మాతెలుగు తల్లికి మల్లెపూదండ - మాకన్న తల్లికి మంగళారతులు



# BHAVA VEENA (భావ వీణ)

**International Journal of Telugu Literary, Culture & Language Study**

(అంతర్జాతీయ తెలుగు సాహిత్య, సాంస్కృతిక, భాషాధ్యయన పత్రిక)

Editor : KOLLA SRIKRISHNA RAO

E-mail : parisodhanatelugu@gmail.com

7989781963,
9440033715
Rohini Towers,
2/11 Brodipet, GUNTUR-2.

**Vol. 14 - Issue. 12(2) - December 2017 - ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253**

## EDITORIAL BOARD

*Chief Editor*
**Dr.B.VENKATASWAMY,**
***M.A.(Tel), M.A. (San), M.A. (Ling), M.A. (Mcj), Ph.D.,***
HOD, Dept. of Telugu,
P. A. S. College, PEDANANDIPADU - 522 235, Guntur Dist., A.P.
Cell no : 7386529274, 7989781963.

### ADVISORY COMMITTEE

1. **Prof. G. Yohan Babu,** M.A., PhD.
   Dept. of Telugu,
   Andhra University, Visakhapatnam.
2. **Prof. K. Madhu Jyothi,** M.A., PhD.
   Dept. of Telugu,
   Sri Padmavathi Mahila University, Tirupathi.
3. **Prof. C. Srirama Chandra Murthy,** M.A., PhD.
   Dept. of Telugu, Faculty of Arts,
   Benaras Hindu University, Varanasi, Utter Pradesh.

### ASSOCIATE EDITORS

1. **Dr.N. R. SADASIVA REDDY**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor,
   Dept. of Telugu & Comparative Literature,
   Sri Krishna Deva Raya University,
   Ananthapuram, Andhra Pradesh.
2. **Dr.V.SANKARA RAO**, M.A.,M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept. of Telugu, Madras University, CHENNAI, Tamilnadu.
3. **Dr. D. SESHUBABU**, M.A.,M.Phil,PhD.
   Asst. Professor, Dept.of Hindi,
   Moulana Azad National Urdu University,
   HYDERABAD, Telangana.
4. **Dr. K. Lavanya,** M.A., M.Phil., PhD.
   Board of Studies Chairman, Telangana University,
   Dichpally, Nizamabad, Telangana.
5. **Dr. N.V. KRISHNA RAO,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Acharya Nagarjuna University,
   Nagarjuna Nagar, Guntur District.
6. **Dr. A. JYOTHI,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept. of Telugu,
   Kakatiya University, Warangal District. Telangana.
7. **Dr. J. VENKATA RAMANA,** M.A.,M.Phil,PhD.
   Asst.Professor, Dept.of Modern Indian Languages,
   Madhurai Kamaraj University, Madhurai, Tamilnadu.
8. **Dr. N. Eswar Reddy,** M.A., PhD.
   Asst. Professor, Dept. of Telugu,
   Yogi Vemana University, Kadapa.
9. **Dr. P.R. Harinadh,** M.A., M.Ed., M.Phil,PhD.
   Dept. of Telugu,
   Regional Institute of Education (NCRT)
   Manasa Gangothri, Mysore, Karnataka.
10. **Dr. B. Tirupathi,** M.A., PhD.
    Dept. of Telugu,
    Dravidian University, Kuppam, Chittor Dist.
11. **Dr. T.SATYANARAYANA,** M.A.,M.Phil,PhD.
    Asst.Professor, Dept. of Telugu,
    Adikavi Nannaya University,
    RAJAMUNDRY, East Godavari, A.P.
12. **Mr.D.ESWARA RAO,** M.A.,
    Associate Professor, Dept.of English,
    P.A.S.College, PEDANANDIPADU-522 235,
    Guntur, A.P.

13. **Dr.P. VIJAYA KUMAR**, M.A.,M.Phil,PhD.
Asst. Professor, Dept. of Telugu, Silver Jubilee
Govt. Degree College, Kurnool District. A.P.

14. **Dr.K. RAVI**, M.A., M.Phil,PhD.
HOD, Dept. of Telugu, C.R. Reddy College,
West Godavari District. A.P.

15. **Dr. G. Swarnalatha,** M.A., PhD.
Asst. Proffesor, Dept. of Telugu,
Govt. Women's College (A), Guntur.

16. **Dr. V. Naga Rajyalakshmi,** M.A., PhD.
Rt Principal,Govt .Degree College,
Chebrole , Guntur, A.P.

17. **Dr. P. Srinivasa Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Andhra University, Visakhapathan.

18. **Dr. Ch. Praveen Kumar,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
Kakatiya University, Warangal.

19. **Dr. N. Rambabu,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

20. **Dr. T. Sailamma,** M.A., M.Phil., PhD.
Asst. Professor, Dept. of Telugu,
Dravidian University, Kuppam, Chittoor Dist.

21. **Dr. M. Sangeetha Rao,** M.A., M.Phil., PhD.
PDF Scholar, Dept. of Telugu,
University of Hyderabad, Hyderabad.

**LEGALADVISER**

**Dr. A. GURAVAIAH**, ***M.A., L.L.M., PhD.,***
Associate Professor
Dept., of Law, A. C. Law College, GUNTUR - 522 002, A.P.

**COVER PAGE & PAGE SETTING**

**TENALI PRAKASH**
G.L.S. ENTERPRISES, Guntur.
970 330 1698.

గమనికః రచయితల అభిప్రాయములతో సంపాదక వర్గమునకు సంబంధం లేదు - ఎడిటర్.

Edited, Printed, Published and owned by Kolla Srikrishna Rao, Rohini Towers, 2/11 Brodipet, GUNTUR - 522 002.
Andhra Pradesh. Cell : 7386529274, 7989781963. E-mail : parisodhanatelugu@gmail.com.
Printed at : GLS Enterprises, Kavitha Nagar, Guntur - 522 002. Ph. 9703301698.

- సంపాదక వర్గం

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# Contents (విషయ సూచిక)


| | | | |
|---|---|---|---|
| 1. | తెలంగాణలో ఆధునిక యక్షగాన సాహిత్యం | - డా. అక్కెనపల్లి వెంకట్ రాంరెడ్డి | 5 |
| 2. | తొలి తరపు అభ్యుదయ కవులు | - డా॥కె.ప్రసాద్ | 9 |
| 3. | బహుజన అస్తిత్వవాద సాహిత్యం-ఒక సందిగ్ధత | | 14 |
| 4. | స్త్రీ చైతన్య కాంక్ష - మన్నులో మన్నునై | - డా॥ యరద్రొడ్డి సుభాషిణి | 17 |
| 5. | జానపదం -సాంఘికాచారాలు | - డా॥ సి. సరళాదేవి | 21 |
| 6. | తెలంగాణ ఆధునిక వచన కవయిత్రులు | - ఐ. చిదానందం | 24 |
| 7. | 'మహా ప్రస్థానం'- గతితార్కిక భౌతిక వాదం | - డా॥ వారాది చిన్నారావు | 30 |
| 8. | తెలంగాణ వైతాళికుడు కాళోజీ | - డా॥ అడువాల సుజాత | 33 |
| 9. | లంబాడీ స్త్రీల పాటల్లో సాహిత్యం-సామాజిక అంశాల విశ్లేషణ | - డా॥ లావుడ్య సుజాత | 39 |
| 10. | మానవీయ విలువలకు అడ్డుగోడ 'అసూయ' | - డా॥ ఈతకోట ఈశ్వరరావు | 44 |
| 11. | విద్యార్థులు - తల్లిదండ్రులు | - డా॥. పి. లోకేశ్వరి | 46 |
| 12. | అద్దేపల్లి వారి సాహిత్య విమర్శ - శ్రీశ్రీ మహాప్రస్థానం | | 48 |
| 13. | స్త్రీ విద్యకోసం పాటుపడిన మహనీయుడు కందుకూరి | - మద్దిరాల సత్యనారాయణరెడ్డి | 50 |
| 14. | అంతరించిన ఆదర్శాలు - కథలు - జీవిత సత్యాలు | - నల్ల సమ్మయ్య | 52 |
| 15. | గిరిజన జీవన విధానంలో కాలం తెచ్చిన మార్పులు | - డా॥ కె.ఎన్.వి.వి.ఎస్. నారాయణమూర్తి | 55 |
| 16. | నల్లగొండజిల్లా పంబాలలు - సామాజిక అంశాల విశ్లేషణ | - పంబాల పర్వతాలు | 59 |
| 17. | కరుణామయుడుగా మోదుకూరి జాన్సన్ | - మూకిరి సుధ | 62 |
| 18. | హైదరాబాద్ సంస్కృతికి ప్రతీకలు నెల్లూరి కేశవస్వామి కథలు | - మానువాడ రామాంజనేయులు | 65 |
| 19. | బతుకు దారిలో వెలుగు చూసిన నంబూరి పరిపూర్ణ | - భానోత్ రమేష్ | 68 |
| 20. | అప్పల్నాయుడు నవలలు ప్రపంచీకరణ నేపథ్యం- మానవ | - గెడ్డవలస రవికుమార్ | 70 |
| 21. | ఆధునిక కవిత్వం - భ్రూణహత్యలు పరిశీలన | - యం.రెడ్డెమ్మ | 74 |
| 22. | తెలుగు కవితా విప్లవాల స్వరూపం | - పల్లె సైదులు | 76 |
| 23. | సలీం కథలు - మానవతా దృక్పథం | - డా॥ ఎం. నాగరాజు | 78 |
| 24. | తెలుగు నవల - సామాజిక దృక్పథం | - గాదె ఉమామహేశ్వరి | 83 |
| 25. | వ్యక్తి నామాలు: ఒక పరిశీలన | - డా. యరగ్రంగు స్వరూపరాణి | 85 |
| 26. | "అనామిక డైరీ" నవల - సజీవ మనస్తత్వ చిత్రణ | - డి. ధాత్రికుమారి | 89 |
| 27. | దాట్ల దేవదానం రాజు వచన కవిత్వంలో - అభ్యుదయ తత్వం | - పి.వి.వి. గంగాధరం | 93 |
| 28. | అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ స్వభావ వర్ణన | - డా॥ జి. ఉషారాణి | 95 |
| 29. | బాలసాహిత్యం - బాలలకు వికాసం | - యం. నాగమణి | 103 |
| 30. | జాషువా సాహిత్య ప్రయాణం | - డా. పుట్ట యాదేశ్ | 105 |

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# తెలంగాణలో ఆధునిక యక్షగాన సాహిత్యం

- డా. అక్కెనపల్లి వెంకట్ రాంరెడ్డి, ఉపన్యాసకులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం, మహిళా కళాశాల, కోఠి.

తెలుగులో యక్షగాన సాహిత్యం ఆవిర్భావం సుగ్రీవ విజయంతో మొదలైంది. తెలుగులో యక్షగానాలు రచింప బడిన కాలం అటు ఆంగ్లేయపాలన ఇటు నిజాం పాలన సాగుతున్నది. పరరాజుల పాలనలో తెలుగువారి భాషా, సంస్కృతులు బాగా దెబ్బతింటూ వచ్చాయి. వాటిని కాపాడుకోవడానికి యక్షగాన కవులు తమ పూర్వపు చరిత్రల్ని, సమకాలిన వీరుల చరిత్రల్ని యక్షగాన రచనల్లో పొందుపరుస్తూ వచ్చారు.

తెలంగాణలో 1955 నుండి 2015 వరకు దాదాపు వెయ్యికిపైగా యక్షగానాలు వెలువడ్డాయి. అందులో ముద్రిత యక్షగానాలే ఎక్కువ. రచయితలు సర్వకాల సంపన్నులు అయినందువలన సమహారకళ అయిన యక్షగాన రచనకు పూనుకున్నారు. కళా సంస్కృతుల్ని పుణికి పుచ్చుకున్న ఆణి ముత్యాల్ని యక్షగానాలనెన్నో రచించారు. తెలంగాణలో వెలు వడిన ఆధునిక యక్షగానాల మీద సమగ్ర పరిశోధనకే నా ఈ పరిశోధన నిర్దేశించుకోబడింది. తెలంగాణలో నిజాం పరిపాలన ప్రజా వ్యతిరేకమైందేగాక, మతోన్మాదంగా సాగింది. దానికి నిదర్శనంగా అక్కన్న మాదన్నల హత్య చెప్పుకోవచ్చు. 1724లో నిజాం పాలన ప్రారంభమైన కూడా అదే పాలన కొనసాగింది. ఆ రోజుల్లో కంచి పీఠాధిపతి 'ననదు' పొందినప్పటికి పౌరో హిత్యానికి ఆటంకం కల్గించడం వల్ల నిజాం రాజ్యాన్నే వదిలి వలన వెళ్ళారు. అలాగే నిజామాబాద్ జిల్లా కందకుర్తి గ్రామాన్ని వదిలి డా॥ కేశవరాం బలరాం హెడ్గెవార్ కుటుంబంతోపాటు వలస వెళ్ళారు. ఈ పరిస్థితుల్లో హిందూమత సర్వ పరిరక్షణకు యక్షగానం నాటకాలు నిర్వహించేప్పుడు నిరంకుశ నిజాంల పరిపాలనను తెలియజెప్పి, ప్రజల్లో ఐక్యతను పురికొల్పేవి. ఎక్కడ యక్షగానం ప్రదర్శితమైతే అక్కడికి నిజాం అధికారులు వచ్చి ప్రదర్శనలోని కథను సాంఘిక వ్యవస్థను అడిగి తెలును కొనేవారు. ఎందుకంటే యక్షగానంలో నిజాం పరిపాలనకు వ్యతిరేకంగా కథావస్తువు వుందేమోనని? అనుమానించేవారు. దాన్ని గమనించిన యక్షగాన కవులు కథా ప్రాంరభంలోనే సుత్రధారి చేతనో కథావస్తువులోని రాక్షసుల పీడనను నిజాం రాజుల పీడనల కథాగానం చేసేవారు. చారిత్రక యక్షగానాల్లో మరింత కల్పనలు చేసి, ఆనాడు నాటకాలాడేవారు. ఈ విధంగా యక్షగానాలు ప్రజల్లో ఇతర మతాలు పాలకుల పట్ల విద్వేషం రగిలేలా రచనా ప్రణాళిక వేసుకునేవారు. అంతేగాక భారతీయ సంస్కృతిక వార సత్వాన్ని అందించడంలో రామాయణాది పురాణ యక్ష గానాలు అపూర్వమైన పాత్రను నిర్వహించాయి. వీటివల్ల హైందవ తాత్విక, ధార్మిక, సాంస్కృతిక వికాస పరిపోషణకు యక్షగానాలు ఎంతో దోహదం చేశాయి. అందులో భాషా సంస్కృతులకు ఒక వేదికను ఏర్పరిచి ప్రజల్లో వారసత్వాన్ని పెంపొందించేవి. అలాగే ప్రజల భావాలకు అనుకూలంగా ప్రజల్లో దైవ భావనను పెంచే విధంగా యక్షగానాలు నిర్మాణం అయ్యేవి. యక్షగానం ఎక్కడ ప్రదర్శించినా అక్కడ నిజాం ఉద్యోగులైన పటేలు, పట్వారీలు నివేదికలను (Reports) తయారుచేసి, నవాబుకు పంపించేవారు. వారంతా ఉర్దూ భాషలో సంపాదించుకున్నంత విజ్ఞానం తెలుగులో లేక పోయేది. దానివల్ల యక్షగానంలో ప్రదర్శితమైన పాత్ర ప్రదేశాలు మాత్రమే ప్రధానంగా నివేదికలో రచించి అందించే వారు. ఈ విధంగా యక్షగాన ప్రదర్శన చాటున తెలుగు చరిత్ర, సంస్కృతులను కాపాడుకునే విజ్ఞానాన్ని మనం చూస్తాం.

### యక్షగానాల లక్షణాలు, సంగీత సాహిత్యాలు :

సాహిత్యంలో యక్షగాన రచన ఒక విలక్షణమైనది. లలిత కళలకంటే అద్భుతమైనటువంటి కళ ఈ యక్షగానానికి వున్నది. సంగీతం, సాహిత్యం, నృత్యం కళల సమాహారంతో సాగే ప్రక్రియ ఈ యక్షగానం. సామాన్య కవులకుగాని, భావ కవులకుగాని ఈ రచన అసాధ్యమైంది. యక్షగాన కవి కవిత్వా లక్షణాలు, సంగీత స్వరూపాలను, నృత్య కళారీతులను తెలుసుకున్న వాడై ఉండాలి. యక్షగానాలలో సృజన రచనతో పాటు సంగీత నృత్యాలకు సమప్రాధ్యానం ఉంటుంది. అలాగే సంగీతానికి సంబంధించిన దరువులు యక్షగానం నిండా పర్చు కొని రాగం, తాళాలతోపాటు చెల్తీ రాగాలు కూడా యక్షగానాల్లో విపరీతంగా ఉపయుక్తమవుతాయి. ఆదితాళం, త్రిపుటతాళం, జంపెన లాంటివి ప్రత్యేకంగా చోటుచేసుకుంటాయి. తెలుగు సాహిత్యంలో సౌందర్యవతమైంది. సీసం, అర్థవంతమైన గీతం పద్యాలకు యక్షగానం నెలవైంది. అయితే ఈ చందస్సులో పూర్తి నాలుగు పాదాలు పూరింపక మూడు పాదాలను రచించి నాలుగో పాదాంతంలో దరువులోక ప్రవేశింపు చేయడం యక్ష గానానికి వున్న విలక్షణత. దీన్నే యక్షగాన పరిభాషలో సీసార్థా లని, గీతార్థాలని వ్యవహరిస్తారు.

తెలంగాణలో పేర్కొన దగిన యక్షగాన రచయితల్లో చెర్విరాల బాగయ్య, బోడిగె ఉగ్రగౌడ్, అంబేద రాజవీరప్ప లాంటి వారు యక్షగాన రచనలను లక్షణయుతంగా సంగీత

సాహిత్యాలతో నిండుదనం వచ్చేటట్లుగా నిర్మించేవారు. సన్ని వేశాలలో ఎక్కువగా త్రిపుట తాళంతో గానీ, 'చలీతో' నడిచే దరువులను ఉపయోగించేవారు. నెల్లూరు యుద్ధంలో (1970) ఉగ్రగౌడ్ రసవత్తర దరువుల్ని రూపొందించేవారు. ఉదా హరణకు..

**"వెయ్యారు విధముల నెలది చెడిపోవు**
**ఎంత ప్రతివతవే తల్లీ నిను ఏ అమ్మగన్నదే వల్లీ**
**ఖ్యాతిగల స్త్రీలతో నీతిగా వున్నట్టి సీతను మించిన భూజిత నేనిక**
**దుష్టా ఆ మాటలు మరువుకు భ్రష్టా**
**బుజాన ఖడ్గం సరాగ దీప్తిని**
**మా మొరుగు చుందువా సిరయును తీయదు"**

ఇది త్రిపుట తాళంలోనే కాదు, భాషాపరంగా మాండ లిక పదాలు. నుడికారాలు కుప్పలు తెప్పలుగా కనిపిస్తాయి.

గౌడ పురాణంలో (1975) చుక్క సత్తయ్య రచించిన యక్షగాన దరువులు ప్రేక్షకుల్ని రస సంద్రంలో ముంచుతాయి.

**"చెట్టు చాటున వున్న చెలియ భామా నీవెవ్వరే!**
**నీడలోనా నిల్చున్న అతివా నీవెవ్వరే"**

అంటూ త్రిపుట తాళంలో మహత్తరంగా దరువును సాగిస్తారు. అలాగే "చలీ రాగంలో సాగించిన దరువులు కూడా మనకు ఆశ్చర్యం కలిగిస్తాయి.

**"పొట్ట మీద బీరయ్య పొడుచుకుంటున్నాడు.**
**సిల్ల సిల్ల రుదురం చెల్తావున్న దా**
**కాగేటి రక్తం పారేటి గంగలా పట్టి చల్ల బట్టే"**

అంటూ దరువును అశ్వనడకతో సాగిస్తూ ఉంటాడు. గురిగారి నారాయణగౌడ్, పెద్ద మల్లారెడ్డి కలిసి రచించిన గౌడ జీవిత చరిత్ర యక్షగానం (1993) ప్రజాదరణ పొందింది. అందులో పాట తాళం, త్రిపుట తాళం, ఏకతాళం, ఆది తాళం, కందార్థం, ఎలలు లాంటివి సమృద్ధిగా ఉన్నాయి.

**"పాణేశ్వరా ఏ పనిగలిగే ఎటువోయి యుంటివి**
**ఏదేనా కార్యం కయ్యి"**

ఆదితాళంలో రసాస్వాధంగా సాగే దరువు మనల్ని అలరిస్తూంది. అలాగే

**"రూపంబు నీవు యిట్లున్న**
**పాపంబాయముడు దొరకనా!"**

అంటూ ఏకతాళంలో దరువు సాగుతుంది.

యక్షగానాల్లో కంధర్థాలు, గీతార్థాలు, సీసార్థాలు అరుదుగా కనిపిస్తాయి. ఏ ఛందస్సుకైనా నాలుగు పాదాలతో నిర్మితం కావడం రచనా సంప్రదాయం. అయితే యక్షగానా లలో వీటికి ఒక విలక్షణత సంతరించిపెట్టారు కవులు. అదేమంటే ఛందస్సు కంద పద్యం రాయదలుచుకున్న యక్ష గాన కవి మూడు పాదాలు రాసి, నాల్గోపాదం నుండి దరువులో కొనసాగిస్తాడు. ఉదాహరణకు....

**"కూడురాం నీ విటు జేయుట**
**మూడుడ చోరత్వంబూనూం ముందుయెటులవునూ**
**నిడితి గవుడ జాతి దీయు**
**కడువడి వారెండబడ్డ (దరువు) కండ్లు కావంరంలా యదిఏరా**

దీన్ని మనం గమనించినట్లయితే 'వారెండబడ్డ' అనే పద్యపాదం పూర్తిగాక ముందు దరువు మొదలౌతుంది. అంటే కంద పద్యపాదంలో అర్ధభాగంలో దరువును ప్రవేశింపచేయ డమే కందార్థమంటారు. ఇలాంటివే గీత పాదాలకు, సీస పాదాలకు దరువులుగా చేరే ఒక వినూత్న ప్రక్రియ. సంగీత సాహిత్యంలో వీటిని విశ్లేషించి చెప్పాలి. అలాగే యక్షగానాల్లో ఏలలకు తరగని ఆదరణ వుంటుంది. యక్షగానాల్లో దరువులు రాగతాళాలతో వుంటే ఏలలు మాత్రం కేవలం రాగ శితంగానే కనబడతాయి.

**"సుందరీ స్నానంబు చేతు**
**ముందు జనము కొని తెమ్ము'**

అని రాగంలో సృజనలో గొప్పతనమంతా రచయితకున్న మేధా సంపత్తి చేత ఆవిష్కృతమవుతుంది.

అంబేద రాజవీరప్ప యక్షగాన రచనల్లో ఆరితేరినవాడు. ప్రబంధాలు, కావ్యాలు, అధ్యాయనం చేయడం వలన ఆయనకు మహా కవులకు ఉన్న విశిష్ఠమైన ప్రతిభ అబ్బింది. ఆయన 1965లో రచించిన గౌడపురాణంలో

**"వారిజా కమలన యన వనములో మరెవరయా**
**రారాజవరియానాతో కూరిమి మీద తెల్పుమీ**
**లోలాక్షీ నీకు ఇట్టి వేరారి వృద్ధియేలలా**
**వనితలకిట్టి పనులు అలవికావు పొమ్మి"**

అంబేద రచనమీద పెద్దన మనుచరిత్ర ప్రభావం కనిపిస్తుంది అని చెప్పడానికి పై దరువును ఉదహరించాలి. అలాగే

**"ఎక్కడి పురుషుడో ఇక్కడ నుండెనో ఎంత చక్కని సుంద రుడో కందర్పుని మించిన అందచందంబు దరయందు మాధూన లేదు"**

ఈ దరువులో పెద్దన పద్యపాదంలోని

**'ఎక్కడివాడో యక్షతనయెందని జయంతని కంతుల మించిన'**

అనేది స్పష్టంగా కనబడుతుంది.

యక్షగాన కవుల్లోని ప్రతిభా విశేషాలను బట్టి వారికున్న సంగీత, నృత్యరీతుల పరిజ్ఞానాన్ని బట్టి పరిశోధించవలసిన అవసరం ఎంతైనా వుంది.

తెలంగాణలో మొదటి యక్షగానం శేషాచల కవి 1980లో రచించిన 'ధర్మపురి రామాయణం' అదే సంవత్సరం

రాపాక శ్రీరామకవి 'ఆధ్యాత్మ రామాయణం' వెలువడింది. ఈ రెండింటిని యోగాన పరిశోధకుడు డా. యస్వీ జోగారావు పరిశోధించి నిర్ధారించాడు. దానిని బట్టి తెలంగాణకు 225 సంవత్సరాల చరిత్ర ఉందని చెప్పవచ్చు. ఈ పరిశోధనలో 1955 నుండి తెలంగాణ యక్షగానాల మీద పరిశోధన కాబట్టి 1955లో ఆనవత్తుల పులయ్య "వాల్మీకి చరిత్రం" రచించారు.

తెలంగాణలోని యక్షగానాలు అన్ని సాహితీ ప్రక్రియల కన్నా భిన్నంగా వెలువడ్డాయి. ఆధునిక కాలంలో ఒకవైపున భావ కవిత్వం, అభ్యుదయ కవిత్వాలు సాగుతుంటే వాటికి ధీటుగా యక్షగానాలు రచనలు సాగడం విశేషం. శేషాచలకవి, ఆనవత్తుల పులయ్య లాంటి యక్షగాన కవుల తరువాత చెప్ప కోదగిన వాళ్ళు చాలా మందే వున్నారు. ఆవంచ పట్వోళ్ళ శంకర్ రెడ్డి (1961)లో రచించిన "భారత సారంబగు జనయే జయ" యక్షగానం పురాగాథల్ని యక్షగానాలుగా మలిచినట్టిది. కొట్టి క్రిష్టవాయ్య 1962లో రచించిన "కలియుగ పొన్నకథ" అనే యక్షగానం ఆధునికంలో రావడం గుర్తుంచుకోవల్సిన అవసరం ఉంది. అలాగే 1962లో వానుదేవుడు అనే కవి "శ్రీ గుణచంద్రికా పరిణయం" లాంటి పౌరాణిక గాథల్ని యక్ష గానంలో రాశాడు.

1965లో చాలా యక్షగానాలు వెలువడ్డాయి. యక్ష గానంలో చేయి తిరిగిన చెర్విరాల బాగయ్య ఆ సంవత్సరమే "పుష్పలీలావతీ చరిత్ర", అదే సంవత్సరం అంబేద రాజవీరప్ప "గౌడ పురాణం" యక్షగానం రచించాడు. అదే కాలంలో చుక్క సత్తయ్య ఒగ్గు దరువుల ప్రక్రియలో "గౌడ పురాణాన్ని" రచించాడు. 1965లోనే యక్షగానాలు అనేకం రావడం, అవన్నీ కూడా పురాణ గాథలతో నిర్మితం కావడం లాంటి విషయాలను పరిశీలించాల్సి ఉంది.

తెలంగాణ యక్షగాన కవులు ప్రతిభావంతంగా నిర్వహించిన పాత్ర వల్ల నూతన దృక్పథంలో పౌరాణిక కథనాలతో యక్షగానాలు వెలువడడం అపూర్వమైనదిగా చెప్పాలి. 1969లో గజ్జల నర్సయ్య గుప్త రచించిన "సులోచన పరిణయం" అదే సంవత్సరం నాగన్న గారి రామదాసు "మాయ ప్రకృతి పురుషలీల" అదే సంవత్సరం చెర్విరాల బాగయ్య "బబ్రు వాహన చరిత్ర" అలాగే 1970లో అన్నమాచార్యులు "శ్రీ సత్య నారాయణ కథ" అదే సంవత్సరం గడ్డం రామదాసు "ప్రభావతి విలాసం" యక్షగానాలు వచ్చాయి. ఇక 1972లో ఆడపు గురువదాసు "కొండల రాయని చరిత్ర" అనే చారిత్రక యక్ష గానం అదే సంవత్సరం నిర్మాలనందస్వామి "గుణసుందరి" యక్షగానాలు వచ్చాయి. అయితే 1994లో చెర్విరాల బాగయ్య "శ్రీకృష్ణ పారిజాతం", 1976లో బూర్గుపల్లి వెంకట నర్సయ్య "డాంగేయోపాఖ్యానం", శ్రీ కృష్ణకవి రచించిన "చిత్రకేతో పాఖ్యానం" లాంటి పౌరాణిక యక్షగానాలు వెలువడ్డాయి.

1977 తరువాత కూడా భాగవత కథా వస్తువుతో యక్ష గానాలు రావడం విశేషించి చెప్పాలి. జిల్లా వెంకటదాసు "సుభద్రా పరిణయం" సుదర్శనం అనంతయ్య "ఒక హిడింబి సురవధ" వానమాల నరసింహదాసు "ద్రౌపది వస్త్రాభరణం" వరుసగా వెలువడ్డాయి. 1978లో బూర్గుపల్లి వెంకటాఖ్యుడు రచించిన "విష్ణుమోహిని విలాసం" కూడా భాగవత కథామయ మైన యక్షగానమే. ఈ సందర్భంలోనే శివపురాణ కథలతో వచ్చిన యక్షగానాల్లో వామనమాల నర్సింహదాసు "తపతీ స్వయంవరం", భౌమనార్యులు రచించిన "తారాశశాంకం", జిల్లా వెంకటదాసు రచించిన "చిరుతోండ నాటకం" లాంటివి పేర్కొనాలి.

1980లో వెలువడ్డ యక్షగానాల్లో చాలావరకు చారిత్రక ఇతి వృత్తాలతో వెలువడ్డాయనే చెప్పాలి. చెర్విరాల బాగయ్య "కాంభోజురాజు చరిత్రం". ఆయన రచించన జయాత జయపాలం, పెద్ద బొబ్బిలి చరిత్రం, మల్లన్న చరిత్ర లాంటివి తెలంగాణ యక్షగానాల్లో అలరారినవి.

## యక్షగానాలు వస్త్వాలంకరణ రచనలు :

ఏ రచనకైనా వస్త్వాలంకరణ ముఖ్యం. ఆ పైనే నవరసాలలోని రసాలు ఆవిష్కరించబడతాయి. యక్షగానాల్లో వస్తువును బట్టె రచనంత సాగుతుంది. తొలి యక్షగానం "సుగ్రీవ విజయం" ప్రభావంతో ఆధునిక కాలం వరకు పౌరా ణిక యక్షగానాలనే కొనసాగించారు కవులు. ఉదాహరణకు తెలంగాణలో తొలి యక్షగానం శేషాచలకవి రచించిన రామా యణం గానీ, అదే సంవత్సరం (1780)లో వెలువడ్డ ఆధ్యాత్మ రామాయణంగానీ పౌరాణికాలే అనే విషయం మరువద్దు. అలాగే ఆనవత్తుల పులయ్య రచించిన వాల్మీకి చరిత్ర కూడా పౌరాణిక యక్షగానమే. అలాగే సోమశేఖర విలాసం కూడా శ్రీనాథుని హరవిలాసం లాంటి పురాణమే. 1961లో వచ్చిన పట్వోళ్ళ శంకర్‌రెడ్డి రచించిన భారత సారుంగు జనమే జయం యక్షగానానికి కథావస్తువు పౌరాణికమే. అలాగే 1965లో చెర్విరాల బాగయ్య రచించిన "పుష్ప లీలావతి చరిత్ర అయితే నేమి గజ్జెల నర్సయ్య రచించిన సులోచన పరిణయమైతే నేమి అన్ని పౌరాణికాలే. అయితే 1971కి వచ్చేసరికి కాంతామతి లాంటి చారిత్రక యక్షగానాలు వచ్చాయి. గుణసుందరి, జగదేక వీరుని కథ లాంటి చారిత్రక వస్తువులు కలిగిన యక్షగానాలు.

యక్షగానాల్లో అలంకారాలు విరివిగా వాడబడినాయి. అంబేదా రాజ వీరప్ప రచించిన, కంతమహేశ్వర చరిత్రలో అనేక సందర్భాల్లో అలంకారాల రచనలు చేశారు. "సారీజ నయన కమల వనములో మీరెవరయ్యా" అనే దరువులో సంప్రదాయంగా కావ్యాలంకారం కనిపిస్తుంది. చుక్కా సత్తయ్య రచించిన యక్షగానం గౌడ పురాణంలోనూ అలంకార రచన అద్భుతంగా సాగింది. అంబేదరాజ వీరప్ప రచించిన "మల్లన్న చరిత్ర"లో కాంతిని బోలే అతివ శరీరం లాంటి అలంకారాలు బోలెడు కనిపిస్తున్నాయి.

యక్షగానంలో అలంకార రచన విరివిగా కన్పిస్తుంది. దానితో రచనంతా సౌందర్యవంతంగా కన్పిస్తుంది. అంబేద రాజవీరప్ప రచించిన గౌడ పురాణంలో

**"భానుని రశికి శరీరమున చెమట వెడలుచుండే"**
**"బ్రహ్మ మానస పుత్రుడా పరగనేని**
**వారి చెమటచే పుట్టివాడవీవు"**

అతిశయోక్తి అలంకారం ఉపయోగించడం ఇందులో కన్పిస్తుంది.

మల్లన్న చరిత్రలో "గుబగుబ శంకం బట్టి దేవదారి తుమ్ము తీయాలో" దురువు నడకలో శాబ్ధిక లయతోపాటు "గుబగుబ అనేటువంటి ఛేకాను ప్రాసాలంకారంతో పరిపూర్ణం అయింది. ''ఖ్యాతిగల స్త్రీలతో నీతిగా ఉన్నట్టు సీతను మించిన భూజాలానేనిక''. ఈ దరువులో ఉపమాలంకారం ఉపయుక్తమైంది. "చిల్లర తులసి ఏమో చెరి అఱకుబట్టి కలకల కాంతిచే కన్ను అదిరే.

**నా నొదిటి కుంకుమ చెదిరే నాధుడు రాకపాయో.**

ఈ దరువుల్లో సాంస్కృతిక పదబంధాలు, నుడికారాలు ఉన్నప్పటికీ అర్థాంతరన్యాసం అలంకారమే కనిపిస్తూ ఉంటుంది. అంతేకాక పలుకుబడి పలుకుబడులు, నుడి కారాలు యక్షగానుల కొరత లేదు. ప్రతిపాదంలోను అది ప్రత్యక్షం అవుతాయి. ఉదాహరణకు యారండ్లు (తోడి కోడండ్లు), వొట్టం (నష్టం), అయిరావు (అచ్చిరావు), పొరడు (పిల్లాడు), వొగ్గరంగా (ఆరవంగా), ఆగమవడం (ఎటూగా కుండా పోవడం) లాంటి క్రియా విశేషాలు విస్తారంగా కనబడతాయి. అంతేకాదు

**"ముంతటి కల్లుంటే మోకాల్వంటి బువ్వలంటిది"**
**"బొంతుల నీళ్లు బోకెళ్ల బోసి"**
**"రోకలి ఇరిసినపుడు లోనేసుకో"**

లాంటి సామెతలు కూడా కోకొల్లలుగా కనిపిస్తాయి.

## యక్షగానాలు - ఆనాటి సమాజం :

పరరాజుల కాలంలో ధార్మిక, సాంస్కృతిక విలువల్ని కాపాడుకోవడానికి కళారూప ప్రదర్శనమైన యక్షగానాల్ని ఎన్నుకొన్నారు. పాత్రలలో ఆనాటి పరిస్థితిని సంభాషించి జేసేవారు. ప్రస్తావనలో ఒక పాత్ర ప్రవేశించి రెండో పాత్ర బఫూన్‌తో రాజు చేసే ప్రజావ్యతిరేక పనులను ఏకరువు పెట్టేది. రచయితలు పౌరాణిక ఇతివృత్తాలను ఎన్నుకొని హిందూ జాతికి వ్యతిరేకమైన ముస్లిం పాలకులను ఎండగట్టడానికి కథను నడిపించేవారు. నిజాం కాలంలో అధికారుల లంచగొండితనం, దోపిడితోపాటు అధికార పర్యటనల సందర్భంగా తహసీలు దారులాంటి వారికి "దావుతలు ఏర్పాటుచేయాల్సి వచ్చేది. వాటిని వ్యంగ్యంగా పాత్రల ద్వారా తెలియపర్చేవారు. ఆనాటి ప్రజల జీవితం, మత కార్యకలాపాలు, ఆచార వ్యవహారాలు అన్ని స్పష్టంగా యక్షగాన ప్రదర్శనలో ప్రతిబింబించేవి.

ముఖ్యంగా తెలంగాణలో వెలువడిన యక్షగానాలను పరిశీలిస్తే ఆనాటి సమాజ స్వరూపం జనజీవనం కనిపిస్తూ ఉంటుంది. నిజాంల కాలంలో ఇస్లాం మతానికి ఉన్న ప్రచారాన్ని తగ్గించడానికి హిందూమత కార్యక్రమాలు జోరందు కున్నాయి. అందులో భాగంగానే సనాతనమైన శైవమత (శివ లీలలు) అనేక యక్షగానాల్లో దర్శనమిస్తాయి. పార్వతి తపస్సు, పాశుపతాస్త్రం, కిరాతార్జునీయం, మార్కండేయ పురాణం, మార్కండేయ విలాసం, తిరుమంగళ్ యాల్వార్ చరిత్రలన్నీ శైవమతానికి చెందినవి. అలాగే వైష్ణవానికి సంబంధించిన యక్షగానాల్లో జనమేజయ యక్షగానం, బభ్రుమోహిని విలాసం, మాదవ చరిత్రలాంటివి వెలువడ్డాయి. ప్రతియక్షగానం మతాన్ని, భక్తిని, భావాన్ని ప్రజల్లో అంకురింపజేయడానికి రచనలు ఉపయోగించారు. అలాగే మానవలోత శక్తులుద, అద్భుత దైవిశక్తులు మతపరంగా వ్యాపింపచేసి, ఆనాటి ముస్లిం పాలకులను ఎదురించే దౌర్జన్యాన్ని, స్థైర్యాన్ని కల్గించాయి. ఇక చారిత్రక యక్షగానాల్లో పెద్ద బొబ్బిలి చరిత్రను, కాంభోజరాజు చరిత్రను, మల్లన్న చరిత్రను లాంటి యక్ష గానాలను ప్రజల్లో వీరారాధను రగిలించాయి. అలాగే సమాజ స్వరూపంలో చాతుర్వర్ణ వ్యవస్థ ఆచారాలు కట్టుబాట్లు యక్ష గానాల్లో ఆవిష్కరించడంవల్ల జీవన విధానం అలవర్చుకోవడానికి కారణమైనాయి. మల్లన్న చరిత్ర, గౌడపురాణం లాంటి యక్షగానాల్లో స్త్రీ జాతి వర్గీకరణ, స్త్రీలకుండే లక్షణాలు సమాజంలో స్త్రీలు నడుచుకునే పద్ధతుల్నే వివరించడం కూడా కనిపిస్తుంది. హిందూ సంప్రదాయంలో సాముద్రికం, జ్యోతిష్యం శాస్త్రానికి సంబంధించిన అనేక విషయాలు యక్ష గానాల్లో చెప్పడం జరిగింది. ఉదాహరణకు : భారతీయ సాంస్కృతిక జీవనాన్ని బట్టి ప్రభావం చేసే జాతకాలు, వస్తువులు విరివిగా వివరించబడ్డాయి. స్త్రీ వన్నెను బట్టి సంసార ఫలితాలుంటాయి అనేదే జానపదుల నమ్మకం. తుంప రెంటికలు ? జగడాల మారి, నెత్తిన మాడ ? బర్కతుండదు, వాకిట్ల సుడి ? మామకు గండం, మొండి శిఖది ? దీపమార్పేది, పెనసన సుడుంటే? బావకు కీడు, కనుబొమ్మలు కలుసుంటే? మారుమను, నాలుక మచ్చ ? శపిస్తే నాశనం, రొమ్ముకుపంటి ఉంటే? పాలు దాగే పాపకు గండం, అంటుడు కడపు? అత్తకు గండం, బొడ్డున సుడి; పిల్లలు పుట్టి చస్తారు.

తెలంగాణలో లెక్కకుమించి యక్షగానాలు వెలువడినట్లు ఆధారాలు లభిస్తున్నాయి. తెలంగాణ సాహిత్య అకాడమి ద్వారా వాటిని వెలుగులోకి తీసుకువచ్చి తెలంగాణ సాహిత్యాన్ని పరిపుష్టం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉంది.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# తొలి తరపు అభ్యుదయ కవులు

- డా॥కె.ప్రసాద్

భావ కవిత్వంపై తిరుగుబాటు చేసిన తొలి తరపు కవులలో ముఖ్యులు శిష్ట్లా ఉమామహేశ్వరరావు, శ్రీశ్రీ,పఠాభి, శ్రీరంగం నారాయణ బాబు,ముద్దు కృష్ణా పురిపండ, అప్పల స్వామి, జలసూత్రం రుక్మిణీనాథ శాస్త్రి, పాలగుమ్మి పద్మరాజు మొదలగు వారు.

వచన కవితకు ఆద్యుడుగా పేర్కొనదగినవాడు శిష్ట్లా ఉమామహేశ్వరరావు. అతడు 1930లో రచించిన వచన గీతములు 1938లో 'నవమి చిలుక,విష్ణుధనువు' అను రెండు కావ్య సంపుటములుగా రూపొంది వెలువడినది. శిష్ట్లా తన కవిత్వమును 'ప్రాహ్లాద కవిత్వమని పేర్కొనినాడు.ప్రాహ్లాద కవిత్వం పూర్వ కవిత్వం కాదు. భావ కవిత్వంకాదు నూతన ములో బహు నూతన కవిత్వం ' అని నవమి చిలుకకు వ్రాసిన మున్నుడిలో ప్రకటించుకొన్నాడు. ప్రాహ్లాద కవిత్వం ఆరిపోయే దీపాన్ని రగుల్చుతుంది. పరుగెత్తే పామరుణ్ణి నిలేస్తుంది, అని తన కవిత్వ లక్ష్యమును శిష్ట్లా నిర్దేశించినాడు. 'నవమి చిలుక' గ్రామ జీవితములోని వివిధ సంఘటనలను గర్భీకరించుకొని ఉదయించిన కావ్య సంపుటము. విష్ణు ధనువులో ప్రేమ సిద్ధాంత ప్రవచనము ముఖ్యధ్యేయము. విష్ణుధనువులో శిష్ట్లా ప్రయత్న పూర్వకంగా ఛందస్సును వికృత మొనర్చినాడు.

వచన గేయము విషయములో శ్రీశ్రీ ప్రభృతులకితుడు మార్గదర్శకుడైనాడు. ఇతడు భావకవిత్వముపై తిరుగుబాటు చేసెడేకాని క్రొత్తబాట వేయలేదని ఒప్పుకోక తప్పదు అని డాక్టర్ సి.నారయణరెడ్డి శిష్ట్లా తిరుగుబాటును గురించి అభిప్రాయ పడినారు. ఆరుద్రగారు శిష్ట్లాది గొప్ప విప్లవారంభముగా భావిం చారు. కవిత్వ మార్గమును సుగమము చేసిన శిష్ట్లా అభినంద నీయుడు. శిష్ట్లా కవితలో సింబాలిజము, ప్రభావమున్నట్లు చెప్పుదురు.

పఠాభి పూర్తి పేరు తిక్కవరపు. పట్టాభిరెడ్డి గారు 1938 లో పఠాభి కలకత్తాలో చదువుకొంటున్నపుడు ఆ నగరములో విలయ తాండవం చేసిన ఆకలి, దారిద్ర్యము విలువలు కోల్పోవుచున్న మనుష్యులను కళ్ళారా చూచినాడు. పాత విలువలను ధ్వంస మొనర్చుచు పఠాభి, పిడేలురాగలడజన్, అనుపేర 12 వచన గేయములను వ్రాసినాడు. నా ఈ వచన పద్యాలనే దుడ్డు కర్రలతో పద్యాల నడుములో విరుగ దంతాను. చిన్నయ సూరి బాల వ్యాకరణాన్ని చాల దండిస్తాను, అని పఠాభి తెలుగు చందస్సు వ్యాకరణము పై దాడి చేసినాడు. అనుసరిస్తాను నవీవ పంథా, కానీ భావకవిన్ మాత్రము కాను నే నహంభావ కవిని అనుటను బట్టి అతనికి గల అహంకారము, విశృంఖలత్వము, వైచిత్రప్రియత్వము వ్యక్త మగును. కళ కొరకే అను సిద్ధాంతమును బలపరచిన కవి పఠాభి. ఆధునిక జీవితములోని వివిధ ఘట్టములను గురించి కవిత్వము వ్రాయుటలో ప్రథముడితడే. ఫ్రాయిడ్ ప్రతిపాదిం చిన సెక్సు ప్రాధాన్యమును తెలుగు కవిత్వంలో తొలి సారిగా ప్రవేశపెట్టినవాడు ఇతడే.

భావ కవిత్వంలోని ఆదర్శ వాదంపై తిరుగుబాటు చేసి వాస్తవికతా వాదమును ప్రతిపాదించిన కవి శ్రీరంగం నారయణ బాబు.అతడు శ్రీశ్రీతో పాటు విప్లవ శక్తులనాహ్వానించిన పురోగామికవి. సంతబయలు, కుక్క,గాడిద,కుళ్ళు కాలువ, ఫ్యాక్టరీ కూత,మర ఫిరంగి, మందుగుండు, బీదవాడు, భిక్షువర్షీయసే, అన్నీ అవేమిటి, ఇవేమిటి లోకంలో ఉన్నవన్నీ కవితా వస్తువులే అని సంఘర్షణకు వ్రాసిన ప్రవరలో చెప్పి నాడు. రుధిరజ్యోతి నారయణ బాబు వ్రాసిన గేయకవిత సంపుటి. నారయణ బాబు దేశమాత గేయ ఖండికలో "చాలీ చాలని చిరిగిన చీరలో" గుక్కెడు అన్నం, గుక్కెడు నీళ్ళు కొరకు పరితపించు భిక్షుకస్త్రీని వస్తువుగా స్వీకరించినాడు. కావలి అను గేయములో కాష్టజ్వాలలను,ఆరిన చితిని, రాబం దులను గ్రహించినాడు. విశాఖ పట్టనణం అను గేయ మున నగరములోని రాచబాటతో పాటు ఇరుకు సందులలోని విషయములను వర్ణించినాడు. మాహోద్వేగముతో విప్లవశంఖ మును పూరించినాడు. రుధిర జ్యోతిన్ జ్వలనాలలనా ప్రియుండ విప్లవ ఋషిని, విద్రోహ కవిని అని ఉద్ఘాటించి నాడు. మర ఫిరంగినె మహతిగమీటి కదన కుతూహలరాగం వినిపిస్తాను, అని ద్వితీయ ప్రపంచ యుద్ధ కాలమున జపాను వారి దండయాత్రనుద్దేశించి వ్రాసిన గేయము అభ్యుదయగేయ ఫక్కీకి చెందినది. నారాయణ బాబు వాస్తవికతను, అధి వాస్త వికతను, రెండింటిన సమన్వయ పరచుకొనిన అతి నవ్యుడు. ఆంగ్ల కవిత్వములోని 'ఇమేజిజము' ప్రభావము గల తెలుగు కవి ఈతడొక్కడే.

వచన గేయ రచనలో శిష్ట్లా ఉమామహేశ్వర రావుతో పాటు ముద్దు కృష్ణ కూడ శ్రీశ్రీకి మార్గదర్శకుడు.వచన కవిత్వమునాదరించి దానికాక వేదిక నేర్పరచి ప్రోత్సహించినది. ముద్దుకృష్ణ నడిపిన జ్వాల అను పత్రిక, ప్రపంచమంతా ఒక యిల్లుగా మానవజాతి అంతా ఒక కుటుంబంగా మారిపోయే రోజులు వస్తున్నవి. మనం కూపస్థంగా ఉండడం వల్లనో పురా తన మగత చేతనో రక్తంలో నీరసం చేతనో,నూతన తేజస్సుకు గుడ్ల గూబల మారుతున్నాము. యువకుల దృష్టికి ఒక కొత్త

తేజస్సు, ఒక కొత్తదారి కనబడుతూ ఉన్నది. ధర్మాలలో, సంఘంలో, భావాలలో భాషలో మార్పు రాక తప్పదు.దీనికి అడ్డు వీల్లేదు. వచ్చినా ఆగదు. పిరికి తనానికి ముక్తిలేదు. అందుచేత నచ్చని పాత బంధాలను తెంపివేయడానికి ఎంతైనా సాహసిస్తాము. నచ్చిన కొత్తదానికి దూకుతాము. భయపడము, తప్పు అవుతుందేమో అని జంకము. అతని 'శాంతి' వచన గేయము ప్రసిద్ధమైనది. పురిపండ అప్పలస్వామి దైవం అను గేయములో, అంధ విశ్వాసాలపట్ల తీవ్రనిరసనను వ్యక్తం చేసినాడు. గుడిలోన దైవమా ఆలింపవోయి,గుడిలోన దైవమా పైకి రావోయి. అని దైవమును సంబోధించి 'మాల మెట్టిననేల, మాలమెట్టన సీమ మైలపడినది' అను కుహనా భక్తుల నుండి బయటపడి వారిని ఉద్ధరించమని హెచ్చరించి నాడు. అనలపతాకం అను గేయము శ్రీశ్రీ మహాప్రస్థాన గేయముచే ప్రభావితమైనది. అందులో పీడత ప్రజాకోటిని పురిపిండా మేల్కొల్పినాడు. జాతీయ మార్గగామియైన పురి పండా అప్పల స్వామి సాంఘిక దుర న్యాయములపై పంజా విప్పిన కలిసింహము.

పులిపంజా 40 ఖండ కావ్యముల సంపుటి. అన్నీ కవితా ఖండములందు ప్రస్ఫుటమగనో, ప్రచ్ఛన్నముగనో విప్లవ భావమున్నది.భారతదేశం మా దేశం అనునది చైనా దురాక్రమణమును ఖండించు గేయము. పద్మనాభం అనుగేయమున ప్రాచీన వీరగాథాస్మరణ మున్నది. సంధ్యా వందనం, విశ్వజనీనం, స్వర్గానికి-నరకానికి, ప్రేతభూమి మొ॥గు పెక్కు ఖండికలపై అధివాస్తవికతా ప్రభావము కలదు. పులిపంజాలో నాస్తికత పరవళ్ళు త్రొక్కుచున్నది.

పేరడీల రచనతో తెలుగు సాహిత్యములో సుస్థిర స్థానమును సంపాదించుకొనిన కవి, విమర్శకుడు జలసూత్రం రుక్మిణీనాథశాస్త్రి, ఆశ్వాసాంతం, ఆసుపత్రికోకిల అనునవి అతని రచనలలో ప్రసిద్ధమైనవి. అతని కవిత భావి కవిత్వమును, అభ్యుదయ కవిత్వమును కలిపే కొలికి పూస.

పాలగుమ్మి పద్మరాజు రచించిన 'పురిటిపాట, చీకటి మనమైత్రి అను గేయములు ఆధునికవిత్వములో మిక్కిలి రసవంతమైనవి. వచనకవిత్వమును వచనము నుండి వేరు చేయుటలో పాలగుమ్మి పద్మరాజు శక్తి అమోఘమైనది.

## శ్రీశ్రీ మార్గాను యాములగు అభ్యుదయ కవులు

శ్రీశ్రీ మరో ప్రపంచం, దేశ చరిత్రం, మహాప్రస్థానం మున్నగు గేయములు రచించిన తరువాత కొత్తతరము అభ్యుదయ కవులకు మార్గ దర్శకుడయినాడు.

కదిలించేదీ, పెను నిద్దుర వదిలించేదీ, మును ముందుకు నడిపించేదీ, పరిపూర్ణపు బ్రతుకిచ్చేదీ అయిన అభ్యుదయ కవిత్వమునకు శ్రీశ్రీ పట్టుగొమ్మ.

కష్టజీవులకు, కార్మికజనులకు మహోదయమును, నవయుగోదయమును తోపింపచేసి సాంఘిక విప్లవమును కోరిన అభ్యుదయ కవి తెన్నేటిసూరి.అరుణరేఖలు లోని మాతృగీతి, మహోదయం, కన్నీటికాలువ, వట్టిబయల, స్వర్గానికి రోడ్డు, నీకవి, తిండి కావాలి. ప్రపంచ విప్లవం,కీలుగుఱ్ఱం అను గేయములు ఒక్కొక్కటి ఒక్కొక్క విస్ఫులింగము. మానవ స్వాతంత్ర్య మార్గానికార్టాలైన రక్తాక్షరాలతో వ్రాలు చేసేశాను అని కష్టజీవుల స్వేచ్ఛకై అతడు పరితపించాడు.

విశ్వ కారాగార వీధిలో చెరవడ్డ విశ్వకార్మికులార,నిగళ బద్ధుల్లార, లెండోయి, లెండోయి, బ్రతికి లేవండోయి అని ఉత్సాహమును రసల్గలిపినాడు.

బ్రతుకంతా భారం, క్రూరం, ప్రమాదాల తీరం, ఘోరం, పుట్టటమే మహా పాతకం చావే యిక మేలనుకుంటూ నిరుత్సాహపడకండోయ్ అని బాధలలో నున్నవారిని ఓదార్చి యుగయుగాల మానవ కథనం స్వర్గానికి రోడ్డేస్తున్నదని అభయమిచ్చినాడు.

'తిండి కావాలోయి, తిండి కావాలోయి మండేటి పేగులకు తిండి కావాలోయి' అని ఆకలి కేకలను వినిపించినాడు. అభ్యుదయ కవిత్వ యుగములో సాంఘిక విప్లవమును కోరిన కవి తెన్నేటిసూరి.

పిలకా గణపతి శాస్త్రి భావకవిత్వమునకు సంబంధించిన పెక్కు ఖండ కావ్యములను వ్రాసినాడు. 'హోరని గాలి దుమారము లెగిరెన్, భోరని ధారావర్ణము కురిసెన్,వీధులలో ఎవరో ఆ నీడలు ఆకలితో ఏవేవో ఘూషలు అమ్మా మాదాక బలం తల్లీ అమ్మా పిల్లల మన్నం తల్లీ' అని ఆర్తితో వ్రాసిన మాదాకబళం మాత్రము అభ్యుదయ కవితకు తలమానికమైంది.

వాన అనుగేయంలో కూడా పిలకా గణపతి శాస్త్రి వాన హాయిగా కురిసెనుగానీ కానీలేని దరిద్రుల కన్నీళ్ళెన్నో యీ నీళ్ళల్లో ప్రవహిస్తున్నాయి గదా ఓ కవితా! అనియు చాలని బియ్యపు నూకల కోసం కూలిజనంతో ఎఱ్ఱని కంకర ధూళి వేడిలో గర్జిద్దామే నేలంతా వణికే దాకా చిరవేదనలో లోలో కరిగి సురిగిపోదాం అనియు అభ్యుదయమును అందించినాడు.

జన్మ నెత్తిన మానవునకు జీవితమే పరమధనం.అయితే అది ఒకమారే అతని కొసగబడిన వరం. అని పలికిన అవంత్స సోమసుందర్ అభ్యుదయ కవులలో ప్రముఖుడుగా గణింపదగినవాడు.

తెలంగాణ పోరాటమునకు సంబంధిచిన వీరి వజ్రాయుధములోని సమధర్మం, బాడుగ గోచిలు,ఆకలి నాలుకలన్నీ అను గేయములు అతని కవితా శక్తికి ప్రబల నిదర్శనములైనవి.

వజ్రాయుదము తరువాత సోమసుందర్ వ్రాసిన మిణుగురులు, సోమరసం, సుందరకాండ, మేఘరంజని మొదలైన రచనలు అభ్యుదయ భావములకు భిన్నమైనవి. తన జన్మ స్థలమైన పిఠాపురము ప్రకృతి సౌందర్యమును ''ఊరు మారిందిలో'' వర్ణించాడు. వెన్నెలలో కోనసీమ శీర్షికకు తగినట్లె ఆంధ్రప్రదేశపు సౌందర్య సీమను కమనీయముగా వర్ణించాడు. ''అనల కిరీటం అనురచరనలో మాత్రము అభ్యుదయ భావముల కాల్పనిక రీతి కలగలసినది.అందలి చీకటిని ద్వేషిస్తాను అను గేయములో సోమ సుందర్ కవితా శక్తి వ్యక్తమగుచున్నది. అతని ఫ్యాక్టరీ గేయము రక్తము ఉడుకెత్తించును.

వాడుక భాషలో సంస్కృత సమాసములను భావకవులు పయోగించిన పడికట్టు పదములుపయోగించుటవలన సోమ సుందర్ శైలిని జటిలము చేసినాడు. సోమసుందర్ వచన కవితా మార్గము విలక్షణమైనది. అనిశెట్టి సుబ్బారావు రచించిన ''అగ్నివీణ''అభ్యుదయ కవిత్వములో పేర్కొనదగినది. ఎవరి పిల్లలోయి మీరు, బిచ్చగాడి పాట, మొదలైన గేయములలో అనిశెట్టి భావ తీవ్రతను, ధారశుద్ధిని వెలువరించినాడు. భయం, భయం బ్రతుకు భయం... అన్నా మనకీ లోకం పన్నిన పద్మవ్యూహం.ఆశలతో బ్రతుకీడ్చే అస్థిపంజరాలు మనం. ఆవేదన హితమయ్యే ఆశాజీవులం మనం.గతమంటే కారు వెగలు రేపంటే తగ్గని భయం అని సామాన్యుని దుర్భర జీవితము నిస్సహాయస్థితిని అనిశెట్టి రమణీయముగా వర్ణించినాడు.ఈ లోకపు శాసనాలు ఎంగిలాకులిస్తాయి. ఇనుప కమ్ములిస్తాయి అని పరిస్థితులు బాలలను బిచ్చగాళ్ళుగా నేరస్థులుగా చేయుటను గురించి ఆక్రోశించినాడు. అనిశెట్టి గేయములు కర్తవ్యోన్ముఖులను చేయు భావములతో నిండి యుండును. శాంతి, రిక్షావాలా మున్నగు రూపకములలో అని శెట్టి సుబ్బారావు మూకాభినయంతో ప్రదర్శించుటకు వీలైన కవిత్వమును రచించినాడు.

రెంటాల గోపాలకృష్ణ రచించిన సంఘర్షణ,సర్పయాగం అనునవి అభ్యుదయ భావములు గల ఉత్తమ కావ్యములు. వీరి 'పల్లకీ బోయీలు' అను గేయము సామాన్యపాఠకులనే కాక కవితా రసజ్ఞులను కూడ ఆకట్టుకొనినది.

'ఇంటిదానికి జరం' పాయిలో నుప్పెయ్య లేదు.సద్దీలేక దొరగోరి సావిట్లో ఉంటాను' అని వెట్టి చాకిరితో సతమత మగుచున్న మేనా మోయి బోయీల దీనస్థితి జాలి గొలుపుచున్నది.

అదిగో అరుణపతాకం, పేదవారికి ప్రాణం, పీడిత ప్రజలకాధారం అని రెంటాల మార్క్సిస్టు సిద్ధాంత దృక్పథములో వ్రాసినాడు. సంభవామియుగేయుగేలో అధర్మము ప్రవర్తిల్లిన చోట అభ్యుదయ కవిగా నవతరింతునని చెప్పినాడు. నగరంలో రాత్రి శివధనువు అను వీరి గేయములు కూడ సుప్రసిద్ధమైనవే.

ఉదయని అను కావ్య సంకలనముతో గంగినేని వెంకటేశ్వరరావు అభ్యుదయ కవిగా ప్రసిద్ధిగాంచినాడు. మార్క్సిస్టు సిద్ధాంత బలముతో పోరటపు అనుభవముతో గంగినేని వెంకటేశ్వరరావు రచించిన అరచేతిలో మృత్యువు,ఓ రాత్రి,ఎర్ర సముద్రం మొదలైన గేయములు అభ్యుదయ కవుల కాదర్శములయినవి. గంగినేని కవితలో రాజకీయ సిద్ధాంత అవగాహన కవితా శిల్పము మేళవించినవి.గంగినేని ఎర్ర సముద్రంలో దిన గండాలు దాటలేక,దరిద్ర మహా జనాదళి, ఎత్తినది అని ఎర్రజెండా రెపరెపలు కష్టజీవుల కడుపు మంటలుగా వర్ణించినాడు.

బెల్లంకొండ రామదాసు నయాగరా కవులలో ప్రముఖులు. కల్పన కవితాసంకలమునకు సంపాదకులలో ఒకడు. అతడు వ్రాసిన గేయములు చాలా తక్కువ.మానవ మేధస్సుకు సంకెళ్ళను తగిలించిన గత సాంఘిక శిలా శాసనం పడగొట్టును. పగిలిన నా నిప్పుల కంఠం పలికిన విప్లవగీతం రామదాసు గీతము. ఆదర్శ నిలయమైన లోకమును దహించవలెనని అతడు ఆవేశపడినాడు. అతడు శ్రామిక లోకపు స్వర్గమును కోరి కవిత్వము చెప్పినాడు. భూతకాల భూతశాల వదిలి వర్తమాన విషవర్తులాన్ని ఛేదించుకొని,భావి కాలపు నల్లని ముసుగు ధరించి వెడతానుమరి. సెలవు-వినిపించెనెదో మెల్లని పిలుపు మూయండి.నా వెనుక విశ్వపు తలుపు అని పలికిన రామదాసు కవి అర్ధాంతకముగా తనువు చాలించినాడు.

కవిత్వము రాజకీయములు వేరుకాదని సాహిత్య వేత్తల జీవితము దంత శిఖరములలో కాదని ఆచరణలో నిరూపించిన కవి కె.వి.రమణారెడ్డి. వీరి అడవి, భువన ఘోష, అంగార వల్లరి కావ్యములలో అభ్యుదయ భావములు పొడ సూపినవి. సంస్కృత పదములనధికముగా వాడుట అన్వయ కాఠిన్యము వీరి కవిత్వమును క్లిష్టము చేసినవి. వీరి కవితలలో ఎన్నదగినవి - రక్తాశ్రువు, రణోన్మాది, చిత్రపటం, స్టాలిన్ అస్తమయం, శ్రీశ్రీ అనునవి. రాజకీయోద్యమములో రహస్య జీవితము గడుపుచున్న సుంకర సత్యనారయణకు వీరు వ్రాసిన ప్రజాకవికి బహిరంగ లేఖ అనునది ఉత్తమ రచన.

అభ్యుదయ కవి అజంతా వ్రాసిన ప్రతి గేయమును అమోఘమైన సంచలనమును కలిగించి కవుల రసజ్ఞుల మన్ననకు పాత్రమైనది. చెట్లు కూలుతున్న దృశ్యం అను గేయములో ''ఆశలేదు''ఆస్కారం లేదు. ఫలానా రోజు కోసం ఆఖరౌతుందనే హామిలేదు. జీవితం ఎప్పుడూ ఇలా కన్నీళ్ళ ప్రవాహంగానే సాగుతుందనుకుంటాను. రోడ్డు పొడుగునా చెట్లు కూలుతున్న దృశ్యాలనీ చూపుతుందనుకుంటాను, అని అజంతా ఆధునిక మానువుని నిస్సహాయతను,మానసిక ఏకాంతమును వెల్లడించినాడు. అజంతా రచించిన కొత్త సంవత్సరం రోజు చూస్తూనే ఉన్నాను. పరిత్యాగి పరివేదన,

న్యూస్ రీడర్, నడివేసవి, క్షుద్ర సంధ్య జెండాలకు కన్నీళ్ళు లేవు.అగ్నిస్పర్శ-అన్నియు ఉత్తమ కవితలే. మానవ హృదయ ముల అంతశ్చైతన్యమును భావచిత్రములలో పట్టుకొనగలిగిన ప్రతిభాశాలి అజంతా. అతడు రోజు చూస్తూనే ఉన్నా గేయ ములో నిరాశమయ లోకమును చిత్రించినాడు.

ఆలూరి బైరాగి వ్రాసిన "చీకటి నీడలు నూతిలో గొంతుకలు" రెండును విశిష్టమైన రచనలు. కత్తిరించిన ఒత్తులే వెలుగుతాయి. దివ్యంగా, బాధాదగ్ధ కంఠాలే పలుకుతాయి శ్రావ్యంగా అని ప్రపంచపు బాధనంతను తన కంఠములో పలి కించిన ఉత్తమకవి బైరాగి.అతను మానవతావాదమును నమ్మి రాడికల్ హ్యూమనిజముతో ప్రభావితుడై కవిత్వమును చెప్పి నాడు. హృదయపు మెత్తని చోటుల గిరే జంతువు ఆకలి అని, ఆకలిని వర్ణించి, బైరాగి ఆకలి జీవుల ప్రతినిధియై విప్లవ మునకు దారి తీసినాడు.

పేదజనుల స్వేదధార, మానధనుల అశ్రుధార, ఆకాశపు కళ్ళలోంచి, కట్టలు తెగి పొరులుతోంది.అది తుఫానై ముంచెత్తుతుంది. ఆగబోదు ఈ తుఫాను, ఆగరాదు ఈ తుఫాను, మీ మేడలు మునుగువరకు, మీ కోటలు కూలు వరకు, మీ అంతఃపురకాంతులు, భూమి పైన దొరలు వరకు శోకంతో పొరలు వరకు,ఆగరాదు ఈ తుఫాను అని శ్రామికలోక మహాశక్తికి విజయము చేకూరవలెనని కోరినాడు. సంఘ దురన్యాయమునకు గురియై నికృష్ట జీవితము గడుపుచున్న వేశ్యపై కూడా బైరాగి జాలి చూపినాడు. తాజ్ మహల్ కష్ట జీవులను వెక్కిరించు శిల్పమని దానిని పడగొట్టమని బైరాగి తాజ్‌మహల్ పడగొట్టండోయ్ అను గేయమున చెప్పినాడు.శ్రీశ్రీ వలె తాజ్‌మహల్ నిర్మాణమునకు రాళ్ళెత్తిన కూలీలను గురించి తపన పడనాడు.

నూతిలో గొంతుకలు, చీకటిలో ప్రారంభమయిన సంశయకావ్యము ఆవేదనల ఆనంతంలో అంతమైన జీవితా లను గురించి ఇది చర్చించును. ఇందలి నాయకులైన హేమ్లెట్, అర్జునుడు, రాస్కల్నికోవ్ ఈ ముగ్గురి బాధను ఒకే స్థాయినందు కొనినది. ఇది మానవుని సహజవేదన అని బైరాగి తొలిపలుకులలో చెప్పినాడు.

విషాదకుని విషాదం, ఉన్మత్తుని ఆహ్లాదం, వేశ్యల విషాదం, ఓంకార ప్రణవనాదం అను బైరాగి కవిత పరితలను ఉక్కిరిబిక్కిరి చేసి అంతర్ముఖులను గావించినది. 'నాకొంచెం నమ్మకమివ్వు' అనుటచే ఈ సంశయ జగత్తులో మనిషికి కావ లసినది నమ్మకమని బైరాగి చాటినాడు.

అభ్యుదయ కవులలో గోపాల చక్రవర్తికి ప్రత్యేక స్థానమున్నది. అతడు జీవితం కరిగిపోయేమందు, ఉన్న దాంట్లో నలుగురికీ పంచు' అని జీవిత సత్యములను రసవంత ముగా పలికినాడు. చేదు జీవితమును, విషాద గాంభీర్యమును, అత్యద్భుతమైన హాస్యరీతిలో మేళవించినాడు. అతడు 'రేపు మనది' అనుకొను ఆశావాది, సామాన్యులకు ఉత్సాహము కలిగించు అభ్యుదయవాది. గోపాల చక్రవర్తి వ్రాసిన 'కలంకలలు' 'ఆనందజీవనది' కావ్యములువార్త్యెచిత్రిక నిలయములు, సంది పత్రం, యువకవి నిష్క్రమణ, మౌవనం ఇత్యాది గేయములు గోపాల చక్రవర్తి రచించిన రసవద్రచన లలో కొన్ని ప్రణయము, ప్రకృతి, తత్వశాస్త్రము, అభ్యు దయము మొదలైన భావములతో బోయి భీమన్న వచన కవిత్వములో వైవిధ్యమును ప్రవేశపెట్టినాడు. అనాదికొన నుండి అనంతత్వంలోకి, త్రిపదలు రాగవైశాఖ, గుడిసెలు కాలిపోతున్నై, శివాలికలు, భోయి భీమన్న వచన కవిత రూపములో వ్రాసిన కావ్యములు. ప్రాచీన కాలం నుండి మానవ నాగరికతలో వచ్చిన మార్పులను వచన కవితా రూపమున వివరించిన కావ్యము 'అనాది కొన నుండి అనంతత్వంలోక', 'త్రిపదలు' సమకాలిక సమాజముపై భీమన్న తలపులు. మూడేసి పంక్తులుగా కూర్చినవి. రాగవైశాఖ శివాలికలు. ప్రణయ భావభరితమైనవి. గుడిసెలు కాలిపోతున్నై భీమన్న అభ్యుదయ భావములకు దర్పణము. మార్క్సిస్టు సిద్ధాంతంపై విశ్వాసము లేకున్నను భీమన్న దారిద్ర్యపు బాధ లను స్వయంగా అనుభవించి పేదల జీవితము బాగుపడవలె నని కోరిన అభ్యుదయదారి. ధర్మసంస్థాపనార్థం ఈ గుడిసెలు మళ్ళీ మళ్ళీ అవతరిస్తుంటై. ఈ విషవలయం సాగడం ఎంతవరకు? రహాస్యల గుడిసెల వాళ్ళకు తెలిసే వరకు, అని అట్టడుగున ఉన్నవారిని కళ్ళు తెరవమని భీమన్న ఉద్బో దించినాడు. భీమన్న వ్రాసిన జన్మాంతర వైరములో అంతరాని తనములో మ్రగ్గుచున్న వారి బాధలను వర్ణించినాడు. ప్రార్థనలు, భజనలు అవి వట్టి శవజాగారాలు. మతమూ, భక్తినశించకుండా ప్రగతి లేదు మనిషికి అను విశ్వాసమును ప్రకటించినాడు. ప్రణయము ప్రగతి రెండును కలగలసిన వీరి కవిత్వములో అభ్యుదయ భావములతో పాటు కాల్పనిక రీతి కూడ వ్యక్తమగుచుండును. భోయి భీమన్న రచించిన 'దీపసభ' అను కావ్యముపై మానవతా ప్రభావము ప్రస్ఫుటముగా గోచరించును.మానవుడు పురోగమించడానికి ప్రాథమికంగా అతడికి కావలసినది స్వేచ్ఛ, సమృద్ధి. ఈ రెండింటి కోసం 'దీపసభలో'సర్వోదయ సమాజ నిర్మాణం ప్రతిపాదించబడింది. సమాజం దీపాధారం వలె స్నేహపరమైనప్పుడు మానవుడు అఖండ జ్యోతివలె జగజ్జేయ మానుడుకాగలడని సూత్రీకరించ బడింది అని భీమన్న స్వయంగా 'దీపసభ' కావ్య ప్రయోజన మును విశదీకరించినాడు. విశ్వేశ్వరి అయిన పరంజ్యోతి అధ్య క్షతను జరిగిన పరిషత్తులో వివిధములగు దీపములు తమ తమ అనుభవములను వివరించుట ఇందలి కావ్యవస్తువు.

ఆ అను భవములలో మానవ జీవిత రీతులనేకము వివరింప బడినవి. 'కొబ్బరి తుంట'అను కవితా ఖండికలో కూలీల జీవితమునందలి దుర్భర కష్టములను భీమన్న హృదయ విదారకముగా వర్ణించినాడు. బండి దీపమునందు దుర్భర దారిద్ర్య పీడితులగు నిరుపేదల బ్రతుకులు వివరింపబడినవి. శాస్త్ర విజ్ఞాన యుగములో జీవించుచున్న ఆధునిక మానవుడు సాదించిన విషయములను కొనియాడి ఆ ఫలి తములను సామాన్యలకు కూడ అందుబాటులోనికి రావలెనని అభిలషించిన అభ్యుదయకవి కె.బాపురెడ్డి వీరి రాకెట్టు రాయభారం చక్కని సందేశ కావ్యము పాడేరు పాట అరకులో అభ్యుదయం మొదలైన రచనలలో బాపురెడ్డి గిరిజనుల జీవితములను బాగుపరచుటకు ప్రభుత్వము తలపెట్టిన ప్రణాళికలను ప్రస్తుతించినాడు.

కూలి వాడు కుబేరురుడులో పొదుపు ఉద్యమమును ప్రచారము చేసినాడు. బాపురెడ్డి గేయములలో కవిత్వము కంటే ప్రచార ధోరణి ఎక్కువ.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

# బహుజన అస్తిత్వవాద సాహిత్యం - ఒక సందిగ్ధత

–

ఈ దేశ ప్రజలను కులాతీత వ్యక్తులుగా,ఇక్కడి సమాజాన్ని కులరహిత సమాజంగా చిత్రించడం అవగాహనా రాహిత్యమైనా అయ్యుండాలి. లేక అబద్ధపు చిత్రణ ఐనా అయ్యుండాలి. ఒక్కడ హిందూ, ముస్లిం, క్రైస్తవ, సిక్కు దాదాపు అన్ని మతాల్లోనూ కులం దాని పునాదులను శాశ్వతపర్చుకుని ఉన్న చారిత్రాత్మక విషయాన్ని పక్కన బెట్టి రచయితలు కులం గురించి రాయకపోవడమనేది పెద్ద తప్పిదమే. కులం దాని ప్రభావాన్ని చూపని చోట కులం గురించి వ్రాయకపోవడం పెద్ద విషాదమేమి కాదు. కాని కుల రక్కసి అత్యంత విషపూరి తంగా ఈ దేశ ప్రజా జీవితాల మీద కరాళనృత్యం చేస్తూ ఉంటే కులం ఎక్కడిదని దబాయించడం, అంతా సమానమే నని నమ్మించే ప్రయత్నం చేయడం మూర్ఖత్వం.

సాహిత్యంలో నిబద్ధత అనేది అత్యంత ముఖ్యమైన అంశం. లేని దాన్ని ఊహించుకుని పుంఖానుపుంఖాలుగా సాహిత్యం వ్రాసి తృప్తి చెందే భావకవులున్న దేశంలో ఉన్న కులాన్ని లేనిదానిగా.., అది అంత ప్రాధాన్యత లేని అంశంగా చిత్రీకరించి ముసుగులు కప్పడం ఆశ్చర్యంగా తోస్తుంది. కులం గురించి మాట్లాడితేనే ఈ సమాజాన్ని చీల్చుతున్నారని అంతె త్తున లేచే నయా దేశభక్తులు అసలు ఈ మనువాద సమాజమే చీలికలతో ఉన్నదనే కామన్ పాయింట్‌ని ఎందుకు మరిచి పోతున్నారో అర్థం కాని పరిస్థితి. సరే., అందరి సంగతి ఏమోగాని తమ గతితార్కిక భౌతికవాదంతో హేతుబద్ధత,శాస్త్రీయతను కాస్త నేర్పిన లెఫ్ట్ ఐడియాలజీ కులాన్ని అత్యంత సాధారణమైన అంశంగా తీసుకోవడం ఒక చారిత్రాత్మక తప్పిదం.

'పదార్థం చేత నిర్మితమైన ఈ ప్రపంచానికి ఒక గతి ఉంటుందని,ఆ గతిని శాస్త్రీయబద్ధంగా అధ్యయనం చేయాలని బోధించిన లెఫ్ట్ ఐడియాలజీ ఆ గతి నిచ్చెనమెట్ల రూపంలో ఉన్న ఈ కుల వ్యవస్థను ఎందుకు గమనించలేదో, కనీసంగా ఎందుకు స్పర్శించలేదో, ఎందుకు చర్చకు పెట్టలేదో ఆలోచించాల్సి ఉంది. కుల అస్తిత్వ ఉద్యమాలు ఉవ్వెత్తున ఎగసిన తర్వాత కొంతకాలం క్రిందట 'కులవివక్ష'గురించి మాట్లాడడం మొదలుపెట్టారీ లెఫ్టిస్టులు. అసలు కులమే లేని కులరహిత సమాజంగా ఈ సమాజాన్ని మార్చాల్సిన తరుణంలో వివక్ష గురించి మాట్లాడడం ఇంకా గందరగోళమే. కులం ఉంటే వివక్ష ఉంటుంది. కులం లేకుంటే వివక్ష ఉండదు కదా-మరి అలాంటప్పుడు కులవివక్ష గురించి పోరాడతా మనడం కులం పట్ల లెఫ్ట్ ఐడియాలజీ కన్ఫ్యూజన్‌నెస్‌ని మరొకసారి బహిర్గతపరుస్తుంది.

ఇండియాలో కులవ్యవస్థే వర్గాల సృష్టికి కారణమని, వర్గాలకు కుల వ్యవస్థ తల్లి అని, వర్గం అనేది కులం యొక్క సంతానమని, కులం అనేది కొందరికి పెట్టుబడిగా, సంపదగా కొనసాగుతూ, మరికొందరిని పీడిత వర్గంగా. పేదలుగా మారడానికి దారి తీస్తున్నదని లెఫ్ట్ ఐడియాలజీ ఎందుకు కనుక్కోలేకపోయిందో, కనుక్కున్నా ఎందుకు ఆ విషయాలను బహిరంగపర్చలేదో వెల్లడించాల్సిన అవసరం ఉంది.మనిషి జీవితంలో అత్యంత ప్రధాన పాత్ర పోషిస్తూ పునరుత్పత్తి సంబంధాల్లోనూ కులం తన ప్రభావాన్ని చూపుతున్న విషయాన్ని తమ గతి తార్కిక కోణం నుండి వీరు ఎందుకు పసిగట్టలేదో పునశ్చరణ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది. ఒక్క ముక్కలో చెప్పాలంటే ఈ విషయంలో లెఫ్ట్ ఐడియాలజీకి మను వాదులకు కులం విషయంలో దగ్గరి సంబంధం ఉన్నది. లెఫ్ట్ ఐడియాలజీ 'వర్గం'కాగా, మనువాదులు 'మతం' అవు తున్నారు. ఇద్దరూ 'కులం' అంశాన్ని వదిలేస్తున్నారు చర్చకు పెట్టకుండా -

వాస్తవానికీ ఫలానా కులంలో పుట్టాలని ఏ వ్యక్తి తన పుట్టుకకు ముందు కోరుకునే అవకాశం లేదు. అసలు పుట్టుక అనేది ఛాయిస్‌కి సంబంధించిన అంశం కాదు. ఆయా కులాల్లో పుట్టడం అత్యంత యాదృచ్ఛికం. కాని పుట్టుక చేతనే కులం నిర్ణయించబడుతుండడం, ఆ వ్యక్తి జీవన గమనంలో కులం ఆహార సంబంధాల దగ్గర నుండి ఆర్థిక సంబంధాల వరకు ఒక గతిలో అతన్ని నియంత్రిస్తుండడాన్ని కమ్యూనిస్టు ఐడియా లజీ ఎందుకు అర్థం చేసుకోలేకపోయిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. కులం కమ్యూనిస్టు ఐడియాలజీకి అర్థం కాలేదా అర్థం చేసుకోని కూడా వ్యూహాత్మక మౌనం పాటించారా? తేల్చాల్సి ఉంది. మరీ ముఖ్యంగా సాహిత్యం విషయానికొస్తే... సాహిత్యం జీవితాలను వ్యాఖ్యానించాలని చెప్పిన వీరే ఈ దేశ ప్రజల జీవితాలు కులం పునాదుల మీద నిర్మితమై ఉన్నాయనే విషయాన్ని మరిచి ఈ సమాజాన్ని వర్గదృష్టితో చూసి ఆర్థిక రంగమే ఈ సమాజాన్ని నియంత్రిస్తుందని చెప్పింది. వర్గ పునాదుల మీద సాహిత్యం, సంస్కృతి, కులం, మతం వంటి ఉపరితల అంశాలు నిర్మాణమవుతాయని మార్క్సిజం చెబుతుంది. వర్గ సమాజంలో వర్గ సంస్కృతి ఉం టుందని వర్గ సాహిత్యమే ఉంటుందని చెబుతుంది. పేద వర్గం యొక్క కళాత్మక వ్యక్తీకరణలన్నీ వర్గ సమాజానికి వ్యతి రేకంగా ఆవిష్కారమయ్యే చైతన్యమని మార్క్సిజం బోధిస్తుంది. పునాది-ఉపరితలం అనే రెండింటిలో పునాది(వర్గం)ని

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


మారిస్తేనే ఉపరితలం మారుతుందని మార్క్సిస్టు సిద్ధాంతం చెబుతుంది. ఇదిలా ఉంటే... ఎక్స్‌ట్రీం మార్క్సిజం విప్లవం ద్వారానే సమానత్వసాధన అంటుంది. కాని ఇప్పటిదాకా జరిగిన విప్లవోద్యమాల్లో నేలకొరిగిన వారెవ్వరు? తుపాకి గొట్టం ద్వారా రాజ్యాధికారం ప్రయోగంలో కోల్పోయినదెంత? పొందినదెంత? అనే ప్రశ్నకు విప్లవోద్యమాలు సమాధానమివ్వవు. కనుక సాహిత్యం జీవితాన్ని వ్యాఖ్యానించాలి-కాని షరతులు వర్తిస్తాయి అనే మార్క్సిస్టుల ఈ ద్వంద్వ గమనాన్ని పసిగట్టిన దళిత బహుజన సాహిత్యోద్యమకారులు అస్తిత్వోద్యమాలకు పూను కునేంత వరకు దళిత బహుజన జీవితాలు సాహిత్యంలో ప్రధాన బాగం కాలేకపోయాయి. వాస్తవానికి దళిత బహుజన అస్తిత్వ ఉద్యమాలు ఎప్పుడు ఊపందుకున్నాయో అప్పుడే దళిత బహుజన జీవితాలు సాహిత్యంలో ప్రధాన భాగమై నాయి.

అయితే ఇక్కడ మార్క్సిస్టులకు ఒక్క సూటి ప్రశ్న - సాహిత్యానికి వర్గ దృక్పథం ఉంటుందని అంగీకరించినప్పుడు ఆ వర్గానికే మూలమైన కులాన్ని ఎందుకని అంగీకరించ డూడదు?

అలాగని బహుజన అస్తిత్వవాదులు కేవలం కులమే అనట్లేదు కదా-కులం చాతుర్వర్ణ భారతీయ సమాజంలో ఒక నిర్ణయాత్మకమైన శక్తిగా ఉన్నప్పుడు దాన్ని పునాది అంశంగా ఎందుకు పరిగణించట్లేదనే చర్చ లేవదీస్తున్నారు బహుజన అస్తిత్వవాదులు.

సాహిత్య చరిత్రను పరిశీలిస్తే.., 1980ల్లోనే అస్తిత్వ ఉద్యమాలు స్త్రీవాదంతో మొదలైన సంగతి తెలిసిందే. స్త్రీవాదం కూడా వర్గదృష్టి నుండి సమాజాన్ని విశ్లేషించిన మార్క్సిస్టు విశ్లేషణ సరైంది కాదని,లైంగిక దోపిడీ,లైంగిక హింస, పితృస్వామిక అణిచివేత స్త్రీల ప్రధాన సమస్యలనీ, వాటిని ఉపరితల సమస్యగా చిత్రించి అప్రధానం చేసిందని వాదిం చింది. ఇప్పుడు స్త్రీవాదంలోనూ దళిత బహుజన స్త్రీవాదం బయలుదేరి అందరు స్త్రీల సమస్యలు సమానం కాదని పితృస్వామిక సమాజంతో పాటు కులం కూడా ఒక ప్రధానమైన నిర్ణయాత్మకమైన అంశమనే చర్చ బయలుదేరింది.దీనికి పూలే అంబేద్కర్ భావజాలం తాత్విక పునాది అయ్యింది.

ఆ తర్వాత దళిత అస్తిత్వవాదం, బహుజన అస్తిత్వ వాదం కూడా పూలే, అంబేద్కర్ ఐడియాలజీతో కులం పునా దిగా భావిస్తూనే కులం వలన ఏర్పడిన వర్గాన్ని, ఆ వర్గపు ఆలంబన అయిన ఆర్థిక అంశాలను కూడా పరిగణనలోకి తీసుకుని పరిశీలిస్తున్నది. లెఫ్టిస్టులు చెప్పిన రెండు వర్గాలు ఎవరో కాదని అగ్రవర్ణాలు-ఆధిపత్య కులాలే పెట్టుబడీదారి అని,అణగారిన కులాలే పీడితపేదలని శాస్త్రీయబద్ధంగా నిరూపిస్తున్నది. ఈ దళిత, బహుజన ఐడియాలజీకి పునాది తత్వం లేదని వాదించే పిడివాదులకి సమాధానం చెబుతూ అస్తిత్వ ఉద్యమాలకు పూలే-బాబాసాహెబ్ తాత్విక దృక్పథమే బహుజన ఐడియాలజీకి మూలమని తేల్చి చెబుతున్నారు. అంత మాత్రం చేత కులాన్నే సర్వకాల సర్వ అవస్థలయందు ఆలంబన చేయక మారుతున్న కాలాన్ని బట్టి శాస్త్రీయ అవగా హనతో మారడమే అసలైన బహుజనిజం అని బహుజన దృక్పథం చెబుతున్నది. కులం చేత ఒక జాతినిగాని ఒక నీతిని గాని నిర్మించలేమని విశ్వసిస్తూనే ఆర్థిక అంశాలకు కూడా సమ ప్రాధాన్యతను ఇస్తూనే వీటన్నింటిని దాటి రాజ్యాధికార దిశగా సాగాలని పిలుపునిస్తున్నది.

వాస్తవానికి ఇంతగా దళిత బహుజన దృక్పథం పెంపొందడానికి చాలా ఉద్యమాలు, సంస్థలు పనిచేసాయి. తెలంగాణాకు సంబంధించి ఒక క్రియాశీలక పాత్ర పోషించింది మాత్రం ద.ర.క.మే (దళిత రచయితల కళాకారుల మేధావుల ఐక్యవేదిక). దరకమే ఒక విశాల తాత్విక దృక్పథంతో ఒక తాత్విక పునాదితో ముందుకొచ్చింది. చార్వాకులు, బుద్ధుడు, పూలే, సావిత్రీ భాయ్ పూలే, బాబాసాహెబ్, పెరియార్, నారాయణ గురు, సాహూ మహరాజ్‌ల జీవితం భోదనలే దీనికి పునాదని తేల్చి చెప్పింది. వీరి ఆలోచనా విధానం,తాత్విక సందేశమే దరకమే కార్యాచరణకు చర్చకు పెట్టింది. అయితే దరకమే కొంత మార్క్స్, ఇంకొంత అంబేద్కర్‌ను అనుసరిం చడం జరిగింది. ఇలా ఒక్క దరకమేనే కాకుండా వ్యక్తులుగా జి.లక్ష్మినరసయ్యలాంటి వాళ్ళు చిక్కనవుతున్నపాట తర్వాత ఇంకాస్త ముందుకెళ్ళి అంబేద్కర్ ఐడియాలజీనే పూర్తిస్థాయిగా కార్యాచరణకు పెట్టడం జరిగింది. ఆ తర్వాత జి.లక్ష్మినర సయ్యతో పాటు మద్దూరు నగేష్‌బాబు, పైడి తేరేష్‌బాబు, చల్లపల్లి స్వరూపారాణి, వేముల ఎల్లయ్య,చిత్రం ప్రసాద్, మునాస వెంకట్, పగడాల నాగేందర్, జూలూరు గౌరీశంకర్, కోయి కోటేశ్వర్రావ్, జి.వి.రత్నాకర్‌లు బాబాసాహెబ్ తాత్విక దృక్పథంతో ఈ విశాల దళిత బహుజన దృక్పథాన్ని బాగా అభివృద్ధి చేశారు. ఈ తరంలో సంగిశెట్టి శ్రీనివాస్, డా.జిలుకర శ్రీనివాస్, స్కైబాబా, డా.పసునూరి రవీందర్లు, డా.చింతం ప్రవీణ్‌లు ఈ విశాల దృక్పధాన్ని ఇంకా ముందుకు తీసు కెళ్తున్నారు.

దళిత, బహుజన రచయితలు అగ్రవర్ణ, అగ్రకుల, అన్యవర్గ భావజాలం అందించిన సూత్రాల ఆధారంగా తమయొక్క దళిత, బహుజన జీవితాలను తమ తమ సాహిత్యంలో చిత్రీకరిస్తున్నారంటూ అలాకాకుండా దళిత, బహుజన జీవిత వస్తువును బహుజనుల శక్తి సామర్థ్యాలను నిలబెట్టే ధైర్యాన్నిచ్చే విధంగా మలుచుకోవాలని ఇంతకి ముందరి తరం బహుజన ఐడియాలజిస్టులు సూచించారు. అయితే వర్గ నిర్మూలన ధ్యేయంగా రచనలు చేసిన లెఫ్టిస్టుల

ఐడియాలజికీ భిన్నంగా రాజకీయ అధికారం ద్వారానే సాంఘిక సాధికారికత,సామాజిక న్యాయం,సామాజిక మార్పు సాధ్యమని నేటి బహుజన ఐడియాలజిస్టులు సాహిత్య సృజన చేస్తున్నారు.

పూలే-అంబేద్కరిస్టులు కేవలం కులాన్ని పట్టుకుని వేలాడతారని అంటున్న లెఫ్టిస్టుల, మత ఛాందసవాదుల భావ దారిద్ర్యాన్ని గమనిస్తూ ప్రజాస్వామిక సమసమాజ నిర్మాణానికి, స్వేచ్ఛా సమానత్వానికి, సామాజిక న్యాయం ద్వారా సామాజిక మార్పుకు క్రమంగా కులరహిత సమాజానికి కృషి చేస్తున్నది బహుజన ఐడియాలజీ. ఈ విషయంలో బహుజన రచయితలు తమ సాహిత్యం ద్వారా రాజకీయ విముక్తి అనే అంశాన్ని తీసుకుని భోదించు - సమీకరించు - పోరాడు - రాజ్యాధికారం పొందు అనే అంశాల ప్రాతిపదికన సాహితీ అస్తిత్వ పోరాటం చేస్తున్నారు.

మరి దళిత, బహుజన రచయితలందరూ ఈ దారిలోనే పయనిస్తున్నారా? పయనించారా?అనేదే అసలు చిక్కు ప్రశ్న. ఈ చిక్కు ప్రశ్నల్లో చిక్కుకున్న రచయితలు ఇలా చిక్కుపడడానికి చాలా కారణాలున్నా వామపక్షభావజాలాన్ని అనుసరిస్తుండడం ప్రధాన కారణం. లెఫ్టిజం ప్రభావమున్న దళిత, బహుజన రచయితలు చాలా మంది ఇప్పటికీ తాము పుట్టి పెరిగిన తమ చుట్టూ గల తమ సమూహపు జీవితాలను, తమ సొంత సంస్కృతిని కథలు నవలల్లో చిత్రించడం లేదు. ఇలా వారు వర్గ దృక్పథం పేరిట 'క్యాస్ట్ ఈస్ ఇమ్మేటిరియల్' దృక్పథాన్ని ఫాలో అవుతూ అందరి గురించి రాసి అందరివాడు అనిపించుకోవాలనే అతృతతో కన్ఫ్యూజన్‌లో పరాయీకరణకు గురవుతున్నారు. ఫలితంగా తమ కులాల గురించి రాయలేకపోతున్నారు. ఇలా బహుజన రచయితలు స్వీయ అస్తిత్వాన్ని స్వీయ చైతన్యాన్ని కోల్పోయి కులం, కుల సంస్కృతి, కుల వివక్ష, రక్త సంబంధాలు జీవితంలో, సామాజిక పరిణామాల్లో, సామాజిక ఉద్యమాల్లో నిర్వహించే పాత్రను పట్టుకోలేక పోయారు.

"బహుజన కులాల్లో పుట్టి తమ కులాల గురించి రాయలేకపోవడం, సంకోచించడం కన్నా పరాయీకరణ ఏముంటుంది?. కొందరు ఈ పరాయీకరణ నుండి బయటపడి కొంతమేరకు రాసినా బహుజన ఐడియాలజీని సరిగా అర్థం చేసుకోలేక ఓడిపోయిన జీవితాలను, పీడిత జీవితాలను, ఉద్యమాలను, విప్లవోద్యమాల్లో కోల్పోయినతనాన్ని, కూలిపోయిన గుడిసెల గురించి, పాడుబడ్డ బావుల గురించి, చెదిరిన పల్లెల గురించి రిపోర్ట్ లాంటి సాహిత్యం రాసుకుంటున్నారు. అసలు ఈ జీవితాలు ఇలా ఉండడానికి ప్రజాస్వామ్య పద్దతిలో అతి ముఖ్యమైన ఓటు, అధికారం - రాజ్యాధికారం ముఖ్యమని చెప్పరు. ఇలా ఈ లెఫ్టిస్టిక్ ఐడియాలజీ వల్ల రచయితలకు జరిగిన నష్టం కన్నా బహుజన సమాజానికి, సాహిత్యానికి జరిగిన నష్టం వేల రేట్లు" అంటారు బహుజన తత్వవేత్త బి.ఎస్.రాములు.

అయితే మొత్తానికి మొత్తంగా లెఫ్టిజాన్ని మాత్రమే దోషిని చేయడం బహుజన అస్తిత్వకారుల ప్రధానోద్దేశ్యం కాదు. దీనికి అగ్రవర్ణ-మనువాదం కూడా కారణమే కాని లెఫ్టిస్టు సిద్ధాంతకర్తలు ఈ మనువాద భావజాలం,దాని ఆచరణ, సంస్కృతి కులవ్యవస్థ రూపంలో కొనసాగుతున్న రాజకీయ, సామాజిక వ్యవస్థలే ప్రధాన కారణమని వాటి మూలాలను బహుజన రచయితలకు విప్పి చెపండంలో ఘోరంగా విఫలమయ్యారు.

వాస్తవానికీ, సామాజిక వర్గ సంబంధం కన్నా కుల రక్త సంబంధం, కుల పునరుత్పత్తి సంబంధం మిన్నా అని భారతీయ సమాజం ఆచరణలో తెలుపుతున్నది. కనుక బాబా సాహెబ్, పూలేలు ముందుకు తెచ్చిన సమస్త వర్ణ, వర్గ, కుల, లింగ, మత, ప్రాంత, భాష, దేశీ విచక్షణలకు అసమానతలకు వ్యతిరేకంగా సామాజిక న్యాయం కోసం,సామాజిక మార్పు కోసం, జీవన ప్రమాణాల ఎదుగుదల కోసం-మొత్తంగా కుల నిర్మూలన కోసం సమగ్ర సామాజిక వికాసం కోసం సమగ్ర సామాజిక దృక్పథంతో రచనలు చేయాల్సి ఉంది.-అంతిమంగా రాజ్యాధికారం వైపు సాగాలని అప్పుడే బహుజన జీవితాలకు విముక్తి అని... సాహిత్యం ద్వారా రాజకీయ విముక్తి సాధించాలంటే మన కోసం మనం రాసుకోక తప్పదని ఇప్పటికైనా బహుజన రచయితలు వర్గ, ఆధిపత్య సందిగ్ధాలను వీడాలని ఈ తరం బహుజన దృక్పథం చెబుతున్నది.

**ఉపయుక్త గ్రంధాలు :**

1. చిక్కనవుతున్న పాట-దళిత కవిత్వం-(సం)జి.లక్ష్మినరసయ్య, త్రిపురనేని శ్రీనివాస్, కవిత్వం ప్రచురణలు-14, విజయవాడ, జనవరి, 1995.
2. పదునెక్కిన పాట-దళిత కవిత్వం-(సం)జి.లక్ష్మినరసయ్య, దళితసాన ప్రచురణలు, విజయవాడ, జనవరి, 1996
3. దళిత సాహిత్యం-తాత్విక దృక్పథం-(సం)జి.లక్ష్మినరసయ్య, దళితసాన ప్రచురణలు, విజయవాడ, 1999.
4. వెంటాడే కలాలు-వెనుకబడిన కులాలు-(సం)జూలూరి గౌరీశంకర్, స్పృహ సాహితీ సంస్థ, కోదాడ, మార్చి, 2001.
5. పొతం-మూలవాసి విమర్శ-జిలుకర శ్రీనివాస్,ఇండస్ ప్రచురణలు, హైదరాబాద్, మార్చి,2012.
6. సమకాలీన సాహిత్య ధోరణులు-ననుమాస స్వామి,ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం, హైదరాబాద్
7. దళిత వాద వివాదాలు-ఎస్వీ సత్యనారాయణ, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 2004.
8. సమూహం-బిసి అస్తిత్వవాద యువకవిత్వం-(సం)చింతం ప్రవీణ్ కుమార్, బి.సి రైటర్స్ వింగ్, హైదరాబాద్, డిసెంబర్, 2016.

# స్త్రీ చైతన్య కాంక్ష - మన్నులో మన్నునై

- డా॥ యర్రుదొడ్డి సుభాషిణి, అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీపద్మావతి మహిళా , తిరుపతి-2.

1. ఆధునిక తెలుగు సాహిత్యంలో సమకాలీన సమాజాన్ని ప్రతిబింబించే ప్రక్రియలలో కథానికది అగ్రస్థానం. స్పష్టత, క్లుప్తత, సరళత కథలో పుష్కలంగా ఉండటమే దానికి ప్రధాన కారణం. కథారచయిత్రిగా ఒక స్థానాన్ని పదిలపరచుకొంటున్న యం.ఆర్. అరుణకుమారి మూడు కథాసంపుటాలను వెలువరించారు. అందులో ఒకటి 'మన్నులో మన్నునై'. ఈ సంపుటి 23 కథల సమాహారం. పాఠకులు ఊహించని కొసమెరుపుతో స్త్రీపాత్రలను ఉన్నతీకరించారు. వాస్తవ జీవన దృశ్యాలు వీరి కథల్లో గోచరమవుతాయి. స్త్రీల జీవితాల సునిశిత పరిశీలన వీరి సొంతం. ఈ దిశలోనే నిత్యజీవితంలో స్త్రీల వెతలు, ఆచార సంప్రదాయాల ముసుగులో నలుగుతున్న మహిళల మనసులు వీరి కథల్లో స్పష్టంగా వ్యక్తమవుతాయి. సమస్యకు ప్రతిస్పందనగా స్త్రీ చైతన్యవంతంగా ప్రవర్తించిన తీరు కథల్లో ప్రస్ఫుటమవుతుంది.

2. స్త్రీ కేంద్రంగా, ప్రధాన పాత్రగా నడిచిన కథలే అన్నీనూ! వివాహ విషయంలో సొంత నిర్ణయంతో (పాడవే కోయిలా) కొన్ని, సమస్యల్ని ఎదుర్కొని నిలబడినవి (నాలుగోసింహం గర్జిస్తే, మా ఆయన పెళ్ళి రద్దు చేయండి, శిశిరంలో వసంతం, మరణ శాసనం) కొన్ని, చైతన్యంతో ముందుకు సాగినవి (అడవి పువ్వు) కొన్ని, సాంప్రదాయ వ్యవస్థకు తిరగబడినవి (విషాద గీతం, దొరసాని బతుకులు) మరికొన్ని పాత్రలుగా రచయిత్రి మనముందుంచారు. పరిస్థితులకు తలొగ్గి నడిచిన (తొలిబలి, లేతవెన్నెల) కొన్ని దృష్టాంతాలతో కథలు రూపుదిద్దుకున్నాయి. సమాజంలో ఆడపిల్లను కనడానికి ప్రోత్సాహం లేకపోవడం, ఆ బిడ్డను ఎలాగైనా కాపాడుకోవాలని ఎదురు తిరిగి నిలదొక్కుకున్న స్థితి కూడా ఈ కథల ద్వారా అవగతమవుతుంది. పెళ్ళిచేసుకోవడానికి అత్యాచారమే మార్గమని ఆలోచించిన మగవాని వంచన, కుట్రకుతంత్రాలకు స్త్రీ బలి అయినా, తన కాళ్ళపై తాను నిలబడి జీవించడానికి తన శాయశక్తులా కృషి చేసిన ఉదంతం పాడవే కోయిలా కథ ప్రతిబింబిస్తుంది.

3. కుటుంబ జీవితాన్ని ఇతివృత్తంగా చేసుకొని వచ్చిన కథల్ని గమనిస్తే అందులో అనేక రకాల స్త్రీ సమస్యలు కన్పిస్తాయి. ఆడపిల్ల పుట్టుక, చదువు, పెళ్ళి, భార్యగా, తల్లిగా, ఉద్యోగిగా స్త్రీ పడే మనోవేదన ఇలా అనేక రకాల సమస్యలు స్త్రీని కృంగదీస్తున్నాయి. సమాజంలో వివక్ష కారణంతో స్త్రీలు పడే వెతలు మన చుట్టూ ఉన్న సమాజంలో కోకొల్లలు. ఆకోణంలో నుండి వచ్చిన కథల్లో 'దొరసాని బతుకులు' ఒకటి. ఆడపిల్ల పుడితే చంపేసే సంప్రదాయం గల కుటుంబానికి అడుగుపెడుతుంది గంగ. మొదట పుట్టిన ఆడపిల్లను తన అత్త చంపేస్తుంది. రెండవసారి పుట్టిన ఆడపిల్లనూ భర్త డబ్బుకు అమ్మేయడానికి ప్రయత్నిస్తాడు. దానికి గంగ ఎదురు తిరిగి తనబిడ్డను కాపాడుకొనే ఉదంతమే కథాంశం. ఆడపిల్లలు వద్దని ప్రతి ఒక్కరూ చంపుకొంటూ పోతే జీవావరణ వైవిధ్యం కుంటుపడుతుంది. ఒక జాతి కొరత కారణంగా జీవం మనుగడ ఆగిపోయే ప్రమాదమూ ఉంది. ఒక స్త్రీని నలుగురైదుగురు పురుషులు వివాహం చేసుకోవాల్సిన గత్యంతరం తప్పదు. ఈ సూక్ష్మతను గ్రహించని మనుషులు ఇప్పటికీ ఆడపిల్లను వద్దని చంపేయడం లేదా అమ్మేయడమనేది ఎంతవరకు సబబు? తల్లి కుడా ఒక ఆడపిల్లేననే సత్యాన్ని గ్రహించలేని స్థితిలో స్త్రీ జీవిస్తోంది. ఇది కేవలం కథల్లోనే కాదు. నిజ జీవితంలోనూ కోకొల్లలు జరుగుతున్నాయి. అలా జరిగినదే ఇటీవల ఆంధ్రజ్యోతి పత్రికలో వచ్చినవార్త. నలుగురు ఆడపిల్లలు పుట్టారని ఒకరిని అమ్మకానికి పెట్టిన కసాయి తండ్రి గురించిన వార్త అది "ఐదువేలకే ఆడపిల్ల" (ఆంధ్రజ్యోతి 28.6.17). సృష్టి కొనసాగాలంటే ఆడపిల్ల కావాలి కాని ఆడపిల్లను ఎంత చులకన భావంతో చూస్తున్నారో ఈ వార్త చెబుతుంది. సాంకేతికత, ఎంతగా అభివృద్ధి చెందినా అమ్మాయిలు అన్ని రంగాలలో సమానంగా దూసుకుపోతున్నా నేటికీ ఆడపిల్ల పట్ల వివక్ష కొనసాగుతూనే ఉంది. అందుకే గంగ "మాకు దొర్సాని బతుకులు వద్దు...మా బతుకు లేందో మమ్మల బతకనీయండి అంతేసాలు మాకు" (పుట:99) అంటూ ఎదురు తిరిగి తనబిడ్డను కాపాడుకోవడానికి ప్రయత్నం చేస్తుంది. ఆ ప్రయత్నంలో గెలుస్తుంది. ఇలాంటి చైతన్యం స్త్రీలందరిలో రావాలనే తపన రచయిత్రిలో వ్యక్తమవుతుంది.

భారతదేశంలో స్త్రీలకు ఒక మహోన్నతమైన స్థానం ఉంది. పురాణాల్లో, ఇతిహాసాల్లో, సాహిత్యంలో, రాజకీయంలో ఇలా అన్నింటిలో స్త్రీకి పెద్ద పీట ఉంది. నేడు అన్నిరంగాల్లో అవలీలగా ప్రగతిని సాధిస్తున్నారు. అయినా ఆడపిల్ల పుడితే అరిష్టమనే రోజులు ఇంకా

ఉన్నాయంటే ఆశ్చర్యంతో పాటూ ఆవేదన కలుగుతుంది. ఆడపిల్లను చంపుకొంటూ పోతే సృష్టి ఆగిపోయే ప్రమాదం ఉందని తెలిసీ మనిషిలో మార్పు రాకపోవడానికి కారణం? సమాజమేనా? సమాజంలో జరుగుతున్న దారుణాలా? ఏవి? నిత్యం సమాజంలో చూస్తున్న లైంగిక దాడులు, వేధింపులు, వరకట్నపు చావులు, ఆడపిల్లకు జన్మనివ్వడానికి భయపెడుతున్నాయా? దీని గురించి ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన తరుణమిది. ఒక జాతి అంతరించడానికి ప్రమాదపుటంచున ఉంది. కనుకనే ఆడపిల్లను రక్షించుకోవాల్సిన అవసరముందని చాటిన కథగా "దొరసాని బతుకులు" పేర్కొనవచ్చు.

4. 'పాడవే కోయిలా' కథకు వస్తువు ఆడపిల్ల చైతన్యం. నిర్ణయాధికార ప్రకటనం. ఉషను ఇష్టపడ్డవాడు ఆమె కాదన్నదన్న కోపంతో రేప్‌చేస్తాడు. దానితో ఆమె నాన్నమ్మ అతనికే ఇచ్చి వివాహం చేయాలని నిశ్చయిస్తుంది. ఉషకు ససేమిరా అతడిని పెళ్ళిచేసుకోవడం ఇష్టంలేదు. అతణ్ణి పెళ్ళి చేసుకుంటే రోజూ లైంగికదాడికి గురి కావాల్సిందేనని వాళ్ళ నాన్నమ్మకు నచ్చజెప్పి మార్పు తీసుకొస్తుంది. ఆపెళ్ళి జరగకుండా తననితాను కాపాడుకొంటుంది.

స్త్రీకి శీలంపోతే జీవితమే లేదనుకునే రోజులు కాదని, లైంగికదాడి చేసిన వాడి కుత్సితమైన పన్నాగాన్ని కనిపెట్టి అతనికి బుద్ధి చెప్తుంది. స్త్రీ అంటే అణగిమణిగి ఉండాల్సిన అవసరం లేదని తన కాళ్ళ మీద తాను తాను నిలబడగలనని నిరూపించింది ఉష. "శీలమంటే మనిషి సచ్ఛీలతే గానీ,శారీరక పవిత్ర మాత్రమే కాదు" (పుట:52) అన్న ఉష మాటలు వాళ్ళ నాన్నమ్మలో మార్పుకు కారణమవుతాయి. ఉష భవిష్యత్తుకు బాటలు వేయడానికి దోహదపడతాయి. పదిమందికి ఉష ఆదర్శం కావాలని ఆశించిన వాళ్ళ నాన్నమ్మ ఆమెను చదువుకోమంటుంది. తనకు అండగా నిలబడుతుంది. రచయిత్రి ఆకాంక్ష స్త్రీకి వివాహ విషయంలో నిర్ణయాధికారం ఉండాలని, అమ్మమ్మ అందుకు ఆమోదించడం కుటుంబాలలో పెరగవలసిన సంస్కారాన్ని ఆశావహంగా చూపిస్తుంది.

5. భర్త చేసే తప్పుడు పనులన్నింటినీ చూస్తూ ఊరుకోకుండా ఎదురుతిరిగి పోరాడిన స్త్రీ సాహసాన్ని చిత్రించిన కథ ' మా ఆయన పెళ్ళి రద్దు చేయండి '. మొదటి భార్య జీవించి ఉండగానే ఆమెకు చట్టపరంగా విడాకులివ్వకుండా ఆస్తికోసం ఆశపడి భర్త తను పెంచిన మేనకోడలినే రెండో పెళ్ళి చేసుకోవడానికి సిద్ధపడతాడు. పెళ్ళికి సిద్ధమైన భర్తకు ఆయన మొదటి భార్య కోర్టును ఆశ్రయించి ఆ పెళ్ళిని తప్పించడమే కథాంశం. ఈకథలో పురుష అహంకారం మీద దెబ్బకొట్టి మరీ బుద్ధి చెప్తుంది మొదటి భార్య.

భార్యకు పిల్లలు పుట్టలేదని రెండోపెళ్ళికి సిద్ధపడిన భర్తకు బుద్ధి చెప్పడమే కాకుండా తనకు పిల్లలు పుట్టకపోవడానికి భర్తే కారణమని రుజువు చేసిన వృత్తాంతం ' వంధ్యశిల ' కథ. మరోకథ ' మరణ శాసనం '. ఈ కథలో కట్నం ఎంత ఇచ్చినా తృప్తి చెందని భర్త అత్తమామలు కలిసి భార్య మీద కిరసనాయిలు పోసి కాల్చేస్తారు. వారు చేసిన అరాచకానికి చివరి శ్వాస విడిచే ముందు ఆమె న్యాయస్థానాలను సంస్కరించాలని కోరుతూ ఈ వ్యవస్థ మీద అతివలంతా ఎదురుతిరిగి సాధించుకోవాలని చెప్తుంది. ఎదురు తిరగలేకపోతే ఒకరినిచంపి మరొకరిని పెళ్ళి పేరుతో బలి చేస్తారు. మరో స్త్రీ బలి కాకుండా ఉండాలంటే ఎదురు తిరగడమొక్కటే మార్గమని తెలిపి మరీ ప్రాణాలు విడుస్తుంది సుప్రజ.

ఈ మూడు కథల్లోనూ స్త్రీ పురుషుని వంచనకు బలి పశువయిందన్నది కఠోరసత్యం. అయితే ఏ స్త్రీ కూడా నిస్సహాయంగా ఉండిపోలేదు. మగాడి మోసాన్ని కనిపెట్టి దానిని అందరి ముందు బయటపెట్టి రెండో పెళ్ళి జరగకుండా ఆపి తన భర్తను కాపాడుకొంటుంది ఒక స్త్రీ. పిల్లలు పుట్టక పోవడానికి తాను కారణం కాదని నిరూపించి మరీ విజయం సాధిస్తుంది ఇంకో స్త్రీ. అదనపు కట్నం కోసం కిరోసిన్‌తో నిప్పు పెట్టిన భర్తకు తగిన శిక్ష వేయాల్సిందేనని ప్రతీకార వాంఛతో ప్రాణాలు విడుస్తుంది మరో స్త్రీ. ఇలా ముగ్గురు స్త్రీలూ తామను కొన్నది సాధించి, పలువురికి సందేశాత్మక పాత్రలుగా నిలిచారు. చైతన్యం ఎంత అవసరమో చాటి చెప్పారు ముగ్గురు స్త్రీమూర్తులూ!

6. హత్య చేసిన భర్తను శిక్షిస్తే, నన్ను నాపిల్లల్ని శిక్షించినట్లే అవుతుందని, సమాజం హంతకుడి భార్యాపిల్లలంటూ ఆడిపోసుకుంటుందని, ఏ తప్పు చేయని మాకు ఈ శిక్షను విధించడమేంటంటూ న్యాయస్థానంలో న్యాయమూర్తిని ప్రశ్నించిన ఒక హంతకుడి భార్య గాథ "నాలుగో సింహం గర్జిస్తే......?". మగాడు తప్పు చేసినా స్త్రీలు, పిల్లలు బలైపోతారనే దాన్ని తిరగరాయలనే రచయిత ఆలోచన అభినందించదగ్గది. ఎందుకంటే కుటుంబంలో ఎలాంటి ఒడిదుడుకులు వచ్చినా, వాటి దుష్ఫలితాలను అనుభవించే వారిలో ఆడపిల్లలు, స్త్రీలు ముందు వరుసలో ఉంటారు. అలా స్త్రీలు ఎందుకుండాలని ప్రశ్నించే తీరులో జాగరూకత ఉంది. కనుకనే మాకు ఆ శిక్ష వద్దని న్యాయస్థానాన్ని స్త్రీలు నిలదీసేలా చేసింది.

7. 'అడవి పువ్వు' కథలో తల్లిని మోసం చేసిన తండ్రికి బుద్ధి చెప్పడం కోసం వాళ్ళ కూతురు మోతి ఆడిన ప్రేమ నాటకమే వస్తువు. తల్లిని మోసం చేసిన తండ్రికి పుట్టిన కొడుకుతోనే పెళ్ళికి సిద్ధమై ఆ తండ్రికి బుద్ధి చెప్పిన స్త్రీ మూర్తిని చిత్రించింది రచయిత్రి. పదిమంది లోనూ జరిగిన మోసాన్ని, తండ్రి ఒప్పుకునేలా చేసిన గిరిజన యువతి మోతి సామర్థ్యాన్ని, ధైర్యాన్ని నిరూపించిన కథ ఇది. సమాజంలో ఇలాంటి తండ్రులు చాలా మందే కన్పిస్తారు. కాని వాళ్ళు చేసిన మోసాన్ని బయట పెట్టే సాహసం చేసిన వారు అరుదనే చెప్పాలి. స్త్రీల జీవితాలతో ఆడుకొనే వాళ్ళకు ఈ కథ బాసటగా నిలుస్తుంది బాధిత మహిళలకు ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది.

8. భారతదేశంలో అడుగడుగునా వెంటాడే ఆచార సంప్రదాయాలను ధిక్కరించడమే 'విషాదగీతం' కథకు వస్తువు. రోజాకి పెళ్ళి అయిన రెండు నెలలలోపే భర్త యాక్సిడెంట్‌లో మరణిస్తాడు. ఉత్తర క్రియలు నిర్వహించే రోజున రోజాను విధవను చేసే తంతు ప్రారంభమైనప్పుడు ఆమె తల్లి ఎదురు తిరిగి "మీరంతా నన్ను నా కుటుంబాన్ని వెలివేసినా సరే నా బిడ్డ పసుపు కుంకుమల్ని మాత్రం దరి చేరనీయను" అని ఆ దుష్ట సంప్రదాయం మీద గర్జించి ఆ తంతును ఆపుతుంది.

ఆడపిల్లలంటేనే సమాజంలో చిన్నచూపు. లింగవివక్షత, లైంగిక వేధింపులు వంటి సమస్యలే కాకుండా మూఢాచారాలు స్త్రీల జీవితాలను ఇబ్బంది పెడుతున్నాయి. భర్త చనిపోయిన స్త్రీలను పసుపు కుంకుమలకు దూరం చేసే దుష్ట సంప్రదాయం మీద తిరుగుబాటు చేసి సాధించిన నేర్పు రోజా తల్లిది. (విషాద గీతం) మూఢాచారాలతో స్త్రీల మనస్సును నొప్పించడాన్ని అడ్డుకుంటుంది. బిడ్డ మీద ప్రేమతోనే ఈ పని చేసినా అది ఆహ్వానించదగ్గ మార్పుగా రచయిత్రి చిత్రీకరించారు. సంస్కరణోద్యమం ఫలితంగా స్త్రీలు తమ జీవిత సమస్యల గురించి తామే ఆలోచించుకోవడం, సామాజిక పరిష్కారం ఉందని గుర్తించడం, అందుకుతామే సంసిద్ధులమయ్యే చైతనాన్ని అభివృద్ధి పరచుకొనే ప్రత్యేకాంశం రోజా తల్లిలో ఉంది. ఆ భావాలను అందరికీ చెప్పే సాహసం అభినందనీయం. స్త్రీకి భర్త పోయిన దు:ఖమే పూడ్చలేనిది. అందుకు ఓదార్పు లేకుండా వారి హృదయాలను దహించి వేయవద్దంటూ ఆవేదన చెందిన స్త్రీ మూర్తిని చిత్రించారు. స్త్రీ సమస్య పట్ల స్పందించిన రచయిత్రి అతి సున్నితమైన మనసు బోధపడుతుంది. మానవ ప్రయత్నానికి ఈ ప్రపంచంలో ఏదీ అడ్డుకాదన్నది మరోసారి స్పష్టం చేసింది.

9. స్త్రీల ఆలోచనాశక్తిని, శక్తి సామర్థ్యాలను, వారిలో కల్గిన చైతన్యాన్ని కొన్ని కథలు సూచిస్తే మరికొన్ని పరిస్థితులకు తలొగ్గి సర్దుకుపోయే తత్త్వం ఉన్న స్త్రీలను సూచించే కథ లేతవెన్నెల, పరిస్థితులకు ఎదురు తిరిగి బుద్ధిచెప్పిన కథ ' నిశ్శబ్ద కెరటాలు'. ఇవి రెండూ ముస్లిం స్త్రీల జీవితాల్లో కనిపించే వారి మనోవేదనలను తెలియజేస్తాయి. బురఖా వేసుకోలేదని ఒక ముస్లిం యువతి (సర్తాజ్) ముఖం మీద కొందరు మతోన్మాదులు ఆసిడ్ పోసిన సంఘటనతో తల్లిదండ్రులకు తనపై ఉన్న ప్రేమతో కలిగిన భయాన్ని కాదనలేక సైరాభాను బురఖా నందుకోవడం 'లేతవెన్నెల' కథాంశం.

ముస్లిం స్త్రీలు బురఖా ధరించడం ఆచారం. పరాయి పురుషుని కంటపడకూడదనేది ఆచారంలోని ఆంతర్యం. ఈ బురఖా వ్యవస్థలో ఎందరో స్త్రీల జీవితాలు క్షోభిస్తున్నాయి. బురఖా వ్యవస్థలో మగ్గిపోతున్న స్త్రీల జీవితాన్ని రచయిత్రి "గాలి, వెలుతురులేని ఓ చీకటి కొట్లో బంధించబడి, ఊపిరాడక ఉక్కిరి బిక్కిరౌతూ....కళ్ళున్నా కన్పించని అంధత్వంలా... తడుముకొంటూ...రాళ్ళు పగిలే మిట్ట మధ్యాహ్నపు ఎండలో ఒక్కరవ్వ కన్పించకుండా పోస్టుమార్టం చేసిన శవానికి చుట్టినట్లు ఒంటినిండా నల్లటి వస్త్రంతో.... నడుస్తున్న శవంలా... భయంకరంగా... భయంగా" (పుట:65) ఉంటున్న ముస్లిం స్త్రీల ఆవేదనని, దాని వల్ల వాళ్ళు పడుతున్న మానసిన, శారీరక క్షోభను చిత్రించారు. బతుకున్న శవంలా వాళ్ళు అనుభవిస్తున్న హింస చెప్పనలవికానిదిలా ఉన్న వారి అనుభూతిని రక్తి కట్టించారు. బురఖా వేసుకోవడం ఇష్టం లేకపోయినా మతోన్మాదానికి బలి కాకూడదనే ఉద్దేశ్యంతోనే ఆ స్త్రీ జీవితాలు బురఖా మాటుకు నెట్టివేయబడుతున్న వైనాన్ని కథా రచయిత్రి సమాజం ముందుంచారు.

బురఖా కొనుక్కోవడానికి సైతం వాళ్ళ దగ్గర చాలినంత డబ్బులేక, కొందరు ధరించలేక ఇబ్బంది పడుతున్న తీరూ ఉంది. అయినా మతోన్మాదుల దాడి ఆగని స్థితి వ్యక్తమవుతుంది. ఆచారాలను అడ్డం పెట్టుకొని స్త్రీల జీవితాలతో ఆడుకొంటున్న తీరు ఉంది. సమాజం ఎంత ఇబ్బందికరంగా తయారవుతోందో వ్యక్తం చేస్తూఉంది ఈ కథ. అయినా స్త్రీల దేహాన్ని బంధించగలరు గాని వాళ్ళ మనసులను బంధించడం ఎవరితరం? ఎవరి వల్లా కాదు. కాని ఆ విషయం తెలియని వాళ్ళు చేస్తున్న పని తప్ప మరొకటి కాదనే భావనతో ఉండటాన్ని చిత్రించింది రచయిత్రి.

10. పేద ముస్లిం కుటుంబాలలో పన్నెండేళ్ళు కూడా నిండని పసిపిల్లల్ని అరవయ్యేళ్ళు పైబడిన అరబ్ షేక్‌లకు పెళ్ళి పేరుతో అమ్ముకునే దయనీయ స్థితిని చిత్రించిన కథ 'నిశ్శబ్ద కెరటాలు'. ఈ కథలో అమీనా తల్లిదండ్రులకు ఎదురు తిరిగి తనను తాను అరబ్బుదేశాలకు ఎగుమతి చేయబడే దుస్థితినుండి కాపాడుకుంటుంది. నజీర్ లాంటి బ్రోకర్లకు బుద్ధి చెబుతుంది. మహమ్మదీయ మతంలో కనిపించే ఆచారం ముతా సంప్రదాయం. ఈ ఆచారంలో డబ్బుకు ఆశపడి కూతుళ్ళను పెళ్ళి పేరుతో షేక్‌లకు అమ్ముకోవడం. వాళ్ళక్కడ వారిని పని మనుషులుగా వాడుకోవడం,నానాచాకిరీ చేయించుకోవడం, శారీరక వాంఛలు తీర్చే యంత్రాల్లా మార్చడం వంటివన్నీ తెలిసినా డబ్బు ఖర్చుపెట్టి పిల్లల పెళ్ళి చేయలేని దీనస్థితి. అందుకే తమ బిడ్డలను డబ్బుకోసం ఆశపడి అమ్ముకోవడం జరుగుతుంది. ఎదురు తిరగలేని ఆడ పిల్లలు ఆ కష్టాలన్నింటినీ నిశ్శబ్దంగా భరిస్తే, కొంత చైతన్యం కల్గిన స్త్రీలు ఎదురుతిరుగుతారు. అదే చేసింది అమీనా. కాదు రచయిత్రి అమీనా పాత్ర ద్వారా ఈ సంప్రదాయాన్ని ఖండించిందంటే బాగుంటుంది.

'లేతవెన్నెల', 'నిశ్శబ్ద కెరటాలు' కథలు రెండింటిలోనూ ముస్లింసమాజాన్ని,పురుషాధిపత్య ధోరణిని వ్యక్తం చేశారు. ముస్లిం స్త్రీల దైన్యస్థితిని మనముందుంచారు. ముస్లిం స్త్రీలకు ఒక హెచ్చరికను, జాగరూకతను, తిరగబడాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

11. 'శిశిరంలో వసంతం' కథలో ఓ స్త్రీ తను పెళ్ళి చేసుకోకుండా ఉద్యోగం చేస్తూ చెల్లెళ్ళందరికీ పెళ్ళి చేస్తుంది. చివరికి ఆమె కూడా పెళ్ళి చేసుకుంటానన్నప్పుడు కన్నతల్లే ఈ వయస్సులో నీకు పెళ్ళేమిటంటూ దెప్పి పొడుస్తారు. నువ్వు పెళ్ళి చేసుకుంటే నీమీద ఆధారపడి బతుకుతున్న నీ చెల్లెళ్ళు వారి బిడ్డలు ఏమైపోవాలని అడుగుతుంది. అందరినీ ఎదిరించి పెళ్ళి చేసుకోవడానికి ఆమె సిద్ధపడిన ఉదంతాన్ని ప్రత్యక్షీకరించిన కథ ఇది.

మనుషులలో పెరిగిపోతున్న స్వార్థానికి నిదర్శనం ఈ కథ. మానవత్వంతో, బాధ్యతాయుతంగా ఒకతోడు కల్పించాల్సిన తల్లి స్వార్థపరురాలైంది. మరోవైపు తోబుట్టువులు సైతం పెళ్ళికి వద్దంటుంటే ఆ స్త్రీ ఎవరితో తన బాధ పంచుకోగలదు? మనిషి స్వార్థంతో ఎంత అధ్వాన్న స్థితిలోకి దిగజారిపోతున్నాడో తెలుపుతుంది ఈ కథాంశం. స్వార్థం మనిషి జన్మహక్కు అన్నదే నిజం చేసింది. పరస్పరం ఉండాల్సిన విలువలు కనుమరుగైపోయి, సంబంధ బాంధవ్యాలు దూరమవడానికి కారణమైన స్థితిని చాటింది 'శిశిరంలో వసంతం'.

12. ఓ దేశం మీద బాంబుల దాడి జరిగినప్పుడు పునరావాస కేంద్రాల్లో తలదాచుకొన్న స్త్రీల సమస్యలను చిత్రించిన కథ 'తొలిబలి'. అనునిత్యం ఏదో ఒక రూపంలో స్త్రీలు సమస్యల సుడిగుండంలో చిక్కుకొంటూ పడుతున్న నానారకాల అవస్థలను రచయిత్రి మనముందుంచారు. స్త్రీ పట్ల స్త్రీ సమస్యలపట్ల ఆలోచించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

**ముగింపు :**

స్త్రీలలో చైతన్యం వస్తోందనడానికి నిదర్శనం ఈ కథలు. పరిస్థితులకు ఎదురు తిరిగి పోరాడి గెల్చిన స్త్రీలను ఈ కథలో చూడవచ్చు. పురుషాధిక్య సమాజంలో తీవ్రమైన అణచివేతకు గురవుతున్న స్త్రీల సమస్యల్ని, వారిలో వచ్చిన చైతన్యాన్ని చిత్రించడానికి ప్రయత్నించింది రచయిత్రి. అణచివేతకుగురైన స్త్రీలు నిశ్శబ్దంగా ఉండటమే కాకుండా తమకు కావాల్సిన హక్కుల కోసం పోరాడాల్సిన అవసరాన్ని చాటాయి ఈ కథలు.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# జానపదం - సాంఘికాచారాలు

- డా॥ సి. సరళాదేవి, PDF, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు అధ్యయన శాఖ, తిరుపతి.

ప్రాచీన కాలం నుండి ఒక జనసమూహంగా ఏర్పడుతూ వచ్చిందే ఈ సమాజం. భాషాపరమైన జాతి అంతా ఒక సమాజం జానపద సమాజంలో ఆచారాలు చాలా ప్రాముఖ్యతను, ముఖ్యప్రాతను వహిస్తాయి. ఒక్కో జాతికి ఒక్కో విధమైన సాంఘికచారాలుంటాయి. మౌఖిక జానపద విజ్ఞానానికి వస్తు సంస్కృతికి మధ్య వారధిలా ఈ సాంఘికాచారాలుంటాయి. అంటే, మానవులు సామూహిక జీవనాని సంబంధించిన త్యాగాలు గుర్తుగా జాతరలు, నమ్మకాలు, వల్ల పండుగులు, సాంఘికాచారాలవుతాయి. ఒక తరం నుండి మరో తరానికి సంక్రమించే కట్టుబాట్లు ఆచారాలై నిలుస్తున్నాయి. వీటినే జాతి సంస్కృతిగా చెప్పుకొంటున్నాం సామాన్యంగా సమాజంలో ఆచారాలు మనిషి పుట్టుకతో మొదలవుతాయి. బారసాల, రజస్వల, పెళ్ళి, శోభనం, సీమంతం, ప్రసవం చివరి ఘట్టమైన మనిషి చావు కర్మల వరకు అనేక దశల్లో షోడశ సంస్కారాలను పాటిస్తుంటారు. మనిషి జీవితంలో నమ్మకాల వల్ల కొన్ని ఆచారాలు ఉద్భవించాయి. మతం వల్ల మరికొన్ని పుట్టాయి. ముక్క చెవులు కుట్టించడం, బొట్టు, తాళిబొట్టు, గాజులు, నమ్మకాలు కారణంగా ఆచరణలోకి వచ్చాయి. పూజలు, నోములు, బోనాలు, బలులు, పునకాలు మొక్కుబడులు, తీర్థలు, మంత్రతంత్రాలు, అన్ని ఆచారాలై పోయాయి. సమాజంలో కనిపించే ఆటలు, వినోదాలు, వైద్యం మొదలైనవి. వాటికి సంబంధించిన ఆచారాలు, సంప్రదాయలు కొనసాగుతూ వస్తున్నాయి. జానపదుల నమ్మకాలు హేతుకు నిలువునివి. కాని ఇంట్లోకి వస్తే అశాంతి, వేప రాగి చెట్టుకు పెళ్ళి , శనివారం క్షౌరం కూడదు. భర్త చనిపోతే బట్టు, గాజులు, మట్టెలు తీయడం లాంటివి పేర్కోనాలి. సమాజంలో ఏర్పడ్డ కొన్ని కట్టుబాట్లు వల్ల అనేక అంశాలు ఆచారాలుగా వస్తున్నాయి. అందువల్ల అనేక జానపద జీవన ప్రక్రియల సంగమంగా సాంఘిక జానపద ఆచారాన్ని పరిగణించవచ్చు.

జానపద విజ్ఞానంలో మౌఖిక మౌఖికేతర విజ్ఞానం. అందులో చెప్పుకోదగినవి సాంఘికాచారాలు. మౌఖికేతర ప్రక్రియల్లో కళాత్మకమైన వాటిని కళలు కింద చేరిస్తే మిగిలేవి అన్ని సాంఘికాచారాలు, వస్తు సంస్కృతి. మంత్రాలు, స్తుతులు, ఆటల్లో పాటలు, వినోద గీతాలు వేడుకలు మొదలైనవి మౌఖిక జానపద విజ్ఞానం. పూజా విధానాలు, ధార్మిక కర్మకాండలు, ఆటలు వస్తువులు, వైద్య వస్తువులు మొదలైనది. వస్తు సంస్కృతి.

సాంఘికాచారాలు మానవుని సాముహిక జీవనానికి సంబంధించినది. సాంఘిక జీవితంలో మానవునికి ఒక తరం నుంచి మరోతరానికి సంక్రమించే ఆచారాలలో ఎన్నో వున్నాయి.

పుట్టుక, పెళ్ళి, మరణం, మొదలైనవి వాటికి సంబందించిన ఆచారాలు, జానపదులు నమ్మకాలు, మతం, దేవతా గణం, నోములు, వత్రాలు, జాతరలు, పండుగలు, ఆటలు, వినోదాలు, వైద్యం మనిషి జీవితంలో చక్రంలో కొన్ని ముఖ్యమైన సంఘటనలు వున్నాయి. అన్నింటికంటే పుట్టుకే మనిషి సాంఘికంగా అనుసరించే ఆచారాలు, పుట్టుక తరువాత మరణానికి సంబందించిన నమ్మకాలు, ఆచారాలు కర్మకండలు, ప్రతిసంఘటనలోను ఏదో రూపంలో ఉందనే ఉంటాయి. ఈ మధ్యలో జరిగే పెళ్ళి ముఖ్య సంఘటన.

మనిషి మనుగడకు, వంశాభివృద్ధికి ప్రేమాభిమానానికి ఏర్పరుచుకొన్న ఒక వ్యవస్థ పెళ్ళి. సమత్త ఆచారాలు, సంప్రదాయాలు ఉన్నాయి. ఇవన్నీ కూడా నమ్మకాలకు సంబంధించినవే.

మానవ జీవితంలో నమ్మకాలకుండే పాత్ర చాలా గొప్పది. సంఘం నుంచి మనసిషికి సంక్రమించే మూఢ నమ్మకాలు కాని దయ్యాలు, భూతాలు, పిశాచ గణాలు, అస్తిత్వం ఉండే శక్తులు కావు. నమ్మకాలు వల్ల మనిషికి బాధ కాని, మూఢ నమ్మకాలు అన్ని విధాలుగా మనిషిని నశింప చేస్తుంది.

నమ్మకం కొన్ని నియమాలకు లోబడి మత వ్యవస్థను ఏర్పరుస్తుంది. జానపదులకు ఒక మతం అంటూ లేదు. సమాజంలో దళితులు మత వ్యవస్థను చూస్తే కఠిన నియమాలు కర్మకాండలు, కనిపించవు. గ్రామ దేవతలు, ప్రకృతి దేవతలు, మాతృదేవతారాధన ఎక్కువుగా కనిపిస్తుంది. జానపదులు జీవితంలో కూడా మతానికి సంబంధించిన ఆచారాలు మంత్రతంత్రాలకు, ధార్మిక కాండలు, ఒక స్థాయిలో కనిపిస్తాయి.

జనపద వైద్యం కూడా సాంఘికాచారాలలో ఒక్కటే వైద్యానికి మందులు కంటే నమ్మకం ముఖ్యం. ఏ మందువాడకపోయినా నమ్మకం ఉంటే జానపదులకు రోగాలు నయమవుతాయి. శాస్త్రీయమైన వైద్యం కంటే మంత్ర తంత్రాలలలో కూడిన వైద్యం జానపద ఆచారాలలో కనిపిస్తుంది.

నమ్మకాలు సాంఘికాచారాలలో ఒక భాగం. సంఘం అన్నది లేకపోతే మూఢనమ్మకాలు వుండవు. నమ్మకవున్నది

ఒక వ్యక్తి మీద గాని, వస్తువు మీద గాని పరిస్థితిని గురించిగాని మనిషి నమ్మమతిని వ్యక్తం చేసే మానసికి స్థితి. పరంపరాను గతంగా తరతరాలునిక మంచి పునరావృత్తిని పొందుతూ సాముహికమైన సమ్మతిని పొందే మానసిక స్థితియే నమ్మకం.

నమ్మకాలలో భావనక్రియ అనే రెండు అంశాలుంటాయి. పల్లి అడ్డంవచ్చిందంటే ఏమైనా కీడు సంభవించవచ్చనే భావన కలగడం. నమ్మకంలోని ఒక ముఖమైతే పెళ్ళకుండా వెనక్కి తిరిగిరావడం క్రియ నమ్మకాలు మానవుని స్వభావంలోని వివిధ ముఖాలను చక్కగా చిత్రిస్థాయి జానపదుల జీవితంలో ఇది ఎంతవరకు పెనవేసుకొని పోయామంటే వాటిని అనుసరిస్తున్నామనే జ్ఞానం కూడా వారికుండదు.

**పుట్టుక :**

నమ్మకాలు జీవితానుభవం నుండి పుడుతున్నాయి. అత్యంత ప్రాచీనకాలం నుండి ఒక తరం నుంచి మరొక తరానికి సంక్రమిస్తున్నాయి. మానవుని పుట్టుకలోనే కొన్ని నమ్మకాలు పుట్టాయి. అయితే మానవుడు సంఘంగా ఏర్పడిన తర్వాతే నమ్మకాలకు బలం ఏర్పడుతుంది. స్థిరత్వం కలిగింది. మానవుని భావనలు వ్యక్తీకరణం భాష ఏర్పడిన అనంతరం ఈ నమ్మకాలు ఒక మనిషి మంచి మరొక మనిషికి సంక్రమించాయి. ప్రకృతి ఆధారంగా పశుపక్షాదులు స్వరూప స్వభావాలు ఆధారంగా ఎన్నో నమ్మకాలు ఏర్పడ్డాయి. మెరుపు, ఉరుము, వాన, వరద లాంటివి నమ్మకాలు ఉత్పత్తికి కారణమయ్యాయి. అయితే రాను రాను ఏ ఆధారములేని మూఢ విశ్వాసాలు కూడా ఉత్పత్తి అయ్యాయి. ప్రకృతిలోని భయనాక దృశ్యాలు, సంఘటనలు కూడా మానసిక ఆందోళనకు కారణమయ్యాయి. మానవాత శక్తుల మీద విశ్వాసమూ ప్రారంభమై ఇంకా కొన్ని నమ్మకాలు పుట్టడానికి దారితీస్తుంది.

భారతం నుంచి అన్ని కావ్యాలలో ఏదో విధమైన నమ్మకాలు వ్యక్తం చేయడం ఉంది.

గ్రువ్వ, గ్రద్ధ, దివ్యాపపు, బ్రువ్వ, గూబ యిల్లు సొచ్చిన శాంతి సేయింపవలయు.

అని తెలుగు భారతం-అనుశాసీనిక పర్వంలో ఉంది. మరులు, మందులు పెట్టి స్త్రీలు, పురుషుల్ని వశం చేసుకుంటారనే నమ్మకం నాటికి నేటికీ ఉంది. వీటి వల్ల లాభం లేకపోగా నష్టం. ప్రాణహాని కలుగుతుందని ద్రౌపది సత్యభామతో చెప్పినట్లుగా భారతంలో ఉంది. రక్షణ కోసం తామెతులు కట్టుకోవడం కూడా చాలా శతాబ్ధాలుగా ప్రల్నాటి వీర చరిత్ర ఉంది.

**యేనికి రక్షకై మించు తామెతులు**
**దండ చేతులరెంట ధారణ చేసి**

ముహూర్తాలు, శకునాలు, తెలుగు కావ్యాలలో లెక్కకు మిక్కుటంగా కనిపిస్తాయి. గోధూళి లగ్నంలో పురం ప్రవేశించాలని, విశేషించి ఉషఃకాలం సర్వ ప్రయోజనారం భాలకూ ప్రశస్తమైందని చెప్పారు.

ప్రారంభకాలంలో నమ్మకాలు ప్రకృతి మూలకంగా ఉద్భవించాయి. తర్వాత యజ్ఞయాగాదులు, జాతరాలు, వ్రతాలు, నోములు, పూజలు, మొదలైనవి. మత సంబంధ కార్యకలాపాలు నమ్మకాలు ఉద్భవించడానికి కారణమవుతాయి. కొన్ని నమ్మకాలు సాంస్కృతిక కారణాల వల్ల ఉద్భవిస్తాయి. మాతృ ప్రవృత్తి సహజమైన గుణమే కాని గొడ్రాలని హీనంగా చూసేది గొడ్రాలని ఆశ్వీరదం పొందరాదనే నమ్మకం. సాంస్కృతిక కారణాల వల్లనే ! గొడ్రాలని ఆశ్వీరదం పొందరాదనే నమ్మకం. ఈ కారణాల వల్ల ఒక వ్యక్తి నుంచి వ్యక్తికి వేరవుతుంటాయి. ఏదైనా వారం మంచిదని మంచిది కాదని నమ్మకం సమాజం నుంచి వస్తుంది.

ఈ మూడు కారణాల వల్లనే కాక నమ్మకాలు ఇంకా వేరు వేరు కారణాల వల్ల పుట్టవచ్చు. మనోదౌర్బల్యం ఉండేవాళ్ళు, భయగ్రస్తులు ఎన్నో విధాలైన ముఢవిశ్వాసాలకు బలి అవుతుంటారు. మహత్కార్యసాధనకు బయలుదేరిన వ్యక్తి అపశకునమని వెనుదిరితే ఒక గొప్ప కార్యమే విఘ్నం కావచ్చు. రోగపీడితుడైన వ్యక్తి "తూతూ మంత్రం తుమ్మకకు మంత్రం" అని అనుకొంటుంటే ప్రాణానికే అపాయం కలగవచ్చు.

జనప్రియ నమ్మకాలనూ, మూఢవిశ్వాసాలను ఏడు రకాలుగా విభజించారు.

1. మానవ శరీరం, జానపదవైద్యానికి సంబంధించినవి.
2. జీవిత చక్రానికి సంబంధించినవి : పుట్టుక, వివాహం, మరణం, మొదలైనవి.
3. ఆర్థిక, సామాజిక సంబంధాలు
4. ఇంద్రజాలం, యాంత్రికత
5. భూతప్రేతాలు, మరణాలు ఇత్యాదులకు సంబంధించిన పరిజ్ఞానం
6. సంఖ్యాలు, ఖగోళ సంబంధాలు
7. వ్యవసాయం సంబంధాలు: వాతావరణం, పెంపుడు జంతువులు, వృక్షాల పెంపకం, వేట, చేపలు పట్టడం, ఇత్యాది.)

మానవాతేత శక్తులకు మతేయ ఆచారాలకు దాసులై మూఢనమ్మకాలను ప్రచారం చేస్తూ, ఆచరిస్తూ ఉండే విద్యాధికులూ ఉన్నారు. అయాగళ పరిహార్థం మహానాయకుల మంత్ర తంత్రాలు వగైరా మౌఢ్యాలను ప్రదర్శించే వారున్నారు. ఇప్పటికీ జందాలు ధరించేవారు. విభూతులు పెట్టుకునేవారు. పురోహితుల పాదాలు కడిగి ఆ నీళ్ళు తాగేవారు, గ్రహణకాలంలో

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



తప్పెట కొట్టి సూర్యున్ని రాహువు నుంచి తప్పించే వారు, ఆస్తిక మహాశయాలు, దేవుడికి ముడుపులు కట్టుకునేవారు, నోటికి తాళాలు వేసుకునేవారు, పిల్లలకు మొక్కులర్పించేవారు, దేవుడికి తలనీలాలర్పించేవారు, సత్యనారాయణ పూజలు, నాగపూజలు చేసేవారు, తాగని నాగశిలకు పాలు పోసేవారు, గంగానదిలోని మురికి నీటినీ తీర్థమని తెచ్చేవారు, ఇంటి చూరుకు బూడిద గుమ్మడి కట్టేవారు, చింతచెట్టు మీద దయ్యాన్ని చూసేవారు, పెద్ద పదవికోసం చెయ్యి చూపించుకొనే వాళ్ళు, క్షీరానికి తిధినక్షత్రాలు చూసేవారు, ఇలాంటి మూఢనమ్మకాలలో ఆంధ్రాభిమానం కలవారు నూటికి తొంభై సార్లు దొరుకుతారు.

మానవాతీత శక్తుల మీద నమ్మకాలలో బాటు మానవ జీవితానికి సంబంధించిన నమ్మకాలు కొన్ని ఉన్నాయి. పుట్టుక, పెళ్ళి, మరణం, స్వప్నం కుటుంబం, బాంధవ్యం మొదలైనవి. మనిషి అలవాట్లుకు అభిరుచులకు సంబంధించినవి ఇవి మామూలుగా ఎలా ఉన్నా పండుగునాడు పిల్లలను కొట్టు కూడదని తిట్టకూడదని చెప్పడం, విఘ్నేశ్వరుని పూజనాడు మాత్రం ఎంతమంది చేత తిట్టుంచుకుంటే అంత మంచిదని చెప్పడం ఎవో కొన్ని కారణాల వల్ల కలిగే నమ్మకాలు రాత్రి పూట సున్నం, మజ్జిగ, మొదలైనవి. ఇవ్వకూడదని చెప్పడం. ఉప్పు చేతికి ఇవ్వకూడదనడం ఒక రకమైనవి, మంగళవారం, అశుభం అని చెప్పడం, శనివారం కొత్తగుడ్డలు ధరించ రాదనడం, శుక్రవారం ఆడబడుచును ఇంటినుంచి పంపించ కూడదనడం మరికొన్ని ఆచారాలు, ఆరు వేళ్ళు ఉంటే అదృష్టవంతులని మెల్లకన్ను ఉంటే అదృష్టమని దైహిక స్వరూపాన్ని బట్టిచెప్తే కూడికన్ను కుడి భుజం అదిరితే మంచిదని చెప్పిది చలనాన్ని గురించిన నమ్మకాలు.

పశుపక్ష్యాదులకు సంబందించిన నమ్మకాలు వాలు చాతుర్యాన్ని తెలిపేవి కొన్ని. వాటి అరుపులు ద్వారా కనిపించడం ద్వారా మనిషికి కలిగే శుభశుభాలను తెలిపేవి కొన్ని పశుపక్ష్యాదులు తరతరాలనుంచి మానవునితో అవి బాహ్య సంబందాన్ని కలిగి వుండడమే ఇలాంటి నమ్మకాలు పుట్టడానికి వీటిలో కొన్ని ప్రాణికోటిలో మానవునితో వుండే మధుర బాంధవ్యాన్ని తెలిపేవైతే, మరికొన్ని అజ్ఞానం వల్ల ఉద్భవించిన మూడనమ్మకాలు.

రాత్రిపూటలో కుక్క ఏడుస్తూ ఉంటే ఏదో అశుభం జరగవచ్చునే నమ్మకం వుంది. బల్లి పలికితే శుభం. దేహం మీద వేరు వేరు చోట్ల పడితే శుభశుభాలు కలుగుతాయని నమ్మకం. పిల్లిని చంపితే దానికి గుడికట్టించాలంటారు. గడ్ల గూబ ఇంటిమీద వాలితే అశుభం ఇలాగే పాములు, కాకులు, గద్దలు, నక్కలు, నెమళ్ళు, కోళ్ళు పశువులు గురించిన నమ్మకాలు వందలు , వేలు ఉన్నాయి.

ప్రకృతిలో ఇతర వస్తువులను గురించిన నమ్మకాలు కోకల్లలు అరటి చెట్లు గెలవేస్తే కలిగే అశుభాలను గురించి, తులసిచెట్టు పవిత్ర గుణం గురించే విశ్వాసాలున్నాయి. నువ్వులు, ప్రత్తి మొదలైనవి. ఊరుకి తీసుకొనరాదనే నమ్మకం వంటివి బహూశా అవికొంత అపూరమైనవి లేక వాటిని పవిత్ర కార్యాలకు వాడుతున్నాం కాబట్టి ఊరక తీసుకోరాదని గాని ఉండవచ్చు.

**ఆధార గ్రంథాలు:**

1. జానపద విజ్ఞాన ధ్యేయం - డా. జి.యస్ మోహన్
2. ఆంధ్రులు జానపద విజ్ఞానం- ఆర్వీనస్ సుందరం
3. కర్నూలు జిల్లా జానపదుల నమ్మకాలు శకునాలు - డా॥డి. గాయత్రి.
4. జానపద నాటకాలు - ఆచార్య బాల అరుణకుమారి.
5. తెలుగు జానపద గేయ - సాహిత్యము - బి. రామరాజు
6. జానపద కథలు - కె.వి. సత్యనారాయణ
7. తెలుగు వారి జానపద కళారూపాలు - డా. మిక్కిలినేమి రాధకృష్ణమూర్తి
8. జానపద సాహిత్య - ఎల్లోరా
9. ఆంధ్రుల జానపద విజ్ఞానం - ఆర్ వి.యస్ సుందరం

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

# తెలంగాణ ఆధునిక వచన కవయిత్రులు

- ఐ. చిదానందం, పరిశోధక విద్యార్థి, ఉస్మానియా విశ్వవిద్యాలయం.

సమాజంలో అన్ని రకాల అవలక్షణాలను వాటి పరిష్కారాలను మార్గాలను పురుషుడికంటే స్త్రీయే సరైనా దిశానిర్దేశనం చేయగలరు. అలాంటి స్త్రీ కవియిత్రులకు తెలంగాణలో ఎంతో మంచిస్థానం కలదు.

ఆడవాళ్లు ధైర్యంగా రాస్తున్న ఎన్నో విషయాలు నేటి సమాజంలో చర్చనీయ అంశాలుగా మారి సమాజ మార్పుకు దోహదం చేస్తున్నాయి. మనిషి శాసిస్తున్న సామాజిక పరిస్థితులను ఎదుర్కొని ఎంతోమంది ఎంతో మంచి కవిత్వం రాస్తున్న వారు వున్నారు. ఒకప్పుడు కనిపించని స్త్రీల కవిత్వభాషలోని మాధుర్యం వ్యంగ్యం నేటితరం కవిత్వంలో కనిపిస్తున్నాయి.

నిజం చెప్పాలంటే స్త్రీలు రాసే కవితాభాష అలవాటైన కవిత్వ భాషకంటే కొత్త. అందుకే సాహిత్యరంగంలో వీరి ముద్ర చెరిపివేయలేనిది. కవిత్వంలో వివిధ అనుభూతులు లైంగిక ఇతి వృత్తాలను సైతం తమకు వున్న పరిధి నిషేధాలు అవధులు దాటకుండా చెప్పుకోవాల్సిన విషయాలను తమదైన శైలితో చెబుతూ రాసే వీరి కవిత్వం సమాజంకు చురకలు వేస్తూనే ఉంటుంది. ఇలాంటి కవిత్వమే అందరికి ఆలోచింపచేస్తున్నది. అలాంటి కవిత్వము రాస్తున్న వారు తెలంగాణప్రాంతంలో ఎంతోమంది కలరు. అలాంటి వారిలో కొద్దిమందిని చర్చించడం పరిశీలించడమే ఈ వ్యాసం యొక్క ముఖ్య ఉద్దేశ్యం.

తెలంగాణ సాహిత్యంలో స్త్రీల ధృక్పథం కేవలం స్త్రీవాదంకే పరిమితంకాలేదు. ప్రపంచ విషయాలపై సున్నితమైన విషయాలపై ఎంతో అర్థంగా స్పందిస్తూ కవిత్వం రాసిన వారు ఉన్నారు. నిజమైన మానవత్వం అంటే ఇదేకదా ముఖ్యంగా మనదేశంలో హిందూ, ముస్లింల మధ్య జరిగిన అల్లర్లు తరచు జరుగుతుంది. అలా జరిగిన గొడవలల్లో ప్రముఖంగా చెప్పుకోవాల్సినది "గోద్రాసంఘటన". ఈ సంఘటన వలన ఎంతోమంది మనుష్యుల్ని మలితీసుకోవడం జరిగింది. గోద్రా సంఘటన మత వైషమ్యాలకు బీజం వేసింది. ఈ సంఘటన చేసిన గాయాలను మాన్పుకోవాల్సి ఉందంటూ తుర్లపాటి లక్ష్మి-

**"భాయి భాయి అంటూ**
**అన్నా తమ్మీ అంటూ**
**భాబీ బహన్ అంటూ**
**అక్కా వదిన అంటూ**
**ఆత్మీయంగా అభిమానంగా**
**మసలినవాళ్లం.........."**

అంటూ తుర్లపాటి లక్ష్మిగారు తరతరాల హిందూ - ముస్లిం సామరస్య సంస్కృతిని గుర్తుచేస్తూ ఎంతోమంచి కవిత్వం రాసారు. వీరు "తలైతి" అనే కవితా సంపుటిని రచించారు.

చందమామ.....మావే (నాటికలు) కానుక కథలు వంటి రచనలు చేసిన రచయిత్రి కిరణ్ బాల. వీరు "కలల ప్రపంచంలో" అనే కవితా సంపుటిని రచించారు. అలాగే అయాచితం నటేశ్వర శర్మగారి సతీమణీ అరుణకుమారి. వీరు "అరుణ కిరణాలు" అనే రచన చేసారు. మరో రచయిత్రి స్వాతి శ్రీవాద నిజామాబాద్ ప్రాంత వాసి. కానీ ప్రస్తుతం హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నారు. "చౌరస్తా" అనే కవితా సంకలనంకు వీరు సహసంపాదకత్వం వహించారు. అలాగే వీరు "పొరలు" అనే కథలసంపుటిని, నదినై ప్రవహించాలనే అనే కవితా సంపుటిని కూడా రచించారు.

అలిండియా రేడియోలే పనిచేస్తూ సాటి స్త్రీల పైనా సహానుభూతితో సామాజిక బాధ్యతతో రచనలు చేస్తున్న రచయిత్రి అయినంపూడి శ్రీలక్ష్మిగారు. వీరూ దృక్కోణం అలలవాన, లైఫ్ ఎట్ చార్మినార్, వెన్నెల దుఃఖం వంటి కవితా సంపుటాలను రచించారు. అంతేకాదు వీరి మరో విశిష్టమైన కవిత్వ రచన "మెనోలాగ్ ఆఫ్ ఏ వూండెడ్ హార్ట్". ఇది "బ్రెస్ట్ క్యాన్సర్" పై వచ్చిన దీర్ఘకవిత.

స్త్రీల గురించి వచ్చిన కవిత్వం చాలా వరకు కాస్మోటిక్ కవిత్వంలా పేరొందింది. ప్రాచీనం నుంచి ఆధునికం వరకు వచ్చిన కవిత్వంలో స్త్రీల అంగాగ వర్ణనకై ప్రాధాన్యత వుంది. స్త్రీవాద సాహిత్యం ఉధృతంగా వున్నప్పుడూ కూడా స్త్రీల సమస్యలపై పురుషుల నిరసన కవిత్వం ఎక్కువగా కనిపిస్తూ వచ్చింది. ఇలాంటి సమయంలో అందుకు భిన్నంగా లక్ష్మిగారు...

**"మహా సంక్షోభానికి**
**మహా విపత్తే అక్కర్లేదు**
**ఒక కన్నెర చాలు"**

అంటూ బ్రెస్ట్ క్యాన్సర్ పీడిత స్త్రీల జీవితాలను గురించి చెప్పింది. వీరి కవిత్వం జెండర్ భేదాలకు అతీతంగా స్పందించేలా ఉంటుంది. బ్రెస్ట్‌క్యాన్సర్ బాధితులనే కాదు. కఠినాత్ములను సైతం కదిలిస్తుంది. అంతేకాదు బ్రెస్ట్ క్యాన్సర్ పీడితులకు జీవితంపట్ల ధైర్యాన్ని నూరుపోస్తుంది.

**"నా ప్రియ సహోదరీ**
**రా**
**ఇప్పుట్నించే**
**"షీ" గా కాకుండా**
**మనిషి జీవిద్దాం... (1)**
**కొమ్మలు విరిగిపోయాననీ**
**వృక్షాలు ఏడుస్తూ కూర్చోవు (2)**

మనోధైర్యంతో బతకాలనీ పిలుపునిస్తుంది లక్ష్మిగారు. క్యాన్సర్‌ను జయించి "ఫినిక్స్ పక్షిలా పునరుత్థానం పొందుదాం" అంటూ తనలాంటి బాధితులకు కొండత ధైర్యం అందించ గలిగింది.

తెలంగాణ యూనివర్సిటీలో అధ్యాపకురాలిగా పని చేస్తూ పరిశోధకురాలిగా పేరొందిన రచయిత్రి డా॥ త్రివేణిగారు. వీరు "తూనీగలు" అనే నానీలను రచించారు. తెలంగాణ యూనివర్సిటీలోనే పనిచేస్తున్న మరో రచయిత్రి కె. లావణ్య గారు. వీరు "అంతర్ముఖం" అనే కవితా సంపుటిని రచించారు. అలాగే తెలంగాణ కవుల కవితల సమాహారంగా వచ్చిన "జిగర్"కు సహసంపాదకత్వం వహించారు. తెలుగు అధ్యాపకు రాలిగా పనిచేస్తున్న బాలా లలితాదేవిగారు. వీరు "ఏ సిరాతో రాయాలి?" అనే రచన చేసారు.

మరో కవయిత్రి మల్లవరపు విజయ. వీరు "సత్య న్వేషణ" అనే రచన చేసారు. కవిత్వంలో కొత్త పదజాలంతో రాస్తూ స్వీయ అనుభవాలకు శక్తివంతమైన సున్నితమైన తమ దైన అభివ్యక్తి జోడిస్తూ రచనలు చేస్తున్న రచయిత్రి పొద్దుటూరి మాదవీలత. వీరు "మనస్సునామి, భక్తిలతా మాధవీయం, గాయాలెన్నైనా, తంగెడు పూల వనంలో" అనే రచనలు చేసారు.

**"చరితలాగతమై**
**మిగలాలనే లేదు**
**సరళరేఖకు చివరి**
**బిందువు కావాలనే లేదు**
**అలలా ఎగిరి**
**విరగాలనే లేదు "**

అంటూ తామేంటో తమ మనసేంటో స్త్రీలపరంటా "నేనూ" అంటూ చెప్పిన కవయిత్రి ఇందిరగారు. వీరు ఖమ్మం జిల్లా వాసి. కవిత్వంపైన సామాజిక సమస్యలపైన ఖచితత్వంతో రచనలు చేసిన రచయిత్రి వీరు. విశాలమైన ప్రాతిపదికతో కవిత్వం రాసిన ఇందిరా "జెండర్, ఒక్కపాటా" వంటి కవిత్వం రచించారు.

తనకు తోచిన తెలిసినవాదంను సిద్ధాంతంతో వ్యాఖ్యా నించే రచయిత్రి జ్వలిత. పేరుకు తగ్గట్టే వీరి కవితా శీర్షికలు సంపుటాలు ఉంటాయి. వీరు "అగ్నిలిపి (2012), పరివ్యాప్త (2011)" వంటి రచనలు చేసారు.

మనకు ఉన్న కవయిత్రులు తక్కువ. అందులో మైనా రిటీలు ఇంకా తక్కువ. ఇక ముస్లిం కవయిత్రుల గురించి చెప్పనక్కర్లేదు. ముస్లిం స్త్రీల అణచివేతను నిరసిస్తూ దిక్కరిస్తూ విస్తృతంగా కవిత్వం రాస్తున్న వారు షాజహానాగారు.

**"నా మాట నా నవ్వు**
**అన్ని నిషిధాలై పోయాయి**
**పెదవుల తలపులెప్పుడు**
**అతని ఆజ్ఞల బీగాలను బిగించుకోనుండాలా "**

అంటూ ముస్లిం స్త్రీల దీనస్థితిని వ్యతిరేకిస్తుంది షాజహనా. అలాగే ముస్లిం స్త్రీల జీవితాలలో వుండే నల్లటి పరదాను గురించి చెబుతూ...

**"ఊహ తెలియని వయస్సులో గుమ్మానికి పరదా కడితే**
**రంగు రంగుల కుచ్చుట చూసి మురిసిపోయినదాన్ని**
**అప్పుడే స్వేచ్ఛకి మొదటి బేడి అని తెలుసుకోలేనిదాన్ని**
**గుమ్మానికి కట్టినట్లే అమ్మ ముఖానికి బురఖా కడితే**
**స్వప్నంలాంటి జిందగి శాపమనీ తెలియనిదాన్ని"**

అంటూ "బురఖా" విషయంలో తన అభిప్రాయంను తెలిపింది. అంతేకాదు ఇలాంటి అమానుషంను ఎదిరించ డానికి తనకు చాలా ధైర్యం ఉంటుందనే చెబుతుంది. ఇదొక్కటే కాదు ముస్లిం వివాహ సంస్కృతిలో భాగం అయిన "తలాక్" పైన తీవ్ర నిరసన వ్యక్తం చేసారు.

**"ముప్పయిసార్లు తలాక్ చెప్పి**
**నువ్వయితే ముప్పయి మూడుసార్లు**
**నిఖా ప్రేమ మీద**
**నిఖార్సయిన వ్యభిచారం**
**బహిరంగంగా చేయవచ్చు**
**నేను మాత్రం కలుగులో ఎలుకలా**
**చీకటి మహల్‌లో ఒంటిదయ్యాన్ని"**

అంటూ ఆక్రోషిత్మక, ఆలోచనాత్మక కవిత్వం రాస్తారు షాజహనా. నిజానికి ముస్లిం స్త్రీలపై రావాల్సినంత కవితలు రాలేదు. షాజహనా గారి తెగింపు వలన ఆమె బాటలు వస్తున్న స్త్రీ కవయిత్రులు ఎందరో కలరు. షాజహనగారి కవిత్వంకు ఆధారం ముస్లిం అసాధరణ సంప్రదాయాలపైనేకాదు. వీరి కవిత్వంలో పురుషాధిక్యతపై వికారాలు, ద్వేషాలు నిరసనలు వుండనే వున్నాయి.

**"మాకాళ్ళ సందుల్లో చొచ్చి**
**మమ్మల్ని బరి బత్తెల పరిగెత్తించారే**
**అయినా**
**స్త్రీ తప్ప మగ్గాన్ని క్షమించేదెవరు**
**ఎన్నటికీ ప్రపంచం**
**నా రొమ్ము తాగుతు పసిబిడ్డే.... "**

అంటూ ఆవేశంతో కవిత్వం రాసారు. నిజానికి ఆవేశం కాదు. ఆలోచన అవగాహనతో రాసిన కవిత్వం. షాజహనగారు "నఖాబ్" అనే కవితా సంపుటిని రచించారు. అలాగే వీరి కవితలలో అనార్కలి, పర్దా హట్ దేకో, ఖబర్ధార్, ఖౌసేఖిజా అనే రచనలు ప్రసిద్ధి చెందాయి.

సమాజంలో జరిగే సంఘటనల ఆధారంగా జరిగే సంఘటనలను విమర్శిస్తూ కవిత్వం రాసేవారు రావుపల్లి సునీతగారు ఒక్కరు. వీరు సారావ్యతిరేక ఉద్యమాన్ని సమర్థిస్తూ "రేలా రేలా" అనే పాటనూ రచించారు. మనదేశంలో వలసలు ఎక్కువ. వలసలపై వీరి కవితా సంపుటి "అన్వేషి (1995)" ప్రసిద్ధం. అలాగే వీరి కవిత "అమ్మ అలిగింది". మంచి బాధ్యత గల కవిత.

**"కడుపున్న కన్నవాళ్ళు**
**కసురుకున్నందుకు**
**పేగును బించుకు పుట్టినవాళ్ళు**
**ప్రేమబిక్ష రాల్చనందుకు**
**ఎదిగినబిడ్డల మధ్య**
**ఏకాకి అయినందుకు**
**పసిపిల్ల చెష్టలా**
**అమ్మ అలిగింది**
...................
...................
**అమ్మను లాలించడానికిప్పుడూ**
**అమ్మకు అమ్మలేదు**
**అమ్మను బులిపించటనికి**
**అమ్మకు నాన్నలేడు**
**అమ్మ వేదనను పంచుకోవడానిప్పుడు**
**అమ్మకు "మానాన్న" లేడు**

అంటూ సాగే కవిత్వంలో సమాజంలో తల్లిదండ్రుల పట్ల బిడ్డల దృక్పథం తెలుస్తుంది. ఇప్పుడే సమాజం స్వభావం తెలుస్తుంది. ఒకరికొకరు కనీసం సొంతవారిని కూడా అప్యాయంగా పలకరించుకోలేని దుస్థితి తెలుస్తుంది. అందుకే కవయిత్రి ఇలా బాధపడుతుంది.

**"అమ్మ అలిగితే నాకు**
**లాలించే తీరిక ఎక్కడిది "**

స్త్రీవాద దృక్పదంతో ఫెమినిజం కోణంలో రచనలు చేస్తున్న మరో రచయిత శీలం సుభద్రాదేవి (1949)గారు. వీరు పుట్టింది విజయనగరంలోనైనా మైదరాబాద్ ప్రాంతంలో వీరికి విడదీయరాని అనుబంధం కలదు. ఇక్కడే వీరు ఉపాధ్యాయారాలుగా పనిచేస్తూ వర్తమానంలో సాహిత్య విలువలతో రాసే కవయిత్రి వీరు. వీరు మోళీ (1987). తెగినపోగు (1994) ఆవిష్కారం (1999). ఒప్పుల కుప్ప (1999) వంటి రచనలు చేసారు. అలాగే "దేవుడి బండ" అనే కథల సంపుటి రచించారు. ఇంకా "ముద్ర" అనే కథల సంపుటిని భార్గవీరావుగారితో కలిసి సహసంపాదకత్వంను వహించారు. వీరి మరో రచన "యుద్ధం ఒక గుండెకోత (2001)" ఇది మంచి దీర్ఘకవిత. స్త్రీల కవిత్వంలో వుండే ఆందోళన, సంఘర్షణలు వీరి కవిత్వంలో కూడా కలవు.

**"మా గుండెలు మూగవే**
**కానీ ఇప్పుడు కాదు**
**ఎన్నో ఎళ్ళుగా నిద్రించిన**
**మా వ్యక్తిత్వం తుళ్ళిపడి లేచింది**
**స్వేచ్ఛకోసం పెనుగులాటలో**
**సంప్రదాయపు తాళ్ళు**
**తెగిపడ్డాయి..........."**

అంటూ "ఆకలి నృత్యం (1980)"లో సూటిగా మనస్సులో నాటుకుపోయే కవిత్వంతో వీరి కవిత్వ రచనను ఆరంభించారు. అంతేకాదు వీరి ప్రతిభకు 1997లో తెలుగు విశ్వవిద్యాలయం వారి ధర్మపురి పురస్కారం, 1997 ఉత్తమ రచయిత్రి పురస్కారం లభించాయి.

హైదరాబాద్‌లో లెక్చరర్‌గా పనిచేస్తూ వివిధ పత్రికలలో విరివిగా వ్యాసాలు కవిత్వం రాస్తున్న రచయిత కవయిత్రి శిలాలోలిత (1972)గారు. వీరూ "పంజరాన్ని నేనే....పక్షిని నేనే (1999), ఎంతెంతదూరం (2005)" వంటి కవితా సంపుటాలను వెలువరించారు. అలాగే వీరు సిద్ధాంత వ్యాసాలు కవయిత్రుల కవిత్వంకు సంబంధించినవే. వీరు 1993లో "కవయిత్రుల కవిత్వంలో స్త్రీ మనోభావాలు" అనే అంశంపై యం.ఫిల్., మరియు "కవయిత్రుల కవిత్వం-పరిశీలన" పై పిహెచ్.డి. పట్టాను పొందారు. అలాగే వీరు సావిత్రిగారి పై స్మృతికవితను కూడా రాసారు.

విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పనిచేస్తూ ఎలాంటి భేసభాజాలు లేకుండా విద్యార్థులతో కలిసిపోయి వారిని ప్రోత్సహించే రచయిత్రి కవయిత్రి ఆచార్య సూర్యధనుంజయ్‌గారు. నిరాడంబరత, స్వచ్ఛీలత, కలుపుగోలుతనం, ఎవ్వరూ పలకరించినా సౌమ్యంగా మాట్లాడటం, కోపం విసుగు లేకుండా అందరితో కలిసి పోవడం వీరి సహజలక్షణం. ఒక హెూదాలో వుండే వారిని గురించి అందునా ఇవ్వాళిటీ వారినే గురించి ఇలా చెప్పగలమా, అయినా అన్నీ మంచి లక్షణాలు వున్న ఉత్తమ ఆచార్యులు డా॥ సూర్యాధనంజయ్ గారు. వీరు నల్లగొండజిల్లా బంజార సాహిత్యం పై పరిశోధన చేసారు. అలాగే "తాంగ్డి" అనే సాహిత్య వ్యాస సంపుటిని వెలువరించారు. అందరినీ సమసమాజం వైపు నడిపించాలీ అనే తపనతో ఆలోచించే ఆచార్యులు వీరూ. ఇంతమంచి వ్యక్తి కాబట్టే వీరి శిష్యగణంకు కొదువలేదు. వీరు ఎక్కడ వున్నా వీరి చుట్టూ

పదిమంది వచ్చి చేరుతారు. దీనిని బట్టే చెప్పవచ్చు. వీరెంతటి ఆత్మీయత కలిగిన వ్యక్తో.

వీరు మంచి కవయిత్రి కూడా. వీరూ లంబాడీల జీవితాలను వ్యధలను తీసుకొని "బంజార నానీలు"గా మలిచారు.

**"అహా లంబాడీ వనిత**
**వయ్యారం**
**ఇది శ్రమలోంచి పుట్టిన**
**మయూరం"**

వీరి నానీల పదాలలో వున్న భావతీవ్రత, శక్తి అనేది మనకు ఆలోచనల కొలిమిని రాజేస్తుంది.

వస్తువులో అభివ్యక్తిలో వైవిధ్యమైన కవిత్వంను సృజియిస్తూ కృషిచేస్తున్న రచయిత్రి కవయిత్రి కొండపల్లి నిహారణి. వీరు వరంగల్‌జిల్లా పెండ్యాల గ్రామవాసి. వీరు రచయితగా తమ మామగారు "కొండపల్లి శేషగిరి రావుగారి" జీవిత చరిత్రను రాసారు. అలాగే వీరే రాసిన వ్యాసాలన్నీ ఒకచోట చేర్చి "చిత్ర శిల్ప కళా రమణీయకం" అనే శీర్షికన పుస్తకంగా తీసుకువచ్చారు. ఇంకా "అమెరికాలో ఆరు నెలలు, వ్యాసహారిక" వంటి రచనలు చేసారు.

వీరు తెలంగాణ అస్తిత్వ భావనతో ఎన్నో మంచి కవితలు రాసారు.

**"వినీలాకాశంలో**
**తెల్లని నెలవంక నా తెలంగాణ**
**ఎత్తైన కొండి ఆకుపచ్చని మైదానాల**
**గలగల సెలయేర్లు అడుగడుగున**
**దేవుళ్లు విరుసిల్లే**
**వరాల నేల నా తెలంగాణ "**

ఇది ఒక్కటే కాదు అనేకానేక అంశాలకు స్పందిస్తూ ఎంతో మంచి కవితలు రాసారు. అలా కొండపల్లి నిహారిణి గారు "అగ్ర తలుపులు, నిర్నిద్రగానం, ఎనిమిదో అడుగు" వంటి కవితా సంపుటాలను వెలువరించారు.

తెలంగాణ రచయిత్రుల వేదిక వ్యవస్థాపకురాలిగా ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక ముక్తి తెలంగాణ ఉమెన్స్ కలెక్టివ్, సలహాదారుగా, రుద్రమ ప్రచురణ వ్యవస్థాపకురాలిగా ఇలా ఎన్నెన్నో బాధ్యతయుతమైన పదవులతో నిరంతరం సాహిత్యంకై తపిస్తూ కృషి చేస్తున్న రచయిత్రి అనిశెట్టి రజిత. వీరు కథలు, పాటలు కవిత్వం వంటి ప్రక్రియలలో అన్నింటిలో నిష్ణాతులు రజితగారు. వీరు ఓ లచ్చవ్వ (2000), ఉసురు (2002) మార్కెట్ స్మార్ట్ శ్రీమతి (2010). వంటి దీర్ఘ కవితలు రాసారు. ఇంకా దస్తఖత్ (2005), అనగనగా కాలం (2005) వంటి హైక్కులు, గోరంత దీపాలు (2005), నన్వే ఓ నన్వే (2005) అనే నానీలు రాసారు.

ఏ రూపంలో కవిత్వం రాసిన వ్యక్తీకరణలో సంవిధానంలో కొత్తదనంతో రాస్తున్న వారు రజితగారు. వీరు రాసిన కవితలలో అర్థత ఆలోచనత్మాకత వుంటుంది. ఉదాహరణకు వీరు రాసిన "దుఃఖాల దుబాయి" స్వంతదేశంలో సరిపోనీ సంపాదన లేక బతుకు తెరువు లేక దుబాయి వెళ్లి ఇక్కట్ల పాలయిన వారిపై వీరి కవిత.

**"పానం మీదికొచ్చిన అప్పు తీర్చే తోవలేక**
**సావోరేవో తెల్సుకొనుబోతే**
**రూపాయల దూపకారి పోవుడేనా**
**ఎతుకు లాటల ఏకంగా పీనుగవుడేనా....."**

అంటూ దుబాయీకి వెలస వెళ్లిన వారి దైన్యాన్ని చిత్రీకరించారు. ఇలా వాస్తవిక దృష్టితో తార్కిక రచనలు చేసిన రజితగారు "గులాబీలు జ్వలిస్తున్నాయి(1984), నేనొక నల్లమబ్బునవుతా (1997), చెమట చెట్టు(1991)" వంటి కవితా సంపుటాలను వెలువరించారు.

**"పోరాడాల్సిన శత్రువు చేతికి**
**మనమే ఆయుధమైనప్పుడు**
**విజయం మాటెక్కడ**
**బలహీన రహస్యాన్ని**
**దోపిడీదారు దోసిట్లో**
**మనమే ఉంచినప్పుడు**
**గెలుపు ప్రసక్తేమిటీ"**

అంటూ స్త్రీల దైన్యస్థితిని ప్రగాఢ వ్యక్తీకరణతో సులువుగా కవిత్వం చెప్పగలిగే కవయిత్రీ నెల్లుట రమాదేవి. వీరు "మనస్సుభాష" అనే కవితాసంపుటిని రచించారు.

విద్యార్థి సంఘంలో పనిచేస్తూ విద్యార్థుల సమస్యలు స్త్రీలపై అమరవీరులపై కవితలు రచనలు చేస్తున్న కవయిత్రి జూపాక సుభద్ర. వీర కవితలు "కైతునకలదండెం, నల్లపొద్దు" వంటి కవితా సంపుటాలలో ప్రచురితం అయినవి. అలాగే వీరి కవితా సంపుటి "అయ్యయ్యో దమ్మక్కా", ఇంకా వీరి కవితలు నగరంలో నాగు, పల్లె కోయిల వంటి కవితలు పట్టణాలకు, పల్లెలకు వున్న అంతరాలను తెలుపుతాయి.

ప్రాథమికంగా కవితను చదివితే వున్న అర్థం కంటే మరోసారి చదివితే స్ఫురించే లోతైన అర్థంతో కవిత్వం రాయ గల్గిన కవయిత్రి బండారు విజయ.

**"చదవడానికే పుస్తకాలే అవసరం లేదు**
**నీవు చదవగలిగితే ప్రతివారి హృదయం ఓ పుస్తకం"**

అనే రచయిత్రీ వరంగల్ వాసిని. వీరు "దీపికా" (1981) అనే కవితా సంపుటిని వెలువరించారు. విప్లవ పార్టీలో దళసభ్యురాలిగా పనిచేసిన రచయిత్రే దనసరి అనసూయ. వీరిది కూడా వరంగల్ ప్రాంతమే. వీరు "సీతక్కగా" ప్రసిద్ధ

రాలు, వీరి కవిత "గురి తప్పిన ఆదివాసి ఆయుధం" అనే కవిత "నల్లపొద్దు"లో పొందుపరిచారు.

**"కలలన్ని బలం పుంజుకోని**
**నిరంకుశంను దుయ్యబడితే**
**నవచైతన్యం**
**అదే నవోదయం "**

అంటూ "శ్రీకారం" కవితాసంపుటిని రచించిన వరంగల్ రచయిత్రి అయిన వోలు వెంటక అరుణాదేవిగారు.

**"రాటకు కట్టిన బానిసత్వం**
**కూడదీసుకొని కట్లు**
**విడిపించుకోందామంటే**
**బతిమాలి**
**బెదిరించి**
**పిల్లలు కుటుంబ మంటూ**
**కదలకుండా కట్టిపడివేయడం**
**కంట్లో ఊట ఆగిపోనీకుండా**
**జీవనదిలా .................... "**

అంటూ "అణచివేత" అనే కవిత ద్వారా స్త్రీల పరిస్థితిని పెళ్లి సంసార బంధాలు బాధ్యతలు స్త్రీలను ఎంతగా బలహీను రాలుగా చేస్తాయో చెప్తారు. కొలిపాక శోభారాణిగారు. హృదయంలో వ్యక్తీకరించే భావంను హృద్యంగా చెప్పగలిగే కవయిత్రి శోభారాణి. వీరు "చలనం" అనే కవితా సంపుటిని రచించారు.

**"పొయ్యి మీద**
**నీళ్ల మరుగుతున్నాయి**
**వివక్షకు గురైన**
**ఆమె మనస్సులా........"**

అంటూ ప్రతీతాత్మకంగా అద్భుతమైన ఎక్స్‌ప్రేషన్స్‌తో రచనలు చేసిన రచయిత్రీ నాంపలి సుజాతగారు (కరీంనగర్) వీరు 'మొదుగుపూలు' అనే రచన చేసారు.

మరో కరీంనగర్ రచయిత్రి అడవులం సుజాత వీరు "మట్టి మల్లెలు" అనే కవితాసంపుటిని రచించారు.

**"శోక సముద్రం**
**దాట గలిగితే**
**సప్త సముద్రాలు**
**దాటినట్లే మది "**

అలాగే వీరి వచన కవితలలో "వర్తమాన స్త్రీ, చెట్టు" వంటి కవితలు ప్రసిద్ధి.

**"ఆడదంటే అనుభవించేదే అయినచోట**
**ఒళ్ళంతా కళ్ళేకాదు ముళ్ళుండాలి**
**రోమ రోమాన సిస్మోగ్రాఫలుండాలి "**

అంటూ విప్లవాత్మక ధృక్పధంతో పోరాటచైతన్యంను నూరిపోస్తూ ప్రతిభావంతమైన రచనలు చేసినవారు యం. రత్నమాలగారు. నల్లగొండజిల్లాకు చెందిన వీరి కవితలు "గమనం- ఘర్షణ-గమ్యం" అనే రచనలో కలవు.

**"నేనంటే మీకేప్పుడు లోకువే**
**మీ మూలంగా నాకెప్పుడు శోకమే...."**

అంటూ "చూపు" అనే కవితా సంపుటి ద్వారా ఆలో చనత్మకంగా రాసిన కవయిత్రి గారు దుర్గాబాయి (నల్లగొండ). స్త్రీలు పురుషులకోసం స్వేచ్ఛలోను కష్టాలను ఆనందంగా భరిస్తారు అంటూ-

**"పోగొట్టుకున్న వెమిటో తెలియకుండా**
**వెతికి వెతికి వేసారి పోయింది మనస్సు......."**

అంటూ స్త్రీ జీవితంలో కోల్పోతున్న స్వేచ్ఛామాధుర్య మును గురించి దిగులు పడుతూ సగటు మహిళ జీవితంను చెప్పతుంది హిమజగారు. వీరు "ఆకాశమల్లె" అనే కవితా సంపుటిని రచించారు.

**"మనం మనుష్యులం**
**మనకు అన్ని కావాలి**
**ఒక్క మానత్వం తప్ప"**

అంటూ చెప్పదలచుకున్న అంశంను వ్యంగ్యంగా చెప్పడం షహనాజ్ ఫాతిమా గారి కవిత్వంకు వున్న ఆకర్షణ. వీరు కెరటాలు, చెలిమి అనే కవితా సంపుటాలను రచించారు.

**"కన్నీటి చుక్కలు కత్తులైనప్పుడు**
**కన్నీటు నిప్పు మిమ్ము వెంటాడి**
**వెంటాడి భగ్గున మండిస్తుంది"**

అంటూ తెలంగాణ ఉద్యమం గురించి కళ్లకు కట్టినట్లు కవిత్వం రాసిన కవయిత్రి వొడ్నాల సూర్య.

ఇంకా వీరేకాదు. ఎంతోమంది కవయిత్రులు తమ రచనలతో తెలంగాణ కవిత్వంను జీవం పోసారు. వారిలో మరికొందరు.

మోత్కుపల్లి దమయంతి (హైదరాబాద్) - కుట్ల వ్యవస్థ (కవిత)

గోగు శ్యామల (హైదరాబాద్) - నల్లపొద్దు (కవితా సంకలనం)

వి. నాగమణి (హైదరాబాద్) - ఎదురుచూపు (కవిత)

పర్యాద సరళ (హైదరాబాద్) - శ్రీలు పొంగిన నేల (కవితా సంపుటి)

కుమారి ఆలేటి లక్ష్మి ((హైదరాబాద్) - జీవన నాదాలు (కవితా సంపుటి)

పరిమళ సోమేశ్వర్ (కొత్తపేట), మేరి మాదిగ (నల్ల గొండ), మద్దెల స్వాతి మార్గరేట్ (ఖమ్మం), జాబుల గౌరీ, బండారు సుజాతా శేఖర్ (నల్లగొండ) నిద్రించే నిజం, జొన్నకంకులు (నానీలు), రేగులపాటి విజయలక్ష్మి (కరీంనగర్), మొగిలిపూలు (నానీలు), గోపి భాగ్యలక్ష్మి, పట్వారీ సుజాత (పుప్పొడి), దాసోజు లలిత మొదలైన వారు కలరు.

తెలుగులో తెలంగాణలో స్త్రీల రచయితలకీ కొరత లేదు. కానీ కవిత్వం విషయంలో అలాంటి ధృక్పథం విషయం లో ప్రారంభం గొప్పగాలేదు. వర్తమాన ఆశాజనకంగా లేదు.

అక్కడో ఇక్కడో ఆడపదడపా కవిత్వం రాస్తున్న కవియిత్రులు వున్నారు గానీ, సీరియస్‌గా కొనసాగుతున్నవారు చాలా తక్కువ.

కారణం ఏదైనా సరే పురుషులతో సమానంగా రాయ గలిగే సామర్థ్యం వుండీ ఇంకా ఇంటి బాధ్యతలతో రచనలపై దృష్టి సాధించని వారు ఎందరోకలరు. ప్రపంచం ఒకప్పుడూ నిషిద్ధం అని బందించి వేధించింది అయినా స్త్రీలు ధైర్యంగా ముందుకు వచ్చి పురుషులతో దీటుగా సాహిత్యంను పండిం చారు.

సమాజంలో అన్ని సంబంధాలలో నిజాయితీ లోపిస్తున్న ఈ తరుణంలో మనుష్యులను సాహిత్యం ద్వారా తీర్చిదిద్ది బాధ్యతలను గుర్తు చేయాల్సిన అవసరం కవయిత్రులకు ఎంతోవుంది. నేటీ వీరి కవిత్వంలో వున్నా వాక్యవిన్యాసం భావసౌందర్యం అనుభూతి విశేషం వీరిని మంచి కవయిత్రు లుగా నిలబెడుతున్నాయి.

ఎన్నడు లేనంత ఆరోగ్యకరమైన వాతావరణం నేటి సాహిత్య రంగంలోకలదు. కాబట్టి పరిస్థితిని వినియోగిస్తూ స్త్రీ మూర్తులు తమ కవితా వాణిని ఈ లోకానికి వినిపించాల్సిన తరుణమిది. ఇది వారి బాధ్యత కూడా. ఇలాంటి కవయిత్రులు తెలంగాణ సాహిత్యంలో ఇంకా ఎంతోమంది రావాలని ఆశిస్తూ...

**ఆధార గ్రంథాలు :**

1. తీరొక్కపువ్వులు (వ్యాస సంపుటి) - సంకలనం : అనిశెట్టి రజిత కాత్యాయనీ విద్మహే
2. ముద్దెర - సంపాదకులు : ముదిగంటి సుజాతారెడ్డి
3. నారి - సారంబి (వ్యాసాలు) : శిలాలోలిత
4. జిగర్ - అనిశెట్టి రజిత
5. బేరాతలు - చేకూరి రామారావు
6. నవ్యకవితా రూపం "నానీ" వివేచన - చింతకంది శ్రీనివాసరావు

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# 'మహా ప్రస్థానం'- గతితార్కిక భౌతిక వాదం

- డా॥ వెరెడి చిన్నెరావు, తెలుగుశాఖ, ఆంధ్ర యూనివర్సిటి, విశాఖపట్నం.

అభ్యుదయ కవిత్వంలో రెండు రకాల విధానాలు ఏక కాలంలో దర్శనమిస్తాయి.. పాశ్చాత్య ప్రభావం వల్ల తెలుగులోకి ప్రవేశించిన అభ్యుదయ కవిత్వం, ప్రజాకవులు ఏర్పరచిన అభ్యుదయ కవిత్వం. పాశ్చాత్య ప్రభావంతో తెలుగులోకి వచ్చిన కవిత్వాన్ని శ్రీశ్రీ, నారాయణబాబు వంటి వారు ఆహ్వానించి దానికి పట్టం కట్టారు. ఈ కాలంలో మరొక విధంగా అభ్యుదయ కవిత్వం కనబడుతుంది. అదేంటంటే, నిజాం పాలనకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణా ఉద్యమ పోరాటంలో ఆవిర్భవించిన కవిత్వం. సుద్దాల హనుమంతు వంటి ప్రజాకవులు రచించి పాడిన పాటలు ఆధారంగా ఈ కవిత్వం ఉనికిని చాటుకుంది. అయితే పాశ్చాత్య ప్రభావంతో వచ్చిన అభ్యుదయ కవిత్వాన్ని మాత్రమే తెలుగులో ఆదరించడం జరిగింది. అలాగే తెలుగు కవిత్వాన్ని ప్రభావితం చేసి ఎందరో అభ్యుదయ తెలుగు కవులను సృష్టించి సాహిత్యానికి ఒక ఆధునిక మార్గాన్ని ఏర్పాటు చేసింది.

మార్క్సిస్టు దృక్పథానికి ప్రతీక అయిన అభ్యుదయ కవిత్వం ఒక సామాజిక ఉద్యమం. కార్ల్ మార్క్స్, ఫెడరిక్ ఎంగిల్స్ మొదలగు వారి రచనల స్ఫూర్తితో ఈ ఉద్యమం ఆవిర్భవించింది. 'ప్రోగ్రెసివ్ అనే ఇంగ్లీషు పదానికి అనువాదంగా ఆధునిక సాహిత్యంలో 'అభ్యుదయం' అనే మాటను ఉపయోగించడం జరుగుతోంది. అంతేకాకుండా అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ కవిత్వం వంటి మాటలను, మార్క్సిస్టు సాహిత్యం, మార్క్సిస్టు కవిత్వం అను రూఢార్థాల్లో ప్రస్తుతం ప్రయోగిస్తున్నాం. తెలుగు సాహిత్యంలో, అభ్యుదయ కవిత్వానికి చాలా ప్రాధాన్యం ఉంది. ఇది 'మార్క్సిస్టు ఉద్యమంలో భాగంగారచించిన కవిత్వం'అనే అర్థంలో మనం స్వీకరిస్తున్నాం.

'గతి తార్కిక భౌతిక వాదం' అనేది అభ్యుదయ కవిత్వంలోని మౌలిక సిద్ధాంతం. చారిత్రక భౌతిక వాదం కూడా ఇందులో భాగమే. ఆర్థికంగా బలహీనమైన, బలమైన రెండు వర్గాల మధ్య భేదం, సంఘర్షణ పెరిగి చివరకు ఈ సంఘర్షణ విప్లవాత్మక పరిణామం ద్వారా శ్రామిక వర్గ విజయానికి దారితీస్తుంది. ఇలా ఏర్పడిన శ్రామిక వర్గ నియంతృత్వ ప్రభుత్వాలు తరవాత రాజ్యాంగ వ్యవస్థతో పనిలేని కమ్యూనిష్టు సమాజం ఏర్పడుతుంది. మనకు పరిపూర్ణ సుఖాన్ని అందించడానికి ఈ సమాజం అన్ని విధాల ఉపయోగపడుతుంది. ఇది చారిత్రక భౌతిక వాదం. ఈ ప్రభావం ఎక్కువగా ఐరోపా దేశాలలో కనబడుతుంది. అయితే కార్ల్ మార్క్స్ ఒకే తత్వంలోని పరస్పరం సంఘర్షించే రెండు అంశాల సంఘర్షణే పరిణామానికి మూల సూత్రం అనే 'గతితర్కిక' సిద్ధాంతాన్ని పదార్థంలోంచే చైతన్య ఆవిర్భవించిందన్న భౌతిక వాదాన్ని సమ్మిళితం చేసి తన సిద్ధాంతాన్ని రూపొందించాడు.

తెలుగులో అభ్యుదయ కవిత్వం తారాస్థాయికి చేరడానికి పునాదులు శ్రీశ్రీ ఆలోచనలు అని విమర్శకుల అభిప్రాయం. శ్రీశ్రీ 'మహాప్రస్థానం', 'ఆధునిక భగవద్గీత'గా చైతన్య శిల్పిగా దర్శనమిస్తుంది. మహా ప్రస్థానంలో మార్క్సిస్టు భావజాలాన్ని పరిశీలిస్తే శ్రీశ్రీ కలగన్న సమాజం, సమాజ విధానం బయటపడుతుంది.

శ్రీశ్రీమహాప్రస్థానంలో గతితార్కిక భౌతికవాదంతో పాటు దాచినా దాగని సత్యాలు, వర్గసంఘర్షణ సిద్ధాంతం, శ్రామికుల సమిష్టి చైతన్యం శ్రామిక శక్తుల దోపిడీపై నిరసన, పాళితుల తిరుగుబాట్లు ఇలా అనేక కోణాలు ఉన్నాయి.

**"వరాల వర్షం కురిపించాలని**
**ప్రపంచ భాగ్యం వర్ధిల్లాలని**
**గనిలో, పనిలో, కార్ఖానాలో**
**పరిక్లమిస్తూ**
**పరిప్లవిస్తూ"**

కార్లమార్క్స చెప్పిన గతితార్కిక భౌతికవాదమిదే. శ్రీశ్రీ మార్క్సను, అతని భావజాలాన్ని ఎక్కడా వదిలిపెట్టలేదు. శ్రామిక జీవులు - ధనిక స్వామికి దాస్యం చేస్తూ వారి చేతులోనే దోపిడీకి గురౌతున్నారని శ్రీశ్రీ తన మహాప్రస్థానంలో పేర్కొన్నాడు.

'దేశచరిత్రలు' గేయంలో గతితార్కిక భౌతిక వాదం నిలువునా బయటపడుతుంది.

**"ఏ దేశ చరిత్ర చూసినా**
**ఏమున్నది గర్వకారణం**
**నరజాతి చరిత్ర సమస్తం**
**పరపీడన పరాయణం"**

'ప్రతిజ్ఞ' ఖండికలో కార్మికుల శ్రమశక్తిని దోచుకునే పెట్టుబడీదారీ వ్యవస్థ తీవ్రంగా నిరశించి శ్రామిక వర్గ చైతన్యానికి పునాదులు వేసిన మార్క్సిస్టు దృక్పథం ప్రత్యక్షమౌతుంది.

విరోధి వైరుధ్య సూత్రం ప్రకారం పెట్టుబడీదారీ వ్యవస్థ, కార్మిక వ్యవస్థల మధ్య సంఘర్షణ ఎప్పుడూ ఉంటుంది. అయితే పెట్టుబడిదారీ వ్యవస్థలోని దోపిడీ విధానాన్ని నిర్మూలించడానికి శ్రామికులందరూ ఏకము కావాలని మార్క్స ప్రబోధించాడు. కానీ శ్రీశ్రీ అక్షరబద్ధం చేశాడు.

**"చీనాలో రిక్షావాలా**
**చెక్ దేశపు గని పనిమనిషి**
**ఐర్లాండున ఓడ కళాసీ అణగారిన ఆర్తులందరూ**
**హటెన్‌టాట్, జూలూ నీగ్రో**
**ఖండాంతర ఆనాజాతులు**
**చారిత్రిక యధార్ధ తత్వం**
**చాటిస్తారొక గొంతుకతో"**

అని విశ్వ శ్రామికుల సమిష్టి చైతన్యం చేసిన అభ్యుదయ కవిగా శ్రీశ్రీ తన భావాన్ని వ్యక్తం చేశాడు. వ్యక్తుల ఇష్టానిష్టాలకు మార్క్సిజం అవకాశం ఇవ్వదు, ఆధారపడదు. అయితే వాటి వెనకున్న శక్తులను మాత్రమే పరిశీలిస్తుంది. అలా కాని పరిశీలనలన్నీ 'కట్టుకథలని' నమ్ముతుంది. శ్రీశ్రీ ఈ విషయాన్ని తీవ్రంగా వ్యక్తపరిచాడు.

**"ఇతిహాసపు చీకటికోణం**
**అట్టడుగున పడి కన్పించని**
**కథలన్నీ కావాలిపుడు**
**దాచేస్తే దాగని సత్యం"**

అని హెచ్చరించాడు. గతితార్కిక భౌతిక వాదానికి సంబంధించిన మరొక అంశం వర్గ సంఘర్షణ. ఈ వర్గ సంఘర్షణ సిద్ధాంతాన్ని అతిస్పష్టంగా సొంతగొంతుకతో స్వర కల్పన చేశాడు శ్రీశ్రీ. మానవ జాతి చరిత్రఅంతా వర్గ సంగర్షణ ఫలితమే అన్న గతి తార్కిక భౌతికవాద సిద్ధాంత ఫలితాన్ని శ్రీశ్రీ..

**"పరస్పర సంఘర్షించిన**
**శక్తులలో చరిత్ర పుట్టెను"**

అని సంగ్రహతనూ, సరళతనూ, గంభీరతనూ పుణికి పుచ్చుకున్న వాక్కులలో అందించాడు.

దోపిడీని ఎదిరించి కార్మికుల్లో వర్గ చైతన్యం పెల్లుబికి వారంతా సంఘటితులై పెట్టుబడిదారీ వర్గానికి విరుద్ధంగా వారి దోపిడీని ఎదురిస్తూ విప్లవాన్ని లేవదీస్తారని మార్క్స్ భావన. అందువల్లనే శ్రామిశక్తిని దోచుకుంటున్న వైనాన్ని తెలియజేశాడు.

**"ఘర్మజలానికి ధర్మ జలానికి**
**ఖరీదు కట్టే షరాబులేడోయ్"**

అని నిర్వేదం ప్రకటించాడు. ఈ నిర్వేదంలో ఆశావాదం ఉదయించింది.

శ్రీశ్రీ మహాప్రస్థానంలో శ్రామిక వర్గ చైతన్యాన్ని అద్భుతంగా ..

**"నాలో కదిలే నవ్య కవిత్వం**
**కార్మిక లోకపు కళ్యాణానికి**
**శ్రామిక లోకపు సౌభాగ్యానికి"**

సమర్పిస్తానని శపథం చేశాడు. అంతే కాకుండా.

**"కమ్మర కొలిమి కుమ్మరి చక్రం**
**జాలరి పగ్గం సాలెల మగ్గం**
**శరీర కష్టంస్పురింప చేసే**
**గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి**
**సహస్ర వృత్తుల సమస్త చిహ్నాలు**

సౌందర్యమనేది ఊహా కవిత్వ విషయమో, అతీంద్రియ స్వప్నమో కదాని, సమాజపు సుశిక్షితమైన గతిలోనే సౌందర్యం ఇమిడి ఉందని ఆ గతి శ్రమ ఫలితమే కనుక శ్రమే సౌందర్యమని మార్క్సిస్టు తత్వవేత్తలు వాదించాడు.

ఈ దృక్పథాన్నే శ్రీశ్రీ -

**"శ్రమైక జీవన సౌందర్యానికి**
**సమానమైనది లేనేలేదని"**

చెబుతూ ''వ్యధార్థ జీవితయథార్థ దృశ్యం' పునాదిగా జనించబోయే భావి వేదాలకు జగత్తును అందిస్తానని ప్రతిజ్ఞ చేశాడు.

పాలితులుచేసిన తిరుగుబాటును శ్రీశ్రీ మహా ప్రస్తానంలో తీవ్రంగా వ్యంగ్యంగా రచన చేశాడు.

కనక దుర్గా చండసింహం జూలుదులిపి ఆవులించింది. ఇంద్ర దేవుని మదపుటేనుగు ఘీంకరిస్తూ సవాల్ చేసింది. అంటూ సవాళ్ళను, తిరుగుబాటును విప్లవానికి, విలయానికి ప్రతీకగా ప్రత్యక్షీపరింపచేశాడు శ్రీశ్రీ

**"పుడమి తల్లి నీ**
**పురిటి నొప్పులు**
**కొత్త సృష్టిని"**

స్పురించాయని పెట్టుబడిదారీవ్యవస్థ విధ్వంసమై శిథిలమై శ్రామికవర్గం ఆవిర్భవిస్తుందన్న విషయాన్ని తెలియజేశాడు.

కవిత్వాన్ని ఒక సాధనంగా వాడుతూ శ్రీశ్రీ తన భావ వ్యక్తీకరణకు మరింత పదును పెట్టాడు. పాలక వర్గానికి, వ్యతిరేకంగా పాలితులనూ, పీడితులనూ నడిపించడానికి కవిత్వాన్ని మార్క్సిస్టులు ఒక సాధనంగా వాడుకున్నారు. అందుకే శ్రీశ్రీ కదిలేదీ కదిలించేదీ పెనునిద్దర వదిలించేది నవ కవిత అని అక్షరబద్ధం చేశాడు.

మార్క్సిస్టుల వాస్తవికతా వాదం కూడా గతాతార్కిక భౌతిక వాదంలోని భాగంగా దర్శనమిస్తుంది. కావ్య వస్తువులే వాస్తవికతా వాదం బోధిస్తుంది. స్వర్గం, నందనవనం మొదలైన అతీంద్రియ వస్తువులు, పూలు, సెలయేర్లు, మబ్బులు మొదలైన హృదయభరితమైన వస్తువులే కాకుండా జుగుప్సావహ

మైన అనుదాత్త వస్తువులను కూడా ఈ కోవలోకి చెందుతాయని అందుకే ..

**"కళ్లంటూ ఉంటే చూసి రాస్తే**
**అన్నీ ఆనందాయకాలే, రసమయాలే, కవితావేశాలే"**

అని విశ్వసించాడు. అంతేకాకుండా ...

**"కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిల్లా హీనంగా చూడకు దేన్నీ**
**కవితా మమేనోయ్ అన్నీ"**

అని ఉల్లేఖించాడు శ్రీశ్రీ.

ఇంకా 'జగన్నాథుని రథచక్రాల్లో' జగత్తులో జరుగుతున్న అన్యాయాలను అణచి వేయడానికి విప్లవ శక్తి అవతరిస్తుందని హెచ్చరించి పతితులకు, భ్రష్టులకు , బాధాసర్ప దష్టులకు దుర్దినాలు తొలగిపోవా; స్వాతంత్ర్యం, సౌహార్దం, సమభావం, పునాదులుగా నూతనలోకం ఉదయిస్తుంది ఆశాసంగీతం ఆలపించాడు. 'దేశచరిత్రలు" గేయం గతితార్కిక చారిత్ర భౌతిక వాదానికి ప్రతీకగా నిలుస్తుంది.

ఈ విధంగా గతితార్కి భౌతిక వాదం మహాప్రస్థాంలో నిక్షిప్తమై అభ్యుదయ భావజాలంతో బయటకు స్ఫురిస్తుంది. ఇతర దేశాలలో ప్రారంభమై భారత దేశంపై ప్రభావం చూపిన ఈ మార్క్సిస్టు దృక్పథాన్ని శ్రీశ్రీ తన రచనా దృక్పథాన్ని, ఆలోచననూ, భావ వ్యక్తికరణను జోడించి మహాప్రస్థానం రాసి ప్రజలకు అందించి అభ్యుదయ కాంక్షను చాటాడు.

❀ ❀ ❀

# తెలంగాణ వైతాళికుడు కాళోజీ

**- డా॥ అడువాల సుజాత,** ఇ.నెం. 2-10-1040, గాయత్రి ఎస్.ఆర్.ఆర్. అపార్ట్‌మెంట్స్, జ్యోతినగర్, కరీంనగర్.

తెలంగాణ తాడిత, పీడిత ప్రజల గుండెలలో కొలువైన కవి కాళోజీ. అతని మాటలలో చేతలలో, ఆలోచనలలో, ఆవేదనలో, వేష భాషలలో, ప్రవర్తనలో తెలంగాణ స్వరూపం సంపూర్ణంగా కనిపిస్తది.

సమాజ గొడవను, ప్రజల గొడవను తన గొడవగా చేసుకొని "నా గొడవ" పేరుతో అనేక కవితలు రాసిండు. వాటిని ఎనిమిది సంపుటాలుగా వెలువరించిండు. పాలకుల ద్వారా పాలితులకు జరిగే హింసను, సమాజంలో ప్రజానీకానికి ఎదురయ్యే ఇబ్బందులను, తెలంగాణ ప్రాంతానికి, తెలంగాణ భాషకు జరిగిన అన్యాయాన్ని నిరంతరం తన గళం ద్వారా కలం ద్వారా చాటి చెప్తూ ప్రజలను మేల్కలిపిన వైతాళికుడు కాళోజీ.

కాళోజీ దృష్టిలో భాష రెండు రకాలు. ఒకటి "బడి పలుకుల భాష" గ్రాంథిక భాష. రెండవది "పలుకుబడుల భాష". ఇది నిత్యం ప్రజలు వ్యవహరించే భాష. వ్యవహారిక భాషనే జీవభాష. ఏ భాషకైనా జీవధాతువు ఆ ప్రజల వాడుకగా ఉండే మాండలికమే. కాళోజీ తన మాండలికమైన తెలంగాణా భాషనే ఎంచుకొని సామాన్య ప్రజలందరికీ అర్థమయ్యే పలుకుబడులలో రచనలు చేసిండు.

"ఒకని భాష విషయంలో, యాస విషయంలో, తిండి విషయంలో ఎగతాళి చేస్తే అతని ఆత్మాభిమానం దెబ్బ తింటది. దానికి వెలకట్టలేం" అంటాడాయన. అంతే కాదు ఇంకా ఇట్లా అంటున్నాడు "ఒక రకంగా చూస్తే వేషం కన్నా భాష రక్తమాంసాల్లో కలిసిపోయి వుంటది. ఏ ప్రాంతం వారు ఆ ప్రాంతం వాడుక భాషలోనే రాయాలి. భాషాశాస్త్రం ప్రకారం చూస్తే ఏ భాషకయినా జీవధాతువు మాండలికం. మాండలికంలో తేడాలు, యాసలు, వ్యత్యాసాలు వుండటమే భాషకు జీవ లక్షణాలు" అంటాడు.

అభివృద్ధి చెందిన రెండు జిల్లాల భాషనే అక్కడి మాండలికమే తెలుగు. మిగిలిన జిల్లాలలోని భాష తెలుగు కాదు, అది యాస అనటం తప్పు అనీ కాళోజీ నిశితంగా ఖండించాడు.

దీనికి ఆవేదనగా 'నా గొడవ'లో ఇట్లా అంటాడు.

**"అన్య భాషలు నేర్చి**
**ఆంధ్రంబు రాదంచు**
**సకిలించు ఆంధ్రుడా**
**చావవెందుకురా..." అంటూనే...**

ఇంకా....

**"రెండు జిల్లాలదీ**
**దండి భాష అయినప్పుడు**
**తక్కినోళ్ళ యాస**
**తొక్కి నొక్క బడ్డప్పుడు**
**ప్రత్యేక రాజ్యం పాలు**

అని కాళోజీ ఆంధ్ర ప్రాంతపు భాషావాదులను హెచ్చరిస్తాడు.

సమైఖ్యాంధ్ర రాష్ట్రంలో తెలంగాణ భాషకు జరిగిన అవమానాన్ని నిరాదరణను దాదాపు ముప్పై ఏండ్ల కిందనే వెల్లడించాడు కాళోజీ.

కాళోజీ తన గొడవను ఉగాది కవితగా రాసి 'ఉగాది' తోనే చెప్పుకుని సేద తీరుతాడు. విన్నందుకు థ్యాంక్స్ చెప్తూనే, స్వాగతమంటాడీ కింది కవితలో....

**ప్రస్తుత ప్రపంచపు కథ కాలమానంగా వెలసిన నీవు**
**మా బ్రతుకు తీరును**
**మానవ చరిత్రలోని మాయని భాగంగా**
**నమోదు చేసుకొని వెళ్ళు.**
**రాబోవు సమాజానికి గుణపాఠంగా**
**కాలమానంతో పాటు**
**మా బ్రతుకుల మూల్యాంకనం చేస్తూ**
**అనంతరం సాగిపోయే కాలానికి నీవు ప్రతినిధివి**
**నీ మూల్యాంకనానికి ముడి సరుకు మానవజీవితం**
**అనాదిగా నీకు మాకు ఉన్న సంబంధమిది**
**ఆ చనువుతో**
**నీతో చెప్పుకుంటున్నాను నా గొడవ**
**ఓపికతో విన్నందుకు థ్యాంక్స్**
**మరోసారి నీకు స్వాగతం చెప్తున్న !..... అంటాడు.**

ఇంకొక కవితలో....

**అసాధారణమగు కాలమా ! / మాదానిగ మతానికి / సాధారణ రూపమెత్తి**
**నీ రసాలు చిందిస్తూ / ఏతెంచుట నీకే తగు / మా బ్రతుకుల నిండియున్న**
**చేదు పులుపు తీపుల వలె / అసాధారణముగ కాలమా / సాధారణ రూపమెత్తి**
**ఏతెంచుట నీకే తగు అంటాడు. / ఈ " మహాన్ అయిన కాలంలో నీవొక లిప్తవు**

**మహత్తయిన కావ్యంలో / నేనొక తరంగాన్ని / కాల పరంపరలో నీవు**
**కావ్య పరంపరలో నేను / కాల ధర్మం నీది / కావ్య ధర్మం నాది**
**కాలమానంగా నీవు / కావ్యమానంగా నేను / ..............**
**ఓ ఉగాది చానా !**
**నీవు నేను వ్యక్తిత్వం ఉన్నోళ్ళం / ఏనాడూ ఏదానికీ / ఏమాత్రం లంగనోల్లం"....**

అనే ఆత్మవిశ్వాసాన్ని కనబర్చాడు.

కాళోజీ నిరంతర ఉద్యమజీవి. తన కాలంలో జరిగిన అనేక ఉద్యమాల్లో పాల్గన్నాడు. ప్రతి విషయాన్ని ప్రశ్నించాడు. స్వాతంత్ర ఉద్యమంలో పాల్గన్నాడు. రజాకార్లనెదిరించి జైలు జీవితం గడిపాడు. రజాకార్లపై ఆయన కోపాన్ని పరాకాష్ఠకు చేర్చిన కవిత "కాటేసి తీరాలె" ఇందులోని కసి తెలంగాణా ప్రజలందరిది.

**"మన కొంపలార్పిన మన స్త్రీల చెరచిన**
**మన పిల్లలను చంపి మనల బంధించిన**
**మానవాధములను మండలాధీశులను**
**కసి ఆరిపోకుండ బుస కొట్టుతుండాలె**
**కాలంబు రాగానె కాటేసి తీరాలె...**
**తిట్టిన నాల్కలను చేపట్టి కొయ్యాలె**
**కొంగులాగిన వేళ్ళు కొలిమిలో పెట్టాలె**
**కన్నుగీటిన కళ్ళ కారాలె (కొట్టాలె) చల్లాలె**
**తన్నిన కాళ్ళను డాకరిగ వాడాలె**
**కండ కండగ కోసి కాకులకు వెయ్యాలె**
**కాలంబు రాగానె కాటేసి తీరాలె...**

ఈ కవిత కాళోజీ జైల్లో ఉన్నప్పుడు రాసాడు. జనగాం దగ్గరి బైరాన్‌పల్లి గ్రామస్తులు రజాకార్లతో పోలీసులతో చాలాసార్లు పోరాడి తరిమికొట్టారు. కోట బురుజును స్థావరంగా చేసుకుని కమ్యూనిష్టు పార్టీ ఆధ్వర్యంలో ప్రతిఘటించారు. అయితే 1948 ఆగస్ట్ చివరి వారంలో రజాకార్లు, పోలీసులు గ్రామాన్ని స్వాధీనం చేసుకొని గ్రామ ప్రజలను మూడు నాలుగు వందల మందిని కాల్చేశారు. హింసలకూ గురిచేసారు. ఇది తెలిసిన కాళజీకి నరనరాల్లో కసి పెరిగింది. ఆ సంఘటనకు స్పందనగా పైన తెలిపిన 'కాటేసి తీరాలె' కవిత రాసిండు.

కాళోజీ కాంగ్రెసు పార్టీలో సభ్యుడు. కాంగ్రెసు పార్టీ తరపున ఎమ్.ఎల్.ఏ.గా పోటీచేసి ఓడిపోయిండు. కాంగ్రెస్ పార్టీ నియమ నిబంధనలను పాటిస్తున్నప్పటికినీ "పాతివ్రత్యం" అన్న మాటకు వ్యంగ్యార్థ సూచకంగా 'పార్టీవ్రత్యం' అన్న పదబంధాన్ని కాళోజీ తయారు చేసాడు. కాళోజీ మేనమామ లోకమాన్య బాలగంగాధర తిలక్ అనుయాయు పండిట్ నర్దేవ్ శాస్త్రి కాళోజీని రాజకీయంగా ఉద్యమపరంగా తీర్చిదిద్దిండు.

ఒక శతాబ్దం కిందట పేరెన్నిక గన్న సంఘ సంస్కర్త డి. రాజారెడ్డి అతని గురువు.

పార్టీయే దేవుడు, సర్వస్వం అని భావించడం, పార్టీ తప్పుచేస్తే సమర్థించడం, ఇట్లాంటివి కాళోజీకి ఏమాత్రం ఇష్టం ఉండేవి కావు. ఏదైనా ఎవరైనా అవకతవకలు చేస్తే, వారు తన పార్టీవారైనా, కాంగ్రెస్ వారైనా సరే, చివరికి తన తోడ బుట్టిన అన్న అయినా సరే - ఎవరేమనుకుంటారో అనే ఆలోచన లేకుండా - విమర్శించడం కాళోజీ పద్ధతి. ఇది ఆయన స్వభావం. ఇటువంటి అనేక అనుభవాలను అతని ఆత్మకథలో జోడించిండు.

**'నా ఇజం' కవితలో**
**"నానాయిజాల కడుగున చూడ**
**'నాయిజం'దే అగుపడును జాడ"** అంటాడు.

కాళోజీ తలలేనితనాన్ని ఒప్పుకోడు. వ్యక్తిత్వం ఉండాలనీ, ధనానికి లంగి నలుగురిలో పలచన కావద్దనీ, తలెత్తుకొని తిరగగలిగే ధీరగుణం ఉండాలని కాళోజీ భావించిండు.

**"ప్రాంతేతరులే దోపిడి చేస్తే పొలిమేర దాక**
**తన్ని తరుముతం !**
**ప్రాంతం వాడే దోపిడి చేస్తే ప్రాణంతోనే**
**పాతర వేస్తం!"** అని తెలంగాణా మనస్తత్వాన్ని చిత్రించిండు.

**"వీర తెలంగాణా నాది వేరు తెలంగాణా నాది**
**వేరై కూడా తెలంగాణా వీర తెలంగాణ ముమ్మాటికి"**

అని ఎలుగెత్తి చాటిండు. తెలంగాణా మాండలికాన్ని ఆంధ్రావాళ్ళు హేళన చేయడాన్ని ఏమాత్రం సహించబోమని కాళోజీ ఆ రోజుల్లోనే గట్టిగా చెప్పిండు. రాజకీయ వివక్షతో పాటు, భాషా వివక్షను చూపే ఆంధ్రులను ప్రశ్నించిండు.

**"తెలంగాణా ప్రజలు సల్పు**
**తెలంగాణా ఉద్యమాన్ని**
**రౌడీ అలజడి అంటూ**
**బాకాలూదెడి ఆంధ్రుల**
**దెంతపాటి సభ్యతంట**
**తెలంగాణ "యాస" నెపుడు**
**యీసడించు భాషీయుల**
**సుహృద్భావన ఎంతని"**

అంటూ ప్రశ్నిస్తూ కవిత్వం రాసిండు.

కాళోజీ ప్రజాకవి కాబట్టి ప్రజల గోడును ప్రజల భాషలో పలికిండు నా గొడవంటూ. అతని కవిత్వం ప్రజలను కదిలించేది, అదిలించే కవిత్వం. అది మందలిస్తుంది, ప్రశ్నించి కళ్ళు తెరిపించే కవిత్వం. కాళోజీ కవిత్వమంతా తెలంగాణ భాషలో యాసలో జాలువారింది.

తెలుగు భాష ఎన్నితీర్లుగా వాడుకలో ఉంటుందో అన్ని తీర్ల తెలుగు భాష ప్రాంతాల వారిగా వాడుకలోనికి రావాలని కాళోజీ కోరిక.

**"తెలుగుబాస వాడుకయే**
**అన్ని తీర్ల వాడుకకు**
**పరపతి పెత్తనమొకటే**
**ముఖే ముఖే సరస్వతి**
**నోటనోట మాటమ్మ**
**అనితీర్లు వాడుకని**
**ఒకే తీరుగ చూచుట**
**ఎవడివాడ వారిది అని,**
**ఎవరి వేడ్క వారిది అని**
**అందరికీ వేడుకగ తలుస్తే"**

అని వాడుక భాషను వేడుకగా చెప్పిండు.

మాండలికమే భాషకు, యాసకు మూలబింధువు. అందుకే కాళోజీ తెలంగాణా యాసను, భాషను నా గొడవలో ప్రయోగించిండు.

కాళోజీ ప్రజాకవి కనుక తన కవిత్వంలో ఇంకా అనేక పదాలు, పదబంధాలు సృష్టించిండు. లేఖకుడును బట్టి రేఖకుడు, వాడకుడు, శిల్పకుడు, చిత్రకుడు, యాంత్రికుడు, దీపకుడు అని దాదాగిరిని బట్టి నేతాగిరిని, పశ్చాత్తప్తులను బట్టి పూర్వతప్తులని, అశ్వమేధయాగాన్ని బట్టి స్వమేధయాగం అని, ఆర్టిస్టును బట్టి హార్టిస్టు అని, బోర్‌వెల్‌ను ట్యూబు బావి అని, దివాంధతను బట్టి మహాంధులు అని సహకార సంఘాలను స్వాహాకార సంఘాలు అని, రాజకీయులను బట్టి ప్రజాకీయులు అనే పదాలను సామ్యాన్ని బట్టి పదాలను అనుసరించి సృష్టించిండు. ఇవి అధిక్షేప కవిత్వానికి వ్యంగ్య పూరిత కవిత్వానికి అలంకారాలుగా భాసిల్లినయి. దినపత్రికలలో నేడు శ్లేషను సాధించే పద్ధతిని కాళోజీ 70వ దశకంలోనే అనుసరించిండు. కుబేరులు చేసే పనులను 'కుబేరాలు'గా ప్రయోగించిండు.

ప్రజాభాషలో రాసే కవిత్వానికి వ్యాకరణం లేదని గేలిచేసే విమర్శకులకు పండిత భాషలో కవిత్వంలో వ్యాకరణం తప్ప మరేమి లేదని వివరించి చెప్పిండు కాళోజీ.

**వ్యాకరణము సూత్రాలతో**
**వాణిని బంధించగలమా?**
**నోటనోట బైలెళ్లెడి వాణికి**
**చోటుచూపి బంధించుట చాటు**
**"వ్యాకరణం రాజబాట వేస్తుంది**
**వాడుక పిల్లబాట తొక్కుతుంది**
**సమ్మతరూప దర్శనాభిలాషి పండితుడు**
**అగుపడ్డ రూపమే సమ్మతము సామాన్యునికి**
**ఎవనికో నచ్చునట్లు పలకడం నాడు**
**ఎవనికి వాడు నచ్చినట్లు పలకడం ఖాయం నేడు"**

అని వాడుక భాష ఔన్నత్యాన్ని చాటి చెప్పిండు.

కాళోజీ కవిత్వంలో తాత్విక కోణం కూడా కనిపిస్తుంది. ప్రపంచ ప్రఖ్యాత కవి లెబనాన్ దేశస్థుడైన ఖలీల్ జిబ్రాన్ రాసిన "ప్రాఫెట్"ను 'జీవనగీత' పేరుతో అనువదించి ప్రచురించిండు.

'బతుకమ్మ' అంటే బతుకును ఆరాధించే పండుగ. అందుకే ప్రపంచంలో ఎక్కడా బతుకమ్మ పండుగ వంటి పండుగ లేదు. తెలంగాణా ప్రజలు బతుకును ఆరాధిస్తారు. పిరికివాళ్లు కారు. వీరోచితంగా బ్రతుకుతారు. అందుకే బతుకమ్మ పండుగపై 'బ్రతుకమ్మా బ్రతుకు' అనే కవిత రాసిండు. కాళోజీకి బతుకమ్మ పండుగ అంటే ఇష్టం. స్త్రీలు తమ కష్ట సుఖాలను, త్యాగాలను, జీవితంలోని కొన్ని కోణాలను, చరిత్రలోని ముఖ్యఘట్టాలను బతుకమ్మ పాటలుగా పాడుకోవటం గమనార్హం. కాళోజీకి ఈ విధమైన సామాజిక చైతన్యం ఇష్టం. అందుకే బతుకమ్మ పండుగను ఇష్టపడేటోడు.

కాళోజీకి దేవాలయాల సందర్శనాలు, పూజలు, పునస్కారాలు, జంధ్యాలు మొదలైనవి ఉండేవి కావు. కాళోజీ ఇంట్లో కులమతాలు మడి ఆచారాలు ఉండేవి కాదు.

కాళోజీ తన ఆత్మకథను "ఇదీ నా గొడవ" అని రాసుకున్నడు. "మొదటి ప్రపంచ యుద్ధంతో పాటు నేను భూమి మీద పడిన. అది 09-09-1914". అని తన జనన వివరాలు తెలిపిండు. కాళోజీ రట్టహళ్ళి అనే ఊర్లో పుట్టిండు. ఇది బీజాపూర్ జిల్లాలో ఉంది. ఈ ఊరు కర్ణాటక ప్రాంతంలోని పాత బొంబాయి ప్రెసిడెన్సీ కింద ఉండేది. కాళోజీ చిన్నతనంలో వీళ్ళ కుటుంబం కొన్నేండ్లు మహారాష్ట్రలోని 'సాయిరాం' గ్రామంలోను, కొంతకాలం తెలంగాణాలోని ఇల్లెందు తాలూకా 'కారేపల్లి' గ్రామంలోను నివసించింది. 1917 వరకు కాళోజీ కుటుంబం హన్మకొండలో ఉండేది. తర్వాత మడికొండకు మారటం జరిగింది. తర్వాత కాళోజీ అన్న రామేశ్వరరావు న్యాయశాస్త్రం చదవడానికి హైద్రాబాద్ పోవలసి వచ్చింది. దాంతో కాళోజీ పాతబస్తీలోని చౌమహల్లా కాన్గీబడిల సెకండ్ ఫారంలో చేరిండు. తరువాత సుల్తాన్‌బజార్‌లోని రెసిడెన్సీ మిడిల్ స్కూల్‌లో చేరిండు. ఉన్నత విద్యకోసం 1934 ఏప్రిల్ నెలలో వరంగల్ కాలేజ యేట్ హైస్కూల్‌లో ఇంటర్మీడియట్‌లో ప్రవేశించిండు. 1939లో 'లా' పూర్తి చేసిండు. 1940లో గవిచెర్ల గ్రామానికి చెందిన రుక్మిణిని పెళ్ళి చేసుకున్నడు.

కాళోజీకి విద్యార్థి దశలోనే 'ఖతర్‌నాక్ ఆద్మీ' అనే ముద్ర పడ్డది. ఈ ఖతర్‌నాక్ తనం అంతా కూడా అన్యాయాన్ని,

అవినీతిని, ముఖ్యంగా నిజాం అరాచకాలను ఎదిరించడానికే మరి! అప్పుడే విలక్షణమైన ఆలోచనలలో ఉండేటోడు. వాటిని ఆచరించాలనే పట్టుదల ఉన్నోడు కాళోజీ.

చిన్నప్పుడు తల్లి రమాబాయి చెప్పిన వీరసావర్కర్ కథ, ఇతర మరాఠీ వీరుల కథలు, తండ్రి కాళోజీ రంగారావు చెప్పిన ప్రహ్లాద చరిత్ర కాళోజీకి మనసులో చెరగని ముద్ర వేసినై. ప్రహ్లాద చరిత్ర కథలో ప్రహ్లాదుని పాత్ర కాళోజీకి నచ్చిన పాత్ర. ఎందుకంటే తండ్రి హిరణ్య కశిపుడు నిరంకుశతత్వం గల వాడు. అతని నిరంకుశత్వాన్ని పసి వయసులోనే ఎదిరించిండు ప్రహ్లాదుడు. అన్యాయాన్ని మొండితనాన్ని ఎదిరించడంలో ప్రాణాలకు తెగించి నిలబడ్డాడు ప్రహ్లాదుడు. ఆ ధైర్యం, స్థైర్యం కాళోజీకి బాగా నచ్చాయి. ప్రహ్లాదుడు అన్యాయాన్ని ఎదిరించాడు. అన్యాయాన్ని ఎదిరించిన దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసిన శ్రీహరే తనకు ఆరాధ్య దైవం అన్నాడు. అందుకే ప్రహ్లాదునిలాగా అన్యాయాన్ని ఎదిరించడంలో అతడు తండ్రైనా, రాజైనా, ప్రభువైనా, అధికారియైనా సరే నిర్భయంగా ఉండాలనేది కాళోజీ తత్వం.

కాళోజీ ముక్కుసూటి మనిషి. అతనికి భయాలు, సంకో చాలు లేవు. ఎదుటివాడు ప్రాణ స్నేహితుడైనా సరే, దేవుడైనా సరే లెక్క చేయడు. తాను అనదలచుకున్నది అనేస్తాడు. తాను చెప్పదలచుకున్నది చెప్పేస్తాడు. అడగాలనుకున్నది అడిగే స్తాడు.

కాళోజి తల్లికి కన్నడం, మరాఠీ భాషలు వచ్చేవి. తండ్రికి మరాఠీ రాదు ఉర్దూ వచ్చేది, హిందీ తెలుసు. అప్పుడు అమ్మ మరాఠీలో నాన్న ఉర్దూలో మాట్లాడుతూ అర్థం చేసుకొనే వాళ్ళు. మరి పిల్లలకు తల్లిదండ్రుల మాతృభాషలైన ఉర్దూ, మరాఠీ రెండూ మాతృభాషలైతే, తోటి వారితో తెలుగులో మాట్లాడేటప్పుడు తెలుగు కూడా మాతృభాషే అయ్యింది. ఈ విధంగా కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణా ప్రాంతాలలో కాళోజీ బాల్యం గడిచినందువల్ల మూడు భాషలల్లో ప్రావీణ్యం ఏర్పడింది.

ఆర్యసమాజం, హిందూ మహాసభ, గ్రంథాలయో ద్యమం మొదలగు కార్యక్రమాలు కాళోజీని బాగా ఆకర్షించినై. తెలంగాణాలోని గ్రామీణ వ్యవస్థ గురించి, నిజాం పరిపాలనా విధానం చాలా వివరంగా కాళోజీ రికార్డు చేసిండు. ముస్లింలలో కూడా ఎక్కువ తక్కువలు ఎట్లా ఉండేవో వివరించిండు. గ్రంథాలయోద్యమాన్ని చూసి బెదిరిపోయిన నైజాం సర్కార్ "గస్తీ నిషాన్ తిర్‌పన్" (రాజపత్రం నెం. 53) జారీ చేసింది. ఇది వాక్స్వాతంత్ర్యాన్ని నిరాకరించింది. దీంతో ప్రజలు తమ కష్ట సుఖాలు ఎవరికీ చెప్పుకోలేని వారయ్యారు.

బ్రిటిష్ ఇండియాలో కొనసాగిన స్వాతంత్ర్యోద్యమం తెలంగాణాలో కూడా ప్రారంభమైంది. క్విట్ ఇండియా ఉద్యమంలో తెలంగాణా ప్రజలు పాల్గన్నరు. నైజాంలో బాధ్యతాయుత ప్రభుత్వ పాలన కావాలని కోరారు. ఈ ఉద్యమాలన్నింటిలోనూ కాళోజీ పాలుపంచుకున్నరు. కాంగ్రెస్ జెండాలు ఎగరేసేవారు. బ్రతికినంతకాలం ప్రజల కొరకు వివక్షపై పోరాటం చేసిండు. ఉద్యమకారునిగా, కవిగా పేరొం దిన కాళోజీ వ్యక్తిత్వం, స్వేచ్ఛ అనే రెండు ప్రధాన విషయాలను మనిషి కోల్పోకూడదని చెప్పిండు. నిర్భయంగా మాట్లాడటం ఆయన స్వభావం దీనికి ఉదాహరణగా 1948లో జరిగిన ఈ సంఘటన నిలుస్తుంది. "వరంగల్ సెంట్రల్ జైల్లో కాళోజీ తదితరులు ఉన్నరు. అప్పుడు బురుజు మీద ఉన్న ఒక పోలీసు రాత్రి ఎనిమిది గంటల సమయంలో వీళ్ళను ఉద్దేశించి "తుపాకీతో వీళ్ళను కాల్చి చంపినా పాపం లేదు" అని అక్కసు వెళ్ళగక్కిండు. అది విన్న కాళోజీ అతని దగ్గరకు పోయి "ధైర్యముంటే కాల్చవోయ్ అని సవాల్ చేశాడు. ఆ సమయంలో మిగతా ఖైదీలందరూ భయపడ్డరు." కానీ కాళోజీ ఇట్లాంటి సందర్భంలో వెనుక ముందులు చూడడు. ఇదీ ఇతని నిర్భీతి.

కాళోజీ జీవితాంతం ప్రజాస్వామ్య వాదిగా ఉన్నడు. "నీ అభిప్రాయాన్ని స్వేచ్ఛగా ప్రకటించే నీ హక్కుల కోసం అవసరమైతే నా ప్రాణాలైనా ఇచ్చి పోరాడుతా" అన్న మాటాల్ని కాళోజీ ఎప్పుడూ గుర్తు చేసేవాడు. ఆ మేరకు బతికాడు. అందుకే మహాకవి శ్రీశ్రీ కాళోజీని ఫ్రెంచి కవి "లూయీ ఆరగాన్" తో పోల్చాడు. 1953లో మహబూబ్‌నగర్ జిల్లా అలం పురంలో జరిగిన 'నా గొడవ' పుస్తకావిష్కరణ సభలో ఈ మాట అన్నాడు. యుద్ధంలో ఫ్రాన్స్ కవులంతా పారిపోతే లూయీ ఆరగాన్ ఒక్కడే దేశంలో నిలబడి మహా విశ్వాసాన్ని వెల్లడించే గీతాలు రాశాడు. కాళోజీ కూడా అలాంటి వాడేనని శ్రీశ్రీ ఉ ద్దేశం. నిజమే ! తెలంగాణ ఇటీవలి కాలం దాకా ఒక యుద్ధ భూమి. అందులో నిలబడి కాళోజీ ప్రజలవైపుగా కవిత్వం విని పించిండు. నిజాంను ఎదిరించిండు. నిరంకుశ ప్రభుత్వాల్ని ధిక్కరించాడు. అందుకే ఆయన ఉద్యమ కవి.

"మా నాయినది గాంధీ సూఫీతత్వం. అంటే మత సామ రస్యం. సాధు సత్పురుషుడని హిందువులస్తరు, ముస్లింలస్తరు. మా నాయన ముస్లింల సెయింట్స్‌ని, హిందూ సాధువులని కలిసేవాడు. ఆయనకు కుల పట్టింపుల్లేవు. అట్లాంటి వాతా వరణంలో పెరగడం వల్ల మాకూ ఈ రకమైన భావాలు ఏర్ప డ్డాయి". అని కాళోజీ చెప్పుకున్నడు. అందుకే ఏదో ఒక మతం పక్షాన ఆయన ఎప్పుడూ కన్పించలేదు.

కాళోజీ కవి, ఉద్యమకారుడే కాదు మంచి కథకుడు కూడా. ఇతని కథల్లో స్వచ్ఛత సూటిదనం, నచ్చని విషయాలపై నిరసన స్పష్టంగా కనిపిస్తది. కాళోజీ కథలకు ఈనాటికే ప్రాసంగి కత ఉన్నది. మతం పేరిట, కులం పేరిట మనుషుల్ని హీనంగా చూడటం, అవమానించడం ఎంత దారుణమో చెప్పిండు.

మనుషుల్లోని ద్వంద్వ ప్రవృత్తి, అన్యాయమైన రీతుల్ని తెలియ జెప్పిండు. వ్యంగ్యం, హేళనలతో సాగిన కథ 'విభూతి లేక ఫేస్ పౌడర్'. ఇందులో అలంకరణ పట్ల రాజకీయాల్లో పరి పాలనలో అవకతవకల్ని, అక్రమాల్ని ఇప్పుడు కూడా చూస్తున్నాం. తెలంగాణలో 1940 నాటికి ఉన్న రాజకీయ వ్యవస్థ శైశవ దశలో ఉంది. ఒకరిని మించి ఒకరు కుట్రలు, కుతం త్రాలతో, లౌక్యంతో రాజ్యపాలన సాగింది. ఈ పరిస్థితులను రామాయణంలో సుగ్రీవుడు, విభీషణుడు మొ॥ వారి ఉదం తాలకు ముడిపెట్టి రాసిన కథ 'లంకా-పునరుద్ధరణ'. దీనిపై విసిరిన వ్యంగ్యాస్త్రమే ఈ కథ. రాతి బమ్మకు గుడి కట్టించే విషయంలో ముందుకు వచ్చిన ప్రజలు, ప్రాణమున్న అనాథ శిశువులపై ఆదరణ చూపించ లేకపోవటంపై విసిరిన వ్యంగ్యా స్త్రం 'భూతదయ'. కాళోజీ కథలన్నీ ఒకరకంగా రాజకీయ కథలు. వీటిలో సాహిత్య విలువలు కాపాడటానికి ప్రయత్నిం చిండు.

ఆత్మకథలు సామాజిక జీవితాన్ని సంస్కృతిని ప్రతిబిం బిస్తాయి. ఇది చరిత్ర రచనకు ఉపయోగ పడ్తాయి. పాఠకులను ఉత్తేజపరుస్తాయి. కొందరు ఆత్మకథలను ఒక క్రమంలో రాస్తారు. మరికొందరు తమ జ్ఞాపకాలను గుదిగుచ్చి శకలాలు శకలాలుగా అందిస్తారు. గతంలో తిరుపతి వెంకటకవులు, శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి, ఆచంట జానకీరాం, డాక్టర్ సంజీవదేవ్, తిరుమల రామచంద్ర, శ్రీశ్రీ, జి.కృష్ణ మొదలగు వారు తమ జ్ఞాపకాలను పాఠకులకు ఆత్మకథలుగా అందిం చారు. అటువంటి జ్ఞాపకాల సంపుటే కాళోజీ రాసిన "ఇదీ నా గొడవ" వీటిని ఇంగ్లీషులో మెమో అంటాం. ఈ పదాన్ని మెమ్మోర్స్ అని ఉచ్ఛరించాలి. కానీ, చాలామంది మెమోయిర్స్ అంటున్నారు.

ఇక కాళోజీ 'ఇదీ నా గొడవకు' వస్తే నిజానికి ఇది ఆయన రాసింది కాదు. ఆయన చెప్పిన విషయాలు రికార్డు చేసిన కేసట్ల ఆధారంగా రూపొందింపబడిన ఆత్మకథ ఇది. తూర్పు మల్లారెడ్డి, ఎ.బి.కె. ప్రసాద్, వాసుదేవరావు, స్మైల్ మొదలగువారు వేర్వేరు సందర్భాల్లో 1985లో కాళోజీ జ్ఞాపకాలను రికార్డు చేసింద్రు. స్వేచ్ఛాసాహితి ప్రచురణగా ఈ పుస్తకం 'ఇదీ నా గొడవ'గా సెప్టెంబర్ 1995లో ప్రచురిత మైంది.

"ఇది నా జీవిత కథ. ఇందులో ఒక క్రమపద్ధతి లేదు. తారీఖులు, దస్తావేజులు లేవు. మా కుటుంబం, స్నేహం, సంఘం, సాహిత్యం, రాజకీయాలు- వీటి వూసులే వుంటాయి" అంటూ ఈ ఆత్మకథ ప్రారంభమౌతుంది.

"మా ఇంట్ల ఒక బీరువా ఉంటది. దాంట్ల ఒక అరల కాగితాలు, బట్టలు, నా వస్తువులు అనదగ్గవి ఉంటయి. మా ఇంటికి రోజూ వచ్చే వారెవరికైనా తెలుసు. రామశాస్త్రికి చెప్తే పంపిస్తడు." ఈ మాటలను బట్టి కాళోజీ వ్యక్తిగత ఆస్తిలేని నిరాడంబరుడు అనేది తెలుస్తుంది. నిజానికి కాళోజీ 'సొంత ఆస్తి రద్దుకావాలనే కమ్యూనిస్టు కాదు. ఎక్కడికి వెళ్ళినా, ఎక్కడికి వచ్చినా, ఎక్కడ తిరిగినా - ఈపూట ఇక్కడ తింటే రాత్రికెక్క డనో, ఈ రాత్రి ఇక్కడుంటే రేపెక్కడనో ఆయనకే తెలియదు. ఆచరణకు, ఆదర్శానికి ఏమాత్రం తేడా లేని జీవితం ఆయనది.

కాళోజీ అన్నకు ఏడు సం॥ వయసున్నప్పుడు అతడు ఏడు నెలల పసికూన. అప్పుడు అన్న భుజాల మీద ఎక్కి ఆడిన తమ్ముడు తనకు ఎనభై ఏండ్లు వచ్చినా అన్న అండలోనే కొనసాగిండు. అన్న రామేశ్వరరావు కూడా కవి. ఆయన ఉర్దూలోనూ, హిందీలోనూ కవిత్వం రాసేటోడు. తన 14వ ఏట నుండే కుటుంబ సంరక్షణ భారాన్ని భుజాల మీద వేసు కున్నడు. వృత్తిలో అడ్వకేటు. కాళోజికి సొంత ఇల్లుకానీ, విడిగా కిరాయి ఇల్లుగాని లేవు. అన్న రామేశ్వరరావు ఇంట్లోనే ఉండే టోడు. కాళోజీని పోషించి అతని బాధ్యత పూర్తిగా మోసింది అన్న రామేశ్వరరావే. రామేశ్వర రావు ఎంత సిస్టమేటిక్‌గా పద్ధతిగా జీవితం గడిపేవారో, కాళోజీ దానికి పూర్తిగా వ్యతిరేకం. కాళోజీ స్నేహితులు, కవులు, కళాకారులు అందరూ అన్న రామేశ్వర రావుకు అతిథులే. తమ్ముడిపై ఉన్న అనురాగంతో కాళోజీని అన్న రామేశ్వరరావు ఎప్పుడూ ఏమీ అన్లే. ఆంక్షలు విధించ లేదు. అతని భావాలపై కార్యక్రమాలపై విమర్శించలేదు. ఉద్యమాలలో పాల్గనవద్దని శాసించలేదు. ఆ అన్నదమ్ముల అనుబంధం అంత గొప్పది.

మరి తమ్ముడో ప్రపంచం గొడవను నా గొడవగా రచిం చిన 'నా గొడవ' అనే కవితా సంపుటిని తనకు ప్రాణమైన అన్నయ్యకు అంకితం ఇస్తూ ఇలా అన్నాడు.

**"ఎన్నేండ్లు వచ్చినను చిన్నవాడినంటచు**
**అతి గారాబము తోడ అన్ని సమకూర్చుచును**
**ఆటలకు పాటలకు అవకాశమిచ్చిన**
**అన్నయ్యకు నా గొడవ అంకితము చేతు"**

అనే ఆప్యాయతా అనురాగాల బంధం ఈ అన్న దమ్ముల అపురూప బంధం.

నాటినుండి నేటివరకు గొప్ప ప్రజాస్వామిక వాదిగా, ప్రజల హక్కులకై పోరాడిన వీరునిగా ప్రజా హృదయాలలో చెరగని ముద్ర కాళోజీ.

కాళోజీ మాటల్లో...

"తిరుగుబాటు చేసినవాడు, దౌర్జన్యాలను ఎదుర్కొన డానికి ప్రయత్నించినవాడు - ప్రతి నరుడు నరసింహుడే. తిరుగుబాటే బతుకు అయిపోయే పరిస్థితి ఏర్పడడానికి బాధ్యత - సంపూర్ణ బాధ్యత ప్రభుత్వానిదే" అంటూ ఈ క్రింది

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



కవితా పంక్తులతో కాళోజీ తన ఆత్మకథను సశేషంగా ముగించారు.

**"అన్యాయాన్నెదిరిస్తే నాగొడవకు సంతృప్తి**
**అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి**
**అన్యాయాన్నెదిరించినవాడే నాకారాధ్యుడు"**

అనే ప్రజాకవి, తెలంగాణా కీర్తికిరీటంగా వెలిగే వైతాళికుడు కాళోజీ నారాయణరావు గారు.

కాళోజీ వ్యక్తిగతంగా ఏదీ ఆశించలేదు. జీవితమంతా ప్రజల కోసమే ఆలోచించాడు. ప్రజల బాగోగులు పట్టించుకున్నాడు. అందుకే కాళోజీ ప్రజల మనిషి ప్రజాకవి. జయప్రకాశ్ నారాయణ్ మరణించినపుడు కాళోజీ అన్న మాటలు.

"పుటక నీది, చావునీది, బతుకంతా దేశానిది" ఈ మాటలు సరిగ్గా కాళోజీకి కూడా వర్తిస్తాయి అనడం అతిశయోక్తి కాదు. తన మరణానంతరం తన భౌతిక దేహం వైద్య విద్యార్థుల పరిశోధనకు ఉపయోగ పడాలని ఆశించిన మహామనిషి కాళోజీ. 2002 నవంబర్ 12న చివరి శ్వాస విడిచిన కాళోజీ జీవితంలో ప్రతి నిముషం, ప్రతి క్షణం దేశక్షేమం, ప్రజాక్షేమం కోరి ఉద్యమమే ఊపిరిగా బ్రతికిన వాడు. తన మరణంలోనూ సమాజాన్ని బ్రతికించినవాడు.

కాళోజీ, నా గొడవ, అణాకథలు, కాళోజీ కథలు, కాళోజీ కవితలు, తెలంగాణ భాష- బతుకు, తుది విజయం మనది, నా భారత దేశయాత్ర, బాపూ-బాపూ-బాపూ, జీవనగీత, పార్థివ వ్యయము, తెలంగాణా ఉద్యమ గీతాలు మొదలగు రచనలు చేసిండు. ఈ తెలంగాణా ముద్దుబిడ్డకు భారత ప్రభుత్వం 'పద్మవిభూషణ్' గౌరవాన్ని అందించింది. స్వాతంత్ర్య సమర యోధునిగా తామ్రపత్రం ఇచ్చి గౌరవించింది. కాకతీతా విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేటు ప్రదానం చేసింది. రామినేని ఫౌండేషన్ అవార్డు గాడిచర్ల ఫౌండేషన్ అవార్డులు అందించారు. కాళోజీకి ఈ సత్కారాలు అవార్డులు అన్ని కూడా చంద్రునికో నూలుపోగు వంటివే.

కాలం నాలుకపై నిలబడ్డవాడు, తన సామాజిక జీవితం ద్వారా ఆయనిచ్చిన భావ ప్రసారం ముందుతరాలకు శక్తి నిస్తుంది. ఆయన జీవితం కవిత్వం భావితరాలకు ఆదర్శం. నా గొడవ సాహితీలోకంలో సువర్ణాక్షరాలలో నిలుస్తుంది. కాళోజీ జన్మధన్యం, అతని జన్మమమరం అతనికి లేదు మరణం. 2014- జూన్ 2న తెలంగాణ రాష్ట్రం సిద్ధించింది. ఏ లోకంలో ఉన్న తెలంగాణా ఉన్నతిని కాంక్షించి దీవించే ఆ కవిశిరోమణి ఆశలు పండినాయి. సంకల్పం సిద్ధించింది, ఆశలు, ఆశయాలు నెరవేరుతున్నాయి.

తెలంగాణా ప్రభుత్వం ప్రత్యేకంగా కాళోజీ జయంతిని 'సెప్టెంబర్-9' ని తెలంగాణా మాండలిక భాషా దినోత్సవంగా అధికారికంగా జరుపుకోవడం అతని సేవలకు మనం ఇచ్చే నివాళిగా చెప్పుకోవచ్చు. కాళోజీ పుట్టినరోజున తెలంగాణా రాష్ట్రంలోని అన్ని పాఠశాలల్లో కళాశాలల్లో తెలంగాణా తెలుగు భాషా దినోత్సవ వేడుకలు జరుపుకుంటున్నాం. ఈ సందర్భాన్ని పురస్కరించు కొని విద్యార్థినీ విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుంది. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు తిరిగి జిల్లాస్థాయిలో పోటీలో పాల్గనే అవకాశం ఇస్తారు. గెలుపొందినవారికి బహుమతి ప్రదానం కూడా చేస్తారు.

ఇప్పుడు తెలంగాణాలో కాళోజీ గురించిన విషయాలు తెలియని విద్యార్థి లేదంటే అతిశయోక్తి కాదు. కాళోజీ ప్రత్యేకమైన వ్యక్తిగా ప్రజా హృదయాలలో నిలిచిపోయిన వ్యక్తి. అతనికి ఉచ్ఛ్వాస, నిశ్వాసలు తెలంగాణా ప్రాంతం, తెలంగాణా భాష. ఈ రెండింటికి సంబంధించి ఎవరు ఏమన్నా సరే కాళోజీ సహించడు. ధర్మంవైపు న్యాయంవైపే నిలబడి నిలదీస్తాడు.

పాఠ్యపుస్తకాలలో కాళోజీ పాఠం చేర్చడం గమనార్హం. కాళోజీ జీవితాంతం సమ సమాజ స్థాపనకు పోరు సలిపిన వీరుడు. వివక్షను అణచివేయడానికి, ప్రజా క్షేమానికై అతని జీవితాన్ని త్యాగం చేసిండు. ఆ త్యాగాన్ని నోటిమాటల్లో వివరంగా చెప్పలేం.

అతని జీవితాంతం ప్రజల గొడవను 'నా గొడవ' గా చేసుకొని జీవించిన నిరాడంబర, నిస్వార్థ, నిరాపేక్ష గల సుకవి, ప్రజాకవి కాళోజీ. తెలంగాణాలో పొద్దుపొడుపు సూర్యుడతడు. తెలంగాణ ప్రజలుగా మనం అతని ఆశలు ఆశయాలు నిలబెట్టాలె. తెలంగాణ భాష, యాస సంస్కృతిని బ్రతికించాలె. వాటికి అన్ని రంగాలలో సమ ప్రాధాన్యం కల్గించాలె. అది చూసి కాళోజీ సంబురపడి మనల్ని దీవించాలె. అదే ఆ కవికి మనమిచ్చే నివాళి. జై తెలంగాణ, జై జై తెలంగాణా...

**ఆధార గ్రంథాలు :**

1. తెలుగు సాహిత్య చరిత్ర - తెలుగు విశ్వవిద్యాలయం-హైద్రాబాద్.
2. తెలుగు విజ్ఞాన సర్వస్వము - 3వ సంపుటి తెలుగు విశ్వవిద్యాలయం-హైద్రాబాద్.
3. నారాయణరెడ్డి. డా॥ సి.- ఆధునిక కవిత్వం సంప్రదాయములు, ప్రయోగములు, హైద్రాబాద్ - 1967
4. నాగయ్య డా॥ జి.-తెలుగు సాహిత్య సమీక్ష - నవ్య పరిశోధక ప్రచురణలు - తిరుపతి -2004
5. ద్వానా శాస్త్రి డా॥ - తెలుగు సాహిత్య చరిత్ర - ప్రతిభ పబ్లికేషన్స్- హైద్రాబాద్.
6. ఆరుద్ర, సమగ్ర ఆంధ్ర సాహిత్యం - తెలుగు అకాడమీ, హైద్రాబాద్ - 2005
7. కాళోజీ - నా గొడవ

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# లంబాడీ స్త్రీల పాటల్లో సాహిత్యం-సామాజిక అంశాల విశ్లేషణ

- డా॥ లావుడ్య సుజాత,
పార్ట్ టైం అధ్యాపకురాలు, తెలుగు విభాగం, యునివర్సిటీ మహిళా పి.జి కళాశాల, సుబేదారి, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్లు.

జానపద సాహిత్యం చరిత్రకందని యుగాల నుండి మౌఖిక ప్రచారంలో జీవిస్తూ జాతి జీవన చైతన్యాన్ని క్రమ వికాసాన్ని ప్రతిబింబింపచేస్తున్నది. జానపద సాహిత్యంలో భిన్న భిన్న ప్రక్రియలున్నాయి. ఆయా ప్రక్రియాల్లో సమాజగత నియమాలు, ఆచారాలు, సంప్రదాయాలు, దైవభావనలు, స్త్రీ పురుష సంబంధాలు మొదలైనవెన్నో సమర్త, వివాహం, శోభనం, గర్భం, సీమంతం ప్రసవం, మరణం లాంటి దశల ప్రతిఫలాలు, భావ సంఘర్షణలు జానపద సాహిత్యంలో ఎంతో సమర్థవంతంగా చోటు చేసుకుంటాయి. పైన పేర్కొన్న విషయాలన్ని కూడ లంబాడీ స్త్రీల జీవితంలో జరిగే ప్రక్రియలే ముఖ్యంగా స్త్రీలే పాడుకున్న పాటలలో, చెప్పిన, కథలలో స్త్రీల హృదయా విష్కరణలు, అనుభూతులు చాలా సహజంగా కన్పిస్తాయి.

లంబాడీ సాహిత్యంలో గేయాయాల, కథాగేయాలు, కథలు ఆయా కళారూపాలు విశాలమైన పరిధిని కలిగి ఉంటాయి. అంతేగాక స్త్రీల మనోభావాలను, వ్యక్తిత్వాన్ని స్పష్టంగా వ్యక్తం చేస్తాయి. లంబాడీల సాహిత్యంలో రామాయణ, భారత భాగవతాదులకు ప్రత్యేక స్థానమున్నది. ముఖ్యంగా రాయాణంలో మానవ హృదయ స్పర్శ ఎక్కువగా ఉండటం వల్ల సీతారాములను లంబాడీలు తమ వంటి వ్యక్తులుగా భావించి ఎన్నో పాటలు పాడుకున్నారు.

**రామాయణానికి సంబంధించిన పాట :**

**బావణ బరాదెతి బాలాజీ అయొర దొరియో నాచెన ఓరిలో హుం**
**కాంకె జోలిగాలన అయొర దొరియో నాచెన ఓరిలో హుం**
**సీతరిగడేన మాంగణిన చాలొర దొరియో నాచెన ఓరిరో హుం**
**ఊటే సీత బికే డలీర దొరియో నాచెన ఓరిరో హుం**
**తాళిబరి మోతి బికే డలీర దొరియో నాచెన ఓరిరో హుం**
**జొలిమ గాలతో పాడన లెగొర దొరియో నాచెన ఓరిరో హుం**
**సాతయి సమదర్ దాటయి లెగొర దొరియో నాచెన్న ఓరిరో హుం**
**లొకండిది ఝూడ హెట మెలదినోర దొరియో నాచెన ఓరిరో హుం**
**వసెరో ఝూడ తూ సాయి ఎసర దొరియో నాచెన ఓరిరో హుం**
**పింపలెరో ఝూడతోన కాక కింయుర దొరియో నాచెన ఓరిరో హుం**
**డకడారి ఝూడ హెట తొవియ ఓరాడిర దొరియో నాచెన్న ఓరిరో హుం**
**రాండందారి ఝూడహెట లొనియ ఓరాడిర దొరియో నాచెన ఓరిరో హుం**
**వుందాలో వర్షాలో గరక హరోజరేసరే దొరియో నాచెన ఓరిరో హుం**
**కిర్కిండి దేవి పూజారే రావన దొరియో నాచెన ఓరిరో హుం**
**లంకన రావన హడన లెగొర దొరియో నాచెన ఓరిరో హుం**

ఆ పాట మాములుగా బతుకమ్మ(తీజ్) పండుగ సందర్భంలో, పెళ్ళి సందర్భాలలో లంబాడీ స్త్రీలు పాడుకుంటారు. రావణుడు వర్ణశాలలో ఉన్న సీతను ఏ మాయోపాయంతో ఎత్తుకొని పాయాడో ఈ పాటలో చిత్రింపబడింది.

పై పాటలో ముందుగా తిరుపతి వేంకటేశ్వర స్వామిని స్మరించారు. ఈ పాటలో రాముడు లేని సమయంలో రావణుడు చంకకు జోలె వేసుకుని భిక్షాటనకు సీత దగ్గరికి వచ్చి. ఆమె భిక్ష వేస్తుండగా మాయతో అపహరించాడు. అప్పుడు సీత ప్రకృతిలోని చెట్లను పేరు పేరునా తనని కాపడుమని వేడుకుంటుంది. గడ్డి పోచను ఎల్లప్పుడు పచ్చగా ఉండేటట్టు సీత దీవించటం వల్లనే ఎండాకాలంలో కూడ పచ్చగా ఉంటుందనేది లంబాడీ ప్రజల నమ్మకం. ఈ విషయం సీతమ్మ దుఃఖాన్ని తెలిపే పై పాటలో పేర్కొనబడింది. భారతీయ సంస్కృతికి మూలస్తంభాలుగా నిలిచిన రామాయణం, మహాభారతం, భాగవతాదులపట్ల, అందులోని పాత్రలపట్ల లంబాడీలకు ప్రేమాభిమానాలు అధికం, వారి హృదయాలలో రామలక్ష్మణులు ఆదర్శ వ్యక్తులుగా నిలిచిపోయారు. అందుకే రామయణ గాథలను ఆధారం చేసుకొని తీజ్ పండుగ సందర్భంలో లంబాడీ స్త్రీలు ఎన్నో పాటలు పాడుకుంటారు. అందులో భాగమే పై పాట.

గిరిజనులు గొప్ప కల్పనా చాతుర్యం, ఊహాశక్తి కలిగిన వారు. అందుకే మూలంలో లేని సంఘటనలను కల్పించి ఔచిత్యాన్ని పాటిస్తారు. సీతమ్మ తనను రావణుడు అపహరించుకొనపోతున్నప్పుడు పక్కనున్న 'శీత్కల' చెట్టుతో తన బాధ రామునికి చెప్పమని వేడుకుంది. అలా చేస్తే నీ పేరు సీతాఫలంగా యారి నీ పండు ప్రజలంతా ఆనందంతో తింటారనే వరమిచ్చినట్లు పై పాటలో పేర్కొనబడింది.

లంబాడీలు మర్రి చెట్టు క్రింద పొడుగ్గా ఉండే రాయిని పెట్టి పసుపు కుంకుమలు చల్లి దేవతగా కొలుస్తారు. ఎందు

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



కంటే సీత తనను కాపాడుమని మర్రిచెట్టును మొక్కడ మూలానే అది పూజింపతడినది, వీరి నమ్మక అందుకే ఈ పాటలో ఈ విషయం తెలుపబడింది. అంతేకాక మోదుగు చెట్టు క్రింద కూడ రామునికి తెలిపే విధంగా తన అసవాలుం చిందని కూడ పాడుకుంటారు.

పై పాటలో లంబాడీలకు ప్రకృతిపట్ల ఉండే నమ్మకం ఎంత బలమైందో మనకు అవగతమవుతుంది. ఇక్కడ సీతమ్మ కష్టాలను కరుణ రసాత్మకంగా వర్ణించారు. సామన్య స్త్రీ అనుభ వించే కష్టాలన్నింటినీ సీతమ్మకు ఆపాదించి ఈ పాటలో వర్ణిం చారు. ఈ విధంగా రామాయణంలోని ప్రతి సంఘటనకు కూడ వీరు తమ జీవితంలో సమన్వయించుకొని ఎన్నో పాటలు పాడుకుంటారు. ఆ పాటలు వారి జీవితాలను ప్రతిబిం బిస్తాయి.

**కుటుంబానికి సంబంధించినపాట :**

గిరిజన సాహిత్యంలో స్త్రీల పాటలకు ఎంతో ప్రాముఖ్యం ఉంది. తరతరాలుగా నాగరికతలో మార్పులు ఎన్ని వచ్చినా ఆ ప్రభావానికి లోనుగాకుండా వారి ఆచార సంప్రదాయాలను కాపాడుకుంటున్నారు. అందుకు స్త్రీల పాటలు ఎంతగానో ఉపకరిస్తున్నాయి. వారి మనస్తత్వాన్ని హృదయ భావుకతను వ్యక్తం చేయటంలో ఆయాపాటలు ప్రధానపాత్ర వహిస్తాయి.

మానవ జీవితాన్ని ప్రతిబింబించే సాహిత్యం స్త్రీల సాహిత్యమని చెప్పటంలో అతిశయోక్తి లేదు.

అన్నా చెల్లెండ్ల అనురాగం ఎంతో పవిత్రమైంది. పెళ్ళి అయిన తరువాత అత్తవారింట్లో ఉంటున్న చెల్లెలును చూడటానికి వచ్చిన అన్నతో చెల్లెలు తన కష్టాలను ఈ రకంగా చెప్పుకుంటుంది.

**"మోటి బ్యానెన డంబు దినో వీరణ**
**నాన్కి బ్యానెన గణమ్ దినొర**
**గణను దినొతో కాంయి కిదో బాయి**
**సొన రూప డళరేచ**
**తారే సొనే రుపెన కాంయికరు వీరణ**
**మారె మాంయి శారపడరేచ**
**అవడి కరోద మత కర బాయి**
**దపె దపెమ కుయలో కొదాంయు**
**బాయి తారి కబరె లేవు కరింయు**
**మళెవాళ రసతొ మళలె బాయి**
**సాతెరి సొబతి చాళో**
**నూతెపర లాలి రంగపాకడి**
**కాందెపర బరిఏ బందుకడి**
**జమరి జొలిరొ అంటో దినో వీరణ**
**పొకటి పటారెపర మరో వీర చాకన వళకుచు"**

అన్నతో చెల్లెలు, అక్కను తన ఊరికి దగ్గరగా తనను తన ఊరికి చాలా దూరంగా ఉండే ప్రాంతానికిచ్చి పెళ్ళి చేశారని, తనను దూరంగా ఇచ్చినందుకు బంగారం, వెండి నగలు మొదలైనవి ఎన్నో రకాలు వస్తువులు ఇచ్చారని, అవి తానేమి చేసకుంటానని దుఃఖిస్తుంది. తాను అత్తవారింట్లో కష్టాలుపడుతున్నా తనను కనీసం చూడడానికైన రాలేదని బాధపడుతుంది. అప్పుడు అన్నా, చెల్లెలితో దిగులు పడవద్దని ఇకనుండి అడుగడుగునా ఆమె క్షేమాలు తెలుసుకుంటానని ఓదారుస్తాడు.

అప్పుడు అన్నతో చెల్లెలు తలపై ఎర్రని రుమాలు, భుజంపై తుపాకి, అతడు వేసుకున్న అంగి (షర్టు) చూసి, అతడు ఎంతమందిలో ఉన్నా గుర్తు పడతానని మళ్ళీ మళ్ళీ రమ్మని వేడుకుంటుంది.

కొద్ది కాలం క్రితం వరకు లంబాడీ తెగల్లో కన్యా శుల్కం ఆచారం ఉండేది. మగపెళ్ళివారు ఆడపిల్ల (పెళ్ళి కూతురు) తల్లిదండ్రులకు కోడెలను శుల్కంగా కన్యకు ఇచ్చే వారు. కాని పై పాటలో తమ చెల్లెల్ని దూరంగా ఇచ్చినందుకు ఆమె బాధపడకూడదని సుఖంగా ఉండాలని ఇవన్నీ ఇస్తాడు ఆమె అన్న మామూలుగా ఆడపిల్లల్ని ఊరికి దగ్గరగా ఇచ్చి నప్పటికి చూసిపోవటానికి తమ అన్నలు, పుట్టంటివారు రాకుంటే దుఃఖిస్తారు. అటువంటిది దూరంగా ఉన్న చెల్లెల్ని చుట్టపు చూపుకైన వెళ్ళకుటే ఆమె ఎంతగానో దుఃఖిస్తుంది. కొన్ని కారణాల వల్ల అత్తింటివారికి పుట్టింటి వారికి మధ్య అభిప్రాయ భేదాలు రావటం వల్ల రాకపోకలకు కూడ అను కూలముండదు. అప్పుడు ఆ స్త్రీ బతుకు చివరికి ఆడకత్తెరలోని పోకచెక్కలాగా అవుతుంది. పరిస్థితి చక్కబడితేనే ఇరువైపు వాళ్ళు ప్రశాంతంగా ఉంటారు. ఇక నుండి ఆమె యోగ క్షేమాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటానని, ఆమెకు ఏ కష్టం రాకుంటా చూసుకుంటానని ధైర్యం చెప్పి చెల్లెల్ని అన్న ఓదార్చినట్లు పై పాటలో చెప్పబడింది. అంతేకాక ఈ పాటలో ఆడపిల్లలకు తమ అన్నల మీద ఉండే అధిక ప్రేమాను రాగాలు వ్యక్తమైనాయి. సమాజంలో ప్రతి తెగ, జాతి, కుల మతాలలో అన్నా చెల్లెళ్ళ మధ్య ఎంతో అనురాగం ఉంటుంది. పై పాటలో అటువంటి సామాజిక జీవితమే చిత్రింపబడింది.

**ఏలెమ ఏలె మారి కంకొడారి ఏల్ ఓలేడి**
**సెవారి ఓలేడిమ పులాసి నార్రై ఓలేడి**
**ఏలెమ ఏలె మారి కంకొడారి ఏల్ ఓలేడి**
**దండిరి ఓలెడిమ తీజెరి నార్రై ఓలేడి**
**ఏలేమ ఏలె మారి కంకొడొరి ఏల్ ఓలేడి**
**సుకారి ఓలెడిమ సులాసి నార్రై ఓలేడి**
**ఏలేమ ఏలె మారి కంకొదారి ఏల్ ఓలేడి**
**జెతారి ఓలెడిమ సొనేది నార్రై ఓలేడి**

లంబడి స్త్రీలు ఈ పాటలను తీజ్ పండుగ సమయాల్లో పాడుతారు. తీజ్ మీద నీళ్ళు పోయటానికి, నీళ్ళకోసం చెరువుకు వేళ్ళేటప్పుడు నీళ్ళు తెచ్చి తీజ్ మొలకల మీద పోసేటప్పుడు అమ్మాయిలంతా ముక్తకంఠంతో ఈ పాటలను పాడు కుంటారు.

ప్రకృతి ఒడిలో నివసించే లంబాడీ ప్రజలు ప్రకృతిని అమితంగా ప్రేమిస్తారు. ఆరాధిస్తారు. ఈ పాటలో బోడకాకర లేదా అడవి కాకర గురించి పాడతారు. ఆ బోడకాకర కాయ తీగను దండి జేతబాయ సేవభాయ, సుకబాయలనే దేవతలు నాటి నారు కనుకనే ప్రతీ సంవత్సరం అదే స్థానంలో పెరగడం వాటికి కాయలు కాయడం అవి ఎంతో రుచిగా ఆరోగ్యవంతంగా ఉంటాయని వీరి నమ్మకం.

**దండియారిరో కాడు భలో బాజు బిజగో**
**కాడుమ కాంయి కలే బాజు బిజగో**
**కాడుమ సాండియా కలే బాజు బిజగో**
**సాండియాన సింగ్ కలే బాజు బిజగో**
**సింగెన సింగడి కలే బాజు బిజగో**
**మరెన పటేడి కలే బాజు బిజగో**
**పగలానే పింజని కలే బాజు బిజగో**
**సేవ బాయరో కాడు భలో బాజు బిజగో**
**కాడుమ కాంయి కలే బాజు బిజగో**
**డొలియాన సింగ్ కలే బాజు బిజగో**
**సింగెన సింగడి కలే బాజు బిజగో**
**మారెన పటెడి కలే బాజు బిజగో**
**పగలానే పింజని కలే బాజు బిజగో**

ఈ పాటలో దుండయాడి, సేవలాల్ (దేవుళ్ళ పేరు) పశువుల మంద భలే, ఆ మందలో ఏది భలే? మందలో కోడే భలే. కోడెకు ఎది అందం? కొడెకు కొమ్ములు అందం. కొమ్ములకు సింగడి అందమని, కోడెకు మెడలో కట్టినగంటల పట్టి అందమని, కాళ్ళక రంగు దారంతో కట్టన పట్టి అందమనే చక్కని వర్ణన, లయలు కనిస్తాయి.

లంబాడీల ప్రధాన సంపద పశువులు. వాటి సహకారం తోనే తమ జీవన ప్రయాణాన్ని సాగిస్తారు. అవే వీరికి తోడునీడ. వీరు సంచార జీవనాన్ని సాగించేటప్పుడు వారి వస్తువులను ఎద్దులపై పెట్టి తీసుకుని వెళ్ళేవారు. బరువులు మోయడానికే కాక వ్యవసాయపు పనులల్లో కూడ సహకరిస్తాయి. కనుక వీరు వీటిని ఎంతో ప్రేమగా చూసుకుంటారు గొసంపదే అసలైన సంపదగా భావిస్తారు.

**జొని బేటి సస్రెమా జాణో లాగొ తొన**
**కొని జాంపు యాడి సస్రేమ యేలా చయ్ మన**
**జాంవుని కజెర్ పచ బల్మి కసెన**
**సస్రొ ముచాలో యాడి పెటెమాయి కాళో**
**సాసు హత్ణ్ణి యాడి గాలెమెలి కాళొ**
**హతె టాంగే దాబు జన్నా పెట్ంచా గొడో వాళొ**
**నణద్ కుంవారి యాడి భాంద్ మెలి సాడి**
**భాంద్ మెలి సాడి ఉతొ లగాడచె చాడి**
**కాంయి కూంఏ యాడి మార్ నణదెరో ఖున్**
**జటాణి ఖావచె యాడి గందలా తళ్న్**
**గంద్లా ఉందున్ యాడి రస్ - పాణి మన**
**కాంయి కూంఏ యాడి జెట్ - జటాణిరో ఖున్**
**జొని బేటి సస్రెమా జాణో లాగొ తొన**

ఈ పాటలో తండ్రి తన కూతురితో అత్తవారింటికి వెళ్ళుమని బ్రతిమాలితే తాను వెల్లనని, అత్తవారింట్లో తన కన్నీ కష్టాలేనని తాను ఏకరువు పెడుతుంది. తనను బలవంతం చేయవద్దని అక్కడ మీసాల మామ, హత్ణ్ణి(పేరు) అత్తలకు కాళ్ళు పట్టాలి, పట్టేటప్పుడు కావాలని కాళ్ళు ముచు కుంటారు.చీర కట్టుకున్న ఆడబిడ్డ నాపై అన్ని చాడీలు చెపు తుంది. మా తోటి కోడళ్ళు చేప ముక్కలు తిని పులుసు నాకోసం మిగులుస్తారని ఇంకా ఏం చెప్పమంటారు. ఆ ఇంట్లో అన్ని బాధలేనని దుఃఖిస్తుంది.

చీర కట్టుకున్న అడపడుచు అని ప్రత్యేకంగా చెప్ప టంలో పట్టణ సంస్కృతి నేర్చినా కుటిల స్వభావాన్ని ఆమె మరచి పోలేదని భావం. సంసార జీవితంలోని కష్టసుఖాలను నిర్వేదాలను స్త్రీలు తాము పాటలు రూపంలో పాడుకుటారు. అత్తామామల వేధింపులు, బావా మరదళ్ల సరసాలు, భార్యా భర్తల శృంగారాలు, సవతుల కయ్యాలు, అక్కాచెల్లెండ్ల అను రాగం, అన్నా చెల్లెండ్ల అనుబంధం వీరి పాటలో వస్తువు లైనాయి.

పుట్టనప్పటి నుండి పెళ్ళి అయ్యేంతవరకు తల్లి దండ్రుల నీడలో స్వేచ్ఛగా పెరిగిన కూతురు పెళ్ళి యిన తరువాత అత్తగారింట్లోనే ఉండవలసి వస్తుంది. కొత్తగా అత్త వారింటికి వచ్చిన అమ్మాయికి ఆ ఇంట్లో వాతావరణం అంతా కొత్తగా ఉంటుంది. సమష్టి కుటుంబంలో ప్రవేశించిన కొత్త కోడళ్ళు అత్త మామలకు కాళ్ళు పట్టడం అత్తకు స్వయంగా స్నానం చేయించటం మొదలైనవి లంబాడీ కుటుంబాలలో ఉంటాయి. కొత్తగా వచ్చిన పెళ్ళి కూతురికి సహకరించకపోగా, వారు ఎన్నో రకాలుగా కోడండ్లను బాధలుపెట్టడం పై పాటలో పేర్కొనబడింది.

**సారొ దాడొ నాటె గాడి సాంజె ఆన ధాన్ రాంది**
**దాన్ గిలో వేగొ కణ్ బొలి మత్ బొల్ రె**
**పొరియ తార రె పొరియ తార**
**సారొ దాడొ సాళ్ కాటి సాంజె ఆన బాటికిది**
**బాటి బళగి కన్ బొలి మత్ బొల్ రె**
**పొరియ తార రె ఘొరి వాళొ చొర**

**బొలి బొలిస్‌తో సాగునోరి ఝాడె హెట స్వగన్ ఖొరాంయురె**
**పొరియ తార రె ఘెరి వాళొ చొర**
**సారొ దాడొ ఖడ్ కాటి సాంజ్ ఆన్ నొంగాణ రాంది**
**నొంగాణ బళగొ కన్ బొలి మత్ బొల్ రె**
**పొరియా తార రె ముచెవాళొ చొర"**

పై పాటను పండుగలు, పెళ్ళి సందర్భాలలో స్త్రీలు పాడుకుంటారు. పొద్దంతా నాటేసి సాయంత్రం

ఇంటికి వచ్చి అన్నం వండితే అన్నం మెత్తగయిందని తిట్టకురో, ఓ పోరియతారా అని, భర్తను నక్షత్రంతో పోలుస్తారు. పొద్దంతా సాయంత్రం ఇంటికి వచ్చి రొట్టెలు చేస్తే రొట్టెలు మాడినాయని తిట్టవద్దని తిడితే టేకు చెట్టుక్రింద ఒట్టేయిస్తానని, పొద్దంతా పచ్చి గడ్డికోసి సాయంత్రం వచ్చి కూరవండితే, కూరమాడిందని చెప్పకురో నా మీసాల మొగుడా అని పాడిన పాటలు సామాజిక జీవనంలోని ఒడిదుడుకులను స్పష్టం చేస్తాయి. కుటుంబంలో భార్య భర్తల బంధం చాలా ప్రధానమైంది. వీరు పరస్పరం ప్రేమానురాగాలతో ఉంటెనే సంసారం సక్రమంగా సాగుతుంది.

పై పాటలో తాను పండిన అన్నం మొత్తగా అయినా రొట్టె, కూరలు మాడినా ఆ విషయాన్ని మాత్రం పదిమందికి చెప్పవద్దని, భర్తకు పచ్చని టేకు చెట్టుకింద ఒట్టేయిస్తానంటుంది. తాను కూడ ప్రొద్దంతా శ్రమిస్తుంది. కనుక తాను చేసిన పొరపాటును భర్తతన మనస్సులోనే దాచుకోవాలని కోరుకుటుంది.

సంసారంలో చిన్న చిన్న విషయాలను పెద్దవిగా చేసుకొని జీవితాన్ని పాడు చేసుకోకూడదని, అన్యోన్యత ముఖ్యమని పై పాటలో పేర్కొనబడింది. ఒక్కొక్కసారి రుచికరంగా వండినా కూర వంకలు పెట్టే భర్తలు లేకపోలేదు. ఏదిఏమైనా పై పాటలో సహజపు తీరు తెన్నులు వ్యక్తమైనాయి.

**గుమేరే గాలె గాలె హరి ఏ చారీ ఏ గుమేరె గాల్**
**గుమేరే గాలె గాలె హరి ఏ చారీ ఏ గుమేరి గాల్**
**ఏ దండిఏరీ చకరి ఏ చారీ ఏ గుమేరి గాల్**
**కాచొళేమ అంసు చూవిఏ చారీ ఏ గుమేరి గాల్**
**ఏ తీజెరో రాజ ఏ చారీ ఏ గుమేరెగాల్**

ఈ పాటను తీజ్ మొలకల మీద నీళ్ళు పోస్తూ అమ్మాయిలంతా కలిసిపాడుతారు.

"పరికిణీ వేసుకొని నృత్యం చేసే ఓ అమ్మాయిల్లారా! వీరంతా బాగా నృత్యం చేయండి. దండి వేత పిల్లలు మీరు. అందమైన దారాలతో కుట్టిన ముసుగు ధరించిన మీరు, కంచంలో కన్నీరు కార్చే మీరు, బాగా ఆడండి. ఈ తీజ్ మీ కోసమే వచ్చింది''. అని ఈ పాటలోని భావం. లంబాడీ అమ్మాయిలు సహజమైన అందంతో పాటు ఎన్నో రకాల అల్లికలు, కుట్లు కుట్టడంలో నేర్పరుల. తీజ్ వీరికి సంబంధించిన పండుగ. ఈ పండుగను వారు ఎంతో సంతోషంగా జరుపుకుంటారు. ఇంత స్వేచ్ఛగా, ఆనందంగా తాము ఎప్పుడు ఉంటామనుకుంటున్నారేమో కాని, పెళ్ళి అయిన తర్వాత పుట్టింటి వాళ్ళు ఇచ్చిన కంచంలో కన్నీరు కార్చవలసి వస్తుందనే విషయాన్ని గ్రహించాలని ఈ పాట ద్వారా జీవిత వాస్తవాలను, సాంఘిక శక్తుల స్వరూపాన్ని అర్థం చేసుకునే వీలున్నది. స్త్రీల దయనీయమైన జీవిత వాస్తవికతలను ప్రతిరూపంగా కనిపిస్తున్నాయి.

**సదా సవాద్‌సే ఏ జిబెన్ మాలమ్**
**బలి-బుండి, అచ్చే-బల్లా సె కళత న మాలమ్**
**కాళె మాంయిర్ జాంగడున్ కాంయి మాలమ్?**
**టెలె టాంపళెరో నాయకణెన, మాలమ్, డాయిన్ మాలమ్**
**అమరావతి క్వారిన్ కాంయి మాలమ్?**
**కసాపటిరో నాంద్ సాండియన్ మాలమ్, నందియన్ మాలమ్**
**గంటియా ఖోదన్ కావు నూరెన కాంయి మాలమ్?**
**పుంగిరొ నాంద్ నాగెన్ మాలమ్, సాపెన్ మాలమ్**
**పాణిమ పరజె డిండున్ కాంయి మాలమ్"**

పై పాటను పండుగల సందర్భంలో స్త్రీ పురుషులు పాడుతారు.

ఈ పాటలో "తీపి చేదు రుచుల తేడా నాలుకకు తెలుసు వంట గిన్నెల్లో తిరిగి గరిటెకేమి తెలుసు? మంచి చెడుల వివేకం జ్ఞానానికి తెలుఉ అవివేకి అయిన మూర్ఖునికి ఏం తెలుసు? ఇతరులను గౌరవించాలనేది నాయకుని భార్యకు తెలుసు. జ్ఞానం లేని స్త్రీకి ఏం తెలుసు? ఆంబోతు మెడలో గంట శబ్దం శివుని నందికి తెలుసు. బురదలో కంద మూలాలలు వెతికి తినే పందికేమి తెలుసు? నాగస్వరం ఇంపు నాగుపాముకు తెలుసు. నీటిలో ఉండే నీర్కట్టకు (పాము) ఏం తెలుసు" అనే భావం వ్యక్తీకరిచబడింది.

సమాజంలో ప్రతి మనిషికి గౌరవ మర్యాదలు, మంచి చెడులను విశ్లేషించే సామర్థ్యం తప్పక ఉండాలనే విషయం ఈ పాటలో ప్రస్తావించబడింది. భూమి మీద జీవించే ప్రతి వ్యక్తి తన జీవితానికి సార్థక్యాన్ని కలిగి ఉండాలనే విషయాన్ని భావాత్మకంగా పై పాటలో వ్యక్తం చేయబడింది.

**ఘరే ఘరేన దియ్యో జలారోఛ బాయి దోస్ కేరో వియ్యే!**
**గుగరాలో జమ్‌కో పదరోచ్ బాయి దోస్ కేరో వియ్యే**
**మారో ఖియ్యా డబ్‌డా మొలారోఛ్ బాయి బాజాకెరో వియ్యే!**
**నాగరేరి సాలేమా బీజా బోవుంబాయి కామ్‌కేరో వియ్యే**
**కామదారె బీయ్యానే హరద చుకేణి కావుకేరో వియ్యే**
**కీడిసే బాలన్ సాంపేమారి బాయి ఇమ్మత్ కేరో వియ్యే**
**గోదామె కేరి ఘర ఛరియే బాయి దోస్‌కేరో వియ్యే**

**బర్ మాదేవో పామనో అయో మారి బాయి పండరేరి ఘర**
**దేవేరి అంగళి కటాగీ మరాఇ బాయియే పండరేరి ఘర్**
**పాడ పితాంబర్ పాటో బాంది బాయియే పండరేరి ఘర్**

లోకంలో జరిగే సంఘలన్నింటికి భగవంతుడే మూల కారణమని పై పాటలో వర్ణించబడింది.

ప్రతి ఇంటిలో దీపాలు వెలగటం, గజ్జెలు మ్రోగటం, డప్పుల శబ్దం వినబడటం, నాగటి చాలులో విత్తనాలు చల్లటం, చీమలన్ని కలిసి పామును చంపటం, చీమలు పొదుపు చేయటం, ధాన్యాన్ని నిలువు చేయటం, పండరి ఇంటికి శివుడు చుట్టంగా రావటం, ఆయన వ్రేలు తెగిలే పట్టు బట్టతో కట్టుకట్టటం. ఇవన్నీ ఆ దేవుని మహిమ వల్లనే జరిగాయని ఈ పాటకు భావం.

భగవంతుని పట్ల విశ్వాసాన్ని తెలిపే ఈ పాటలో భక్తితో తనను ఆరాధించిన వారికి ఎటువంటి కష్టం కలుగకుండా చూసుకునే భగవంతుని దయకూబీ వర్ణింపబడింది. ఆధ్మాత్మిక భావనలు ఈ పాటలో చోటుచేసుకున్నాయి,

**'సిళి కళి వాళేమా చాందిన రాతేమా- కాంయివేగోరే చందమామ**
**చలొ అజోరే అజో అందొమామ - మోర్‌కు నాచ్ఛ జూ నాచరిచురే**
**కాంయి వేగోరె చందమామ - అంఖిమా ఆంస్సు ముండెమా క్యాళ్**
**కాంయి వేగొరె చందమామ - చాలో ఆ జోరి ఆజో, అంథోమామా**
**మోర్‌కూ జురజు జూరరీచురే చందమామ".**

పిల్లలు అన్న తినమని మారాం చేసేటపుడు, తల్లి చందమామను చూపి అన్నం తినపిస్తూ పాడే పాట.

చల్ల చల్లని గాలిలొ, వెన్నెల రాత్రిలో హాయిగా నడిచిరారా ఓ గుడ్డిమామా, అని తాను నెమలిలా

నాట్యం చేస్తానని తల్లి అంటుంది. కన్నీళ్ళతో నిండిన పిల్లవాడి నోటిలోని ముద్ద మాయమైంది. ఓ గుడ్డి మామ నీవు చూడ లేదా అని అడుగుతుంది. ఏదో ఒక రకంగా పిల్లవానికి మాయ మాటలు చెప్పి అన్నం తినేటట్లుగా చేసే ఈ పాటలు వివిధ రూపాల్లో ప్రతి ఇంట్లో వినిపించేవే.

**కుణసే ఖొలామ చరారో గోవుదాస్ యో భీయ్యా!**
**బాటి లాయించు ఖాజొరే మారొ భీయ్యా**
**జమనే ఖోళామ దేఖు నాగ బొలథ**
**డావళే ఖొళాను దేఖు గవు బొలథ**
**సగి యాడి వెతిజన భాందగిఏ మాడి**
**మాసియాడి అయిజన కూల గీథ మాడి**
**తారో కొణి ఫిటో ఉపకారమా - కొణి ఫిటో ఉపకారే యాడి"**

గోవులు కాచే అన్న కోసం చెల్లెలు రొట్టెలు తెచ్చానని, కుడి పక్క లోయలో నుండి చిరుతపులి అరుస్తుందని తనకు భయంగా ఉందని అంటూ తన తల్లిని తలుచుకుంటుంది. తల్లి చనిపోతే తండ్రి సవతి తల్లిని తెచ్చాడని ఆమె తమను ఎంత బాధపెడుతున్నదో దాని వల్ల తనకింత భయమౌతున్నదో సవతి తల్లి ముందు చిరుత పులి ఏపాటిదని అనుకుటుంది.

సవతి తల్లి మూలాంశం గిరిజన జానపద సాహిత్య మంతటా కనిపిస్తుంది. కన్న తల్లి పిల్లల మేలును కోరితే సవతి తల్లి కీడును కోరుతుందనేది ఈ పాటలోని బాలిక అభి ప్రాయం. సవతి తల్లి ఈర్శ్యకు గురి అవుతూనే, స్వంత అన్నయ్య కొరకు ఆరాటపడే చెల్లెలి మనోవేదన ఈ గేయంలో వ్యక్తమైంది. క్రూర జంతువుల మధ్య జీవితాన్ని గడిపే సంచార లంబాడీ బాలికల జీవితం దిన దిన గండంగా ఉంటుంది. ప్రమాదకరమైన అడవిలో అన్న కొరకు అపాయాల నెదు ర్కొంటూ చెల్లెలు రొట్టె తీసుకొని పోవటం ఆమెకు అన్నపైన ఉండే అనురాగానికి నిదర్శనం.

ఈ విధంగా పై పాటల్లో లంబాడీ ప్రజాజీవనం ప్రతి బింబించింది. శ్రామికులైన వీరు పాడే పాటల్లో వారి కష్ట సుఖాలు ఒడిదొడుకులు సాంఘికాచారాలు, సామాజిక చైతన్యం మొదలైనవెన్నో దర్శనిమిస్తాయి.

## ఉపయుక్త గ్రంథ సూచి:

1. పి.జ్యోతి జానపద విజ్ఞాన వ్యాస మంజరి, భరత్ పబ్లికేషన్స్, వరంగల్ 2008
2. వి. రామకోటి, బంజారా లోక్‌గీత్ కృష్ణవేణీ పబ్లికేషన్స్, హైదరాబాద్ 2002.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# మానవీయ విలువలకు అడ్డుగోడ 'అసూయ'

- డా॥ ఈతకోట ఈశ్వరరావు, పోస్ట్ డాక్టోరల్ ఫెలో, హైదారాబాద్ విశ్వవిద్యాలయం, హైదారాబాద్.

వాల్మీకి, వేదవ్యాసులు మాజాతి వారే అని సగర్వంగా చెప్పుకున్న జాతీయ కవి బోయి భీమన్న 1911 సెప్టెంబర్ 11 న తూర్పుగోదావరి జిల్లా రాజోలు తాలూకా మామిడికుదురు అనే గ్రామంలో బోయిపల్లయ్య,నాజమ్మలకు రెండవ సంతానంగా జన్మించారు. భీమన్న గారు స అజించని సాహిత్య ప్రక్రియ లేదు కవిత్వం మొదలుకొని నాటకం వరకు అన్ని ప్రక్రియలను రచించి తెలుగు సాహిత్యానికి అమ అతభాండాన్ని అందించారు.వీరి గుడిసెలు కాలిపోతున్నాయి అనే కావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు లభించింది.ఇలా ఎన్నో అవార్డులూ, రివార్డులూ, సత్కారాలూ, బిరుదులూ... పొందు కొని సాహితీ క్షేత్రంలో సేద్యం చేసిన భీమన్న 2005 డిసెంబర్ 16 న పరమపదించారు.

**సర్వసమ్మత సర్వసమతా సామ్య భారత భారతీ !**
**సస్యపుష్కల శ్యామ మందార , స్వర్ణగరాభారతీ !!**
**సకళ సుకళాసార సారస్వత సరస్వతీ భారతీ !**
**శాంతి సౌఖ్య వసంత భూమీ జన్మభూమీ భారతీ !!**

అంటూ ఈ అసూయ నాటకాన్ని ఆరు రంగాలుగా ఎనిమిది ముఖ్య పాత్రలతో తెరకెక్కించారు.ఈ నాటకంలో సామ్యవాద, సోషలిజాన్ని,ప్రజారాజ్యాన్ని కాంక్షించి కుల మత జాతి వర్గ వైషమ్యాలు తొలగిపోవాలని మనుషులు మనుషుల మధ్య ప్రేమే వారధి కావాలి కానీ అసూయ అడ్డుగోడ కారాదని భీమన్న సామ్య భారత భారతిని కాంక్షించి ఈ నాటకాన్ని రక్తికట్టించారు.

### అసూయ నాటకం పాత్రలు :

అసూయ నాటకంలో కొన్ని ప్రధాన పాత్రలు, మరికొన్ని కథాగమనానికి అనుకూలించే చిన్నపాత్రలు కనిపిస్తాయి. ప్రధాన పాత్రల్లో రాజా, విశ్వం, రాత్రి, చండ భాస్కరరావు, దినం, రేరాణి ప్రధాన పాత్రలు. చిన్నపాత్రలుగా భూతాలు, తాతాలు మొదలగు వారితో పాటు సందరాన్నే అనుసరించి పోలీసులు, డాక్టర్లు, నర్సులను తెరపై ప్రవేశింప చేస్తారు.

### ఇతివృత్తం :

నాయకుడు రాజు అనే విద్యార్థి కాంగ్రెస్ నాయకుడు. ఇతని చుట్టూ ఇతర పాత్రలు నడుస్తాయి. ముఖ్య పాత్రలు రాజా, రాత్రి, విశ్వం మొదలగు పాత్రలతో ఆరు రంగాలుగా ఈ నాటకం తెరకెక్కించాడు రచయిత రాజా విశ్వం స్నేహితుడు కథానాయిక రాత్రి , విశ్వం చెల్లెలు. ఈమె రాజాని ప్రేమిస్తుంది. భూతాల కూతురు రేరాణికి జ్వరం రావడం, రేరాణిని రాజా బలాత్కరించాడనే అపవాదాన్ని నమ్మిన భూతాలు రాజా మీద కర్రతో దాడి చేయడం తద్వారా రాజా కూడా హాస్పిటల్ నందు అడ్మిట్ కావడం అదే హాస్పిటల్ లో జ్వరం వచ్చిన రేరాణి అడ్మిట్ కావటం.రాజాని పరామర్శించటానికి వచ్చిన రాత్రి తన మనస్సులో ప్రేమను వ్యక్తం చేయడం జరుగుతుంది.అదే సందర్భంలో విశ్వం రేరాణి పై ఉన్న ప్రేమను వ్యక్తం చేస్తాడు. ఇలా ఈ రెండు జంటలు ఏకం కావడంతో కథ సుఖాంతమై రసాత్మకంగా ముగుస్తుంది.

అహంకారాన్ని, అసూయనూ, ఆధిపత్యాన్ని అసూయ నాటకంలో కళ్ళకు కట్టినట్టు చిత్రించారు భీమన్న. చండ భాస్కరరావులోని అసూయ యొక్క ఆధిపత్యాన్ని అహంభావాన్ని... అలగాజనం అనే పీడిత, బాధిత పేద జనంపై చులకన భావనను ఈ నాటకంలో చిత్రించడం జరిగింది.

సాంఘిక ప్రయోజనాన్ని ఆశించే, సాంఘిక చైతన్యాన్ని కోరుకునే నాటక రచయితలు నాటకాలు రచిస్తారు.భీమన్న రచించిన అసూయ నాటకం ఆద్యంతం సామాజిక ప్రయోజనాన్ని ఆశించింది. సామాజిక చైతన్యానికి స్ఫూర్తినిచ్చింది. ప్రజలకు హితబోధ చేసింది. ఈ నాటకం ప్రధానంగా భూస్వామ్య వ్యవస్థ పోవాలని, ఆర్థిక అసమానతలు లేని కుల, మత, వర్గ విచక్షణ పాటించని సమాజం రావాలని, అందరూ అసూయాద్వేషాలు పోయి ప్రేమానురాగాలతో ఆత్మీయంగా జీవించాలని ఈ అసూయ నాటకం ప్రబోధిస్తుంది.ప్రజల్ని చైతన్య పరుస్తుంది. చంద్ర భాస్కరరావు భూస్వామ్య ఆధిపత్యాన్ని పేదప్రజలైన భూతలు తాతాలు వాళ్ళ ఇళ్ళపై దౌర్జన్యం దోపిడీ విధానం ఇక్కడ కూడా చంద్ర భాస్కరరావు పాత్ర ద్వారా అసూయాభావాన్ని సామాజిక చైతన్యంతో తెరకెక్కించారు భీమన్న.

భారతదేశంలో దోపిడీ వ్యవస్థ అందులో భాగమైన అంటరానితనం సమాజాన్ని ఎలా విధ్వంసం చేస్తుందో తెలిపి దీనిని రూపుమాపడానికి సాంఘిక ఉద్యమాలు రావలసి ఉందని చెపపటానికి అసూయా నాటకాన్ని రచించాడేమో అనే అభిప్రాయాన్ని కలిగిస్తుంది ఈ నాటకం. ఈ నాటకంలో ఉన్నవన్నీ సజీవ పాత్రలే,సంఘటనలన్నీ సహజమైనవే,నిత్యం జరుగుతూ ఉండేవే. సంభాషణలు నిజంగా మనుషుల్ని మన కళ్ళ ఎదుట నిలబెడుతాయి. అందుకే ఈ నాటకం సాంఘిక నాటకంగా కనిపిస్తుంది. కూడు, నీడ, గుడ్డ అందరికీ సమానమని రాజా, విశ్వం, రాత్రి పాత్రల ద్వారా సాంఘిక విప్లవాన్ని రగిలించాడు భీమన్న. అసూయ నాటకానికి సంబంధించి

పాత్రపోషణ సంభాషణ నైపుణ్యం నాటక శిల్పం సన్నివేశ కల్పనల విషయంలో భీమన్న గారు ఎక్కడా ఎక్కువ తక్కు వలు కాకుండా కేవలం ఆరంటే ఆరు రంగాల్లో ఆద్యంతం రససిద్ధిని కలుగ చేశారు భీమన్న.

పాత్రపోషణలో రాజా ప్రధాన పాత్ర. ఎంతో సామాజిక విప్లవాన్ని చైతన్యాన్ని రగిలించే పాత్ర, ఇతనికి తోడుగా సహాధ్యాయిలుగా రాత్రి, విశ్వం పాత్రలును కూడా ఎంతో రసభరితంగా చిత్రించారు భీమన్న.

రాజా, ప్రభుత్వం భూవిషయ0లో తప్పకుండా మంచి చర్య తీసుకుంటుందని వారిని ఊరట పరుస్తూ ఈవేళ జమిందారీల బిల్లు,రేపు భూమినంతా జాతి పరం చేసే బిల్లు, ఎల్లుండి సోషలిజయ- తాత్కాలికమైన కష్టాలకు భయపడ కండి, ప్రజారాజ్యం దగ్గరలోనే ఉన్నది, ఇక పదండి అనడంలో ఎంతో దూరద అష్టి సామాజిక నవ చైతన్యం కనిపిస్తాయి. ఈ విధంగా అసూయ నాటకం ద్వారా సర్వోన్నత సామ్యవాద భావాలను ఆయా పాత్రల ద్వారా రగిలించి సంభాషణా నైపు ణ్యాన్ని సన్నివేశ కల్పనలను నాటక శిల్పానికి నాణ్యతను తెచ్చే విధంగా పాఠక ప్రేక్షకులకు కనువిందు కలిగించడమే రచ యిత లక్ష్యం. ఈ నాటకంలోని పాత్రల పేర్లు కూడా ఎంతో వైవిధ్యంగా ఉంటాయి. ఉదాహరణకు కథానాయిక పాత్రకు రాత్రి ర్ని నామకరణం చేయడం, అదేవిధంగా ప్రతినాయకుడు చంద్ర భాస్కరరావు సహాధ్యాయి పాత్రకు దినం అని నామ కరణం చేయడం నిరక్షరాస్యులైన పల్లెటూరి పెద్దలకు భూతాలు, తాతాలు అని నామకరణం చేయడంలో ఎంతో వైవిధ్యం కనిపిస్తుంది. ఇది రచయిత ప్రతికాత్మక ద అష్టికి నిదర్శనం. మొదట్లో దినం పాత్ర అసూయ అక్కసులతొ నిండిపోయి ఉంటుంది. చివరిలో పశ్చాత్తప హ అదయంతో మార్పు చెందుతుంది. ఈ మార్పుకు కారణం రాజా పాత్ర చూపించిన సాత్విక ప్రేమ భావాలే కారణం

ఇలా ప్రతి మానవునిలోని అసూయా ద్వేషాలు పోయి మార్పు చెంది రాజా పాత్ర వంటి సాత్విక ప్రేమ భావాలు నిండిన నాడు సమసమాజం ఆవిర్భవించి, ఉన్నతమైన మానవీయ విలువలు పెరిగి దేశం ప్రేమ బాటలో సాగు తుందని ఈ నాటకం ద్వారా భీమన్న గారు ప్రభోధం చేశారు.

చివరగా నాటకంలో ఆద్యంతం అసూయతో నిండి పోయిన హ అదయం చంద్ర భాస్కరరావుదే. అసూయ, పగ, కార్పణ్య, ద్వేషాలు ద్వేషలు ఎన్ని ఉన్నా చివరకు గెలిచేది ప్రేమే, ఆ ప్రేమ రాజా పాత్రలో కనిపిస్తుంది. ఈ విధంగా అసూయ నాటకం ద్వారా సాంఘిక విప్లవాన్ని, సామాజిక చైతన్యాన్ని, రససిద్ధిని పాఠక, ప్రేక్షకులకు కలిగించాడు భీమన్న.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# విద్యార్థులు - తల్లిదండ్రులు

- డా॥. పి. లోకేశ్వరి, పి.డి.ఎఫ్, తెలుగు అధ్యయనశాఖ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

పూర్వం సరైన తిండి, వైద్యం అందక లేత వయసులోనే చాలామంది పిల్లలు చనిపోయ్యేవారు. నేడు చేతికి అందివచ్చిన పిల్లలు చదువుల్ని అందుకోలేక కంటి నిండా నిద్రలేక, ఆరోగ్య మైన వాతావరణం లేక ఎప్పుడూ చదువు చదువు అని వారిలో చదువు అంటే వారి తలపై 100 కేజీల బరువు పెట్టినట్లు మనసంతా బరువుతో లోలోపల కుంగిపోతూ మనస్తాపంతో ప్రాణాల ను కోల్పోతున్న పిల్లలు చాలామంది వున్నారు.

యంసెట్ లో 70 వేల ర్యాంకు వచ్చిది. అంటే తన జీవితం అంతా చీకటి ప్రపంచమంతాచీకట్లైపోయింది. నాకు లెక్కలురావు అని తల్లిదండ్రులకు ఎంత చెప్పినా లెక్కలే చదవాలని విద్యార్థులపై ఒత్తిడి తెస్తారు. తమ పిల్లలు, ఇంజ నీర్లు, డాక్టర్లు కావాలి. చదివేవారి ఇష్టాలతో తల్లిదండ్రులకు సంబంధం లేదు. విద్యార్థులకు ఇష్టంలేని కోర్సులో లక్షలుపోసి వారిని చదవండి అని బలవంతం చేయడం, తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పెట్టేహింస అంతా ఇంతా అని వర్ణించడానికి లేదు.

పిల్లలతో మానసిక వేదన, తల్లిదండ్రుల్ని మోసం చేశా మని మనస్సులో చిన్నతనం సమాజం దృష్టిలో ఎందుకు పనికి రానివాడు ఇన్ని సమస్యల మధ్య ఈ చిన్నారి జీవితం ప్రశ్నార్థకం ర్యాంకు రాకపోతే ఎదో ఒక చదువు చదివి పొట్టపోసుకోవచ్చు అని తల్లిదండ్రులు గాని, సమాజంగాని ఎందుకు నేర్పడం లేదు. విద్యార్తులకు ర్యాంకు రాకపోతే 'చావు' ఒక్కటేనా పరి ష్కారం.

### పిల్లల మీద తల్లిదండ్రుల మోజు :

ఈ కథలో నామిని గారు చదువు పేరుతో పిల్లలు ఎంతటి నరకాన్ని చవిచూస్తున్నారో ఈకథ ద్వారా అందరి తల్లిదండ్రులకు సమాజానికి చెప్పదలిచారు. తల్లిదండ్రుల ఇష్టాన్ని పిల్లలపై రుద్దడం వారు మంచి మార్కులు తెచ్చుకోకపోతే వారి గౌరవానికి భంగం అందుకే కార్పొరేట్ స్కూల్లో లక్షలుకట్టి పిల్లలను చదివిస్తున్నారు.

**"14 ఎండ్ల నాకూతురి మీద**
**30 కేజీల నా కూతురి మీద**
**300 కిలోల బరువూ బాధ్యతా!"**

అంటూ విద్యార్థులు ఎదుర్కొనే సమస్యను వివరిం చారు. 570 మార్కులు తెచ్చుకుంటే నీకు TVS Scootyతో పాటు బంగారు గొలుసు కూడా తెచ్చిస్తాను అంటూ ఇంట్లో తల్లిదండ్రులు వారి కోరిక తీర్చుకోవడానికి పిల్లలు ఒక పరి కరంగా మారిపోయారు. స్కూల్లో మార్కులు రాకపోతే "ఏం వాడికేమైనా కొమ్ములచ్చినాయా? నీకు మాత్రం ఎందుకురావు 570 మార్కులు, పట్టుదల వుండాలే గానీ అంటూ గంటల తరబడి వారి Brain wash చేస్తూనే ఉంటారు.

పిల్లలు నిద్రలేచినప్పుడు అరగంట ధ్యానం తరువాత కాలకృత్యాలు తరువాత 5 నుండి 7గంటల వరకు చదువు తరువాత ఒక గ్లాసుపాలు, మళ్ళీ స్కూల్, మధ్యాహ్నం భోజనం మధ్యలోఅల్పాహారం సాయంత్రం 5 గంటలకు బడినుండి ట్యూషన్ తిరిగి 7 గంటలకు రాత్రిభోజనం అది కూడా పచ్చి కూరగాయలు, దంపుడుబియ్యం, గుడ్లు ఇవే ఆహారం 11 గంటల వరకు చదువు ఆ తర్వాత నిద్ర అంటే చిన్న పిల్లలు ప్రొద్దున్నే 4 నుండి రాత్రి 11 గంటల వరకు విరామం లేకుండా చదువుతూనే ఉండాలి. అదే తల్లిదండ్రుల కోరిక ఇలా చేస్తే తన పిల్లలకు ఏ లోటూ లేకుండా అన్ని సమకూర్చినట్లు మురిసి పోతుంటాడు ఈ కథలో ఉమాశంకర్. చూసే సమాజం కూడా ఆ పిల్లవాడికి చదువు అంటే ఎంత ఇష్టం ఎప్పుడూ చదువు తూనే వుంటాడు అని పొగడటం ఇది విన్న తల్లిదండ్రులు గర్వపడటం, ఆదివారాలు అస్సలు తీరిక లేదు. ట్యూషన్ మాస్టార్లు కోచింగ్ సెంటర్లు ఇదంతా ఉమాశంకర్ కొడుకు Time table.

చాలామంది తల్లిదండ్రులు పిల్లల్ని ఐఐటిలో చేర్పించా లని కలలు కంటున్నారు. అయితే ఆ పిల్లలకు ఐఐటి చేరాలన్న కోరిక ఎలా కలుగుతుంది. అందుకే ఉమాశంకర్ వేసవి సెలవుల్లో ప్రముఖ ఐఐటి కాలేజీలను లేదా సంస్థలను చూపించి వారితో పరిచమం ఏర్పరచడం వల్ల తన పిల్లవాడికి 'ఐఐటి' చేయాలనే కోరిను బలవంతంగా రుద్దడానికి ప్రయ త్నిస్తుంటాడు ఉమాశంకర్ ఈ కథలో మరో అమ్మాయి సంధ్య కథను కూడా చెప్పారు నామినిగారు. సంధ్య తల్లి దండ్రులు చాలా ధనవంతులు అలాగే వారి కోరికలు కూడా ఉన్నతంగానే వున్నాయి. సంధ్య మేనమామ యంబిబియస్ చదువుతున్నాడు సంధ్యను పెళ్ళి చేసుకోవాలంటే తను కూడా యంబిబియస్ చేయాలని నిబంధన పెట్టారు. సంధ్య చదువు సంగతి చూస్తే వారు అనుకున్నది సాధించడం చాలాకష్టం. సంధ్యకు Maths లో (a+b)సూత్రం కూడా రాదు. అంతే సంధ్య తల్లి హైదరా బాద్లోని Maths Expertని వెతికి వెతికి నామిని గారిని ట్యూషన్ మాస్టరుగా ఎంచుకుంది. కాని నామినిగారు ఎక్కడి నుండి అయినా మంత్రజలం తెప్పించి ఆ పిల్లనెత్తిన చల్లి సూత్రాలు వచ్చేలా చెయ్యమని అడగాల్సిందే అని చేతు లెత్తేస్తారు.

నామిని మాటలతో నిరుత్సాహపడి వేరే మాస్టారు కోసం ప్రయత్నాలు చేయసాగింది సంధ్య తల్లి సరోజ. తల్లి పడే తపనను గుర్తించిన సంధ్య మా అమ్మ నా ప్రాణంతీసేదాకా మంచినీళ్ళు కూడా ముట్టదు అని చేప్పేసింది అంటే తన వల్ల కాని పనిని చెయ్యమని బలవంతం చెయ్యడం ఎంత సమంజసమో తల్లిదండ్రులు, సమాజం ఆలోచించాలనీ ప్రయత్నం చేశారు నామినిగారు.

**తల్లీ, తండ్రీ, గురువూ ఈమూడు దెయ్యాలబాష :**

ఈ కథలో ఇంటి దగ్గర తల్లిదండ్రులు, స్కూల్‌లో గురువూ పెట్టే బాధ భరించలేని నవనీత కథ, నవనీత 10వ తరగతి చదువుతుంది.తను ఎంత ప్రయత్నించినా చదివించి గుర్తుండదు.

**తండ్రి :**

కూతురు బాగా చదవలేదని కోపం అంతా బార్యపై చూపిస్తాడు. ఫీజు కట్టవరకే నాబాధ్యత ఆతర్వాత అమ్మాయి చదువుతుందా లేదా అనేది చూడాల్సిన బాధ్యత తల్లిది అంటూ 'తల్లి రీతిగా వుంటే గదా కూతురు రీతిగా వుండే దానికి' అని తల్లిని నిందిస్తాడు. ఇప4డుకాదు 10 వతరగతి పైయిలైపోతే చేప్తా ఇద్దరి సంగతి అని బేదిరిస్తాడు నవనీత తండ్రి. ఈ బాధ తట్టుకోలేక నవనీత 'యాసిడ్' తాగేసింది. అప్పుడు కూడా తండ్రి 'అక్కడెక్కడన్నా చావనీ' కన్ననేరానికి టెన్త్ ఫైలవ్వగానే ఎవడ్నొ ఒక పంగమాలిన వెదవను చూసి తగిలిచ్చేస్తే పోతుంది అన్నాడు నవనీత తండ్రి కన్న కూతురిపై జాలిలేని తండ్రిగా ప్రవర్తించాడు.

**తల్లి :**

భర్త కూతురు సరిగ్గా చదవలేదని తిట్టి వెళ్ళాడు అందుకే నవనీత తల్లి వెంటనే స్కూల్ కరస్పాండెంట్‌కి ఫోన్‌చేసి మా అమ్మాయి ఎందుకు చదవడం లేదు అన్ని Subjectsలోనూ ఫైయిలైంది అంటూ కొంతసేపు అతన్ని తిట్టింది మా అమ్మా యికి ఎక్కువ మార్కులు వద్దు సార్. పాస్ అయితే చాలు అని చెప్పి ఫోన్ పెట్టేసింది. కూతురు బాధ భరించలేక యాసిడ్ తాగింది ఎందుకు తాగింది అని తెలుసుకుని కంటికి రెప్పలా కాపాడాల్సిన తల్లి 'నువ్వు చదివితే చదువు లేకపోతే పో అంతేకాని బుడ్డ బెదిరింపులకు దిగద్దు అని కర్కషంగా మాట్లాడింది తల్లి.

**గురువు :**

నవనీత తల్లి ఫోన్ చేసిన తర్వాత నేరుగా నవనీత క్లాసుకు వెళ్ళాడు కరస్పాండెంట్. నవనీతను బోర్డుపై 'ఆశయ సాధన' అనే పదాన్ని రాయమన్నారు కరస్పాండెంట్. నవనీత తప్పురాసింది. టీచర్ అలసిపోయేంత వరకు కొట్టాడు నవనీతకు కంటిలో నీళ్ళు కూడా రాలేదు ఎందుకంటే తనకు ఈ ప్రపంచంలో స్వాతంత్ర్యంగా ఏడ్చే హక్కు కూడా ఇవ్వలేదు. లెక్కల్లో సూత్రాలు అడిగాడు సమాధానం లేదు. బి.పి పెరిగి కరస్పాండెంట్ కర్ర తీసుకుని ఓపిక ఉన్నంత వరకు కొట్టాడు. మారుమాట మాట్లడలేదు నవనీత. వీరందరి బాధ తట్టుకోలేక యాసిడ్ తాగి చనిపోవాలనుకుంది కానీ దురదృష్టం వెంటాడి బతికిపోయింది. కనీసం సానుభూతి కూడా చూపకుండా గురువు 'నువ్వు నేర్పిన మంత్రాన్ని అందరికీ వూదొద్దు, తా చెడ్డకోతి వనమెల్ల చెరిచిందనీ! ఛీ అని చీదరించుకున్నాడు కరస్పాండెంట్.

మొదటి నుండి ఆ స్కూల్‌లోనే కదా నవనీత చదువు తుంది. ఇన్ని రోజులూ ఆ అమ్మాయికి మార్కులు రాని విషయం, చదవని విషయం ఆ కరస్పాండెంట్‌కు ఎందుకు తెలియదు. కేవలం నవనీత తల్లి ఫోన్ చేసి మా అమ్మాయి చదవలేదు అని చెప్పిన రోజు వెళ్ళి నువ్వు చదవలేదంట అని నవనీతను గొడ్డును బాదినట్లు బాదడం ఎంత వరకు సమంజసం ఇన్ని రోజులు చదువుచెప్పిన టీచర్‌ని కరస్పాం డెంట్ ప్రశ్నించాలి, నవనీతను ఎందుకు దోషిగా చూపిస్తున్నారు ఈ విధంగా ఆలోచించే సమాజంలో మార్పు రావాలి అని కోరుకుంటూ నామిని గారు ఈ కథను రాశారు.

**ముగింపు :**

తల్లిదండ్రుల మనస్తత్వాలు మారాలి ఎందుకంటే సమాజంలో గౌరవంగా వుండాలంటే, పిల్లలు బాగా చదివి ఉన్నత స్థాయిలో వుంటే అందరూ వారికేమి వారి పిల్లలు మంచి ఉద్యోగాల్లో వున్నారు అంటే చాలు వారు ఈ ప్రపంచాన్నే మరిచిపోతారు. కాని చదవలేని చదువురానివారి పిల్లల్ని చదవండి, చదవండి అంటే వారు ఎలా చదువుతారు. ఎం.సెట్‌లో ర్యాంకు రావాలి, నా పిల్లలు డాక్టర్లు, ఇంజనీర్లు కావాలని ఆశపడుతున్నారే గాని నాకండ్లముందర నా పిల్లలు వుంటే చాలు అని అనుకునే తల్లిదండ్రులు ఈ సమాజంలో ఎంత మంది ఉన్నారు. ఆ చదువులకోసం పిల్లలు పడే అగ చాట్లు పట్టించుకునే వారు ఎంతమంది? విద్యార్థులుపడే ఆవే దన ఎంతమంది తల్లిదండ్రులు అర్థం చేసుకుంటున్నారు? చేసుకోగలరు?. పిల్ల బాధలు పెద్దలకు పట్టవు వాళ్ళకు కావాల్సిందినలుగురిలో గొప్పలు చెప్పుకోవడం. అందుకోసం గొప్పగా వుండే చదువు చదవాలంటూ బలవంతం చేయడం, వారి ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా ప్రవర్తించే మనస్థత్వాలలో మార్పు రావాలని ఆశిద్దాం!.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# అద్దేపల్లి వారి సాహిత్య విమర్శ - శ్రీశ్రీ మహాప్రస్థానం

- జొన్నాడి మాల్లియాన, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

సమగ్రమైన భాషా చరిత్రను సాహితీ ప్రపంచానికి అందించాలంటే కవికిగాని, రచయితకి గాని నిష్పక్షపాతమైన సహృదయత ఉండాలి. అప్పుడే సృజనాత్మక శక్తి వక్రమార్గం నుండి తొలగి విషయ పరిజ్ఞానాన్ని సమాజానికి అందించ గలదు. తాను సమాజానికి చెప్పదలచుకున్నదంతా సాహిత్య పరంగా అందించ ప్రయత్నిస్తాడు. అటువంటి శక్తి ఈనాటి సమాజానికి అవసరమైన ఉన్నత స్థాయిలో ఉండిన వారిలో డా॥ అద్దేపల్లి రామమోహన్‌రావు ముఖ్యుడు.

కవిగాని, రచయిత గాని వ్యాపార దృష్టితో సృష్టించిన సాహిత్యంలో నిజాయితీ కుంటు బడుతుంది. వ్యాపారంలో పరాధీనత ఉంటుంది. తనలో ఉన్న ఉదాత్తమైన ఆశయా లను సమాజానికి అందించలేడు. ఈ విషయంలో అద్దేపల్లికి ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా ప్రలోభాలకు తలవంచలేదు. నిబద్ధతతో కూడిన సాహిత్యాన్ని అందిస్తూనే వచ్చాడు.

ఉత్తమ విమర్శకుడు, ఉత్తమ కవి కాలేకపోవచ్చు. అలాగే ఉత్తమ కవి ఉత్తమ విమర్శకుడు కాలేకపోవచ్చు. కాని అద్దేపల్లి వారి విషయంలో ఆయన ఉత్తమ కవి, ఉత్తమ విమర్శకుడు, ఉత్తమ సమీక్షకుడు, అంతేకాదు ఆయన మంచి గాయకుడు కూడా. ఆయన అన్నింటికి మించిన స్నేహశీలి. ఒకసారి పరిచయమైన వారితో జీవితాంతం స్నేహం కొనసాగించిన సహృదయుడు.

సాహితీపరులు కొందరు వేదికను బట్టి ప్రసంగాలు చేస్తారు. అద్దేపల్లి అలా కాదు, వేదిక చిన్నదైనా, పెద్దదైనా సభకు న్యాయం చెయ్యడం ఆయనలో ఉన్న గొప్ప గుణం. ఎన్నో వేల ఉపన్యాసాలు చేసిన అద్దేపల్లి సాధారణంగా చెప్పిన ప్రసంగమే మళ్ళీ చెప్పకపోవడం ఒక విశేషం, ఆయన ఎన్నో కొత్త విషయాలు ఎప్పటికప్పుడు అవగాహన చేసుకుంటే వాటిని కలుపుకుంటూ ప్రసంగించటం నిరంతర పురోగమనానికి సంకేతం.

అద్దేపల్లి అన్ని ఉద్యమాల్లోని మంచీ, చెడులను గ్రహించి, మంచి చైతన్యం తనలో నింపుకున్న నిత్య చైతన్య మూర్తి, అతని సాహిత్యం తనని గుర్తించటం కోసం రాయలేదు. గురుతరమైన బాధ్యతతో సమాజానికి మంచి సాహిత్యం అందించాలని సదాశయంతో కలం పట్టారు. అనేకమంది పరిస్థితులు ప్రభావాల్ని బట్టి, ప్రతికూల వాతావరణాన్ని బట్టి, లేక అసహాయతను బట్టి, అవసరాన్ని బట్టి రాజీపడి తమ భావాల్ని మార్చుకుంటారు. కాని ఆయన అంతర్జ్వాల నుండి పొగచూరిన ఆకాశం దాక రాజీపడని ప్రశంసనీయమైన ప్రగతిశీలి. ఆయన కవిత్వం రాసినా, ప్రసంగం చేసినా, విమర్శ చేసినా భావాలలో నిర్భయమైన నిజాయితీ కనిపించేది. మనస్సులో ఉన్నదే మాట్లాడడం, అన్నీ మాటకే కట్టుబడి ఉండటం ఆయన లక్షణం. అందుకే ఆయన మార్గాన్ని అను సరించారు. ఆయన వెంట నిలిచారు. ఎన్ని ఒడిదుడు కులు వచ్చినా వ్యక్తిగత సౌఖ్యాలకే, చౌకబారు కీర్తి ప్రతిష్టలకీ లొంగ కుండా తాను నమ్మిన సాహిత్యానికి తన మార్గాన్ని అంకితం చేశాడు.

సాహితీపరులలో శాస్త్రీయ దృక్పథం చాలా మందిలో కనబడదు. అద్దేపల్లిది గొప్ప శాస్త్రీయ ధృక్పథం, ఆయన సమీక్షలు గాని, ప్రసంగాలు గాని, శాస్త్రీయ ధృక్పథం కలిగి యుండటం ఆయనలోని వాస్తవిక దృక్పధానికి నిదర్శనం. ఆయన చెప్పే దానికి చేసే దానికి సమన్వయం ఉండడం వల్ల ఆయన మార్గం అందరికి ఆచరణ యోగ్యంగా ఉం టుంది. అందుకే కుల, మత ప్రాంతాతీతంగా అందర్ని ప్రేమించడం, ప్రేమించబడటం ఆయనకు ఉన్న గొప్ప శక్తి. ఈ కారణంగా ఒక వ్యక్తిగా కాకుండా ఒక సామాజిక శక్తిగా సాహితీ లోకంలో అగ్రస్థానాన్ని పొందిన గొప్ప వ్యక్తి అద్దేపల్లి.

### అద్దేపల్లి రామమోహనరావు విమర్శ గ్రంథాలు :

అద్దేపల్లి వారు రచించిన పదకొండు విమర్శ గ్రంథాలు (1). కవుల పేరు మీద వచ్చిన విమర్శ, (2). కవిత్వ సిద్ధాంతాలు, విమర్శ, అద్దేపల్లి, శ్రీశ్రీ కవిత్వంపై వివిధ కోణాలలో విస్తృత విమర్శ చేశారు.

### శ్రీశ్రీ కవితా ప్రస్థానం :

శ్రీశ్రీ కవితా ప్రస్థానం (మహాప్రస్థానంపై సమీక్ష) గ్రంథాన్ని డా॥ అద్దేపల్లి రామమమోహన్‌రావు మొట్ట మొదటసారిగా రచించాడు. శ్రీశ్రీ కవిత్వంలోని సమగ్రాను భూతి శిఖా స్వరూపం దర్శనమిస్తుంది. ఈ విశ్లేషణ గ్రంథంలో శ్రీశ్రీ మహాకవి అని డా॥ అద్దేపల్లి వ్యాఖ్యానిస్తాడు. శ్రీశ్రీ మహాకవి గానే కాకుండా, ఆయనను ఏకకాలంలో యుగకర్తగా ఎలా పరిగణించవచ్చునో డా॥ అద్దేపల్లి విశ్లేషణాత్మకంగా ఈ గ్రంథం ద్వారా మొదటగా ప్రకటించాడు. శ్రీశ్రీ మహాకవి. నన్నయ్య, తిక్కన, పెద్దన, విశ్వనాథ వీరంతా ఏ కోవకు చెందిన మహాకవులో శ్రీశ్రీ ఆ కోవకు చెందిన మహాకవి అని నిరూ పించాడు.

ఏ దేశంలో గాని ఏ కాలంలో గాని అనేకానేక హృదయ స్పందనలకు ఆలవాలమై అమిత ప్రచారాన్ని పొందిన మహా

కవి రహస్యమిది. మొదటిది అతడు మహా కవితా శిల్ప రచన ప్రవీణ్యుడై ఉండాలి. ఇంకా తన కాలంలో సారభూతమైన మహా భావ తరంగాల సంగమస్థానమై ఉండాలి. చెప్పిన ఈ రెండు విషయాలు ఒకదానికొకటి సర్వత్మానా ఏకమై ఒక మహా చైతన్యాగ్నిగా జ్వలించాలి. ఈ దృష్టిలో ఏ ప్రక్రియ రూపంలో రచించినప్పటికి అతడు అక్షరాక్షర శిల్ప.

శ్రీశ్రీ మహాకవి నూతన చైతన్య ప్రతినిధి. అనేకమంది ఇతర కవులలో నూతన భావాలెంత విస్తృతంగా వున్నా అతని అక్షరాల్లో అవి విశ్వరూపాన్ని ప్రదర్శించాయి. ఒక భావాన్ని సాధ్యమైనంత బలంగా చెప్పడానికి కవి చేసిన ప్రయత్నాలు శిల్పంగా రూపొందుతాయి. ఈ అక్షరాల నుండి భావాలను ఎలా పిండగలడో అంతగా మహాకవి అవుతాడు. ఈ రహస్యాలు మన పూర్వ అలంకార శాస్త్రాల్లో సర్వాత్మనా చర్చించబడ్డాయి అంటూ ఎంత ఆధునిక రచనయైనా అది కల్గించే ఆనందాన్ని సూక్ష్మంగా వివరించవలసి వచ్చినప్పుడు ఆ పరిభాషను తీసుకోక తప్పదు లేదా వేరు పదాలతో చెప్పాలి. కొత్త పదాల నుండి రూఢిగల అలంకారిక పదాలనే ప్రయోగిస్తే అది అర్థ పుష్టి ఉంటుందని ఆయన ఈ విమర్శా గ్రంథంలో భావించాడు.

శ్రీశ్రీ మహాప్రస్థాన మహా కావ్యంలో సమాచార పూర్వకంగా సమాలోచన చేస్తే కనబడే నిర్ధిష్ట శిల్ప రీతుల్ని వివరించడానికి ఈ విమర్శ గ్రంథం డా॥ అద్దేపల్లి ప్రయత్నించడం జరిగింది.

డా॥ అద్దేపల్లి ఈ విమర్శా గ్రంథంలో శ్రీశ్రీ అభ్యుదయ భావాలు తీవ్రంగా బాణాల వలె చెప్పాడనడంలో అతని రచనా శక్తి చెప్పినట్లు కాదు. శిల్ప విశేషాలు చెప్పినప్పుడే అప్పుడు మాత్రమే ఒక మహాకవి శిల్ప శక్తి వ్యక్తమవుతుందని అంటాడు, 1968 నాటికి డా॥ అద్దేపల్లి ప్రఖ్యాత విమర్శకుడైన టి.ఎస్. ఎలైట్ గూర్చి ఎఫ్.ఆర్. సెరల్స్ మొదలైన విమర్శకుల విమర్శనా రీతిని తెలుగు విమర్శాశైలిలో రాజుకురిలోంచు అంటాడు. అసలు మహా కవి అని నిర్వహించడం ఎలా అంటే ఒక మహా చైతన్యానికి ప్రతినిధి కావడం కొన్ని విశిష్ట జీవన సిద్ధాంతాలకి కూడలి కావడం. శ్రీశ్రీలో ఈ మహా లక్షణం ఎంతగానో వున్నదని, ఉన్నదనడంలోనే విశిష్ట లక్షణం అంటాడు. యుగాల తరబడి ప్రవహిస్తూ వచ్చి ఒక మహా భావనా స్రవంతి ఆధునిక యుగంలో తిరిగిన మలుపులో సహస్రాక్షుడై నిలబడ్డాడు. శ్రీ శ్రీ అతని కవిత్వంలో మహాజ్వాల కావడం నిజం, కల్లోలమయ ప్రపంచానికి కవితా ప్రాతినిథ్యం వహించడం ఏ సిద్ధాంతం గలవాడినైన ఆకర్షించక తప్పదు. అక్కడైనా అతని మహాశిల్ప నేతృత్వం వల్ల గుండె కదలక తప్పదు అంటాడు రామమోహన్‌రావు. అతని కవితలోని నూతన భావ ప్రాతినిధ్యానికి మహోదారణం కావ్యపు ఆద్యం తాలే.

**"మరో ప్రపంచం మరో ప్రపంచం**
**మరో ప్రపంచం పిలిచింది**
**పదండి ముందుకు పదండి తోసుకు**
**పోదాం పోదాం పైపైకి**

అని పల్కిన పంక్తులు కొత్త మలుపులు తిరిగాయని నిరంతర అభ్యుదయ దృష్టిని ప్రతిక్షణావేశ సృష్టి కావాల్సిన వంటారు.

ఈ వ్యాసాలలో శ్రీశ్రీ అపూర్వ శిల్ప శక్తిని ఆయన ఈ గ్రంథం ద్వారా వ్యక్తం చేసిన నూతన సంస్కారం ఇందులో కన్పిస్తుంది.చాలా వరకు ఈ వ్యాసాలు 1963-1964లో రాయబడ్డాయి. ఈ వ్యాసాలను రామమోహన్‌రావు ఆంధ్రప్రభలో ధారావాహికంగా రాసిన వ్యాసాలు. ఈ వ్యాసాలలో శ్రీశ్రీ కవిత్వంలో సాహితీ విలువలను కొలవడానికి ఆయన అలంకారిక కవిత్వ భావజాలాలు ఎంతో స్పష్టంగా వివేచించాడు. రా.రా. తన సారస్వత వివేచనలో ప్రతికూల విమర్శ చేయడానికి శ్రీశ్రీని డా॥ అద్దేపల్లి ప్రాచీనత స్ఫురించే శైలిని వుపయోగించడని విమర్శ చేశాడు. కాని వీరి సమస్యకో సమగ్ర విశ్లేషణ అని చెప్పుకోవచ్చు. శ్రీశ్రీ మహాప్రస్థాన కవిత్వాన్ని సమగ్రంగా పరిశీలన చేయడానికి ఈ గ్రంథం చాలా వరకు చారిత్రక ఘట్టంగా ఆనాటి నుంచి ఈ నాటికి నిలుస్తుందనడంలో సందేహం లేదు. సాహితీ మూల్యాంకన అంశాలను డా॥ అద్దేపల్లి ఈ గ్రంథంలో తూచినాడనడంలో తప్పులేదు.

డా॥ అద్దేపల్లి ఈ విమర్శనాత్మక గ్రంథంలో శ్రీశ్రీ మహాప్రస్థానంలోని అంశాలను చెబుతూ శ్రీశ్రీ ఛందస్సు శ్రీశ్రీ కవితా ఓ కవితా, శ్రీశ్రీ - కథన శక్తి, శ్రీశ్రీ - ఆవేశం, శ్రీశ్రీ కవితా దృష్టి, శ్రీశ్రీ అలంకారికత, శ్రీశ్రీ మానవత, శ్రీశ్రీ ఎలిజి, శ్రీశ్రీ దేశ చరిత్రలు, శ్రీశ్రీ స్వతంత్ర మార్గ నిర్మాత, ఇట్లు ఆయన మహాప్రస్థానంలోని కవిత్వాన్ని వివిధ కోణాల్లోంచి ఆయ విభాగాలుగా విభజించి, మొట్టమొదటిసారిగా ఆంధ్ర దేశానికి 1968లో ఈ పుస్తకం ప్రచురించడం ద్వారా పరిచయం చేశాడు.

శ్రీశ్రీ ఛందస్సుతో ఆయన మహాప్రస్థానం కావ్యం నిండా ఛందో ప్రవాహం జాలువారిందని చెప్పవచ్చు.

**అథ : సూచికలు**

1. సాహిత్యాన్ని గురించి, కళను గురించి యెనాన్‌ఫోరమ్‌లో ప్రసంగాలు - (అనువాదం)
2. విప్లవ సాహిత్యోద్యమం - విరసం పాత్ర (1970-1995) విప్లవ రచయితల సంఘం.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# స్త్రీ విద్యకోసం పాటుపడిన మహనీయుడు కందుకూరి వీరేశలింగం

- మద్దిరాల సత్యనారాయణరెడ్డి, పరిశోధక విద్యార్థి, తెలుగు విభాగం, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

భారతీయ పితృస్వామిక కుటుంబ వ్యవస్థలో స్త్రీ అనాదిగా అణచివేతకు, వివక్షకు గురవుతూనే ఉంది. పురుషాధిక్య సమాజంలో స్త్రీ స్వేచ్ఛను కోల్పోయి అన్ని రంగాల్లోను విస్మరించబడింది. ప్రాచీన కాలంలో స్త్రీ కేవలం వంటంటికే పరిమితమై, పిల్లలను కనే యంత్రంగా, పురుషుడి కోర్కెలు తీర్చే పరికరంగా మారింది. ఫ్రెంచి విప్లవం తర్వాత ప్రపంచంలో, అలాగే భారతదేశంలో స్త్రీల విషయంలో కొన్ని పరిణామాలు చోటు చేసుకున్నాయి. భారత దేశంలో ఆంగ్లేయుల పాలన సమాజంలో కొన్ని మార్పులకు దోహదపడింది. దేశంలో పాఠశాలలు నెలకొల్పి ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టడం ఈ విద్యతో ప్రభావితులైన కొందరు భారతీయ సంఘ సంస్కర్తలు సమాజంలోని అనేక మూఢవిశ్వాసాలు, మూఢ ఆచారాలపై పోరాటం సాగించారు. అందులో భాగంగా స్త్రీలు కూడా చదువుకోవాలని, చదువుకున్న మహిళ తన కుటుంబాన్ని సక్రమంగా, సమర్థవంతంగా నడిపించగలదనే భావనను వీరు పెంపొందించారు. 19వ శతాబ్దంలో సంఘ సంస్కరణోద్యమం బాగా వ్యాప్తిలోకి వచ్చింది ఇందులో స్త్రీ విద్యా ప్రాధాన్యాన్ని కొంత మంది సంఘ సంస్కర్తలు, సాహిత్యకారులు గుర్తించి, స్త్రీ విద్యా కోసం కృషి చేశారు. అలాంటి వారిలో కందుకూరి వీరేశలింగం ప్రముఖుడు.

కందుకూరి వీరేశలింగం పంతులు గారు 16 ఏప్రిల్ 1848న రాజమండ్రిలో సుబ్బారాయుడు - పున్నమ్మ అనే బ్రాహ్మణ దంపతులకు జన్మించారు. నాలుగేండ్ల వయస్సులోనే తండ్రి మరణించటం వల్ల ఆయనను పెద్ద తండ్రి అతి గారాబంగా, సున్నితంగా పెంచారు. 1856లో ఆయనకు ఉపనయనం అయిన తరువాత వీది బడిలో చదవటం, రాయటం నేర్చుకున్నాడు. 1860లో దొరతనం వారి పాఠశాలలో చేరాడు. ఏ పాఠశాల అయిన ఒకసారి చదివినంతనే అప్ప చెప్పగలిగేవారు. విద్యార్థి దశలోనే వీరేశలింగం గారు విద్యార్థులకు నాయకత్వం వహించి, న్యాయమైన హక్కుల కోసం పోరాటం చేశారు. 13వ యేటనే రాజ్యలక్ష్మితో ఆయనకు వివాహం జరిగింది. అప్పటికి రాజ్యలక్ష్మికి తొమ్మిదోయేడు. మాటి మాటికి జబ్బుపడం వల్ల వీరేశలింగం గారి చదువకు అంత రాయం కలిగేది. అయినా దృఢ సంకల్పంతో చదువును కొన సాగించారు. చివరికి 1970వ సంవత్సరంలో మెట్రిక్యులేషన్ పరీక్ష రాసి కృతార్థులయ్యారు. తరువాత వివిధ పాఠశాలలో సహాయోపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా, పండితులుగా అనేక సంవత్సరాలు విద్యాబోధన చేశారు.

వీరేశలింగం రచనలన్ని సమాజం కోసమే రాశారు. 1868-69లో మార్కేండేయ శతకము, వేణుగోపాల శతకము అనే రెండు శతకాలను కందపద్యాలలో వ్రాశారు. 1870లో మూఢావిశ్వాసాల ప్రబంధంగా 'శుద్ధాంధ్ర నిర్వచన నిరోష్ఠ్య నైషదం'గా వ్రాశారు. వెంటనే 'రసికజనమనోరంజనం' అనే కావ్యాన్ని వ్రాశారు. దీనిని ఆనాటి పండితులు మెచ్చుకున్నారు. ప్రభుత్వం వారు ఎఫ్.ఎ. తరగతికి పఠనీయ గ్రంథంగా దానిని పెట్టారు. 1872లో 'శుద్ధాంధ్రొత్తర రామాయణము'ను రచించారు. దీనిలో ఉన్న పద్యాలను చదివిన పాఠకులు మెచ్చుకొని 'అభినవ తిక్కన' అనే బిరుదుతో సత్కరించారు. బాల బాలికలకు సులభంగా అర్థం కావటానికి 'సులభవ్యాకరణాన్ని' క్రమ శిక్షణా శీలము పెంపొందించుకోవటానికి 'నీతిదీపిక'ను 1875లో వ్రాశారు. షేక్స్పియర్ రచించిన 'ది' కామిడీ ఆఫ్ ఎర్రర్స్' నాటకాన్ని 'చమత్కార రత్నావళి'గా 1885లో అనుకరణ చేశాడు. షెక్స్పీయర్ రచించిన 'ది మర్చెంట్ ఆఫ్ వెన్నిస్ అనే నాటకాన్ని 'వెనీసు వర్తక చరిత్రగా' అనువదించాడు. అలాగే 'రాజమంజరి', కళ్యాణ కల్పవల్లినికూడా అనువాదం చేశాడు. వీరేశలింగంగారే స్వయంగా రాసిన సాంఘీక నాటకాలలో 'బ్రహ్మ వివాహం', 'వ్యవహారధర్మబోధిని', 'వివేకదీపిక', 'మునిసిపల్ నాటకము' బాగా పేరు పొందాయి. 'అభాగ్యోపాఖ్యానం', 'శుద్ధాంధ్ర' 'భారత సంగ్రహం', 'సరస్వతీ నారద విలాపము' అను కావ్యాలను రచించారు. రాజా రామోహన్‌రాయ్ చరిత్ర (1896) - 'విక్టోరియా మహారాణి చరిత్ర' (1877), 'క్రీస్తు చరిత్ర' (1913), మొదలైన జీవిత చరిత్రలు రాశారు. 'రాజశేఖర చరిత్ర' (1878) అనే నవల తెలుగులోనే తొలి నవలగా ప్రసిద్ధి చెందింది. 'సత్యరాజపూర్వదేశ యాత్రలు', 'చంద్రమతి చరిత్ర', 'సత్యవతీ చరిత్ర' మొదలైన పుస్తకాలను రాశారు. ఇలా వారి పుస్తకాల జాబితాను తయారు చేస్తే తాపీ ధర్మారావు చెప్పినట్లు ఏదో పుస్తకాల వ్యాపారి కేటలాగు లాగా ఉంటుంది. 1883వ సంవత్సరంలో స్త్రీల కోసం 'సతిహిత బోదిని' అనే పత్రికను ప్రారంభించి 'చదువెఱుగని స్త్రీలు తమ బిడ్డలకు శత్రువులు', 'పతివ్రతా ధర్మము', 'అత్తగారి కొడంత్రికము', 'బాల శిక్షణము', మొదలగు వ్యాసములను పంతులుగారు కూర్చిన్నారు.స్త్రీలకు సుబోదకములైన శైలియందు లోకజ్ఞానము కూర్చినట్టి చిన్న చిన్న కథలతో, మనోహరముగా వ్యాసములను పంతులుగారు తీర్చిదిద్దిరి.

వీరేశలింగం గారికి సంఘ సంస్కర్తాభిలాష ఎక్కువగా ఉండేది. నాటి సమాజంలో ఉన్న స్త్రీ విద్యానిషేదం, వితంతు

పునర్ వివాహ నిషేదం, కన్యాశుల్కం, బాల్యవివాహాలు, వేశ్యా న్నతి మొదలైన దురాచారలను నిరసించారు. ముఖ్యంగా సమాజంలో స్త్రీ కొల్పోయిన వ్యక్తుత్వాన్ని పునరుద్ధరింపజేయ డానికి సంస్కరణోద్యమం చేపట్టాడు. సంఘ సంస్కరణలో భాగంగా స్త్రీ విద్యాకోసం కందుకూరి వీరేశలింగం కృషి అనిర్వచ నీయమైంది. "స్త్రీలనవిద్యావంతులుగా చేసినచో వారు సమస్త సత్కార్యములయందును మనతోనేకీభవించి మన పురోగ భివృద్ధిలో సహాయురాండ్రగుదురు. స్త్రీల విద్యావంతులుగా ఉంచినచో వారు సంస్కారముల యందును మనతో కల హించి మన పురోభివృద్ధికి ప్రతిబంధకారిణులగుదురు. కాబట్టి పురుషుని వృద్ధిని గొరువారందరు తప్పక స్త్రీలను విదుషు లునుగా చేయ సర్వప్రయత్నములను జేయవలను అని పురుషుల పురోభివృద్ధికై స్త్రీ విద్య అవసరమని పంతులుగారు వాదించారు[1].

స్త్రీ విద్యను నిషేదించినంత కాలం సామాజిక ప్రగతి ఉండదని స్త్రీ విద్యావశ్యకతను సమర్థిస్తూ, పేక్కు వ్యాసాలు వ్రాసి ప్రచురించారు. ఉపన్యాస వేదికల ద్వారా కూడా స్త్రీ విద్యను గూర్చి ప్రచారం చేశారు. శ్రుతులలో ఎక్కడా స్త్రీ విద్యా నిషేదింపబడి ఉండలేదు. స్మృతులయందు స్త్రీలు వేదమంత్రముల పఠియింపనర్హురాండ్రుని కొన్నింటియందు కానబడుచున్నది. అందుచే సుదతలు తదితరమైన చదువులు చదవ వచ్చునని విదితమగుచున్నది గదా అని వీరేశలింగం గారు అన్నారు. ఇంకా స్త్రీలు చదివి వివేకముగలవారైన పక్షమున తామెప్పుడును పరుష వాక్యమును తిట్లను నోట రానియ్యక యెవ్వరితోనూ కలహము పెట్టుకొనక శాంతత కలవారయి మంచి, నడవడిక గల వారయి యుందురు. 'తల్లి సాలు పిల్లలకు వచ్చునన్న' సామెత ప్రకారం తల్లి మంచిదగుట వలన బిడ్డలను మంచి నడతగలవారై, అందరకును ముద్దుగా నుందురు అని స్త్రీ విద్యా ప్రాముఖ్యాన్ని 19వ శతాబ్దంలో వీరేశలింగం పంతులుగారు తెలియజెప్పారు. "భారతీయ సమాజంలో స్త్రీలకు సమున్నత స్థానం ఉంది. ఉన్నతమైన, ఉత్కృష్టమైన ఉత్తేజితమైన, ఉత్సాహాపూరితమై పురుషుని జీవితానికి ఆలంబన స్త్రీ. పురుషుని జీవితంలో పెనవేసుక పోయిన స్త్రీని ధర్మపత్నిగా, అర్థాంగిగా గౌరవిండం మన భారతీయ సంప్రదాయం[1] అని వీరేశలింగం గుర్తించారు. కాబట్టి స్త్రీలను విద్యాధికులను చేయాలని పరితపించారు.

దవళేశ్వరంలో తాను ప్రధానోపాధ్యాయునిగా ఉన్న కాలంలో 1874లో ఒక బాలిక పాఠశాలను స్థాపించారు. పదేండ్ల తరువాత రాజమండ్రిలో మరొక బాలిక పాఠశాలను స్థాపించ టానికి కారకులైయ్యారు. 1905 రాజమండ్రిలో తాను స్థాపిం చిన మరొక ఉన్నత పాఠశాలలో బాలురతో పాటు బాలికలకు కూడా ప్రవేశం కల్పించి - 'సహ విద్యావిదానం' ప్రవేశపెట్టిన ప్రథములుగా వీరేశలింగం గారు పేరుగాంచారు. "నాటి స్త్రీల దుస్థితికి తపించి వారిని కూడా విద్యావివేకాదులతో మంచి స్థితికి తేవాలని, స్త్రీల కోసం ప్రత్యేకంగా 'సతిహితబోదిని' అనే పేరుతో మాస పత్రికను ప్రారంబించి, వారికి ఉపయోగపడే వ్యాసాలు వ్రాసారు. వారి కోసం 'చంద్రమతి చరిత్ర' అనే కథను, 'సత్యసంజీవిని' అనే నీతిబోధకమైన పుస్తకాన్ని, దేహారోగ్య ధర్మబోధిని, పత్నీహిత సూచిని అనే పుస్తకాలను, సత్యాద్రౌపతి సంవాదం అనే సంవాద రూపక పద్య కావ్యాన్ని వ్రాసారు. వారి కోసమే 'మాతృపూజ', 'పితృపూజ' అనే ద్విపద కావ్యాలను కూడా వ్రాసారు[2]. ఈ విధంగా స్త్రీ విద్యా ఉన్నతి కోసం అహర్ని షలు పాటుపడ్డాడు పంతులు గారు. తల్లులు మూర్కు రాండ్రయి గయ్యాళి గంపలయిన యెడల బిడ్డల చదువు తిన్నగా రాక మూర్ఖులయి, దుర్మార్గులయి చెడిపోయి కడపట తాము దు:ఖములపాలై, తమ వారికి కూడా దు:ఖమును తెచ్చి పెట్టెదరు అని పంతులు గారు హెచ్చరించారు. స్త్రీల యందిట్టి మౌఢ్యము, అజ్ఞానము తొలగించవలెనన్నచో, వారిని విద్యా వివేకము గలవారినిగా చేయవలను. అజ్ఞానాంధ కారమును బొగొట్టుటకై వివేక సూర్యోదయమునకు మించిన సాధనము లేదు. స్త్రీలు విద్యావంతురాలైన గాని సంసారము లయందు నెమ్మదియు సౌఖ్యమును గలుగజాలవని పంతులు గారి విశ్వాసము.

ఈ విధంగా కందుకూరి వీరేశలింగం పంతులు గారు స్త్రీ విద్యా ప్రాదాన్యాన్ని బలంగా వినిపించారు. పంతులుగారు చేసిన అవిరళ కృషికి ఆయనకు ప్రభుత్వం వారు 'రావ్ బహుద్దార్' అని బిరుదుతో సత్కరించింది. ఆ రోజుల నుండి నేటి కాలం వరకు స్త్రీ విద్య విషయాలో నిర్లక్ష్యం జరుగుతూనే ఉంది. నేటి స్త్రీ తలుపులు తెరచి పారిపొమ్మని చెప్పినా పారిపోలేని ఖైది స్థితిలో ఉంది. అమె సమాజపు సంకెళ్లలో బందీ. ఇలాంటి పరిస్థితి పోవాలంటే స్త్రీలు ఖచ్చితంగా చదువుకోవాల్సి ఉంంటుంది. విద్యను మించిన దనము లేదు కాబట్టి విద్యను నేర్చుకొని అనేక మౌఢ్యములను వదిలించు కోవచ్చు. అన్న పంతులుగారి మాటలు అక్షర సత్యం.

## సంప్రదించిన గ్రంథాలు :

1. తెలుగు త్రైమాసిక వైజ్ఞానిక పత్రిక - ఏప్రిల్ జూన్, 2012.
2. కందుకూరి రాజశేఖర చరిత్రము - పరిశీలన (అముద్రిత గ్రంథము)
3. స్వాతంత్ర్యానంతర తెలుగు కవిత్వంలో సంఘ సంస్కరణ.
4. నూరుగురు తెలుగు ప్రముఖులు
5. శత వసంత సాహితీ మంజీరాలు
6. విశాలాంధ్ర (ఆదివారం) 3 మార్చి, 2013

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# అంతరించిన ఆదర్శాలు - కథలు - జీవిత సత్యాలు

- నల్ల సమ్మయ్య పరిశోధక విద్యార్థి, ఫెల్లోషిప్ అవార్డ్ (డిజీబిలిటి), తెలుగుశాఖ, కాకతీయ విశ్వవిద్యాలయం, వరంగల్.

అంతరించిన ఆదర్శాలు కథల సంపుటి రేగులపాటి విజయలక్ష్మి గారి రెండవ కథా సంపుటి ఇది 2012లో ప్రచురింతమైనది. ఈ కథా సంపుటిలో 17 కథలు, ఒకనాటిక వుంది. విజయలక్ష్మి గారి కథల్లో ప్రధానంగా స్త్రీ పాత్ర కనిపిస్తుంది. తమ కుటుంబంలో స్త్రీ ముఖ్యపాత్ర పోషిస్తూ, కుటుంబ అభివృద్ధి తోడ్పడుతుంది. వీరి కథల్లో మానవ సంబంధాలు సామాజిక దృష్టి, సామాజిక స్పృహ చింతన, అలజడి కనబడతాయి.

అంతరించిన ఆదర్శాలు కతల సంపుటిలో మొదటికథ రక్తబంధం. ఇల్లెందుల బూదవ్వ కొడుకు పన్నెండేళ్ళ వయస్సలో అచ్చిరెడ్డి గోడ్లుకాసేటోడు. గొడ్లను ఊరవతతొలి మర్రిచెట్టు కింద ఆడే పిల్లలతోని ఆడుకుంటాడు. ఆవులు, బర్రెలు, చెన్లల్లపడ్డాయి. కోపం దుడ్డెను నాలుగు బాదాడు. దుడ్డె చచ్చి పోతుంది. అందుకు పటేలు కొడుతాడని పారిపోయాడు. అప్పుడు పారిపోయిన పెద్ద కొడుకు నర్సయ్య ఇప్పుడు వచ్చాడు. బూదవ్వ చిన్న కొడుకు సాయన్న నిన్ననే బొంబాయి పోతాడు. పెద్ద కొడుకు తిరిగి రావడం బూదవ్వ ఎంతో ఆనందించింది. పెద్ద కొడుకు నర్సయ్య బొంబాలో స్థిరపడ్డారు. భార్య ఇద్దరు పిల్లలు. ఎప్పుడో తప్పిపోయిన అన్న వచ్చినడని తన కూతురును అల్లున్ని రమ్మన్ని చెప్పింది బూదవ్వ. వారికి బంగారు గొలుసు, బట్టలు ఇచ్చాడు నర్సయ్య. నర్సయ్య చెల్లె ఇంటిలో రెండురోజులుండి, కొద్దిరోజులు మామల ఇంట్లో ఉంది. తల్లి తీసుకొని బొంబాయి వెళ్ళి బొంబాయిలో మామ కొడుక్కు పని చూపి లెటరు రాస్తాడు నర్సయ్య.

ఎన్నడో పారిపోయిన నర్సయ్య మళ్ళీ తన వాళ్లను ఎతుక్కొంటూ వచ్చిన వారిని ప్రేమగా చూసుకోవడం రక్తబంధంగా చెప్పబడింది. ఎన్ని ఏండ్లు గడిచిన రక్తబంధం తెగిపోదు అని ఈ కథ నిరూపిస్తుంది.

'రాబందులు కథ'లో ఊర్మిళ, రమేష్ దంపతులు, వీరికి పిల్లలులేరు. ఎంతో ప్రయత్నించిన ఫలితం లేకపోయింది. ఎంతో కష్టపడి రైసుమిల్లు, ఇల్లు, సంపాదించాడు. ఒకనాడు ఏమిలేని రమేష్ లక్షలు సంపాదించాడు. కాని పిల్లలు లేకపోవడం ఎంతో బాధను కల్గిస్తుంది. ఇదే అదనుగా వారి చుట్టాలు ఊర్మిళ తరపువారు, రమేష్ తరుపువారు వారి పిల్లలను పెంచుకొని దత్తకు తీసుకోవాలని ఒత్తిడి చేస్తారు. తాను పేదరికంలో ఉన్నప్పుడు ఎవరు సహాయం చేయలేదు. ఇప్పుడు అందరు వస్తున్నారని, వారిని ధరిచేరనీయక, ఆనాథ ఆశ్రమానికి వెళ్ళి నచ్చిన బాలున్ని ఎంచుకొని సాదుకొంటారు. ఆ సాదు పిల్లవాడు రవీంద్ర. డాక్టరై పల్లెటూర్లో ప్రాక్టీస్ పెట్టుతాడు. కష్టకాలంలో సహాయం చేయని బంధువులు, ఆర్థికంగా ఎదగడంలో వారి పిల్లవాణ్ణి పెంచుకోమనడం వారిని నిరాకరించి అనాథను తెచ్చుకోవడం అతన్ని ప్రయోజకున్ని చేయడం ఈ కథలో కనిపిస్తుంది.

'తరుణితెగువ' కథలో గోవిందరెడ్డి, ఆర్.టి.సి. డ్రైవర్. అతని భార్య శోభ. వారికిద్దరు పిల్లలు. కొడుకు పెద్దవాడు వాని పేరు ప్రసాద్. బిడ్డ పేరు పల్లవి. ఇద్దరు పిల్లలు బాగా చదువుతున్నారు. గోవిందరెడ్డి తన జీవితంలో తాగుడు, ఫ్రేండ్స్‌తో హవారగా డబ్బు ఖర్చుచేస్తాడు. పిల్లలను అంతగా పట్టించుకోడు. కొడుకు పదవ తరగతిలో మంచి మార్కులతో పాసు అవుతాడు. మంచి కాలేజీ తనకు ఫ్రీ సీటు ఇస్తుంది. కాని పై ఖర్చులు కావాలంటూ తండ్రితో ప్రవీణ్, గోవిందరెడ్డి శోభను తన పుట్టింటికి వెళ్ళి డబ్బులు తెమ్మంటాడు. శోభ అందుకు నిరాకరిస్తుంది. రెండవ పెండ్లి చేసుకుంటానని బెదిరిస్తాడు. అందుకు శోభ సరేనంటుంది. ఎన్ని రకాల ఎత్తులు వేసిన శుభ నిర్భయంగా సమాధానం చెబుతుంది. విశ్వాసంతో జీవితాన్ని గడపాలని, భర్తల వేధింపులతో ఆత్మహత్యలు చేసుకోవద్దని, ఈ కథలో సారంగా కథ నడిచింది.

విధివక్రీకరించింది కథలో పార్వతి, రఘురామ్ దంపతులు, దేవిక, సుదర్శన్ దంపతులు, పక్క పక్క ఇంటివారు. దేవికకి ఇద్దరు కొడుకులు, ఒక కుమార్తె పెద్ద కొడుకు పేరు సతీష్ ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. రెండవ కొడుకు సంపతు పోలీసు ఉద్యోగం. బిడ్డ సాకేరి హైదరాబాద్‌లో పి.జి చేస్తుంది. సాకేరి బస్సు ఎక్కుతుండగా కాలుజారి కిందపడి చనిపోతుంది. తల్లిదండ్రుల కూతురు మరనంను జీర్ణించుకోక ముందే, పెద్ద కొడుకు సతీష్ మోటరు బాగు చేస్తూ, కరెంట్‌షాక్‌తో మరణిస్తాడు. చిన్న కొడుకు పోలీస్ ఉద్యోగానికి వద్దని తల్లిదండ్రులు వారించినా, సంపతు ఉద్యోగానికి వెళ్ళుతాడు. అయితే, నక్సలైట్లు ఎన్‌కౌంటర్ సంపత్తు చనిపోతాడు. పుట్టి పెరిగిన ముగ్గురు చనిపోవడంలో దేవిక, సుదర్శన్ దంపతులను పార్వతి వారిని ఓదార్చుకుంటుంది. ఒక రోజు దేవిక సుదర్శన్ విషం తీసకొని చనిపోవాలని చూస్తారు. అంతలో పార్వతి వారిని వారిస్తుంది. "మనకడుపున పుడితేనే బిడ్డలా? తల్లిదండ్రులను పోగొట్టుకున్న బిడ్డలెందరో" అని పార్వతి నచ్చజెప్పడం ఓ అనాద పాపను తెచ్చుకొని వెన్నెల అని పేరు పెట్టి పెంచుకుంటారు. దేవీక సుదర్శన్‌లు అగాధమైన వారి జీవితంలో ఆ పాప వెన్నెల కలుగవుతుంది. ఈ కథ హృదయ విధారకంగా నడుస్తూ చివర కొత్త వెలుగును ప్రసరించేదిగా వుంది.

''ఔన్నత్యం' కథలో పెంటయ్య భార్య సావిత్రి. పెంటయ్య తన పేరు బాగా లేదని బాధపడుతున్న సందర్భాలెన్నో. అందుకే తనకు పుట్టిన ముగ్గురు కొడుకులకు ఒక బిడ్డకు మంచిపేర్లు పెట్టుతాడు. పెద్ద కొడుకు పేరు భువన చంద్ర, రెండవ కొడుకు పేరు శరత్‌చంద్ర. మూడవ కొడుకు పేరు రామచంద్ర, బిడ్డ పేరు స్వాతి. విషజ్వరంతో మరణిస్తుంది. ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడు పెంటయ్య. ప్రైవేట్ స్కూల్స్ పెట్టి పెద్ద కొడుకును హాస్టల్‌పనులు, చిన్న కొడుకు స్కూల్ టీచర్స్‌గా ఉంటారు. చిన్న కొడుకు ప్రభుత్వ ఉద్యోగి, మిగిలిన వీరి భార్యలు కూడా వారి ప్రైవేట్ స్కూల్ లోనే పనిచేస్తారు.

ఒకనాడు పిల్లలను ఉద్దేశించి శరత్‌చంద్ర ఇక్కడ తదివిన వారు డాక్టర్లుగా, ఇంజనీర్లు, ఐ.ఎ.ఎస్. అయినారు మేం మాత్రం ఇక్కడే ఉన్నాం. అని ప్రైవేట్ స్కూల్స్ నడిపేవారి వ్యధను తెలుపుతాడు. ఈ కథ టీచర్ బాధల్ని చిత్రించినా, వారు సమాజానికి ఎంతో అవసరం.

'అలుపెరుగని మహిళ' కథ మధ్యతరగతి కుటుంబంలో మహిళ జీవితాన్ని తెలిపారు రచయిత. మానేరు ముంపులో మునిగిపోయే గ్రామం వీర్లవంచ. ఆ గ్రామంలో సాయిరెడ్డికి ముగ్గురు కూతుర్లు. రెండవ కూతురు పల్లవి, సాయిరెడ్డి ముంబాయికి వలస వెళ్ళడం వల్ల రెండవ అమ్మాయి పల్లవికి హిందీ బాగా మాట్లాడడం వచ్చు. కొద్ది రోజుల తర్వాత సాయిరెడ్డి పిలల్ని భార్యను వీర్లవంచలో ఉంచి, తానే ముంబాయికి వెళ్ళి సంవత్సరంకు ఒక నెల వస్తూ ఉండేవాడు.

మొదటి అమ్మాయి పెండ్లి అవుతుంది. అల్లుడు ఇల్లుటము వస్తాడు. రెండవ కూతురు పల్లవి. పల్లవి ప్రధాన పాత్రగా కథ సాగుతుంది. పల్లవి వరద వెళ్ళి గ్రామంలోని వినయ్‌ని పెండ్లి చేసుకుంటుంది. అత్తా అహల్య చాలా మంచిది. వీరు జ్యోతినగర్ కరీంనగర్‌లో ఉంటుంటారు. పల్లవికి ఇద్దరు పిల్లలు. ఆ పిల్లల్ని అత్త సవరిస్తుంది. పల్లవి అత్త అహల్యను ప్రోత్సాహించి చదివిస్తుంది. ప్రైవేట్ స్కూల్ టీచర్ పని చేస్తుంది. అప్పుడు అత్తా, కోడళ్ళు లొల్లి పెట్టుకుంటారు. అత్త అహల్య కూతురు ఇంటికి పోతుంది. పల్లవికి స్కూల్, ఇంటిపని భారంగా ఉంటుంది. అత్తను తోలుకరమ్మని భర్తతో చెబుతుంది. కానీ ఇంటికి వచ్చిన అత్త ఆరోగ్యం చెడిపోతుంది. చివరికి అత్త అహల్య చనిపోతుంది.

పల్లవి కష్టపడి టీచర్ ఉద్యోగం సంపాదించుకుంటుంది. మంథనిలో ఆమె ఉద్యోగం రాను పోను బస్సుకు రెండున్న గంటల ప్రయాణం పిల్లలు 6, 5వ తరగతులు చదువుతున్నారు. ఇలోగ పల్లవి తండ్రి చనిపోతాడు. తల్లి చనిపోతుంది. పల్లవి బాగా దుఃఖిస్తుంది. కథా చివరలో పల్లవి ఒక సొంత ఇల్లు కట్టుకుంటున్నట్లుగా ముగుస్తుంది.

''పేకాట తెచ్చిన ముప్పు'' కథలో కరీంనగర్‌లో ఉంటున్న దంపతులు సావిత్రి, ప్రవీణ్‌లు. వారికిద్దరు బిడ్డలు, మహిత, మానస. ప్రవీణ్ సౌదికిపోయి పదిహేను లక్షలు దాకా సంపాదించుకొని కరీంనగర్ వచ్చాడు. ఇద్దరు ఆడపిల్లలు పెండ్లికి ఎదిగారు. బాగా చదువుతున్నారు. సావిత్రి సాధ్వి. ప్రవీణ్ సౌదిలో సంపాదించిన డబ్బులో 2 లక్షలు పేకాటలో పోగొట్టుకుంటాడు. ఇంతలో మహిమకు పెండ్లి కుదిరింది. ఇంతలో హైదరాబాద్‌లో పేకాటలో పది లక్షలు పోగొట్టుకుంటాడు ప్రవీణ్ స్నేహితులు ప్రోద్భలంలో ఇంట్లో సావిత్రికి తెలిసింది. సావిత్రి బాధపడుతుంది ఈ విషయం పెండ్లి వారికి తెలుస్తుంది. వారు మీకు వీలును బట్టి పెండ్లి చేయండి అని అంటారు. మహిత వివాహం జరుగుతుంది వెంకటేశ్‌తో. వీరిద్దరు హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తారు. చెల్లెలు మానస గురించి భర్తతో చెబుతుంది మహిత. భర్య భర్తలిద్దరు మానసకు ఆర్థికంగా తోడ్పడుతురా ? ఆమే దుబాయికి 25 వేల జీతం చేస్తుంది. అక్కడ ఇండియన్ పెండ్లి చేసుకుంటుంది. పేకాట వల్ల జరిగిన నష్టాన్ని ప్రవీణ్ బాధపడుతాడు. అయితే ఈ కథ, పేకాటకన్నా, వియ్యంకులు మంచి వారు కావడం, భర్త మంచివాడు కావడం వల్ల ఈ కథ సుఖాంతంగా ముగిసింది. ఈ కథలో మలుపు తిరుగుతుందో అనుకునే పరిస్థితిని సృష్టించిన రచయిత. కథను సాఫిగా నడిపింది.

తిరుగబడిన భార్య 'కథలో ముగ్గురు ఆడపిల్లల తల్లి లక్ష్మి. భర్త కనకయ్య బొగ్గుబావిలో పనిచేస్తాడు. కనకయ్య లక్ష్మిని మనిషిగా చూడడు. గోదావరిఖనిలో ఇల్లుకట్టి, తన సొంత గ్రామమైన ఇరుకుల్లలో భూములు కొన్నాడు. కాని భార్యంటే చులకన. తిట్లు, అవమానాలు. దీనితో లక్ష్మికి మతిమందగిస్తుంది. లక్ష్మి పిచ్చి అని పిచ్చాసుపత్రిలో వేస్తారు. కొంత కాలానికి లక్ష్మి బాగానే ఉంది. ఒక రోజు తాను దాచి పెట్టుకున్న గొడ్డలితో భర్తను చంపివేస్తుంది. ఈ సంఘటన కనకయ్యలాగా ప్రవర్తించే సంతోష్‌రెడ్డి బాగా ఏడ్పించింది. సంతోష్‌రెడ్డి భార్య సుమతి. ఎందరు భార్యల్నీ చంపడం లేదు. లక్ష్మి భర్తను చంపింది మంచిదే అంటుంది. ఇందులో ఇంకో కథ ఉంది. తెనుగు రాజమ్మకు ముగ్గురు కొడుకులు పెద్ద కొడుకు సాయన్న మెతక మనిషి. అతని భార్య పద్మ చురుకైనది. ఇద్దరు పిల్లలు,సాయన్న తమ్ముడు చేను దగ్గర పద్మను దొరకబట్టి నోట్లో ఎండ్రిన్ పోసి ఎవరికి కనబడకుండా ఉంటాడు. పద్మ చనిపోతుంది. చివరగా రచయిత భార్యను చంపిన భర్త, వదినను చంపిన మరిది. కోడలును చంపిన అత్త, ఇలా ఎందర్ని పొట్టనపెట్టుకుంటారు. ఎదురు తిరిగి వారిని చంపుతే తప్పేందని అంటుంది. సహనం నశిస్తే స్త్రీ రుద్రకాళి అవుతుందని కథ సారాంశం.

'అంతరించిన ఆదర్శాలు' కథలో రజని, భవ్య సత్య ముగ్గరు స్నేహితులు ముగ్గరు బాగా చదువుకున్నారు. వీరు వరకట్నం తీసుకునే వారిని పెండ్లి చేసుకోవద్దు ఇంతకు ముందే వివాహమైన వారిని పెండ్లి చేసుకోవద్దు అనే ఒక ఒప్పందం చేసుకుంటారు. 'సత్య' తండ్రి పేకాట వ్యసనం. ఆస్తి పోగొట్టు కున్నాడు. కట్నమిచ్చి పెండ్లి చేసే స్థాయిలేదు. ఒక రోజు భావ్య రజని ఇంటికి వస్తుంది. రజని తల్లి ప్రేమలత సత్యకు పెండ్లి కుదిరినదని చెపుతుంది. భవ్యకు, రజనికి చెప్పకుండా సత్య నిర్ణయం తీసుకోవడం వారికి ఆశ్చర్యమసింది. 'సత్య'ను చేసుకునే వాడికి ఇది రెండవ సంబంధమని చెప్పి, తస్య ఆర్థికస్థితి అది మంచిదే అని చెబుతుంది భవ్య. రజనీలు వల్లించే ఆదర్శాలు ఆచరణకు సాధ్యంకాదని, సత్యను పెండ్లిచేసుకోనియ్యండని వారిస్తుంది ప్రేమలత. ఇంతలో సత్య తండ్రి శుభలేఖలు తీసుకోని రజని ఇంటికి వస్తాడు. భవ్యకు, రజనీకి శుభలేఖలిస్తాడు. ఆదర్శాలు అంతరిస్తున్నాయి అని ఇద్దరు మిత్రులు బాధపడుతారు.

క్షణికావేశంలో తండ్రి చంపిన కొడుకు కథ. పంక్షన, సంక్రాంతి సంబరాలు పడమటికి వాలినపొద్దు, పరాన్నజీవి, చలలసంబరాలు, దారితప్పిన యువత ఆకాశంలో అనర్థం మొదలగు కథలున్నాయి. వీటిలో కూడా సమాజంలో జరిగినా, సన్నివేశాల సంఘటనలు అత్యంత అర్థవంతంగా సూటిగా తను చెప్పదలచుకొన్న విషయాన్ని కథల్లో చెప్పింది రచయిత చివరనున్న సర్కారుబడి నాటికలో రవి ప్రయివేట్ స్కూల్‌లో బాగా చదవడు. తల్లి శాంతమ్మ రవిని 'నీ చదువుకపోతే నేను మా అన్న ఇంటికి పోతా' అని పోతుంది. తండ్రి పర్శరాములుతో 'నేను బడికి పోతా' అమ్మ రమ్మనుమని సర్కార్ బడికి కొచ్చి పదవ తరగతి పాసైతాడు.

రేగులపాటి విజయలక్ష్మిగారు 'అంతరించిన ఆదర్శాలు' కథల సంపుటిలో విభిన్నమైన వస్తువులలో చిన్న చిన్న వాక్యాలతో సామాన్య ప్రజలకు కూడా సులభంగా అర్థమయ్యే విధంగా కథలు రాసారు. వర్ణాలు, కల్పనలు లేకుండా, వాస్తవికంగా వీరి కథలు చిత్రించబడ్డాయి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# గిరిజన జీవన విధానంలో కాలం తెచ్చిన మార్పులు

- డా॥ కె.ఎన్.వి.వి.ఎస్. నారాయణమూర్తి, బద్రుక వాణిజ్య కళాశాల, అసోసియేట్ ప్రొఫెసర్, కాచిగూడ, హైదరాబాద్.

**ఉద్దేశ్యం :**

గిరిజన జీవన విధానం సమగ్ర చిత్రణలో పూర్వకాలంలో ఉన్న ఆధారాలు, సంప్రదాయాలు వాటిపై కొత్తకాలం తీసుకువచ్చిన మార్పులు, చేర్పులు పరిశీలించడం.

**పరిచయం :**

భిన్న జీవజాతుల సమగ్ర సమాహారం సమాజం. అందులో భారతదేశం మరింత వైవిధ్యభరితమైన జనజాతులకు పేరెన్నికగన్నది. వేల సంవత్సరాల వారసత్వం ఉన్న వివిధ మూల జాతుల సమగ్ర స్వరూపం గిరిజనులు అన్న పదం. విస్తారమైన అడవులు, కొండలు, మైదాన ప్రాంతాలలో ఉండే సంచార తెగలు ముఖ్యంగా అడవిపై ఆధారపడి జీవనం సాగించేవారు. వారు గిరిజనులు, కొండజనులు, అటవీ జనులుగా పేరుపడ్డారు. గిరి అంటే కొండ. కొండ ప్రాంతాలపై జీవనం ఆధారం చేసుకొని జీవించే వీరు ముఖ్యంగా ఆ కొండలపై లభ్యమయ్యే వస్తుసంపదలను తమ జీవికకు ఆధారం చేసుకున్నారు. నేటికి భారతదేశంలో వీరి సంఖ్య సుమారు 4 కోట్ల వరకు ఉందని ఒక అంచనా. పేరెన్నికగన్న 35 తెగలు వీరిలో గోచరిస్తున్నాయి. చెంచులు, బోయలు, గోండులు, సవరలు, బంజారాలు, కొండరెడ్లు, ఆదివాసులు, కొలాములు, నాయకొడ్లు, జాతాపులు మొదలైనవారు. ఆదివాసులు అని కూడా సంక్షిప్తంగా వీరిని గుర్తించవచ్చు.

**గిరిజన సంస్కృతి :**

వీరిది ఒక విలక్షణమైన సంస్కృతి. చిన్న కుటుంబాలు అధికం. కుటుంబంలోని అందరు జీవికకోసం కష్టం చేయాలి. స్వజాతి ఆచారాలతో తమదైన 'చిన్న' సంఘపు నియమాలతో జీవిస్తారు. 'సంఘం వారికి ఎన్నో ఆచారాలు సూచిస్తోంది' అంటారు ఆర్.వి.ఎస్. సుందరం. వంశపారంపర్యంగా వస్తున్న భూమిని తమ ఆస్తిగా, వారసత్వంగా ప్రకటించుకుంటారు గిరిజనులు. వీరిలో బంజారాలు ఎటువంటి స్థిర జీవనం ఉండక సంచార జీవనం గడపడం విశేషం. ఆహారం (కందమూలాలు, గడ్డలు) సేకరించుకొని వేటతో సామాన్య జీవనం కొనసాగించినా వీరిలో కనిపించే స్థైర్య ధైర్యాలు అపరిమితం. వ్యక్తిగత స్వేచ్ఛ, స్వాతంత్ర్యం వీరి సంస్కృతిలో కనిపించే ప్రధాన లక్షణం.

**జీవన విధానం ఆర్బనైజేషన్ :**

గిరిజనులలో కొండ (పోడు) వ్యవసాయం చేసేవారు. చిన్న చిన్న గూడాలలో తమ నివాసాలను ఏర్పరచుకునేవారు. అవి క్రమబద్ధతిలో కాక అవసరార్థం నిర్మించిన గుడిసెలు, ఎటువంటి వాస్తు, ఇతర నియమాలు వీటికి ఉండవు. పోడు వ్యవసాయం చేసుకునే సముదాయాలు ఇవి. ఖచ్చితమైన అర్థంలో వ్యవస్థాపూర్వక నిర్మాణాలను ఇవి ఆనాడు సొంతం చేసుకోలేక పోయినా, నేటి ఆధునిక కాలంలో వచ్చిన మార్పులకు అనుగుణంగా కాలనీలు ఏర్పడ్డాయి.

1980లో హైదరాబాద్ సంస్థానంలో ఆదివాసీ పంచాయితీ వ్యవస్థ ప్రవేశపెట్టడంతో గ్రామ వ్యవస్థ రూపుదిద్దుకుంది. క్రమంగా సీసీ ఇండ్లు, కాలనీలు, రోడ్లు చోటుచేసుకున్నాయి. అయినా ఇంకా అభివృద్ధికి ఆమడదూరంలోనే గిరిజనులు ఉన్నారని చెప్పుకోవాలి.

**గృహం :**

వీరిలో ఇండ్ల నిర్మాణం విశిష్టంగా ఉంటుంది. వీటికి ఏ వాస్తుశాస్త్ర నియమ నిబంధనలు ఉండవు. తమకు నచ్చిన రీతిలో వీటిని నిర్మించుకుని ఉండేవారు. సంచార జాతులు కావడం వలన నివాసం స్థిరత్వంపై కూడా ఎక్కువగా మక్కువ చూపేవారు కాదు. క్రమేణా కాలం తెచ్చిన మార్పుల వలన ఆ గుడిసెలపై మెలమెల్లగా అలంకరణ ప్రీతి పెరిగి వాటి స్థానంలో స్థిర నివాసాలు చోటుచేసుకున్నాయి.

**భోజనం :**

భోజనం చేసే విధానాలలో ప్రపంచం అంతటా రకరకాల సమాజాలలో భిన్నమైన పద్ధతులు ఆచరణలో ఉన్నాయి. పాశ్చాత్యులు మొదలుకొని ప్రాచ్యుల వరకు అగ్రకులాలు మొదలుకొని ఆటవిక జాతుల వరకు వింత వింత విధానాలు విచిత్ర పద్ధతులు ఆచరణలో ఉన్నాయి. పాశ్చాత్యులు మొదలుకొని ప్రాచ్యుల వరకు అగ్రకులాలు మొదలుకొని ఆటవిక జాతుల వరకు వింత వింత విధానాలు విచిత్ర పద్ధతులు, విస్తృతమైన వైవిధ్యంతో గోచరిస్తాయి. ఆటవిక జాతులలో ఈ లక్షణం ప్రత్యేకం. భోజనం చేసే సమయంలో వారు పాత్రలు చేతిలో ముట్టుకొని ఇష్టం వచ్చిన దూరంలో తీరులో కూర్చుని లేదా నిలుచుని స్వేచ్ఛగా భుజిస్తారు. ఇక్కడ స్వాతంత్ర్య ప్రకటన ఎక్కువ. నియమ పాలన తక్కువ.

ముఖ్యంగా మాంసాహారం, కందమూలాలు, దుంపగడ్డలు ఉండగా నియమితమైన స్థలం, కాలం అంటూ భోజనం చేయడానికి ఉండేది కాదు. వర్షాధార పోడు వ్యవసాయం అటవీ సంపద ఆహారంగా జీవించడంతో జంతు మాంసాలను దుంపలను ఎండబెట్టి దాచుకొని వర్షాకాలం

ఇతర కాలాలలో స్వీకరించేవారు. దాచుకోవడం మొదలు కావడంతో సొంత ఆస్తి మమకారం మొదలైంది. భోజన సంస్కృతిలో మార్పు వచ్చింది. క్రమంగా భోజన పాత్ర మొదలు వంట పాత్ర వరకు పద్ధతులు ఏర్పడ్డాయి. ఉడుములు, ఉడుతలు, నెమళ్లు, కుందేళ్ళు, జింకలు, అడవిపందులు, ఊడ పందులు, సీమపందులు, మేకలు, గొఱ్ఱెలు, పక్షులు.. దాదాపు అన్ని జంతువులను ఆహారంగా స్వీకరించే స్థాయి నుండి నేడు ఆధునిక జీవనంవైపు దారి మళ్ళించారు. జొన్న రొట్టె, గట్కా, అంబలి... క్రమంగా మొదలైన భోజనంలోని మార్పు వరి అన్నం, అర్కలు, సజ్జలు, గోధుమలవైపుకు మళ్ళింది. ఎల్లిపాయ కారం, గుంటుకారం, చింతాకుచారు నుండి కొత్త రుచులవైపు దారి మళ్ళింది. సంస్కృతీకరింపబడిన జాతుల ఆహారపు అలవాట్లను వారు తమవిగా చేసుకున్నారు.

**ఆభరణాలు - అలంకారాలు :**

దుస్తులు, ఆభరణాల వల్ల వ్యక్తిత్వం గుర్తించవచ్చు. 'వస్త్రేణ వపుషా వాచా' అని అన్నారు. స్త్రీ పురుష భేదాలు, చిన్న పెద్ద తారతమ్యాలు, కుల వ్యత్యాసాలు, ప్రాంతీయ వైవిధ్యాలు వీటివల్ల బయటపడతాయి. రంగురంగుల పూస లతో కేవలం నడుముకు మాత్రం చిన్న వస్త్రం ధరించి గిరిజన స్త్రీలు కనిపించగా, నడుముకు చిన్న వస్త్రం గోచీవలె పెట్టుకొని మాత్రం పురుషులు కనిపిస్తారు. కొన్ని తెగలలో శిరస్త్రాణం (రుమాలు) రాతక్ పాకడి (ఎర్రపాగ) ఉంటుంది. ఎంతపెద్ద ధోతీనైనా కేవలం నడుము మాత్రానికి చుట్టివేయడం వీరి లక్షణం. బంజారాలలో జాంగియా, జగలా (అంగి)లతో పురుషులు కనిపించగా, ఫేటియా (లంగా) లాయణ్ (నడుముపై ధరించే వస్త్రం) లేఫో (గవ్వలతో కుట్టిన వస్త్రం) కాంచలి (రవిక)లతో స్త్రీలు కనిపిస్తారు. వెండి రూపాయి బిళ్ళలు, అద్దాలు, గవ్వలతో కుట్టిన కంట్లీ, పేట్లి వీరి ప్రత్యేకతను చాటి చెపుతాయి. వివాహమైనవారు ధరించే వస్త్రం టుక్రీ (అంటే పైట అని అర్థం). గాల (చుట్టబట్ట)ను దేవతలను అర్చించే సమయంలో వీరు ధరిస్తారు.

వెండి, రాగి ఉంగరాలు, మర్కి కమ్మలు, చెవిపోగులు, ముంజేతి కడియం, మొలతాడు, కాళ్ళకు చేతులకు వెండి కడియాలు పురుషులు ధరిస్తారు. కన్యా (చెవిపోగు) భురియా (ముక్కుపుడక), సాంక్లి, కపోటియా, కోల్డా (మెడకు, కాళ్ళకు ధరంచే ఆభరణాలు) స్త్రీలు ధరిస్తారు. బంజారాలలో ఇది కనిపిస్తుండగా గిరిజనులలో మాత్రం ఎటువంటి ఆభరణాలు కనిపించవు. అధికంగా వీరు పూసలు, గురివింద గింజలు మొదలైనవి ధరిస్తారు. బేసరి (ముక్కుపుడక) తప్పనిసరి.

నేటి కాలంలో బంగారు పుస్తెలు, వెండి మట్టెలు, నల్లపూసలు, బంగారు ఉంగరాలు, సంస్కృతీకరణ పొందిన జాతులవారివలె ధరిస్తారు. వెండి ఆ రోజుల్లో అధికంగా వినియోగించగా నేడు బంగారం ఆ స్థానాన్ని భర్తీచేసింది.

**వస్తు సంస్కృతి :**

ఇళ్లు, ఇంట్లోని వస్తువులు, ఆహార పానీయాలు, దుస్తులు, ఆభరణాలు, పచ్చబొట్లు, పెంపుడు జంతువులు, చేతి వృత్తి పనిముట్లు, వాద్య పరికరాలు అనేకం ఇందులో చోటుచేసుకున్నాయి. కుండలు అధికం. గడక (అన్నం వండే కుండ), కొబ్బరి చిప్పలను శుభ్రం చేసుకుని గ్లాసులవలె వాడడం విశేషం. ఘట్టి (విసుర్రాయి), ఉకలి (రోకలి), కవ్వం (జేణి), మట్టిపెనం (టుక్రీ) వాడేవారు. నేటి కాలంలో ఇవన్నీ అటకెక్కాయి. వీటి స్థానంలో ఆధునిక వస్తువులు చోటు చేసుకున్నాయి. పచ్చబొట్లు మానేశారు. మట్టిపాత్ర స్థానంలో జర్మన్ సిల్వర్ పాత్రలు (అల్యూమినియం), స్టీలు పాత్రలు వచ్చాయి. ఇనుప పెనం, గ్యాసుపొయ్యి, మిక్సీ, గ్రైండర్లు కూడా వచ్చేశాయి. ఒకరకంగా అన్ని ఆధునిక గృహోపకరణాలు ఇంట్లో దూరాయని చెప్పవచ్చు.

గుడిసె ఇల్లుగా మారింది. మట్టిపాత్రలు స్టీలు పాత్రలయ్యాయి. పచ్చబొట్లు మాత్రం సినిమా హీరోయిన్లను ఆకర్షించాయి. వారిని ఆశ్రయించాయి.

**ఆచార వ్యవహారాలు :**

పుట్టుకనుంచి మరణం వరకు గిరిజనులకు విశేషమైన ఆచారాలున్నాయి. మనిషి జీవితంలో మొదటి ఘట్టం పుట్టుక, చివరిఘట్టం చావు.

బయటి వైద్యులను సంప్రదించకపోవడం, తండా గూడెంలోని మంత్రసాని ఇచ్చే నాటుమందుల వాడకం, చెరువుకట్టపై మన్ను మందుగా తినడం బాలెంతకాయం, బాలెంత ఆహారం (ఖురాకి) బంజారాలలో కనిపించినంతగా ఇతర గిరిజనులలో కనిపించదు. బిడ్డకు జన్మ ఇవ్వగానే ఆ స్త్రీ ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా నిత్య జీవన వ్యవహారంలోకి ప్రవేశిస్తుంది. బాలెంతను పొయ్యిదగ్గరకి రానివ్వక పోవడం వంటివి వీరిలో అంతగా కనిపించవు. పురుడు ఇబ్బంది అయితే వాతలు పెట్టే మోటు వైద్యం కూడా ప్రాచుర్యంలో ఉంది. పెండ్లి సగాయి, బట్టలు, పుష్పవతి కావడం, అన్న భార్యను తమ్ముడు పెండ్లి చేసుకోవడం, బహుభార్యత్వం, విడాకులు, అతి సులభంగా తీరిపోయే తగాదాలు ఇక్కడ పరిశీలనకు ఉదాహరణీయం. ఇష్టం ఉంటే కలిసి ఉంటారు. లేనిపక్షంలో కులపెద్ద/ గూడెపు పెద్ద అనుమతితో తప్పుకట్టి విడిపోతారు. అయితే ఈనాటి కాలంలో ఇవన్నీ చాలావరకు నశించాయి. ఆధునికుల వలె సంఘ నియమాలు వీరు పాటిస్తున్నారు. గూడెం కట్టుబాట్లు ఆచార సంప్రదాయాల స్థానంలో 'సంఘ' నియమాలు వచ్చాయి. బహుభార్యత్వం

ఇప్పుడు లేదనే చెప్పాలి. అయితే వైద్య సదుపాయాలు ఇంకా వారికి లభ్యం కావడంలేదు. అందుకు ప్రభుత్వ విధానాలే కొంతవరకు కారణం.

కర్మకాండలు శవదహన సంస్కారాలు ప్రతి సమాజంలో ఉన్నాయి. చనిపోయిన వారిని ప్రతి సమాజం వారి మతానుసారం దహనం చేయడమో, ఖననం చేయడమో జరుగుతుంది. పెండ్లయిన వారైతే దహనం చేయడం, పెండ్లి కానట్లయితే పూడ్చడం ఆచారం. చివరి సమయంలో నోటిలో బెల్లం ముక్క పెట్టడం బంజారాల ఆచారం. ఇతర గిరిజనులలో కూడా ఇటువంటి ఆచారమే ఉంది. ఈనాటి కాలంలో మాత్రం ఆ సమయంలో బంగారు పిసరు వినియోగిస్తున్నారు. పాడె కట్టడం (ఖాట్) సాధారణం. చిన్నవయసులో అర్థాయుష్షు మరణం చెందినట్లయితే మూసిన కనురెప్పలపై సూదులు గుచ్చే ఆచారం ఒకనాడు పాటించినా, కాలం తెచ్చిన మార్పుతో ఈ ఆచారం నేడు అంతరించింది.

## పూజలు, నైవేద్యాలు :

అడవితల్లికి పూజలు చేయడం, బోనం సమర్పించడం, సిగాలు రావడం, దేవత పూనడం మొదలైన విశేషాలు గిరిజనులకే సొంతం. కొండతల్లి, అడవితల్లి, కొండదేవత వీరికి ప్రధానం. మాతృదేవతారాధన అని చెప్పే ఆదిమ కాలంనాటి సంస్కృతికి శేషభావనలు ఇవి. బలులలో జంతుబలి సహజం. సాకపోయడం, కొమ్ముబూరలతో దేవతలకు ఆహ్వానం పలకడం, జంతువులను బలి ఇవ్వడం నాటి కాలంలో ఉండగా, ఇప్పుడు ఈ వ్యవహారం తగ్గింది.

మైసమ్మ, పోచమ్మ, సమ్మక్క, సారలమ్మ, లక్ష్మీ నరసింహదేవర, కొండదేవర, వేములవాడ రాజన్న క్రమంగా గిరిజనుల జీవితాలలో స్థలం సంపాదించారు. ప్రేత ఆరాధన అధికమైంది. శకునాలపై విశ్వాసాలు పెరిగాయి. దయ్యం పట్టడం వదిలించుకోవడం రెండూ చోటుచేసుకున్నాయి. కాలం ఈ విశ్వాసాలలో మట్టుకు ఎక్కువ మార్పును తేలేకపోయింది. వెంకటేశ్వరస్వామి (బాలాజీర్‌భోగ్), తుల్జాభవాని, మత్రాల్ భవాని, మేరమ్మ భవాని, ఇంకా భక్తి విశ్వాసాలతో కూడిన దేవతారాధన కూడా చోటుచేసుకుంది.

## సంప్రదాయాలు :

గిరిజనులు సంప్రదాయ పద్ధతుల్ని పట్టుదలతో పాటిస్తారు. నృత్యం, గానం, కొండదేవతలను ఆరాధించడం, పట్టుదలతో నమ్మకాలను వదులుకోలేకపోవడం వీరి సంప్రదాయం. సామూహిక కర్తృత్వమే వీరి సంప్రదాయాలలో విశేషంగా కనిపించే అంశం. పండుగలు, పబ్బాల సమయాలలో గిరిజనులు సమిష్టిగా కలిసి నిర్వహిస్తారు. విందులు, వినోదాలలో మద్యం సేవించడం, పాటలు పాడడం, సామూహికంగా నృత్యం చేయడం ఆటవిక సంచార జాతులలో సాధారణం. అయితే కాలం తెచ్చిన మార్పులకు అనుగుణంగా వీరిని వ్యష్టి జీవితాలైనా, గూడెంగా ఉండే ప్రభావం తగ్గింది. 'సంఘం' ప్రభావం పెరిగింది. చిన్న చిన్న కుటుంబాలు ఒక గూడెంగా ఉన్న ఆ రోజులలో గూడెం నిర్ణయాలు కరాఖండిగా పాటింపబడేవి. ఈనాడు ఈ విధంగా ఉండడం లేదు. వైయుక్తిమైన భావజాలం చోటుచేసుకుంది.

## గుళ్ళు, మంత్రాలు :

కనిపించే ప్రతికొండ, బండ, రాయి, చెట్టు, గాలి ప్రకృతిలోని ప్రతి తత్వము వారికి దైవంతో సమానం. రాయిని దైవంగా భావిస్తారు. పసుపు కుంకుమలు అర్పిస్తే అదే వారికి గుడి గోపురం.

మననం చేయడం ద్వారా రక్షించేవి మంత్రాలు. గిరిజనులలో ఉన్న విశ్వాసాలకు అనుగుణంగా వారి భాషలలోనే ప్రార్థనా పూర్వక విన్నపాలు ఇవి. కొండదేవరకు, అమ్మతల్లికి విన్నపం ఏ విధంగా తమను రక్షించమని వన్నివించుకుంటారో, ఆ విధంగానే కోరికలు తీరక చిన్న వయసులో మరణించినవారు దయ్యాలై పీడిస్తారని వారిని వదిలించుకోవడం కూడా మంత్రాలతో సాధ్యమని వారి నమ్మకం.

దయ్యాలని మంత్రాలతో వదలగొట్టడం వీరిలో సాధారణం. రామ్ రామ్ అనే శబ్దోచ్చారణ వీరిలో అధికం. వీరి మంత్రాలకు శాబర మంత్రాలు అని పేరు. పాముకాటు, ఇతర విషకీటకాల కాటు, సర్పకాటు ప్రయోగాలు ఇవన్నీ కూడా శాబర మంత్రాలతో సుప్రసిద్ధం. ఇది సాధించడానికి అనేక క్షుద్ర నియమాలను పాటించాల్సి వచ్చేది. ఈనాటి కాలంలో ఈ విద్యలన్నీ మరుగునపడ్డాయి. విశ్వాసాలు ఉన్నా, మంత్రం, తంత్రం, ప్రయోగం, కొంచెం తగ్గాయని చెప్పాలి.

## విద్య :

విలువిద్య, పోడు వ్యవసాయం, వేట గుడిసెల నిర్మాణం జీవనానికై నిత్యజీవన వ్యవసాయానికై వలసిన విద్య ఆ రోజుల్లో ఉండగా, నేడు ప్రభుత్వ పథకాల వల్ల స్కూలు విద్య ఆరంభమైంది. లిపిలేని వీరి భాషలకు లిపి కూడా ఏర్పడింది. నాటి కాలంలో మౌఖికం నేడు లిపి పూర్వకం. దేవనాగరికి సమీపంలో ఈ లిపి ఏర్పడడం విశేషం. ప్రభుత్వ పాఠశాలలు నేడు గూడాలలో తండాలలో ఏర్పాటుకావడం ప్రభుత్వ రిజర్వేషన్లు, వివిధ పథకాల ద్వారా చర్యలు చేపట్టినప్పటికి నాటి ఫలితాలు పూర్తిస్థాయిలో వారికి అందకపోవడం శోచనీయం.

1979నాటి ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రాంతాలలో వివిధ విద్యా సంస్థలు ఈ విధంగా ఉన్నాయి.

ఆశ్రమ పాఠశాలలు 399 - 26,746 మంది విద్యార్థులు

ప్రాథమిక పాఠశాలలు 1740 - 37,729 మంది విద్యార్థులు
ప్రాథమికోన్నత పాఠశాలలు 115 - 4,052 మంది విద్యార్థులు
ఉన్నత పాఠశాలలు 075 - 3,630 మంది విద్యార్థులు
జూనియర్ కళాశాలలు 006 - 305 మంది విద్యార్థులు

ఆదివాసీ విద్యా వ్యవస్థ ప్రారంభమైన తరువాత సేకరించిన ఈ గణాంకాలకు తరువాత ఎటువంటి ముక్తాయింపులు చోటుచేసుకోలేదు. తెలుగునే క్రమంగా గిరిజనులు తమ భాషగా వాడుకున్నా ఈనాటికీ వ్యవస్థలో మార్పు రాకపోవడం చింతనీయం. కోయలకు కోయభాష, సవరలకు సవరభాష, గోండులకు గోండి (ఇది కన్నడభాషకు దగ్గరగా ఉంటుంది), ఉన్నా వీరందరు వ్యవహారానికి తెలుగునే ఉపయోగిస్తున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో మరింత చొరవ చూపించాల్సి ఉంది.

**వృత్తి :**

గిరిజనుల ప్రధాన జీవనం అటవీ సంపదపై ఆధారం. పోడు వ్యవసాయం వీరి జీవనం. అడవిపై అధికారం ప్రభుత్వం చేతిలోనికి పోవడంతో వీరి వృత్తి జీవనంలో మార్పు వచ్చింది. వేట, ఆహార సేకరణ, వెదురును పండించడం, బెల్లం సిద్ధం చేయడం, ఇప్పపువ్వు, తునికాకు, తేనె సేకరణ మొదలైన అటవీ ఫలసాయం వీరి ప్రధానవృత్తికాగా కాలం వీటి అన్నింటి పైన కఠినమైన వేటు వేసింది. దళారుల దోపిడీ కూడా కొంత ఇందుకు దోహదం చేసింది. బెల్లం ఉడకపెట్టి అటవీ మూలికల మేళనంతో గుడుంబా సిద్ధం చేసేవారు. అలాగే ఇప్పపువ్వుతో సారాయిని, ఇతర పానీయాలను తయారు చేసేవారు. వీరి జీవనం నేడు అయోమయంలో పడిందనే చెప్పాలి. అడవికి వెళ్ళి తునికాకును సేకరించే వీరి వృత్తి ఈనాడు కష్టాల్లో పడింది. బీడీ ఆకుగా తునికాకు ప్రసిద్ధం. కాలంలో వచ్చిన మార్పు సిగరెట్లను ప్రచారం చెయ్యడంతో పుట్టిగుర్తును పొందిన బీడి మూలన పడింది. గిరిజనుల బ్రతుకు ప్రశ్నార్థకమైంది.

అడవికి సమీపంలో ఉండి బంక (గోందు) సేకరించడం కూడా వీరి వృత్తులలో ఒకటి. వృక్షాలను నరికి వేయడంతో అటవీ సంపద నశించింది. ప్లాస్టిక్ గోందుల ప్రభావంతో గిరిజనుల బ్రతుకు ప్లాస్టిక్ కవర్లలో, రిపోర్టుల రూపంలో మిగిలింది.

**ఉపసంహారం :**

గిరిజనులు సంచార జాతి, జీవనోపాధి కోసం ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి వలసవెళ్లి జీవించేవారు. సంచార జీవనం నుండి స్థిరత్వంవైపు ఆధునిక సమాజం ప్రభావం చేత వీరు ఈ మధ్యనే వస్తున్నారు. ఈ ఆధునిక కాలంలో సినారె అన్నట్టుగా 'గుహల నుండి మహలువైపు' మానవ మనుగడ ప్రయాణిస్తుంది. కాలప్రవాహంలో ఎదురీద లేని గిరిజనులు ఒడ్డుకు కొట్టుకుంటూ ఆ నీటిలోనే ప్రయాణిస్తున్నారు. ఆధునిక జీవితం వారిని ఆకర్షిస్తుంది. కాని సరైన అవకాశాలు వారికి అందిరావడంలేదు. సంచార జీవనం నుండి స్థిరజీవననంవైపు ప్రయాణిస్తున్న గిరిజనులను ఈ ప్రభుత్వం ఆదుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పాలకులకు పాలితులకు మధ్య అంతరం తగ్గాల్సిన అవసరం ఉంది.

ఐదవ పంచవర్ష ప్రణాళికలో సమగ్ర ఆదివాసీ అభివృద్ధి సమితి పేరుతో ప్రారంభమై తన వంతు కృషిగా కొన్ని పథకాలను ప్రారంభించినప్పటికి అవి గిరిజన మూలాలను చేరడం లేదనే చెప్పాలి. భూస్వాములకు వడ్డీ వ్యాపారులకు వ్యతిరేకంగా గిరిజనుల సమిష్టి తత్వం మాత్రమే పనిచేస్తున్నంత కాలం ఈ పథకాలతో మనం ఎటువంటి మార్పును సాధించలేం. ప్రభుత్వ, నిష్కళంక చిత్తశుద్ధి, తోడ్పాటు మాత్రమే వారి జీవనంలో చక్కని మార్పు తేగలుగుతుంది.

కాలం తెచ్చే మార్పులు సాంఘిక జీవన సరళిని ప్రతిబింబిస్తాయి. అందుకు ప్రభుత్వ తోడ్పాటు కూడా తోడైతే ఆ మార్పులు ఉన్నతమైనవి అవుతాయి.

**ఉపయుక్త గ్రంథసూచి :**

1. తెలుగు జానపద గేయ సాహిత్యం - డా. ఆచార్య బి. రామరాజు
2. తెలుగు పొడుపు కథలు - డా. కసిరెడ్డి వెంకటరెడ్డి
3. సుగాలి సంస్కృతి - భాషా సాహిత్యాలు - డా. ఎం. గోనానాయక్
4. బుడిగెజంగాలు - భాషా సాహిత్య సాంస్కృతికాంశాల పరిశీలన - డా. ఎన్.ఆర్. వెంకటేశం
5. వరంగల్లు జిల్లా బంజారా సాహిత్యం - సాంస్కృతిక అధ్యయనం - డా. హెచ్. కిషన్.
6. మనుగడ కోసం పోరాటం - క్రిస్టాఫాన్ ఫ్యూరర్ హైమన్‌డాఫ్ (అ) అనంత్.

# నల్లగొండ జిల్లా పంబాలలు - సామాజిక అంశాల విశ్లేషణ

- పంబాల పర్వతాలు, పరిశోధక విద్యార్థి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

జానపద సాహిత్యంలో పంబాల వారిది ఓ విలక్షణమైన సాంప్రదాయం. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు తమ ఉనికిని చాటుకుంటు వస్తున్నారు. కాని అనేక సంవత్సరాలుగా జానపద సాహిత్య పరిశోధనలో పంబాలలకు సంబంధించిన అంశాలు అంతగా వెలుగును చూడనే లేదు. దానికి అనేక కారణాలు ఉండవచ్చు. అందులో ఈ జాతి అంతరించే స్థితిలో ఉంది. తమ సంస్కృతిని, సాంప్రదాయాలను చాటే గాథలను వీరు ఎక్కడా ప్రదర్శించక పోవడం ఇందుకు కారణమై ఉండవచ్చు. రెండు తెలుగును ప్రాంతాలను పరిశీలిస్తే ఆంధ్ర ప్రాంతంలో పంబాలల ఉనికి కొంత కనిపిస్తున్నా తెలంగాణలో మాత్రం నల్లగొండ, కరీంనగ్నర్ జిల్లాలలోనే ఉన్నారు. మిగ్నతా అన్ని జిల్లాలలో లేరని చెప్పలేము కాని దానికి సంబంధించిన ఆధారాలు ఇప్పటి వరకు సరైనవి లేవని తెలుస్తుంది. అక్కడక్కడ పంబాలల ప్రస్తావన కనిపిస్తున్నా బైండ్ల వారితో లేదా బైండ్ల వారిగానే చెప్పడం జరిగింది. కాబట్టి పంబాల గ్నురించిన చారిత్రక ఆధారాలను గ్నమనించి సరైన విధంగా చర్చించవలసి ఉంది. ఇప్పటి వరకు పంబాలల గ్నురించి అనేక నిరాధారమైన వాదనలే జరిగాయి. పంబాలలు తెలంగాణలోని నల్లగొండ, కరీంనగ్నర్ లలో ఉండడంలో చారిత్రక కోణం దాగి ఉంది.

**జనాభా :**

పల్నాడు రాజులు తమ రాజ్య విస్తరణ కోసం క అష్ణ నది దాటుకొని వచ్చి తీరప్రాంతం వెంట వెళ్ళిన ప్రాంతాలలోనే పంబాలల ప్రస్తుత ఉనికి కనిపిస్తున్నది. క అష్ణ నది దాటిన తర్వాత పూర్వ కాలంనుంచి వస్తున్న అక్కడి గ్రామాల పేర్లు ఇందుకు నిదర్శనం. "హాలియా, మల్లేపల్లి, పేర్వాల, మన్నెవారి పల్లి, మన్ననురు ప్రాంతాల గుండా ప్రయాణించి చివరిగా మాదవాని పల్లె" గ్రామం దగ్నర ఆగిపోయారని చరిత్ర పరిశోధకులు పేర్కొన్నారు. చారిత్రిక కోణంలో ఈ ప్రాంతాన్ని గ్నమనిస్తే ఇక్కడి ప్రజలు జరుపుకునే పండుగలు, జాతరలు అనేక అంశాలు తెలుపుతాయి. ప్రస్తుతం ఈ గ్రామాల్లో ఉన్న అంకాలమ్మ, చెన్నకేశ్వర స్వామి దేవాలయాలు, ఇక్కడ జరిగే కేవలం అంకాలమ్మ జాతరలు అందుకు కొన్ని ఉదాహరణలుగా పరిగ్నణించవచ్చు. ఈ అంశాలు ఇక్కడి పంబాలలు వలస వచ్చినవారేనని చెప్పడానికి మరింత బలాన్ని చేరుకూరుస్తాయి. నల్లగొండ జిల్లాలో మొత్తం 12 నియోజక వర్గాలలోని ప్రాంతాలలో మాత్రమే ఉన్నారు. 1. దేవరకొండ, 2.నాగార్జున సాగర్, 3. మిర్యాలగూడ, 4. నల్లగొండ, 5. మునుగోడు, 6.ఆలేరు ఇందులో దేవరకొండ, నల్లగొండ, మునుగోడు ప్రాంతాల్లో గణనీయమైన సంఖ్యలో పంబాలలు ఉన్నారు. నాగార్నున సాగ్నర్, మిర్యాలగూడ, ఆలేరు ప్రాంతాలలో ఒకటి రెండు కుటుంబాలు మాత్రమే ఉన్నాయి. ప్రభుత్వ లెక్కలలో 1981 జనాభా లెక్కలను అనుసరించి 2,333 సంఖ్య ఉండగా 1991 నాటి లెక్కల ప్రకారం 1,974 మాత్రమే మిగిలిపోయారు. ముందటి సర్వేలతో పోలిస్తే తక్కువ శాతానికి పడిపోయారని తెలుస్తుంది. ఈ సంఖ్య 2001 నాటికి మరింత తగ్గి పోయింది. 2011 జనాభ లెక్కల ప్రకారం నల్లగొండ జిల్లాలోని పంబాల సంఖ్య. (18 సంవత్సరాలు నిండిన వారి సంఖ్య మాత్రమే), నియోజక వర్గాల వారిగా.

| | ప్రాంతం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|---|
| 1. | దేవరకొండ | 53 | 45 | 98 |
| 2. | మునుగోడు | 20 | 26 | 46 |
| 3. | నల్లగొండ | 13 | 17 | 30 |
| 4. | ఆలేరు | 9 | 11 | 20 |
| 5. | నాగార్జున సాగర్ | 2 | 3 | 05 |
| 6. | మిర్యాలగూడ | 01 | 2 | 03 |

ఆరు నియోజక వర్గాలలో పంబాలలు మొత్తంగా 202 మంది మాత్రమే ఉన్నారు. ఈ లెక్కలు అనుసరించి ఉద్యోగాలలోగాని, విద్యారంగంలో గాని పంబాలలోని ఏ ఒక్కరు కూడా స్థానం పొందలేక పోయారు. కొంత మంది చదువుకున్నా ఆర్థిక పరిస్థితుల వల్ల చదువు మధ్యలోనే ఆపేసి వివిధ పనులలో చేరిపోయారు.

**సాహిత్యం:**

సాహిత్యం ఒక సామాజానికి, ఒక నాటి కాలానికి, ఆ కాలం నాటి సామాజిక స్థితిగతులకు దర్పణం వంటిది. తెలుగు నేలలో ప్రాచీన కాలం నుంచి నేటి వరకు అనేక గాథలను గేయాలు, కథల రూపంలో తీసుకొస్తున్న సమూహం గాయక సమాజం. అలాగే చాళుక్యుల కాలం నుంచి మొదలుకొని పల్నాడు చరిత్రను చరిత్రకారులకు, నేటి సమాజానికి అందించిన ఘనత పంబాలల వారికి దక్కుతుంది. దురదఅష్టంవల్ల ఈ పాటలు నేడు కనుమరుగై పోయాయి.

పంబాలు పాడే ''శక్తికథా చక్రం'' లోని పాటలు తంగిరాల వారు సేకరించే సమయంలో(1966 సం) అతడు పడిన పాట్లను చెప్పారు. అంత కష్టపడి కూడా మూడు పాటలు మాత్రమే దొరికాయి. మారిన పరిస్థితుల వల్ల ఈ పాటలు

కూడ నేడు పంబాలల వద్ద లభించడం లేదు. నల్లగొండ జిల్లాలోని ఏ ఒక్క పంబాల కుటుంబాన్ని అడిగినా ఈ పాట లకు మూలం వారికి తెలిసే పరిస్థితి కనిపించడం లేదు. ఇక్కడ ఒక విచిత్రం కనిపిస్తుంది. మిర్యాలగ్గూడ, మునుగోడు, ఆలేరు ప్రాంతాలలోని పంబాలలకు పంబ అనే ఒక వాద్యం ఉన్నట్లు గాని, తమ జాతికి పూర్వ చరిత్ర ఉన్నట్లు గాని తెలియడం లేదు. నా క్షేత్ర పర్యటనలో నల్లగొండలో పంబాలలకు సంబం ధించిన సాహిత్యం పూర్తిగా అంతరించి పోయిందని తెలిసింది. ప్రస్తుతం ఈ ప్రాంతాలలోని పంబాలలు పెద్దమునిగ్గల్, చిత్రి యాల, గ్రామాలలో జరిగే అంకమ్మ జాతర్లలో పంబలజోడ్ల వాద్య కారులుగా జీవనం సాగిస్తున్నారు.

**మతం :**

జానపద గాయక సమాజాలన్నీ శైవ వైష్ణవ మతాలను అనుసరించేవే. అందులో ఎక్కువ మంది గాయక సమాజాలు శైవులుగా కనిపిస్తున్నారు. అతికొద్ది మాత్రమే వైష్ణవులై ఉన్నారు. పంబాలలు కొలిచే అంకాలమ్మ ఆది శక్తి రూపంలోని స్త్రీ దేవత. శక్తి స్వరూపిణి శాక్తేయ మతానికి సంబంధించిన దేవత. కనుక అంకాలమ్మ శాక్తేయ మతానికి చెందుతుంది. అందువల్ల అంకమ్మను కొలిచే పంబాలు కూడ శాక్తేయులని చెప్పవచ్చు. కాని పరిస్థితుల కారణంగా ఇతర కారణాల వల్ల పంబాలు శైవ మత సంప్రాదయలను కూడ పాటించడం, అదేవిధంగా మాల కులంవారికి చెన్నయ్య కుల దైవం ఈయ నని విష్ణు రూపంగా పూజించడం వల్ల పంబాలలు మాల కులంలో భాగం కాబట్టి వైష్ణవ మత ప్రభావాలు పంబాల పైన ఉన్నాయని చెప్పవచ్చు. 12వ శతబ్దంలో శాక్తేయం మరియు శైవాలు కలిసిపోవడం, మారిన కాల పరిస్థితుల వల్ల నేడు పంబాలలో శాక్తేయ, శైవ సాంప్రదాయాలను ఆచరిస్తు న్నారు. నల్లగొండ జిల్లాలోని పంబాలలు దాదాపుగా అందరు శాక్తేయులుగానే ఉన్నారని తెలిసింది.

**కులం :**

జానపద గాయక సమాజంలో పంబల వారి కులాని సంబంధించిన చర్చ మరే కులం వారి గ్గురించి జరగ్గులేదని చెప్పవచ్చు. ఎందుకంటే కొందరు పరిశోధకులు ఏ ఆధారాల వల్ల పంబాల వారిని బైండ్ల వారని చెప్పారో తెలియదుగాని మొత్తంగా పంబల వారిని చరిత్ర చీకటి లోతుల్లోకి నెట్టి వేశాయి. సాంస్కృతికంగా ఒక ప్రత్యేకతను కలిగి ఎన్నో సంవత్స రాలుగా చారిత్రిక ఆధారాల పరంగా క్రీ.శ 2వ శతాబ్దం నుంచి నేటి వరకు పంబాలలగమనం సాగుతూనే ఉంది. క్రీ.శ 2వ శతాబ్దం నుంచి క్రీ.శ 10వ శతాబ్దం వరకు చరిత్రలో పంబాలల కులం తెలియనప్పటికీ 11వ శతాబ్దంలో పంబాలల కులం చాల స్పష్టంగా మాల కులం అని తెలిసింది. చరిత్రలో పంబా లలు అంకాలమ్మను పూజించడం, మాల కన్నమదాసు అనునాయిలుగా ఉంటూ తమ కుల, మత వైశిష్ట్యాలను చాటుకునే సందర్భాలలోనే ఓరుగల్లులో పంబాలలు పల్నాటి వీరుల గాథలు ఆలపిస్తున్నట్లు క్రీడాభిరామంలో దర్శన మిస్తుంది. ఆనాటి నుంచి నేటి వరకు పంబాలలు మాల ఉప కులవర్గంలో ఉన్నవారే. దానికి ఆధునికంగా ప్రభుత్వ లెక్కలు సైతం పంబాలలు మాల కులం వారేనని చెప్పడానికి బలాన్ని చేకూరుస్తున్నాయి. 1920 సంవత్సరంలో సిరాజ్ ఉల్హసన్ నైజాం డొమినియనులోని కులాలు, జాతుల సేకరణలో, 1930 సంవత్సరం భారత ప్రభుత్వ ఉత్తర్వులలో, 1981,1991, 2001, 2011 జనాభా లెక్కలలో సైతం పంబాల వారిని మాలకుల ఉప వర్గంలో పేర్కొనడం జరిగింది. చారిత్రకంగా, సాంస్క అతికంగా, ప్రభుత్వ గ్గణాంకాల ద్వారా పరిశీలించిన పంబాలలు మాల కులం వారని కచ్చితంగా చెప్పవచ్చు.

**జీవనవిధానం :**

భూమి మీద నివసించే ప్రతి ప్రాణికి ఒక జీవన విధానం ఉన్నట్లే పంబాల కులం వారికి ఒక సంస్క అతి, ఒక జీవన విధానం ఉన్నాయి. ప్రాచీన కాలం నుంచి నేటి వరకు పంబా లలు కళా వ అత్తిని జీవనాధారం చేసుకున్న రానురాను కళావ అత్తితో పాటు వివిధ వృత్తులు చేస్తూ ప్రస్తుతం వ్యవసాయ కూలీలుగా, తాపీమేస్త్రిలుగా, నాటువైద్యులుగా ఇతరత్రా పనులలో బతుకు వెళ్ళదీస్తున్నారు. నా క్షేత్ర పర్యటనలో భాగంగా కారంపూడికి వెళ్ళినప్పుడు కొంత మంది పంబాల వారిని కలిశాను. నెల్లూరు, ప్రకాశం, గుంటూరు ప్రాంతాల వారని తెలిసింది. వీరు కళా వృత్తిని నమ్ముకొని జీవిస్తున్నారని తెలిసింది. నల్లగొండ ప్రాంతంలోని పంబాలలో దేవరకొండ ప్రాంతంలోని పంబాలలు మాత్రమే కళా వృత్తిని నమ్ముకొని జీవిస్తూ ఇతర సమయాలలో వివిధ వృత్తులు చేస్తున్నారు.

పంబాలలు పుట్టుక నుంచి చావు వరకు అన్ని ఆచా రాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. పూర్వ కాలం లోని పంబాలలకు నేటి పంబాలలకు చాలా వ్యత్యాసం కనిపిస్తుంది. పూర్వకాలం పంబాలలు మాలలకు పూజారులుగా ఉండేవారు. కాని నేడు ఈ సంప్రదాయం ఎక్కడా కనిపించడం లేదు. బహుశ పంబాలలు ఎక్కువగా నివసిస్తున్న ప్రాంతలో ఉండి ఉండవచ్చు. పంబాలలు పుట్టుక నుంచి చావు వరకు జరుపుకునే అన్ని ఆచారాలు మాలకులంవారి మాదిరిగానే ఉన్నప్పటికీ కొన్ని తేడాలు కనిపిస్తున్నాయి. ఉదాహరణకు పంబాలల ఇళ్ళలో స్త్రీలే పూజారులుగా ఉండి అన్ని పూజా కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే వివాహాలలో 'ఆకుపుస్తె' (తాళి ఆకుమాదిరి ఉంటుంది) విధానాన్ని పాటిస్తున్నారు. ఆకుపుస్తె కలిగిన వారు బొడ్డుపుస్తె(మామూలు తాళి) గులవారితో వివాహాలను వ్యతిరేకిస్తున్నారు. చావుతంతులో

పెద్దకర్మ రోజున సమాధిమీద ఉంచిన భోజనాన్ని చనిపోయిన వారి కుటుంబ సభ్యులు మాత్రమే ముద్దలుగా చేసి తినే ఆచారంఉంది. ఈ అంశాలను గురించి ఇంకా లోతుగా పరి శోధించవలసిన అవసరం ఉంది. పంబాలల ఆచారాలలో మార్పులు రావడానికి కారణం ఆయా ప్రాంతాలలో పంబా లలు అల్ప సంఖ్యలో ఉండడం, ఇతర మతాల, కులాల ప్రభావం పంబాలలపై ఎక్కువగా ఉండడం వల్ల అని చెప్ప వచ్చు. కాబట్టి పంబాలల సంఖ్య తక్కువ ఉండడం వల్ల ఇతర కులాల వారి ప్రభావం పడి తమ ప్రత్యేక సంస్క అతిని, జీవన విధానాన్ని వదిలేశారని తెలుస్తుంది. వివాహం వంటి విషయాలలో పంబాలలు మాల కులంవారితో సంబంధాలు పెంచుకుంటున్నారు. ఒక ప్రాంతంలో ఉన్న పంబాలలు మరొక ప్రాంతంలో పంబాలల మధ్య కంచం పొత్తు మాత్రమే ఉంది. వియ్యమందుకునే ఆచారం లేదు. పంబాలలు వివిధ రాష్టాలలో ఉన్నప్పటికీవీరందరూ తమని తాము "పాలి వారు"గానే అంటే ఒక ఇంటి వారిగానే భావిస్తున్నారు.

✿ ✿ ✿

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

# కరుణామయుడుగా మోదుకూరి జాన్సన్

– మూకిరి సుధ, పరిశోధన విద్యార్థిని, తెలుగు మరియు ప్రాచ్యభాషా విభాగం, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

నాటక రచయితగా, సుప్రసిద్ధమైన స్థానాన్ని అలంకరించి మరింత పటిష్ఠతరమైన, మహోన్నత భావ పరంపరలతో పాఠక లోకాన్ని చైతన్య పరచిన రచయిత మోదుకూరి జాన్సన్. రచనల ద్వారా సమాజ హితాన్ని కోరుకోవటం ప్రాచీన కాలం నుండి అనూచానంగా వస్తున్న సంప్రదాయం. ఏ రచయిత ఐనా ఏ ప్రక్రియలో రచన చేసిన అనగా పురాణం, ఇతిహాసం, కావ్యం, ప్రబంధం, నవల, నాటకం, గేయం, కథ, కథానిక, వచన కవిత, మినీ కవిత, హైస్కూలు, నానీలు లాంటి నాటి నుండి నేటి వరకు సాహితీ ప్రపంచంలో ప్రకాశిస్తున్న ఏ ప్రక్రియా విధానంలో రచన చేసినప్పటికి అది ఒక సామాజిక హితంకరమైన, చైతన్య స్ఫోరకమైన మార్గనిర్దేశక లక్షణం కలిగిన సమున్నతమైన రచనగానే స్వీకరిస్తాడు రచయిత. ఏ ప్రక్రియ కైనా నేపథ్యంగా సమాజ హితమో, సందేశమో, ఆచార వ్యవహారాలో సంస్కృతి సంప్రదాయాలో అయివుంటాయి.

అలాంటి సామాజిక హితంకరమైన రచనా ప్రక్రియలలో గేయారూపంగా స్వీకరించదగిన సినిమా రచన సంబంధమైన ప్రక్రియ పాట. పాటకునిచే అమృత రసాస్వాదన చేయించడంలో పాట తన పాత్రను ఎంతో సమున్నతంగా పోషిస్తుంది.

"శిశుర్వేత్తి పశుర్వేత్తి వేత్తిగా రసంఫణి:" అన్న లాక్షణికోక్తికి అర్థాన్ని పరిశీలిస్తే సంగీత సంబంధమైన గేయ లేదా పాటలకు ఎంతటి ప్రాధాన్యం ఉంతో తెలుస్తుంది. లోకజ్ఞానం ఇంకా తెలియని చిన్న పిల్లలైన ప్రాపంచిక జ్ఞానము లేని పశువులైన ఎల్లప్పుడూ విషం క్రక్కుతూ, ప్రజలను భయభ్రాంతులను చేసే నాగులైనా సంగీతంతో, ఆనంద పరవశత్వాన్ని పొందుతాయి. అంతటి గొప్ప స్థితి కలిగిన పాట నాటి నుండి నేటి వరకు సమాజం పట్ల తేనీటి విందుగా, తేట తెల్లని వెన్నెలలా, కన్నీటి కరుణలా, కస్తూరి కలికల, మధుర రసాన్ని గ్రోలిన తేటి నోటి పాటగా ఆహ్లాదాన్ని బహు భంగుల ఆనందాన్ని అందించి తన స్థానాన్ని ప్రాకృతికంగా స్థీకరించుకున్నది తెలుగుపాట.

కవిత్వం, సంగీతం, చిత్రలేఖనం, శిల్పం, నాట్యం అనే అయిదిటినీ చిత్రకళలు అని, లలితకళలు అని, సరసకళలన్నీ పేర్లతో పిలుస్తారు. వీటన్నీటి పరమార్థం అంతిమంగా ఆనందాన్ని అందించటమే. రాగరసము ద్వారా రాగస్వర చిత్రణం వల్ల ఆనందాన్ని ప్రసాదించే కళ సంగీతం రసాస్వాదన వల్ల కలిగే మనోవిలాసాన్ని లేదా ఉల్లాసాన్ని లోకానికి అందించేవి కనుక వీటిని విలాస లక్షణం ఉన్నదని అందుకే వీటిని విలాసకళలని, జయదేవుడు తన గీత గోవిందంలో

**"యది హరిస్మరణే సరసం మనో**
**యది విలాస కలాసు కుతూహలమ్**
**మధుర కోమల కాంత పదావళీమ్**
**శృణు తదా జయదేవ సరస్వతీమ్"**

అంటూ పేర్కొన్న విషయాన్ని పింగళి లక్ష్మీకాంతం గారు తన సాహిత్యశిల్ప సమీక్షలో చిత్ర కళల విషయంలో ప్రస్తావించారు. కవిత్వము, సంగీతములు ప్రధానంగా సరసత్వ లక్షణాన్ని కలిగి ఉంటాయి. వర్ణించే వస్తువు ఏదైనా సంగీతంలో చలనల క్షణాన్ని కలిగి చిత్ర విచిత్రములైన విధానాన్ని కలిగి ఉంటుంది. కనుక దీనికి 'చరకళ' అని కూడా నామాంతరం ఉంది. సంగీతానికి ఆనంద సిద్ధి మాత్రమే పరమావధి. ఆనందావస్థలో లోకాన్ని విస్మరించి అనిర్వచనీయమైన పరవశత్వాన్ని పాఠకుడు పొందుతాడు. తన్మయత్వాన్ని కల్గించే సంగీతం మానవునికి గల బాహ్య ప్రపంచ జ్ఞానాన్ని మార్పు చేసి పరవశింప చేస్తుంది సంగీతం. ఆద్యంతం మాధుర్య గుణాన్ని కలిగి ఉంటుంది. దీనికి మధుర గాత్రం, శృతిలయలు తోడైతే ఆ గానం, సంగీతం మరపురాని మధురానందాన్ని ఇస్తుంది. ఇటువంటి మహోదాత్తమైన సంగీత ప్రక్రియ గేయ ప్రక్రియ రూపంలో తెలుగు సాహిత్యంలో సమున్నతమైన స్థితిలో ఉంది. పాటలుగా కవిహృదయాంతరాళాల్లో దాగిన ఎన్నో మాటలు లోకంలో తమ స్థానాన్ని స్థిరీకరించుకున్నాయి.

గేయవాఙ్మయం ఎంతో విస్తృతమైన పరిధి కలిగినది. మోదుకూరి జాన్సన్ తెలుగు సాహిత్య ప్రస్థానంలో గేయ ప్రక్రియను కూడా అవపోసనపట్టాడు. సినిమాలలో హృదయానికి హత్తుకునే భావాలతో అనేక పాటలు రచించాడు. జాన్సన్ పాట ఒక జీవనపు బాట. అంతే కాదు అది ఒక ఆధ్యాత్మిక సువాసనలీనుతున్న పుష్పాలు నిండిన మకరందపు తేట. అది ఒక ఆనందపుటందాల పూదోట.

మోదుకూరి జాన్సన్ సినిమాలలో పాటలు రాసినా అవి సందర్భశుద్ధి కలిగి ఉంటాయి. ఆ పాట కోసం సందర్భం కావాలని పెట్టినట్లు అనిపించదు. పాటకోసమే సినిమా తీశారేమో అన్నంత పటిష్టమైన భావనాబలం కలిగి అటు ఆధ్యాత్మికతను, ఇటు లౌకికవాద తత్త్వాన్ని జోడించి రచించటంలో మోదుకూరి గేయ రచనా సామర్థ్యం ప్రస్ఫుటంగా గోచరిస్తుంది. ఏ పాట చూసినా కేవలం ఆనందాన్ని, పరవశత్వాన్ని, మాత్రమే కాకుండా తప్పనిసరిగా ఏదో ఒక సామాజిక సంబంధాన్ని సూచిస్తూ అనుబంధపు ప్రతిపాదకమైన చక్కని చిక్కని సందేశాన్ని అందిస్తుందనటంలో అతిశయోక్తి లేదు.

మోదుకూరి పాట తరగని సందేశాల కోట. అందులో భక్తి ఉంది. దానిలోనే రక్తి ఉంది. సందేశాత్మక శోభ నిండిన జీవన్ముక్తి ఉంది. జన్మఫల బోధ ఉంది. సామాజిక చిత్రణ ఉంది. సంస్కృతీయమైన సంప్రదాయం ఉంది. ప్రజా చైతన్య శక్తి ఉంది. మోదుకూరి వారి సినిమా పాటలు అనగానే ఒక రాజముద్రతో ఉన్నట్లు పాఠకుని హృదయాన్ని కదిలించే ప్రేమైక తత్త్వం ఉంది. సమున్నత జీవన సరళికి జాన్సన్ పాట ఓ పెట్టని కోట. దేశభక్తి ప్రబోధంతో ప్రజలను చైతన్యవంతుల్ని చేసే ఒక ఆయుధంగా కూడా మోదుకూరి పాట ప్రసిద్ధమైంది. జన్మభూమి గొప్పతనం బానిస బతుకుల్లోన్ని బాధల పరం పరల నుండి ప్రబలే కష్టములకు ఒక చక్కని పరిష్కార పూరిత మానవత్వం ఉంది.

మోదుకూరి జాన్సన్ రచించిన సినిమా పాటలలో

- **కరుణామయుడు**
- **పాడి పంటలు**
- **దేశోద్ధారకులు**
- **రాజాధిరాజు**
- **పులిజూదం**

మాత్రమే లభ్యమవుతున్నాయి. స్నేహితుల మాటల ప్రకారం చాలా సినిమాలలో పాటలు వ్రాశాడని తెలుస్తుంది. ఐనప్పటికి పైన పేర్కొన్నవి మాత్రమే ఆధారములతో లభిం చాయి. మిగతావి అలభ్యములుగా ఉన్నాయి. ఏ పాట చూసినా తెలుగుదనం, సంస్కృతి, భారతీయత, భక్తి తత్పరత, సామాజిక పరివర్తనాదులు గోచరమవ్వటము మోదుకూరి వారి పాటలలో విశేషం. మోదుకూరి జాన్సన్ వ్రాసిన పాటలకు ఎంతో ప్రాచుర్యం లభించటానికి వానిలోని వస్తుతత్త్వ ప్రక టనమే. మోదుకూరి జాన్సన్ పాటలను విన్నా రచించిన గంభీరమైన భావోద్వేగ పూరితమైన పదముల కూర్పు ఓ చక్కని పాటల రచయితగా మోదుకూరి జాన్సన్ నిల్పుతుంది.

## కరుణాయముడు - కదిలింది కరుణ రథం పాట - విశ్లేషణ :

మోదుకూరి జాన్సన్ రచనా జవితాన్ని ఒక అందమైన, అపురూపమైన మలుపు తిప్పిన పాటగా మన కరుణామయుడు సినిమాలో రాసిన 'కదిలింది కరుణరథం' అనే పాటను గుర్తించ వచ్చు. ఈ పాట మొదుకూరి జాన్సన్ రచనా వైవిధ్యాన్ని చక్కగా మన ముందు ఉంచుతుంది. అంతేకాక మోదుకూరిలోని మానవతా వాదానికి, ఆధ్యాత్మిక చింతనకు, సహృదయతకు నిలువుటద్దంగా, మనిషిగా కాకుండా జాన్సన్‌ను మనీషిగా నిలిపిన విషయంలో ఒక మకుటాయమానంగా గోచరిస్తుందీ పాట.

మోదుకూరి జాన్సన్ ఈ పాట రాసేందుకు ఎంత శ్రమించాడో, ఎంతగా ఆలోచించాడో, అతని రచనా పాటవాన్ని నైపుణ్యాన్ని ఎంతగా ప్రదర్శించాడో పాటలోని చరణాలు స్పష్టంగా తెలియజేస్తాయి. తన జీవన గమనంలో పేదవాడిగా అనుభవాలతో క్రీస్తు జీవితాన్ని అన్వయిస్తూ భావోద్వేగపు పూరితంగా తెలిపిన రచన కదిలిందీ కరుణ రథం పాట అనటం సమంజసం. కరుణామయుడు అన్న పేరే భగ వత్తత్త్వాన్ని తెల్పినట్లుగా ఈ పాట ఆ తత్త్వానికి మరింత దగ్గరగా జనజీవన సరళికి అనునయిస్తూ రచించటం మోదుకూరి రచనా వైదుష్యాన్ని తెల్పుతుంది. కవులు అనంత చిత్రణతో పాటు ఆవేదనలను సైతం ఇంత చక్కగా, హృదయాన్ని కదిలించే విధంగా రచించటంలో మోదుకూరి ఒక ప్రత్యేక స్థానాన్ని పొందగలడన్నది వాస్తవం.

## నేపథ్యం :

ఈ పాట ఉన్న సినిమా కరుణామయుడు. ఈ సినిమా విజయచందర్ దర్శకత్వంలో వచ్చిన ఒక పతాకస్థాయి అందు కున్న సినిమా. కరుణామయుడు సినిమా గురించి, అందులోని సన్నివేశాల గురించి జాన్సన్‌కే విజయచంద్ గారే స్వయంగా వివరించారు. అపుడే ఆ సినిమాలో ఈ పాట ఆవశ్యకతను కూడా జాన్సన్‌కు వివరించారాయన. ఆ మాటలతో చైతన్యాన్ని పొందిన జాన్సన్ తన శక్తియుక్తులలో కదిలిందీ కరుణరథం అనే పాటను ప్రజలకు చేర్చాలన్న ప్రయత్నం చేశారు.

ఈ పాట కోసం సందర్భోచితంగా, సారవంతంగా ఉండే పదజాలం పోగుచేయటంలో గానీ, రచనలో భావ బలాన్ని నింపడం కోసం ఎంత తపన పడ్డారో గానీ ఆ కష్టమంతా వినే పాఠకునికి ప్రత్యక్ష గోచరమయ్యేలా రచించాలనుకున్నారు. పాట చూస్తూ విన్న ప్రతి పాఠకుడు, ప్రేక్షకుడూ హృదయం ద్రవించేలా తన రచన చేయాలన్న కుతూహలంతో కూడిన తపన పాటలో అడుగడుగునా ప్రస్ఫుటంగా కనిపిస్తుంది.

"విజయ చందర్ గారు జాన్సన్ గారితో ఇలా అన్నారట. ఎన్టీఆర్ "పాండురంగ మమాహత్మ్యం'లోని హే కృష్ణాము కుందా! మురారి!" పాటలాగా చాలా ఉన్నత స్థాయిలో ఉం టూ దయ, ప్రేమ, దు:ఖం, కరుణ ఇలా అన్నీ రకాల ఛాయలో ప్రతిఫలించేలా పాటలో వేదన కనపడాలని చెప్పా. మోదుకూరి మారుమాట్లాడకుండా టవల్‌మీదే బాత్‌రూంలోకి వెళ్లి, షవర్ కింద నీళ్లలో దేవుణ్ణి, కన్నీటితో ప్రార్థిస్తూ, తడిసి, ముద్దై వచ్చి, మరొక్క ఛాన్సిస్తే రాసి ఇస్తానన్నారు. నేను సరేననా! అలా షవర్ కింద నీటిలో తన కన్నీటిని దాచుకొని, ఆయన రెండోసారి రాసిందే 'కదిలింది కరుణరథం' అన్న సూపర్‌హిట్ పాట. జాన్సన్ గారు కన్నీటితో వ్రాసిన ఈ పాటను చూచి లోకమే కన్నీరు కార్చింది."

విజయచందర్ గారు స్వయంగా ఈ పుస్తక రచయితతో చెప్పిన మాటలలో భావగాంభీర్యంతో కూడిన కరుణరసం.

ధ్వనించేలా జాన్సన్ చేత ఈ పాట రాయించిందన్నది సుస్పష్టం. మొదటగా ఈ సందర్భానికి ఒక పాట జాన్సన్ రాశానని, అది నచ్చకపోవటం వల్ల మోదుకూరికి విజయచందర్ గారు మరొక సారి రాయమని రసాన్వితమైన రచనగా ఈ పాట వచ్చిందని మనకు తెలుస్తుంది.

**పల్లవి - విశ్లేషణ :**

పాటకు ప్రాణం పల్లవిగా గేయ సాహిత్యం చెప్పిన మాట. పల్లవిలోని ఎత్తుగడ పాటలోని ఔన్నత్యాన్ని, పూర్తిస్థాయి భావజలాన్ని అందించే లాగా ఉండాలన్నది గేయ కావ్యాలలో పేర్కొనే అంశం. పల్లవిలోనే పాతకుని హృదయం ఊగేలాంటి ఒక చమక్కు ఉండాలనీ, అదే సమాజాన్ని మార్పు చేయగల దని, పాటకు జీవం పోయగలదని అందరూ నమ్మే, చెప్పే విషయం.

**"కదిలింది కరుణరథ సాగిందీ క్షమాయుగం
మనిషి కొరకు దైవమే కరిగి వెలిగే కాంతి పథం
కదిలింది కరుణరథ సాగిందీ క్షమాయుగం
మనిషి కొరకు దైవమే... మనిషి కొరకు దైవమే
కరిగి వెలిగే శాంతిపథం
కదిలిం కరుణరథం"**

మోదుకూరి జాన్సన్ కూడా తన 'కదిలిందీ కరుణరథ' పాటకు రాసిన పల్లవి ఎంతో హృదయంగమంగా, సమున్న తంగా ఉంటుంది. పల్లవిలో మోదుకూరి జాన్సన్ ఉపయో గించిన పదాలు పాతకుని హృదయం పల్లవించేలా ఉంటాయి. ఇందులోని అంత్యప్రాస కూడా హృదయాన్ని ఆకర్షిస్తుంది.

❀ ❀ ❀

# హైదరాబాద్ సంస్కృతికి ప్రతీకలు నెల్లూరి కేశవస్వామి కథలు

- మానువాడ రామాంజనేయులు, తెలుగుశాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

నెల్లూరి కేశవస్వామి స్వాతంత్ర్యానంతర తెలంగాణ కథకుల్లో ఒకరు. ఆయన 1969లో, 1981లోకొన్ని కథలనైనా కథా సంపుటాలుగా వెలువరించడం వల్ల తెలుగు సాహిత్యానికి కొన్ని మాత్రం దక్కాయి. 1902 నుండి ప్రారంభమైన తెలంగాణ కథ సామాజిక పరిణామాలను చిత్రిస్తూ వస్తున్నది. బండారు అచ్చమాంబ మన తొలి కథకులరాలని చరిత్ర స్పష్టం చేసింది. కొమర్రాజు వెంకటలక్ష్మణరావు, మాడపాటి హనుమంతరావు 1910 నుండి కథలు రాశారు. ఈ సమయంలోనే ఎనభైమందికి పైగా ప్రసిద్ధ కథకులు తెలంగాణ కథలను సుసంపన్నం చేసారు. ఈ సంఖ్య 1956 నవంబరులో తెలంగాణ - ఆంధ్ర రాష్ట్రం ఏకమయ్యాక ఎదిగిన రచయితల సంఖ్య గణించడం కూడా కష్టమే.. కారణం ఇవ్వాళ్ళ తెలంగాణ సాహిత్య సాంస్కృతుల వికాసం.. వ్యాప్తిలో ఐకాన్‌గా నిలిచింది. ఈ సందర్భంగా ఒకచోట ప్రముఖ కథకులు, విమర్శకులు బిఎస్ రాములు గారన్నట్లు ' తెలంగాణ కథ భారతీయ సాహిత్యంలో ప్రేమ్ చంద్, కిషన్ చందర్, వారసత్వాన్ని పుణికి పుచ్చుకొని ముందుకు సాగుతున్నది' అన్నది అక్షర సత్యాలు, మిగులు సమయం, మిగులు ధనం ఉన్న ప్రాంతాల్లోని రచయితలా కాకుండా తెలంగాణ లోని మెజార్టీ రచయితలు ప్రజల పక్షం వహించి రాయడం ఒక గొప్ప విశేషం. .

ప్రజల పక్షం వహించి రాసిన రచయితల్లో హైదరాబాద్‌లో పుట్టి పెరిగి, ఇక్కడ జీవితాలను చిత్రించిన కథకులు నెల్లూరి కేశవస్వామి. నిజాం కాలేజీలో 'ప్రిడిగ్రీ' చదివి ఉస్మానియా యూనివర్సిటీ విశ్వవిద్యాలయంలో ఇంజినీర్‌గా పట్టభద్రుడై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పబ్లిక్ వర్క్స్ డిపార్టుమెంటు నీటిపారుదల శాఖలో ఇంజనీరింగ్‌గా పనిచేసి రిటైరయ్యారు. నాగార్జున సాగర్ డ్యాం నిర్మాణంలో ఇంజనీరుగా భాగం పంచుకున్నారు. కథకులు వాణిశ్రీ ఆరోజులను జ్ఞాపకం చేస్తూ ఆ రోజుల్లో నాగార్జున సాగరం వీరివల్ల సాహిత్య సాగరమైంది అంటారు. కేశవ స్వామి హైదరాబాద్‌లో నివశిస్తూ, తెలంగాణ జీవితాలను, సంస్కృతిని తెలుగులో చిత్రించిన రచయిత. అయితే ఈ చారిత్రక, సామాజిక పరిణామాలను సంక్షుభిత సమాజాన్ని, మానసిక సంఘర్షణను కథల రూపంలో నిక్షిప్తం చేసిన వారు చాలా తక్కువ మంది కనిపిస్తరు. అయితే ఈ సామాజిక పరిణామాలకు సాహిత్య రూపం ఇచ్చి, సామాజిక, చరిత్ర రచన చేసిన కథకులు, నెల్లూరి కేశవస్వామి.

నెల్లూరి కేశవస్వామి చాలా కథలు రాశారు. తొలి సంపుటి 'పసిడిబొమ్మ' ఆగస్టు, 1969లో వెలువడింది. ప్రసిద్ధ తెలంగాణా రచయిత భాస్కరభట్ల కృష్ణారావుకి అంకితం ఇవ్వబడింది. ఇందులోని కథలు రచయిత ప్రారంభ దశను తెలపడంతో పాటు క్రమంగా రచయితగా ఎదిగిన క్రమాన్ని స్పష్టం చేస్తాయి. తెలంగాణలో సాధన సమితి సాధించిన సాహిత్య కృషికి శ్రీ కేశవస్వామి మూల స్తంభాలలో ఒకరు. కథా గమనం, నాటక ప్రదర్శన రక్తి కట్టేలా కలం మలచడంలో కేశవ స్వామి తనకు తానే సాటి అని నిర్భయంగా చెప్పవచ్చు. ఈ కథల సంపుటిలో 'పసిడి బొమ్మ' 'అలవాటు', 'అభిమానం', 'పాలపొంగు', 'పరీక్ష', 'అక్కయ్య పెళ్ళి' కథలున్నాయి. పరిసర సమాజ వాతావరణం క్షుణ్ణంగా పరిశీలించి మానసిక అంతర్గత భావాలు తరచి చూసిన వివిధ దృక్కోణాల్లో ఈ కథలు ప్రస్ఫుటమవుతున్నాయి. కథల కంటే కొన్ని గల్పికలు మరువు రాని వ్యంగ్యం, హాస్యం, చమత్కారం, సమ్మిళితమైన అలరారుతున్నాయి."

'పసిడి బొమ్మ' కథలో నిరుద్యోగం మగవాళ్లను కేవలం నిరుద్యోగులుగా మిగిల్చితే మహిళలను వేశ్యగా మారాల్సిన అనివార్యతను ఎలా ముందుకు తెచ్చిందో అందుకు వారిలోని అశక్తత, పిరికితనాలు ఎలా కారణమో వివరిస్తుంది. శంకరంతో, రాజారావు లేచిపోయిన విషయం ఎవరో గుర్తు చేయడంతో కథ ప్రారంభమవుతుంది. ఆర్టిస్టు రాజారావు ఒక పసిడి బొమ్మతో కలిసి లేచిపోయాడు అకస్మాత్తుగా రాజారావు ఇల్లు వదిలిపోతూ ఉత్తరం రాసి పెట్టిపోయాడు. రాజారావు గురించి ఆయన భార్య గురించి ఆలోచిస్తూ శంకరం ఒకసారి వారింటికి వెళిన చిరునామా ననుసరించి వెళితే రాజరావు అప్పటికే ఇల్లు వదిలి వెళ్ళిపోయాడని ఆయన భార్య చెప్పింది. ఒంటరి స్త్రీని అలా వదిలి వెళ్ళడం తప్పని అనుకున్నాడు శంకరం. తిండికి కటకటతో ఆమె అతనికి మొఖం చూపించలేక ఇల్లు వదిలి వెళ్ళిపోతుంది. ఇదీ కథ. 1960ల సామాజిక పరిణామాలు, నిరుద్యోగుల స్థితుల్ని చిత్రించారు. రచయిత.

కార్మికవర్గ చైతన్యం ఎక్కడ వున్నా ఆ చైతన్యం పరమ శిస్తూనే వుంటుంది. అది వ్యక్తిత్వంలో, జీవితంలో ఒక 'అలవాటు'గా మారుతుంది. ఈ కథలో ఇద్దరు మిత్రులు కాలక్రమంలో చెరోదారి పడతారు. ఒకరు కార్మిక నాయకుడుగా, మరొకరు వారినదుపు చేసే యాజమాన్యంలో భాగంగా మారతారు. సూరి అధికారిగా వుంటాడు. ఆయన మిత్రుడు గోపి ఆరోగ్యం బాగు చేసుకోవాడానికి తప్పకుండా విశ్రాంతి తీసుకోవాల్సిందేనని డాక్టర్లు చెబుతారు. పాత స్నేహితున్ని ఆరేళ్ళ తర్వాత కలుసుకోవడానికి సూరి దగ్గరికి

ఈ సందర్భంగా వెళతాడు. అక్కడ సూరి కింద పనిచేసే కూలి చనిపోతాడు. కూలీలు, అతని భార్య పిల్లలు నష్టపరిహారం కోసం అడుగుతారు. దాన్ని సూరి వ్యతిరేకిస్తాడు. గోపి సూరికి తెలియకుండా వారిని కలిపి వారు ఎలా సమ్మె చేయాలి, ఎలా కోర్కెలు సాధించుకోవాలో ఉపదేశించి వస్తాడు. అంత దాకా అణిగిమణిగి వున్న కూలీలు సమ్మెకు పూనుకోవడం, గట్టిగా మాట్లాడ్డం ఎలా జరిగిందో సూరికి అర్థం కాదు. తర్వాత విషయం తెలుసుకుంటాడు. వెంటనే గోపికి రైల్వే టిక్కెట్ అడ్వాన్సు బుకింగ్ చేసుకొని తీసుకొస్తాడు. రేపు ప్రయాణమని చెపుతాడు. కథ ముంగిపులో కొసమెరుపు వుంటుంది. ఎవరి ప్రయాణానికి టిక్కెట్ తీసుకొచ్చాడో కథ చివరిలో తెలుస్తుంది. గోపి లాంటి వాడు తన వెంట వుంటే ఇక తన పని అయినట్టే అని భావిస్తాడు. 'అలవాటు' కథ కార్మికవర్గ, పేదల పక్షపాతం జీవితంలో ఒక వ్యక్తిత్వంగా, అలవాటుగా మార్చుకున్న కార్యకర్తల గురించి రాసిన మంచి కథ.

'అభిమానం' కథలో అంటరానితనం తరతరాలుగా దళితుల్లో సృష్టించిన అభద్రతను, వ్యక్తిత్వ హత్యాకాండను ఆవిష్కరించింది. వెంకట్రావు దళితుడు. చిన్న ఉద్యోగం చేస్తూ పెద్ద ఉదోగ్యం కోసం ఎదురు చూస్తుంటాడు. తాను దళితుడని ఎవరికీ తెలియకూడదని తెలిస్తే అవమానిస్తారని, చిన్న చూపు చూస్తారని సంకోచిస్తూ లోలోన బాధపడుతుంటాడు. కొన్నాళ్ళకు హరిజనుల కోసం ప్రత్యేకించబడిన ఒక పోస్టు ప్రకటన చూసి అతని గుండెలు తీవ్రంగా కొట్టుకోసాగాయి. ఆ ప్రకటన రండి, ఈ ఆఫీసర్ పదవి స్వీకరించండి అని ఆహ్వానిస్తున్నట్టుగా తోచింది. కాని తాను దళితుడని చిన్నప్పుడు హేళన చేసిన అవమానాలు, అనుభవాలు గుర్తుకు వచ్చి స్నేహితులంటేనే హడలెత్తిపోయేది వెంకట్రావుకు. ఇలా ఎన్నో అంశాల్ని, అప్పుడప్పుడే ఎదుగుతున్న క్రమంలో సామాజిక పరిణామాలను, మనస్తత్వాన్ని చిత్రించిన చక్కని కథ ఇది.

ప్రభుత్వ ఉద్యోగం ఒక దాస్యంలాగా ఎలా వుంటుందో ఆ క్రమాన్ని 'ప్రజ, ఉద్యోగి, మంత్రి' కథలో కాస్త వ్యంగ్యంగా చిత్రించారు. కేశవస్వామి, మరో కథ 'పాలపొంగు' కథ స్వాతంత్ర్యానికి పూర్వం 1946లో 'భారతి'లో ప్రచురించబడింది. స్వాతంత్ర్య పూర్వ జీవితాలను, పరిణామాలను ఈ కథ ప్రతిఫలించింది. మరోకథ 'అక్కయ్య పెళ్లి' కథ ఉత్తర ప్రత్యుత్తరాల రూపంలో,శైలి, శిల్పంలో రాయబడింది. 'అతిథి' కథలో పట్నం వాసులు చుట్టాల పేరిట, మిత్రుల పేరిట వచ్చే వారి భారాన్ని మోయలేని స్థితి వల్ల వారిని ఎలా వదిలించుకోవాలో చేసే రకరకాల ఉపాయాలను చక్కగా చిత్రించారు.

కథకులు కేశవస్వామి అనగానే గుర్తుకొచ్చేది 'చార్మినార్' కథల సంపుటి, ఇందులో 'విముక్తి', 'కన్నెరికం', 'రూహియాప', 'షరీఫ', ప్రతీకారం', 'అదృష్టం', 'యుగాంతం', 'వంశాకురం', 'కేవలం మనుషులం', 'భరోసా', 'ఆఖరి కానుక' అనే శీర్షికలతో 11 కథలున్నాయి. 1981లో మొదటి ముద్రణ వెలువడింది. జీవితాన్ని, సమాజాన్ని, మనుషులను పలు కోణాల్లో పరిశీలించి, విశ్లేషించిన ఈ కథలను ఆనాటి ప్రముఖ తెలంగాణా కథకుల్లో ఒకరైన డి.రామలింగం 'జలతారు మేలిముసుగు' పేరుతో రాసిన ముందుమాటలో ఇలా అంటారు.

'చార్మినార్ అనే పేరును బట్టే ఈ కథల విశిష్టత వ్యక్తమవుతోంది. గోల్కొండ రాజ్యాన్ని పరిపాలించిన మహమ్మద్ ఖులీ ఖుతుబ్షా క్రీ.శ. 1591లో నిర్మించిన ఆ కట్టడం తదాదిగా నడిచిన చరిత్రకూ, పెంపొందిన సంస్కృతికీ, విలసిల్లిన నాగరికతకూ సాక్షిగా నిలిచి వున్నది. అది హైదరాబాద్ సంస్కృతికి వారసులైన వారి జీవితాలలోని మంచి చెడ్డలకు సాహిత్య రూపమే 'చార్మినార్' అని నామకరణం చేయబడ్డ ఈ కథా సంపుటి".

కేశవస్వామి సన్నిహిత మిత్రుల్లో ఒకరు, కథరాచయిత గూడూరి సీతారాం నేషనల్ బుక్ ట్రస్ట్ కోసం 'నెల్లూరి కేశవస్వామి ఉత్తర కథల'ను సంకలనం చేసారు. ఆయన 'కేశవస్వామి కథల్లో నవాబులు, దేవిడీలు, మహబూబ్ కి మెహిందీ, కోఠాలు, దివాన్ ఖానాలు, జనానా ఖానాలు, బేంసాహెబాలు, దుల్హన్పాషాలు, పాన్దాన్, పరాటా కీమా, దాల్చా నమాజులు, పరదాల వెనుక జీవితంలోని సంస్కృతి, సంఘటనలు ఎన్నో ఒక్కచోట రాసిపోసినట్లు' కనిపిస్తాయని అంటారు.

'విముక్తి' కథలో నవాబుల కుటుంబాల్లో ఎందరో దాసీలు వుండేవారు. వారిని పురుషులు వాడుకునే వారు. ఆ సంస్కృతిని వ్యతిరేకించే తరం కూడా ఆ కుటుంబంలోంచే ఎదిగిన క్రమం సుల్తాన్ పాత్రద్వారా చూస్తాము. సుల్తాన్ తమ ఇంటి దాసి పిల్ల షీరాని వాడుకొమ్మని తల్లి, వదిన తదితరులు ప్రతిపాదించి గదిలోకి పంపిస్తారు. ఆ పద్ధతిని అసహ్యించుకొని దాసి షీరాని సుల్తాన్ పెళ్లాడాలనుకుంటాడు. తల్లితో ఆగ్రా, అజంతా ఎల్లోరా చూసి వస్తానని చెప్పి అనుమతి తీసుకొని ఆమెకు తెలియకుండా షీరాను వెంట తీసుకొని ఢిల్లీకి వెళ్ళి అక్కడినుంచి అలీఘర్ వెళ్ళిపోతాడు. పది రోజుల తర్వాత అమ్మకు ఉత్తరం రాస్తాడు. 'అమ్మీజాన్! నేను మీకు ప్రియమైన ఆఖరి సంతానాన్ని. ఆ ప్రేమాదరాలతోనే నన్ను క్షమిస్తారని ఆశిస్తున్నాను. ఏనాటికైనా మీరు షీరాని హృదయపూర్వకంగా మీ చిన్నకోడలుగా గుర్తిస్తారని ఆశ. ఆనాడే మేమిద్దరం మీ ఆశీస్సులకై దగ్గరకు రాగలము. అంతవరకు దూరాన్నుంచే మమ్మల్ని దీవించండని ప్రార్థిస్తూ.. ఇట్లు మీ ప్రియమైన చిన్న కొడుకు.. సుల్తాన్." ఈ హృదయ సంస్కారం రోజురోజుకు పెరగడమే మానవీయ విలువలకు నిదర్శనం. పాటకచేరీలు చేస్తూ ముజ్రాలు కృత్తిలో జీవిస్తున్న తల్లి కూతుళ్లను 'కన్నెరికం'

కథలో చూడవచ్చు. ఇది 1979 ఏప్రిల్‌లో 'ఆంధ్రప్రభ' వారపత్రికలో అచ్చయ్యిందీ కథ.

నెల్లూరి కేశవస్వామి పేరు చెబితేనే గుర్తొచ్చే కథ 'యుగాంతం', హైదరాబాద్ రాజ్యంలో 1946 - 50ల మధ్య ఎలా కొనసాగాయో చాలామందికి తెలియదు. అందాకా ఎందుకు 1988 -90ల్లో నేను చదువుకున్న సాంఘిక శాస్త్రంలో మద్రాసు ఆంధ్రరాష్ట్ర ముఖ్యమంత్రి గురించి, ఆధ్రప్రదేశ్ ఏర్పడ్డాక అప్పటి ముఖ్యమంత్రి గురించి చదువుకున్నాను. ఇదే సమయంలో హైదరాబాద్ రాష్ట్ర ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు చరిత్ర ఎక్కడా కనిపించలేదు. హైదరాబాద్ రాష్ట్ర చరిత్ర ఆంధ్రప్రదేశ్ ఏర్పడ్డంతో పూర్తిగా మూలకు నెట్టివేయబడింది. ఈ ' యుగాంతం' కథ ఒక సామాజిక, రాజరిక వ్యవస్థ అంతమవుతూ ఒక నూతన దశలోకి సమాజం, మానవ సంబంధాలు మారుతున్న పరిణామాల్ని చిత్రించింది. 'యుగాంతం' అనే పేరుకు సార్థకతను చేకూర్చింది.

'17 సెప్టెంబర్, 1948 పోలీస్ యాక్షన్ మొదలై ఆనాటికి మూడో రోజు'' అని కథ ప్రారంభం అవుతుంది. ''హైదరాబాద్ ప్రత్యేక రేడియో ప్రసార కేంద్రం దక్కన్ రేడియోలోంచి. రాత్రింబవళ్లు ఎడతెరిపి లేకుండా ప్రసారాలు వస్తున్నాయి. వీటి ప్రకారం హైదరాబాద్ సైన్యాలూ, ఇత్తెహాదుల్ ముసల్మీన్ రజాకర్ (స్వచ్ఛంధ) దళాలూ కలిసి, భారత సైన్యాల్ని తరిమి కొట్టేస్తున్నాయి. వాళ్ళ ధైర్యసాహసాల్ని పొగుడ్తూ, భారత ప్రభుత్వాన్ని అనేక రకాలుగా తిట్టిపోస్తూ, పాటలు, పద్యాలూ, ఉపన్యాసాలతోనూ, 'ఖాసింరజ్వీ జిందాబాద్!', 'అజాద్ హైద్రాబాద్ పాయిందాబాద్!' అన్న నినాదాలతోనూ, హోరెత్తిస్తోంది. రేడియో. కానీ నగరం మాత్రం ప్రశాతం గానే వుంది. ఆఫీసులూ, స్కూళ్ళూ, కాలేజీలు, దుకాణాలు తెరిచే వున్నాయి. ప్రజల దినచర్యల్లో చెప్పుకోదగ్గ మార్చేమీ రాలేదు. హిందువులు భయం, భయంగా బిక్కుబిక్కుమంటూ వంచిన తలలు ఎత్తకుండా మౌనంగా తమ తమ పనులు చేసుకుంటూనే వున్నారు''

'యుగాంతం' నిజంగానే ఒక యుగాంతాన్ని చిత్రించిన గొప్ప కథ. ఇవి కేవలం కథలు కావు, వాస్తవ జీవితాల, సామాజిక పరిణామాలను, సామాజిక చరిత్రను నిక్షిప్తం చేసిన చారిత్రాత్మక కథలు.

అందులో భాగంగా చూసినప్పుడు కేశవస్వామి రాసిన 'రూహీ ఆపా' కథ మహోన్నతమైన మానవీయ సంబంధాలను మనిషిలోని సున్నితమైన హృదయాన్ని కులమతాలకు అతీతంగా స్పందించే మనిషిని చిత్రించిన కథ. 'కన్నెరికం' కథకు మరో పార్శ్వంగా ఈ కథ కొనసాగుతుంది. ముజ్రాల జీవితాన్ని 'కన్నెరికం' కథ ఒక బాధాకరమైన కోణంలో చిత్రిస్తే అలాంటి జీవితాల్లో ఆనందించే, జీవితమంతా హృదయంలో దాచుకునే సంతోష సన్నివేశాలు 'రూహీ ఆపా'లో చిత్రించారు. రెండు కథలు కూడా పాత్రలకు అవే పేర్లు ఉంచడంలో రచయిత ఒక స్పష్టమైన దృష్టితోనే రాశాడని చెప్పకనే తెలుస్తున్నది. సొంతకూతురులా నవాబు, నవాబు కొడుకు ఒక ముజ్రాల రమణిని గౌరవించిన తీరును చిత్రించడం ద్వారా ముస్లిం నవాబుల్లో కొనసాగిన హృదయ సంస్కారాన్ని రచయిత ఒడిసి పట్టాడు.

వీరి 'యుగాంతం', 'విముక్తి' కథలను ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి ఆంగ్లంలోకి అనువదించారు. అవి అక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ వారు భారతీయ భాషల్లో ముస్లిం సంస్కృతిపై వచ్చిన కథా సంకలనంలో చేర్చారు. 'అలవాటు' కథను ముదిగొండ వీరభద్రశాస్త్రి ఆంగ్లంలోని అనువదించగా తెలుగు యూనివర్సిటీ వారు 'తెలుగు షార్ట్ స్టోరీస్' పుస్తకంలో ప్రచురించారు.

ఇందులోని 'షరీఫా', 'అదృష్టం', 'వంశాంకురం', 'కేవలం మనుషులం', 'భరోసా', 'ఆఖరి కానుక', కథలు దేనికదే ప్రత్యేకమైనవి. విశిష్టమైనవి. 'వంశాకుంరం' కథలో ముస్లిం పెళ్లి సంబంధాలు ఎలా వుంటాయో, కొడుకు పుట్టాలనే ఆశ ఆడపిల్లల జీవితాలను ఎలా అతలాకుతలం చేసి ఆత్మహత్యకు పురికొల్పుతాయో హృదయవిదారకంగా చిత్రించింది. 'కేవలం మనుషులం' కథలో హుస్సేన్ మిర్జా, మహబూబ్ రాయ్ సక్సేనా దశాబ్దాల స్నేహితులు, వారి కుటుంబాలు స్నేహం కలిసి వుంటాయి. రెండవ తరంలో వారి పిల్ల ఇష్టపడి పెళ్ళి చేసుకోవాలనుకుంటారు. ఇరువురు తల్లిదండ్రులకు ఇది ఊహకు అందని విషయం. మతాల సరిహద్దులను చెరిపివేసిన స్నేహం, పరిచయం, ప్రేమ, పెళ్ళిగా మార్చుకొన్న ఆదర్శాల రెండవ తరం గురించిన చక్కని కథ.

'భరోసా' కథ నమ్మిన పేదలను నట్టేట ఎలా ముంచుతారో భరోసాను భగ్నం చేసిన యదార్థ కథ. 'ఆఖరి కానుక' కథ రోజురోజుకు పేదరికంలోకి ఈడ్వబడుతున్న ముస్లిం కుటుంబాలు అరబ్బు దేశాల షేక్‌లకు తమ కూతుళ్ళను ఇచ్చి పెళ్ళి చేసి తద్వారా కాస్త ఆర్థిక సౌలభ్యం పొందాలనుకునే దుస్థితిని తెలియజేస్తుంది. 'అమీనా దుర్భర జీవితం గురించి కేశవ స్వామి రాసిన కథ ఆ తరువాత దశాబ్దాలుగా హృదయ విదారకంగా కొనసాగుతూ వచ్చింది. నిజంగానే ఒక అమీనా కేసు అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశమైంది.

విశిష్టమైన వస్తు, శిల్ప నైపుణ్యంతో మహోన్నతంగా రాయబడిన నెల్లూరి కేశవస్వామి కథలన్నీ మన గోల్కొండ గనుల్లో లభించిన ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కొహినూర్, జాకోబ్ వజ్రాల వంటివి. హైదరబాద్ 'గంగా జమునా తహజీబ్'కు నిదర్శనాలుగా నిలుస్తాయి. ఒక యుగపు సామాజిక చరిత్రను అంద్దంపడతాయి.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# బతుకు దారిలో వెలుగు చూసిన నంబూరి పరిపూర్ణ

- భూనోత్ రమేష్, పరిశోధక విద్యార్థి, తెలంగాణ విశ్వవిద్యాలయం

తెలుగులో వచ్చిన స్త్రీల స్వీయ చరిత్రలలో ఇప్పటికి తెలియవస్తున్నంత వరకు 1934లో అచ్చయిన ఏడిదము సత్యవతి 'ఆత్మచరితము' మొదటిది. 2017 వరకు ఈ 83 సంవత్సరాల కాలంలో ఇప్పటి వరకు వచ్చిన స్త్రీల స్వీయ చరిత్రలు ముప్పై, తెలుగు సమాజంలో మహిళల అభివృద్ధి వికాసాలు చరిత్రను ముదింపు వెయాలన్నా, అవరోధంగా ఉన్న సామాజిక అసమానతలను అధికారాలను ధిక్కరిస్తూ వందేళ్ళుగా స్త్రీలు చేస్తున్న అంతరిక భాహ్యయుద్ధాల స్వరూప స్వభావాలు తెలుసుకొనాలన్నా, ఆ క్రమంలో ఎంచుకుంటున్న ప్రత్యామ్నాయాలను గుర్తించాలన్నా స్త్రీల స్వీయచరిత్రలను మించిన చారిత్రక వనరు మరోకటి లేదు. నంబూరి పరిపూర్ణ గారి స్వీయ చరిత్ర అటువంటి సారవంతమైన వనరు. పుట్టుకతో అన్నీ అమరిన, అవకాశాలను అంది పుచ్చుకో గల సామాజిక స్థాయికాదు నంబూరి పరిపూర్ణగారిది.

తెలుగు సాహిత్య చరిత్రలో తనకంటు ఒక స్థానంను సాధించుకున్న నంబూరి పరిపూర్ణ కృష్ణా జిల్లా మాల దాసరి కుటుంబంలో పుట్టారామె. శ్రీ వైష్ణవం ఇచ్చిన జ్ఞాన చైతన్యాల వల్ల మాల వారితో దాసరులకు కొంత ప్రత్యేకత ఉంది. ఆ ప్రత్యేకత అక్షరాస్య విద్యకు, పౌరాణిక జ్ఞానానికి, మత, కర్మ కాండకు, వైద్యానికి సంబంధించినదని సంబూరి పరిపూర్ణ వివరించారు. నంబూరి పరిపూర్ణ తండ్రి లక్షయ్య, తల్లి లక్ష్మమ్మ పరిపూర్ణకు ఊహ తెలిసే వయసుకే పెద్దన్న కమ్యూనిష్టు రాజకీయాలలో, చిన్నన్న స్వాతంత్ర్య ఉద్యమంలో భాగస్వాములై ఉన్నారు. ఆ ప్రభావంతో ఎదిగిన జ్ఞాన చైతన్యాలు ఆమెవి. పుట్టింటి ఆధ్యాత్మిక చింతన కారణంగా పన్నెండేళ్ళకే భగవద్గీత శ్లోకాలు చదవగలిగిన, రామాయణపారాయణం చేయగల పరిజ్ఞానం పొందిన లక్ష్మమ్మ భర్తతో పాటు బడి నిర్వహణలో భాగస్వామి కావడం, మంచి పంతులమ్మగా జనం అభిమానాన్ని సంపాదించుకొనటం సహజంగా జరిగింది. బడిపెట్టి మాల పిల్లలకు అక్షరజ్ఞానం ఇస్తుండడం వల్ల సాటి మాల కులస్థులలో కాస్త పై స్థాయి జీవితం, గౌరవం పరిపూర్ణ కుటుంబానికి లభించి ఉండవచ్చుగాక కాని లక్ష్మమ్మ దంపతుల నివాసం మాల పల్లెలోనే అన్న విషయం, అందమైన రూపం, మంచి కంఠం, నటనాకౌశలం ఉన్న లక్ష్మయ్య నాటకాలు వేయటంలో శిక్షణ ఇవ్వగలిగింది. దళితయువకులకు మాత్రమే అన్న విషయం గమనిస్తే అవి కులం రీత్యా వారి వెలివేతనే సూచిస్తాయి.

పరిపూర్ణ గారి జీవితం కొంత మేరకు కుల పరిధులను దాటిందనే చెప్పాలి. విజయవాడ, మద్రాసు, రాజమండ్రి మొదలైన చోట్ల బడులలో బాగా చదివే విద్యార్థిగా, పాటలు, పద్యాలు చక్కగా పాడుతూ నటించగల మంచి కళాకారిణిగా సహవిద్యార్థులలో, అధ్యాపకులలో పేరు, గుర్తింపు పొందిన నంబూరి పరిపూర్ణకు కుల వివక్ష అనుభవానికి వచ్చినట్లు కనబడదు. దానికి తోడు బ్రహ్మ సమాజ ఆదర్శాల ప్రకారం నడుస్తున్న కాకినాడ పిఆర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదవటం వల్ల కుల మత వివక్షకు తావులేని వాతావరణం పరిపూర్ణకు లభించింది. పైగా ఈ చదువుల కాలంలో అభివృద్ధి చెందిన కమ్యూనిష్టు జీవిత దృక్పథం, కమ్యూనిష్టుల నుండి లభించిన స్నేహ సహకారాలు, దర్శిచెంచయ్య, మహీధర జగన్మోహనరావు మొదలైన వాళ్ళ కుటుంబాలలో వ్యక్తిగా కలిసి మెలిసి గడిపిన కాలం కుల అస్తిత్వ చైతన్యం గానీ వివక్షగానీ పరిపూర్ణ అనుభవానికి రాకుండా చేసి ఉంటాయి.

పరిపూర్ణ గారు 1950 నాటికి ఇంటర్మీడియేట్ పూర్తి చేసిన పరిపూర్ణ ఉద్యోగ జీవితం 1953-54 నుండి అధ్యాపక వృత్తితో మొదలైంది. ఏలూరులో ఒక మేనేజ్‌మెంట్ స్కూల్‌లో కొద్ది కాలము పని చేసి సెయింట్ థెరిసా కాలేజీలో రెండేళ్ళు సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ శిక్షణ పొందారు. నూజివీడు మేనేజ్‌మెంట్ మిడిల్ స్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా కొంత కాలం, బాల విహర్ టీచర్‌గా మరి కొంతకాలం పని చేశారు. 1958 నాటికి బ్లాక్ డెవలప్‌మెంట్ ఆఫీస్‌లో సోషల్ ఎడ్యూకేషనల్ ఆర్గనైజర్‌గా కొత్త ఉద్యోగంలోకి ప్రవేశించి స్థిరపడ్డారు. కుల వివక్ష పరిపూర్ణ అనుభవానికి వచ్చింది. ఉద్యోగస్తురాలైన తరువాతే సోషల్ ఎడ్యుకేషన్ ఆర్గనైజర్‌గా హైదరాబాద్‌లో శిక్షణ తరువాత కృష్ణా జిల్లా చిట్టిగూడూరుకు మొదటి పోస్టింగ్ వస్తే అక్కడ ఉండటానికి ఆమెకు ఇల్లు దొరకలేదు. బ్రాహ్మణులు అధిక సంఖ్యాకులుగా ఉన్న ఆ ఊళ్ళో దళిత కులం అయినందున ఆమెకు అద్దెకు ఇల్లు ఇవ్వడానికి ఎవరూ ఇష్టపడలేదు.

పరిపూర్ణకు పదమూడేళ్ళ వయస్సుకే కమ్యూనిష్టు రాజకీయాలతో పరిచయం ఏర్పడింది. రాజమండ్రి జైలులో ఉన్న అన్నగారిని కలవటానికి తల్లితోపాటు రాజమండ్రి వచ్చి కమ్యూనిష్టు పార్టీ ఆఫీసులో ఉన్నప్పుడు రంగస్థల భయంలేక చక్కగా చొరవతో పాడగల పరిపూర్ణ సంగతి తెలిసి ఆమె చేత జన సమూహాలను సమీకరించిన చోటల్లా పాటలు పాడించటం మొదలు పెట్టారు. ఈ క్రమంలోనే పార్టీ అనుబంధ మహిళా సంఘం పనులు చేసింది. జిల్లా విద్యార్థి ఫెడరేషన్‌లో చురుకుగా పనిచేస్తూ 1949 డిసెంబర్‌లో రాష్ట్ర మహాసభల కోసం పని చేసింది. ఆ సందర్భంగానే దాసరి నాగభూషణరావుతో ఆమెకు పరిచయం అయ్యింది. ఇంటర్మీడియట్ పూర్తివు

తూనే పరిపూర్ణ వివాహం దాసరి నాగభూషణరావుతో జరిగింది. అది పెద్దలు కుదిర్చి చేసిన పెళ్ళికాదు. కమ్యూనిష్టు పార్టీ విద్యార్థి రాజకీయాలలో చురుకుగా పాల్గొంటున్న పరిపూర్ణను ఇష్టపడి రాష్ట్ర విద్యార్థి సంఘం నాయకుడిగా కొత్తగా బాధ్యతలు చేపట్టిన దాసరి వర్ణాంతర వివాహం చేసుకోవాలన్న తన ఆదర్శం నెరవేరుతుందన్న ఆలోచన ఇన్నీ కలిసి తనను దాసరితో వివాహానికి సరే అనేట్లు చేశాయి అంటారు పరిపూర్ణ. 1949లో పార్టీ ఆధ్వర్యంలో పెళ్లి జరిగాక పార్టీపై ఉన్న నిషేదాల కారణంగా కాపురం అజ్ఞాతవాసంలోనే సాగింది. 1951 మే నెలలో కూతురు శిరీష పుట్టింది. ఇక అక్కడి నుండి కుటుంబ బాధ్యతను పరిపూర్ణ ఒంటరిగానే మోయవలసి వచ్చింది. ఒక బిడ్డతో మద్రాసులో ప్రవాస జీవితం, ఏలూరులో రెండవ బిడ్డ అమరేంద్ర పుట్టాక బతుకు తెరువు వెతుకులాటలో ఉపాధ్యాయ శిక్షణ పొందటం, అది పూర్తయ్యేసరికి మూడవ సంతానం శైలేంద్ర కలగటం - వాళ్ళ పోషణ కోసం ఉద్యోగాల వెతుకులాట ఈ క్రమంలో కమ్యూనిష్టు కార్యరంగం నుండి పరిపూర్ణ నిష్క్రమణ అనివార్యమైంది.

దాసరి అఖిల భారత విద్యార్థి నాయకుడిగా, ఆ తరువాత పార్టీ పూర్తి కాలపు కార్యకర్తగా, నాయకుడిగా ఎదుగుతూ ముందుకు సాగుతుంటే పరిపూర్ణ అదే వేగంతో వెనక్కి, ఇంట్లోకి నెట్టబడింది. మగవాళ్ళ జీవితానికి, ఎదుగుదలకు ఏ రకం గానూ అవరోధం కాని పెళ్లి, పిల్లలు ఆడవాళ్ళ సహజ బాధ్యత అయి జీవితాన్ని కుచింప చేయడంలో పని చేస్తున్న శక్తి పితృస్వామిక అసమ సాంఘీక న్యాయం తప్ప మరొకటి కాదు. దాసరి ఏ కమ్యూనిష్టు క్రియాశీల సౌందర్యాన్ని ఆమెలో చూసి ఇష్టపడి పెళ్ళాడాడో ఆ క్రియాశీలతను ఆమెలో సదా నిలిపివుంచటం గురించిన చింతన ఇంతైనా ఆ తరువాత కనబరచలేకపోయినారంటే అది కమ్యూనిష్టులు కూడ గుర్తించలేకపోయిన లేదా గుర్తించి నిరాకరించిన ఆ పితృస్వామిక దురహంకార లక్షణం వల్లే అనుకోవాలి. అయినప్పటికీ కమ్యూనిష్టు పార్టీ పట్ల ఆమెకు ఎపుడూ గౌరవమే. పార్టీ పనికిదూరమై, పార్టీలో నాయకత్వ స్థాయికి ఎదుగుతున్న భర్తతో అసంతృప్తి అశాంత వైవాహిక జీవితం గడుపుతూ ఆత్మహత్య చేసుకుందామన్నంత విరక్తి కలిగిన దశలో కూడా బాల్యం నుండి పార్టీ అందిస్తున్న స్ఫూర్తితో ధైర్యానికి పట్టుదలకు మారు పేరుగా ఉన్న తాను నిస్పృహకు గురికావటమేమిటని కూడగట్టుకొని నిబడిన చైతన్యం ఆమెది.

దాసరి నాగభూషణరావు గారిది భూస్వామ్య కుటుంబం. పెద్ద కుటుంబం అని అతని గురించి ఒక చోట చెప్పినది కులానికి సంబందించిన మాటే అయి ఉండాలి. తన పట్ల పిల్లల పట్ల అతని పట్టనితనాన్ని గురించి బాధపడుతూ పరిపూర్ణ ఒక సంఘటనను ప్రస్తావించారు. నాలుగేళ్ళ కొడుకు అమరేంద్ర ఆడుకొంటూ పడి చెయ్యి విరిగి నొప్పికి ఏడుస్తుంటే ఇంట్లోనే ఉన్న దాసరి కొడుకును దగ్గరకు తీసుకొని ఓదార్చటం కానీ, ఆసుపత్రికి తీసుకొని వెళ్ళడం కానీ చేయలేదని చెప్పినప్పుడు ఏమనిపించిందంటే మేము తన సాటి కులం వాళ్ళము వాళ్ళం అయిఉంటే బిడ్డమీద ప్రేమ కనబరచి, ముద్దు చేసి ఉండేవాడేమోనని నన్ను కోరి చేసుకుంటేనేం? తనలో పనితనం నించీ జీర్ణించిన కులాధిక్యత ఇటు నా హీనకుల దీనస్థితి, నాకు పుట్టిన బిడ్డల్ని చులకనగా, నిర్లక్ష్యంగా చూసెట్టు చేస్తున్నాయేమో అని అంటారు. అట్లాగే తాను సోషల్ ఎడ్యూకేషన్ ఆర్గనైజర్ ఉద్యోగానికి ఎంపిక అయినప్పుడు దాసరి ఆ ఉద్యోగం చేయడానికి వీల్లేదని అభ్యంతర పెట్టాడని, ఆ సమయంలో తల్లి తన పక్షాన మాట్లాడబోతే ఆమెను కసురుకొనటమే కాక కొట్టడానికి లేచి మీది మీదికి వెళ్ళాడని చెప్తు ఎంత అవమానకరమైన సంఘటన ఇది అత్తగారు తన సాటి కులం మనిషయి ఉంటే కొట్టటానికి ఇలా ఎగబడేవారేనా అని మనస్సు కలుక్కుమంది అంటారామె.

ఈ రెండు సందర్భాలు అంత ఆదర్శంగా భావించి చేసుకున్న వర్ణాంతర వివాహం పరిపూర్ణకు ఎంతటి చేదు అనుభవాన్నిచ్చిందో స్పష్టం చేస్తాయి. నిజానికి వేల సంవత్సరాలుగా ఊడలు దిగిన కుల వ్యవస్థను, అది సృష్టించిన అంతరాలను అధిగమించటం అంతసులభంకాదని పరిపూర్ణకు తెలియలేదు. కుల ఆంక్షలు, బహిష్కరణలు తీవ్రంగా ఉండే ఆ నాటి పల్లె వాతావరణంలో తనను తీసుకెళ్ళి ఇంట్లో పెట్టుకోలేకపోయినా ఏలూరులో పసిబిడ్డతో ఒంటరిగా ఉన్నప్పుడు అత్తగారు ఆడబిడ్డలు తనపట్ల స్నేహంగా మానవీయంగా ప్రవర్తించటం గురించి కృతజ్ఞతతో గుర్తు చేసుకోగలిగిన పరిపూర్ణ భర్త గురించి అలా భాదపడిందంటే కోరి చేసుకున్న వాడి సహచర్యంలో, సంభాషణలో, ప్రవర్తనలో కుల న్యూనత ఎంత అనుభవానికి వచ్చిందో ఎంత గాయపరిచిందో ఊహించుకోవచ్చు. అయితే క్షోభను శాశ్వతం చేసుకొని క్రుంగి పోవటం పరిపూర్ణ స్వభావం కాదు. తన కష్టాలకు కారకులని ఎవరినో తిడుతూ కూర్చోవటం కాక తన జీవితాన్ని తాను నిర్మించుకొనటం కోసం ఉద్యోగం ఊతగా చేసుకొని 1960 నుండి జీవితంలో రెండవ పర్వం ప్రారంభించారు. ఆమె ఉద్యోగం చేస్తూ తల్లి సహాయంతో పిల్లలను పెంచి ప్రయోజకులుగా చేశారు. పూర్వ ఉద్యమ అనుభవాల వాసన వల్ల ఉద్యోగ నిర్వహణలో భాగంగా గ్రామీణ మహిళల సంక్షేమం గురించి శ్రద్ధ పెట్టారు. దళితుల గురించి ప్రత్యేక సామాజిక కార్యకలాపాలను చేపట్టారు. సాహిత్య కృషి సాగించారు. ఈ క్రమం అంతటిలో వెలుగును చూడటం పరిపూర్ణ గారి ప్రత్యేకత. తన ఎనభైఆరేళ్ళ 'బతుకు పుస్తకానికి వెలుగు దారులలో' అని పేరు పెట్టడం దానినే సూచిస్తుంది. దు:ఖ కారణమైన వ్యక్తులనైనా వ్యవస్థాగత శక్తులనైనా విమర్శించటమే కాని ద్వేషించటం తెలియని తాత్విక స్థాయిని అందుకున్న పరిపూర్ణ జీవితం ఆమెది. అందుకే ఆమె స్వీయ చరిత్ర ఎంతో స్ఫూర్తిదాయకం.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



## అప్పల్నాయుడు నవలలు

# ప్రపంచీకరణ నేపథ్యం- మానవ సంబంధాల విచ్ఛత్తి

- గెడ్డవలస రవికుమార్, పరిశోధకుడు

1947 ఆగస్టు కుట్రని విప్పి చెప్పకపోతే అన్నం సయించదంటాడు విప్లవకవి చెరబండరాజు. అదే రీతిలో 1995 ఏప్రియల్ కుట్రని బహిరంగ పరచకపోతే తీవ్రమైన వెలితి అంటాడు. ఆ వెలితిని అప్పల్నాయుడుగారు తమ 'అనగ నగనగా ఒక రాజద్రోహం', 'నూకలిస్తాను' నవలల్లో పూరించ టానికి ప్రయత్నించారు.

1947-1995 ఈ రెండింటి మధ్య సంవత్సరాల అంత రాలే కాదు. అంతర్జాతీయ కుట్రల అంతర్నాటకాల స్థాయీ భేదాలు ఉన్నాయి. చేజారిపోతున్న వలసాధిపత్యాన్ని ఏదోలా పదిల పరుచుకోవాలని 1947 అర్ధరాత్రి కుట్ర చేస్తే, ఏకధృవ ప్రపంచానికి ఎదురులేని 'డాలరు' రాజ్యాధిపతి 1995 పట్టపగలే కుట్ర చేశాడు. మొదటి కుట్రకు ఒక ఉపఖండం మోసపోతే, రెండవ కుట్రకు తృతీయ ప్రపంచదేశాలన్నీ బలైపోయాయి. ఒక్క సిరాచుక్కతో, వాటి మరణ శాసనం ఖరారైంది. ప్రపంచీ కరణ కనికట్టు కుట్రలా ఉండదు. మోసంలా వుండదు. నెత్తురు కనిపించని యుద్ధాలవి. 1970లలోనే కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డిగారు తమ 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో బహుళజాతి కంపెనీల ప్రవేశంతో మన దేశమెలా తాకట్టు వూబిలో కూరుకుపోయిందో సోదాహరణంగా నిరూపించారు.

### ప్రపంచీకరణ వివిధ భావనలు - ప్రముఖుల అభిప్రాయాలు :

'ప్రపంచీకరణ' అనే మాటకు రకరకాల నిర్వచనా లున్నాయి. 'గ్లోబల్ విలేజ్' (ప్రపంచ గ్రామం) అన్నారు. దీనికి సంపూర్ణ నిర్వచనం ఇంకా రావలసే వుందని భావించే 'ట్రూ గ్లోబలిస్టులు' కూడా ఉన్నారు. "ఒక రాజకీయ సారాంశంతో అంతర్జాతీయ వ్యవస్థ ఏర్పడటం"- అని రజిత్ భార్గవ అభి ప్రాయం. సమాచార సంబంధాలు, కంప్యూటర్ విప్లవం, రవాణా సదుపాయాల అభివృద్ధితో ప్రపంచ దేశాల మధ్య దూరం తగ్గిపోవటమే ప్రపంచీకరణ అని మరికొందరు వాది స్తారు. ఇక మార్క్స్ చెప్పిన "గుత్త పెట్టుబడి కేంద్రీకరణ అత్యు న్నత రూపమే ఇది" అని మార్క్సిస్టులు చెబుతారు. "ప్రపంచీ కరణ ఒక నిరంతర ప్రక్రియ" అని దాన్ని గట్టిగా బలపరచే మైకెల్ ఆర్ట్, ఆంటోనియో నేగ్రీ రాశారు. ప్రపంచీకరణ అంటే మొత్తం పైన ఆర్థిక, రాజకీయ సాంస్కృతిక సంలీన క్రమం. ప్రపంచమంతా ఒకే మార్కెట్ వుండాలనేది దీని తాత్పర్యం. ప్రపంచీకరణ ప్రపంచ బ్యాంకు, అంతర్జాతీయ ద్రవ్యనిధి సంస్థ (ఐ.ఎం.ఎఫ్)ల ఆధ్వర్యంలో జరిగినా వాస్తవంలో ఇది అమెరికీకరణ అనే బలమైన విమర్శలున్నాయి. ప్రపంచంలో వివిధ దేశాల ప్రజల మధ్య సంస్కృతుల మధ్య పరస్పరాధా రిత, పరస్పరానుబంధాలు ఏర్పడటం ప్రపంచీకరణ విజయ మని యునెస్కో నివేదిక(2001) పేర్కొంది.

వలస పాలన వెలగబెట్టిన సామ్రాజ్యవాదులే నయా వలస రూపాలను కనిపెట్టారు. ఇందులో ముఖ్యమైంది సాంస్కృతిక సామ్రాజ్యవాదం. డాలర్, ఇంగ్లీషుభాష, హాలీవుడ్, అంతర్జాతీయ వార్తా సంస్థలు ఇందుకు నాలుగు చక్రాలుగా ఉపయోగపడ్డాయి. పైన పేర్కొన్న నాలుగు చక్రాలకు తోడు సాంకేతికాభివృద్ధి, రాజకీయ మార్పులు దానికి మరికొన్ని ఆయుధాలను జతచేశాయి. ఇంటర్నెట్, ఉపగ్రహ ప్రసారావ కాశాల పెరుగుదల సాంకేతికమైనవైతే డబ్ల్యు.టి.వో, ప్రపంచ బ్యాంకు, ఐక్యరాజ్య సమితి పై అదుపు లభించడం రాజకీయ పరమైనవి.

నిత్యజీవిత వస్తువులు వాటి ప్రచారాలు, కుటుంబ సంబంధాలు- లావాదేవీలు, స్త్రీపురుష సంబంధాలు, మానవ ప్రవృత్తులు విద్య, ఉద్యోగాలు, వ్యాపారాలు, మీడియా, ఇంటర్నెట్, సినిమాలు, సాహిత్యం, కళలు, వైద్యం, ఆరోగ్యం, ఆధ్యాత్మికత, మతం, వ్యసనాలు, వ్యామోహాలు, స్వచ్ఛంద సంస్థలు ఒకటేమిటి? ఏ విషయం తీసుకున్నా ప్రపంచీకరణ ద్వారా వచ్చిన మార్పులు ఆశ్చర్యకరమైన స్థాయిలో కనిపిస్తాయి.

ఫ్యూడల్ వ్యవస్థకు చెందిన దురాచారాలున్నా పాశ్చాత్య దేశాలతో పోలిస్తే భారతదేశంలో కుటుంబ వ్యవస్థ కొంత వరకు మెరుగ్గానే కొనసాగింది. ఇప్పుడు ప్రపంచీకరణ తాకిడికి అన్ని అనుబంధాలు, కుటుంబ సంబంధాలు కూడా బీటలు వారడం చూస్తున్నాం. వస్తువులు మనుషుల కన్నా ప్రాధాన్యతను పొంది ఆ వస్తువులు సంపాదించి పెట్టవలసిన మరగా మనిషి మారిపోతున్నాడు. వాయిదా పద్ధతులలో కొనుగోలు చేయడం దానికి అనుగుణంగా బతుకు గడపడం రివాజుగా మారింది.

అందం, ఆకర్షణలకు ప్రాధాన్యత పెరిగింది. మధ్య తరగతి మనుషులు కూడా సౌందర్య సాధనాలను ఉప యోగించడం పెరిగింది. మొత్తంగా చూస్తే ప్రపంచీకరణలో స్త్రీలను ప్రచార వస్తువులుగా మార్చడం అంతకుముందు కన్నా తీవ్రమైంది.

సమిష్టి విలువలను వ్యక్తిగత దృష్టి ఆక్రమించడం ప్రపంచీకరణ యుగపు ప్రధాన లక్షణం. నిరాడంబరత, నిస్వార్థత లోగడ ఆదర్శాలైతే ఇప్పుడు ఆడంబరం, అట్టహాసం అత్యవసరమైన అంశాలుగా మారాయి. లాభదాయకత అత్యున్నతమైన కొలబద్దగా మారింది. దేశాధినేతలు, క్రీడా కారులు, వాణిజ్యవేత్తలు, మతాధిపతులు కూడా నేర విచారణ నెదుర్కోవలసిన విపరీత ఘట్టాలు చోటు చేసుకుంటున్నాయి.

ప్రపంచీకరణ ప్రభావానికి అమితంగా గురైన రంగాలలో మీడియా ఒకటి. ఈ క్రమంలో సమాచారానికి నిర్వచనమే మారిపోతోంది. దీనికి ఇంటర్నెట్ జత కలిసింది.

ప్రపంచీకరణ మంచి చెడ్డలపై తీవ్రమైన భిన్నాభిప్రాయలున్నాయి. గతంలో వెనకబడిన వర్ధమాన దేశాలు సంపన్న దేశాలను అందుకునేందుకు లభించిన అవకాశమనే అభిప్రాయం ఒకటి ఉంది. క్యూబా అధ్యక్షుడు ఫెడెల్ కాస్ట్రో దీన్ని సామ్రాజ్యవాద ప్రపంచీకరణ అని విమర్శించారు.

**'అనగనగనగా ఒక రాజద్రోహం' నవల : 'ప్రపంచీకరణ' ప్రభావం-మానవ సంబంధాల విచ్ఛుత్తి:**

ఆది నుండీ ఉద్యమాలకు 'పురిటిగడ్డ' అయిన ఉత్తరాంధ్ర నుంచి ఆ ప్రగతిశీల భావజాల సాహిత్య వారసత్వాన్ని అందుకొని రచనలు సృజించిన అక్షరశిల్పి అట్టాడ అప్పల్నాయుడుగారు. అప్పల్నాయుడుగారు తమకున్న ఆర్థిక పరిజ్ఞానం, ఆర్థిక అంశాల అనుశీలనతో ప్రపంచీకరణ దుష్ఫలితాలను 'అనగనగనగా ఒక రాజద్రోహం', 'సూకలిస్తాను' నవలల్లో కళాత్మకంగా అభివ్యక్తం చేశారు. అప్పల్నాయుడుగారి 'అనగనగనగా ఒక రాజద్రోహం' నవల 2005లో వెలుగు చూసింది. ఇది 'ఉత్కళం' నవలకు కొనసాగింపు. రచనా సంవిధానంలో చివర్లో సినిమా తీసే డైరెక్టరు "స్వతంత్ర జీవితాల కోసం త్యాగాలు ఎవరు చేశారు? భోగాలు ఎవరు అనుభవిస్తున్నారు? అని ప్రశ్నిస్తాడు. మరికొంచెం చివరి కొచ్చాక 1990 తర్వాత ఇంకో "... పదేళ్ళలో మరో పెద్ద మార్పు. సారా బిజినెస్, దొంగనోట్లు మార్పిడి, రియల్ ఎస్టేట్, ఇక్కడి సంపదను విదేశాలకు చేర్చు ఏజెన్సీలు... ఇసుక నైవేద్యపు కాంట్రాక్టింగ్- రకరకాల అన్యాయ పద్ధతుల్లో సంపాదించే వర్గం. దాన్నెవరో 'లంపేన్ కేపిటల్ ' అన్నారు. పొలిటిక్స్ లంపెనైజయాయి" నవలలోని జయ ప్రకాష్ వ్యాఖ్యానం ఇది. **(ఉత్కళం: పు.302)**

ఈ లంపెనైజ్ అయిన 'పొలిటీషియన్' 'అనగనగనగా ఒక రాజద్రోహం' నవలలో ప్రధాన పాత్ర అయిన రాంబిల్లి విశ్వనాథం. ఈ నవల 1990- 2004ల మధ్య మన దేశంలో ముఖ్యంగా మన రాష్ట్రంలో ఎల్.పి.జి (Liberalisation, Privtiasation, Globalisation) వ్యవస్థ అమల్లోకి వచ్చిన తర్వాత రాజకీయాలను ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రతిబింబించింది. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలు అయిపోవడాన్ని వ్యక్తీకరించటం ఈ నవల నాణెంలో ఒక వైపు. "పదవి ఉంటే ధనం - పదవి పోతే జనం, రౌడీలు వేరుగా రాజకీయ నాయకులు వేరుగా ఇపుడున్నారా?... పదవిలో ఉంటే రాజకీయ నాయకుడూ పదవి లేకపోతే రౌడీ అంతే! గుడి లోపల ఉంటే విగ్రహం గుడి బయట వుంటే మెట్టు. అదే రాయి. అదే తేడా" అంటాడు ఈ నవలలోని ఒక పాత్ర అయిన మరడాన నర్సింహులు.

**(అనగనగనగా ఒక రాజద్రోహం:పు:.364)**

విశ్వనాథానికి స్కూల్ ఫైనల్లోనే మరడాన ధనలక్ష్మి-పల్లమూ, మెట్టూ కలిపి యాభై యెకరాలూ, రైస్ మిల్లూ-వాలుజడా, వగలూ తెచ్చింది. సీతం నాయుడు.. సర్పంచ్ పదవిచ్చాడు. భార్య- బిడ్డనిచ్చింది. తర్వాత వాళ్లిద్దరూ వెళిపోయాక, క్రిష్టియన్ డాక్టరమ్మ భార్యగా వచ్చింది. మరికొంచెం ఎదిగి మంత్రి కూడా అయ్యాడు. మంత్రి వర్గం మార్పుల్లో ఏది తనకు కావాలో తానే నిర్ణయించుకున్నాడు.

**(అనగనగనగా ఒక రాజద్రోహం:పు. 310)**

సృష్టిలో- బంధుత్వాలు, బంధాలు నరమానవులకే తప్ప- జంతు జాలానికి లేవు. వాటికసలు బంధుత్వం తెలీదు. బంధాలెరుగవు. అదే బ్రదరూ!.. జంతు గుణం! బ్రెదరూ- ఇంకోవిషయం... మనిషన్నోడికి మెదడుండాలి, గుండెకాయుండాలి! ఏంటి? ఆ! మెదడూ, గుండె కాయలున్నోడు- మేడలు గడతాడు. సంపదల మీద తులతూగుతాడు. పదవులనుభవిస్తాడు, అధికారం చెలాయిస్తాడు.

రచయిత దృక్పథానికి అద్దం పట్టేది ఈ సన్నివేశం. నవలంతా ఈ నేపథ్యంలోనే సాగుతుంది. మొదటి నాలుగైదు పుటల్లోనే ప్రపంచీకరణ ఆంతర్యాన్ని పాత్రల సంభాషణా రూపంలో అప్పల్నాయుడుగారు ఆవిష్కరించారు. విచ్ఛుత్తి అవుతున్న మానవ సంబంధాల మీదా, ముంచుకొస్తున్న ప్రపంచీకరణ మారణహోమం మీద రచయిత సంధించిన అక్షరాస్త్రం ఇది.

రాంబిల్లి విశ్వనాథం మంత్రి పదవి పోయింది. ముందే తెలిసిన అతడు పదవికి రాజీనామా చేశాడు. విశ్వనాథానికి నిద్ర పట్టలేదు. ఆలోచన తట్టింది. ఏళ్ళ తరబడి ఎన్నికల వాగ్దానంగా మిగిలిపోయి, రైతుల భూములు ఎండిపోయి, ఖాళీ పొట్టలూ, మట్టి తట్టల్తో రైతులు ఇక్కడ్నుంచి వలసబోయి- కరువు నేలగా మిగిలిపోయే యీ నేల మీదకి- జీవధార కోసం- వంశధార రెండోదశ ప్రాజెక్ట్ నిర్మాణం కోసం తను మాట్లాడాలి...! అగ్గి పుట్టిస్తాను- ఆ విధముగా, భీషణ ప్రతిజ్ఞ జేసి, విశ్వనాధం, అధికార్లతంతు వద్దకి చేరాడు. విజ్ఞప్తులు

యిచ్చేసి, వినయ పూర్వకంగా నిల్చున్న జనసమూహం మధ్యకొచ్చి ఒక అగ్గిపుల్ల- అంటించి విసిరాడు.

మంత్రిగా ఉన్నప్పుడు గుర్తురానివి, పదవి పోగానే గుర్తుకొచ్చాయి. ప్రాంతీయ అసమానతల్ని ప్రజల్లో రెచ్చగొట్టాలి. తిరిగి మంత్రి పదవిని దక్కించుకోవాలి. అదే దురాలోచన, దూరాలోచన...! విశ్వనాథం మాటల్లో ప్రపంచీకరణ అంశాలు ప్రసక్తాలు.

ఉత్తరాంధ్ర మూడు జిల్లాల పరిస్థితినీ అప్పల్నా యుడుగారు విశ్వనాథం ఆలోచనల్లో ప్రత్యక్షీకరించారు. పాఠకుణ్ని ఆయన విచికిత్సలో పడేస్తారు. విశ్వనాథం మంచివాడేమో, నిజంగానే ప్రజలకోసం తపిస్తున్నాడేమో, ఆవేదన చెందుతున్నాడేమో, ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడేమో అని అనిపిస్తుంది. కానీ విశ్వనాథం సర్పంచ్, నుంచి ఎం.ఎల్.ఏ గానూ,ఆ తరువాత మంత్రిగాను ఎదిగినవాడు. గోముఖ వ్యాఘ్రం.

రాజకీయాల్లో రాటు దేలిన వాళ్ళు ప్రజల్నే కాదు, ఎవరినీ వదలరు. పదవి దక్కితే చాలు దండుకోవటమే మహా పండగ. ఇది వరకు లక్షల్లో! ఇప్పుడు వేలకోట్లలో. మన నాయకులు ప్రసంగాల్లో చాటి చెప్పే నినాదాలకు అచ్చమైన ప్రతినిధి రాంబిల్లి విశ్వనాథం.

## మానవసంబంధాల విచ్ఛత్తి :

సమాజ నిర్మాణం- రూపుదిద్దుకున్న ఆదిమ దశనుంచి నేటి స్మార్ట్ ఫోన్ల దాకా మనిషిని నడిపిస్తున్నవి 'మానవ సంబంధాలే'. అది కాదనలేని వాస్తవం. భౌతిక, రాజకీయ, ఆర్థిక, మత- వీటి నుంచి రూపుదిద్దుకునే సాంస్కృతిక అంశాలతో ఎప్పటికప్పుడు మానవ సంబంధాలు రూపుదిద్దు కుంటాయి, పరిణామం చెందుతాయి. 'మార్పు' అనేది మానవ జీవితంలో అనాదిగా సాగివస్తున్న ఒక 'అవిచ్ఛిన్న ప్రక్రియ'. ప్రపంచీకరణ నేపథ్యంలో మానవ సంబంధాలన్నీ ఆర్థిక సంబంధాలుగా మారడాన్ని చెప్పడం ఈ నవలలోని ఒక అంశం. ఉదాహరణకు ఒకటి రెండు అంశాలు.

విశ్వనాథం హైస్కూల్ ఫైనల్ ఇయర్‌లోనున్నాడు. థర్డ్‌ఫారంలో మరడాన ధనలక్ష్మి ఉంది. ఆ ఏడాది ఆమె రజస్వల అయింది. వాణీలు ధరించి వాలు జడల్తో వగలు బోతోంది. ఆ వన్నెలు, వగలు కంటే ఆమె మరడాన సీతం నాయుడుకి ఏకైక సంతానం. మరడాన సీతం నాయుడుకి వంశధార కాలువ దిగువన పాతికెకరాల పల్లపు భూమీ, మరోచోట పాతికెకరాల మెట్టు భూమి ఉంది. ఒక రైసు మిల్లుంది. ఒక పంచాయితీ సర్పంచ్ పదవుంది. రైసుమిల్లూ, మెట్టూ పల్లపుభూమీ, వాణీలూ, వాలుజడా, వగలూ- పొరుగూరి పొట్నూరి రాజశేఖరానికి చెందబోతున్నాయని తెలిసింది. రాంబిల్లి విశ్వనాథం విలవిలలాడిపోయాడు. తల్లి దండ్రులకు చెప్పాడు.

రాంబిల్లి విశ్వనాథం మరడాన ధనలక్ష్మిని పెళ్లి చేసుకోవటం నిజంగా 'ధనలక్ష్మి' కోసమే. మానవ సంబం ధాలలో ఆర్థిక విలువలు ఎలాంటి ప్రాధాన్యం వహిస్తున్నాయో తెలిపేది నవలలోని పై సంఘటన.

మానవ సంబంధాల విచ్ఛత్తికి ప్రధాన అంశం ఆర్థిక సంబంధాలు. ప్రపంచీకరణ అనే భావన (కాన్సెప్ట్) తెలిసీ, తెలియక దాని వలలో పడిన అన్ని దేశాలలో ప్రధానంగా జరుగుతున్నది ఇదే. ప్రసార మాధ్యమాల మత్తులో ప్రజలు తేలియాడాలి. వాటిలో మునిగిన వాళ్ళకి భర్త, భార్య కన్న బిడ్డలు, తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితులు, ఇంకా ఇతరులు- వాళ్ళతో ఉన్న సంబంధాలు క్రమేపి కనుమరు గవుతాయి. వ్యక్తులు స్వంత యింట్లోనే పరాయీకరణ, స్వంతరక్తంలో పరాయితనానికి గురి అవుతారు. ఇది పాశ్చాత్య దేశాల ప్రస్తుత సామాజిక స్థితి. అయినా భారతీయ సంస్కృతి లో కుటుంబ జీవనానికి తిరుగలేని ప్రాధాన్యముంది. ప్రపంచీకరణ (విష) ఫలితంగా భారతీయ కుటుంబ జీవనానికి మరణ శాసనం, మానవ సంబంధాల విచ్ఛత్తికి అంగీకార యోగ్యతాపత్రం లభించాయని అట్టాడవారి అభిప్రాయం. నూటికి నూరుపాళ్ళు మానవ సంబంధాల విచ్ఛత్తి జరిగిందని ఆయన రచనల్లో లేదు. ఆ ప్రమాదం అంచున నిలబడ్డాం కాబట్టి జాగ్రత్త పడాలి అన్న హెచ్చరిక మాత్రం ఉంది.

## నూకలిస్తాను నవల: ప్రపంచీకరణ నేపథ్యం: మానవ సంబంధాలు:

అప్పల్నాయుడు గారి నాలుగో నవల 'నూకలిస్తాను' నాటికి ఆయన చెప్పదలచుకున్న విషయాలు- మొదటి మూడు నవలల్లో ఒక సమగ్రాకృతిని సంతరించుకున్నాయి. 'నూకలి స్తాను' నవలలో వాటి ప్రతిధ్వనులు మాత్రమే విన్పిస్తాయి. విడిగా ఆ నవల చదివితే 2002-2009 మధ్య మన రాష్ట్రంలో కొనసాగిన రాజకీయ పరిణామాల వలన సామాన్యుల జీవితం ఎలా ఛిద్రమైపోయిందో చితికిపోయిందో అవగతమవుతుంది.

స్వాతంత్ర్యం వచ్చిన ఆరు దశాబ్దాల తర్వాత కూడా 'ఘనమైన' ప్రజాపాలకులు (దేశ, రాష్ట్ర) ప్రజలకు స్థిరమైన జీవితాన్ని కల్పించలేక పోవటాన్ని ఈ 'నూకలిస్తాను' నవల వ్యక్తం చేసింది. అడుగడుగునా, రాజకీయ వ్యవస్థ మీద వ్యంగ్యాస్త్ర ప్రయోగం ఉంది. వాస్తవంగా 1991 తర్వాత మనం అనుకుంటున్న 'ఆధునిక జీవిత పరిణామాలు' మొదల య్యాయి. ఎల్.పి.జి వ్యవస్థ భారతదేశంలోకి ప్రవేశించడంతోనే శ్రామికుల (ఉత్పత్తిదారుల) జీవితం కొత్తరకంగా పరాయీకరణ ప్రభావానికి లోనవ్వటం మొదలయ్యింది. ప్రపంచీకరణ

ప్రాజెక్టుల పేరుతో, కంపెనీల పేరుతో ప్రజల జీవితాన్ని ఎలా ఛిద్రం చేసిందో ఈ నవలలో అప్పల్నాయుడుగారు స్పష్టీకరించారు. 'నేల మనుషుల్ని నేల నుండి దూరం చేసి వాళ్ళ బతుకుల్ని ఛిద్రం చేయడమే' నవల ఇతివృత్తం. అయితే ఈ ప్రక్రియ యావత్తూ 'ప్రపంచీకరణ' నేపథ్యంలోది అని రచయిత తీర్పు.

**ఉదాహరణకు రెండు అంశాలు** : సుభాషిణి కూతురు సుశ్మిత. పార్వతికి సమవయసుది. కాకపోతే, సాఫ్ట్వేర్ ఉద్యోగి. అన్నీ కేలిక్యులేటెడ్గా ఉండాలంటుంది. తను తనదైన పరిశీలన చేస్తుంది. భర్తంటే- ఏదో ఒక వినియోగ సరుకు కాదు. కొన్న తర్వాత, మనకి నప్పకపోయినా నచ్చకపోయినా-వాపసిచ్చేయడమో, అవతల పారేయడమో చెయ్యడానికి కుదరదు. అతడొక జీవి, మనలాగనో, మనకి విభిన్నంగానో జీవించొచ్చు. సాగించాలా సంసారం? అంటుంది పెళ్లి గురించి మాటాడినప్పుడల్లా!

వాస్తవంగా ఇది ఈనాటి సాఫ్ట్వేర్ కల్చర్ లో ఏర్పడిన అభిప్రాయం. అయితే స్త్రీ, పురుషుల సహజీవనానికి (ప్రపంచీకరణలో భాగంగా వచ్చిన విధానం 'సహజీవనం') ఆ యిరువురి వ్యక్తిత్వాలా? ఆర్థిక స్థితిగతులా? అన్న ప్రశ్న పాత్రగతమైనది కాదు. రచయిత పాఠకుల్లో కల్పించింది. ఇది అప్పల్నాయుడిగారి నవలా చిత్రణలో 'ప్రపంచీకరణ' అనే పారిభాషిక పద విశ్లేషణ.

పార్వతి తల్లిదండ్రులు 'వలస బోవటానికి ' నిర్ణయించుకున్నారు. వలసంటే పెద్ద పట్నం వెళ్ళి కూలి పనులు చేసుకుని బతకటం. మారిన సామాజిక ,ఆర్థిక స్థితిగతుల్లో ఉన్న వూళ్ళో బతుకు తెరువు లేక పరాయి ప్రాంతాలకు వెళ్ళటం. ఉత్తరాంధ్ర ముఖ్యంగా శ్రీకాకుళ సామాన్య ప్రజా జీవన కృత్యం ఇది.

**మరో ఉదాహరణ** : లోకంలో రెండే వర్గాలున్నాయి. భయపెట్టే వర్గం, భయపడే వర్గం! మనం మొదటి వర్గానికి చెందినోళ్ళం భయపెట్టి బతకాలి- అని తత్త్వజ్ఞానాన్ని బోధించుకొని, భయపెట్టి బతుకు సాగించాడు నగిరెడ్డి కిష్టంనాయుడు. లంక రామినాయుడు గూడా, యించు మించుగా, యిదే తత్త్వజ్ఞానాన్ని, మరో విధమైన పదజాలంతో బోధించుకున్నాడు. ఈ ఇద్దరూ నవలలో రాజకీయ ప్రత్యర్థులు.

అయితే యీ తత్త్వసారాన్ని, మరింత మెరుగుపర్చుకున్నారు నాయుడోళ్ల పిల్లలు! భయపెట్టే వారూ, కొల్లగొట్టే వారూ- యెన్నడూ ప్రత్యర్థులు కారాదనీ, తండ్రుల వలే-భయపెట్టడమూ, కొల్లగొట్టడమూ దృశ్య మానం కాగూడదనీ (బ్రహ్మ స్వరూపం వలే) బోధ పర్చుకుంది సంతానం. అందు చేత, ఇరువురు నాయుళ్ళు- యిప్పుడు ప్రత్యర్థులు కారు. కొల్లగొట్టే వాళ్ళూ, కొల్లగొట్టబడే వాళ్ళ ఇద్దరి సామాజిక స్థితినీ అప్పల్నాయుడుగారు ఈ నవలలో స్పష్టం చేశారు.

ముఖ్యంగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో కాపులు (వీళ్ళనే తూర్పుకాపులు అంటారు) , వెలమలు, కాళింగులు అక్కడి వనరుల మీదా, అధికారాల మీదా సాగించిన మిత్ర,శత్రు మిత్రానుబంధానికి (అట్టాడ అప్పల్నాయుడుగారు వేరే సందర్భంలో ప్రయోగించింది) ఈ నవల అద్దం పట్టింది. ప్రపంచీకరణ సిద్ధాంత నేపథ్యం ఈ నవల కథాకథనంలో అతి స్వల్పం. ప్రాంతీయత, కులాల మధ్య సంఘర్షణ, ఆధిపత్యం కోసం వేసే ఎత్తులు పై యెత్తులు ఈ నవలలో కన్పిస్తాయి.

ఆ తర్వాత ఆనాడు జరిగిన ఆర్థిక పరిణామాల చిత్రణతో నవల ముగుస్తుంది. 'నూకలిస్తాను' నవల 1991 తర్వాత భారతీయ ప్రభుత్వం అనుసరించిన ఆర్థిక నమూనాకి పరోక్షంగా అద్దం పట్టింది.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# ఆధునిక కవిత్వం - భ్రూణహత్యలు పరిశీలన

- యం.రెడ్డెమ్మ తెలుగు అధ్యయనశాఖ, శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి.

సమాజంలో స్త్రీల పట్ల వివక్షత ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. ఆడవాళ్ళందరూ చదువుకోవడానికి అవకాశాలు లేవు. ఆడపిల్లలకు తినడానికి ఇంట్లో మంచి పోషకాహారం పెట్టరు. జబ్బు చేస్తే త్వరగా వైద్యం చేయించరు.పుట్టుక నుండి చనిపోయేంత వరకు ఆడజన్మ వివక్షతకు గురౌతూనే ఉంది. ఆడపిల్ల పుట్టుకను కుటుంబ సభ్యులు ఇష్టపడరు. గర్భంలోనే అంతమొందిస్తున్నారు. పిండంలోని లోపాలను పరీక్షించడానికి కనిపెట్టిన ఆమ్నియో పరీక్షను దుర్వినియోగిస్తున్నారు. ఈ పరీక్షతో లింగ నిర్ధారణ చేసుకొని ఆడపిండాన్ని అమ్మ గర్భం లోనే చదిమేస్తున్నారు. ఇందుకు స్కానింగ్ సెంటర్లు, డాక్టర్లు తోడ్పడుతున్నారు. ఫలితంగా ప్రస్తుతంసమాజంలో ప్రతి 1000 మంది బాలుకరు 943 మంది బాలికలు మాత్రమే ఉన్నారు. అలాగే 0 - 6 సంవత్సరాల వయస్సులో ప్రతి 1000 మందికి 46 శిశుమరణాలు సంభవిస్తూ ఉండగా, బాలురలో 44 మంది, బాలికల్లో 47 మంది చనిపోతున్నారు.

గర్భస్థ ఆడశిశువుల హత్యల్ని మాన్పటానికి పియన్‌డిటి చట్టం చేయవలసి వచ్చింది. కట్నం కారణంగా మహిళల వేధింపులు. హత్యలు, ఆత్మహత్యలు జరుగుతున్నందు వల్ల వరకట్న నిషేద చట్టం చేయాల్సి వచ్చింది. అంటే గర్భంలో కాని, పెళ్ళి తర్వాత కాని ఆడపిల్లకి మృత్యువుపొంచి వుంది. ఇంకా చెప్పాలంటే వరకట్న దురాచారానికి భయపడి ఆడ పిండాల్ని అంత మొందిస్తున్నారు. ఆడపిల్లలకు అడుగడుగునా కష్టాలే.'ఆడదై పుట్టడం కంటే అడవిలో మానై పుట్టడం మేలు' అనేది ఒకప్పటి సామెత ఈ సామెత వెనుక ఆనాటి సాంఘిక, కుటుంబ వాతావరణం దాగి ఉంది. సమాజంలో తగినంత మంది ఆడపిల్లలు లేనపుడు తలక్రిందులు వ్యవహారం సాగుతుంది.

ఇటీవల 'దిలాన్సట్ మెడికల్ జర్నల్' ప్రచురించిన 'ఇండో కెనడియన్' అధ్యయన నివేదికను చదివితే మనం ఆడపిల్ల పట్ల ఎంత అమానుషంగా ప్రవర్తిస్తున్నామో అర్థమవు తుంది. లింగ నిర్థరణ పరీక్షలు నిషేధించినా, ఎంత యధేచ్ఛగా ఆడపిండాలను తల్లి గర్భంలోనే అంతమొంది స్తున్నారో చదివితే ఒళ్ళు జలదరిస్తుంది. గడిచిన 2 దశాబ్దాల్లో కోటి మంది ఆడపిల్లలు అంటే 25 మందిలో ఒకరు పుట్టకుండానే చనిపోయారు.

సంవత్సరానికి 5 లక్షల ఆడపిల్లల్ని బలి ఇస్తున్న ఈ దేశం 21వ శతాబ్ధంలోకి అడుగుపెట్టిందంటే నమ్మగలమా?

మనదేశంలో అల్ట్రాసౌండ్ పరీక్ష ప్రవేశించిన 1976 నుండి లెక్కలు తోస్తే అదృశ్యమైన ఆడపిల్లలు అక్షరాలు కోటి. దీన్ని ఇండియన్ మెడికల్ అసోషియేషన్ వారు కూడా నిర్ధారించి ప్రతిసంవత్సరం 5 మిలియన్ల ఆడపిల్లలను అబార్షన్ రూపం లో అంతమొందిస్తున్నారని ప్రకటించరు. 1994 నుండి అల్ట్రాసౌండ్ పరీక్ష ద్వారా లింగాన్ని నిర్ధారించి చెప్పడం వ్యతి రేకమైనప్పటికీ ఈపరీక్ష చేయడం యధేచ్ఛగా సాగుతోంది. ఇంత మంది ఆడపిల్లల్ని చంపివేసిన దేశఘనత మన భారత దేశానిది.

రెండు దశాబ్దాల్లో కోటి మంది ఆడపిల్లల్ని మనదేశం 21వ దశాబ్ధంలోకి అడుగు పెట్ట కుండానే తల్లి గర్భంలోనే చంపుదున్నారు. ఈ సమాజంలో తల్లిదండ్రులకు కొడుకు మీద ఉన్న ప్రేమ, ఆప్యాయతలు ఆడపిల్లల పట్ల లేవు. తమకు స్కానింగ్‌లో ఆడపిల్ల పుట్టబోతోంతని తెలిసి బయటి ప్రపం చాన్ని చూడనివ్వకుండానే తల్లిగర్భంలోనే చిదిమేస్తున్నారు. స్కానింగ్ సెంటర్లు డబ్బుకు ఆశపడి ఆడపిల్లపుడుతోందని తల్లిదండ్రులకు చెప్పి ఈ పాపంలో వారు పాలుపంచు కుంటున్నారు. ఈ అంశాన్ని 'శారదా అశోక్‌వర్ధన్' 'ఇదేంటి? ఇలా' అనే కవితలో ప్రచురించారు.

**'రెండు దశాబ్దాలలో**
**ఈ పవిత్ర భారతదేశంలో**
**కోటిమంది ఆడపిల్లల భ్రూణహత్యలు**
**వింటేనే ఒళ్ళుగగుర్పొడుస్తుంది**
**రక్తం మరిగిపోతుంది**
**అంతా పైసాకోసమేనా ఈ పాపం!**

పెరిగిన ఆధునిక శాస్త్రసాంకేతిక విజ్ఞానంతో ఆడపిల్లల పుట్టుకను నిరోధిస్తున్నారు. ప్రపంచంలోని ఏ జంతువు తమ పిల్లలను తామే శిక్షించవు. తల్లిదండ్రులు పిల్లల పట్ల ప్రేమ, ఆప్యాయతలను చూపిస్తూ మార్జాలకిశోర న్యాయాన్ని ప్రదర్శించాలి. కానీ ఆడపిల్లల పుట్టుకతో ఆవిధంగా జరగడం లేదు. తల్లిదండ్రులు జంతువుల్లాగా మానవత్వాన్ని మరిచి పోయి ఆడపిల్లలను గర్భంలోనే చంపివేస్తున్నారు. ఈ అంశాన్ని 'ఉమామహేశ్వర నూతక్కి' రాసిన 'నిషిద్ధాక్షం' కవితలో చక్కగా వర్ణించారు.

**'పక్షైనా, పశువైనా**
**తమ పిల్లలకి తామే మరణశిక్షవేమదు**
**మరెందుకమ్మా! నారాకకు భయపడతావు**

**ఇసుకలో ఇంకిపోయే నీటిలా**
**మానవత్వం మంట గలిసినపుడు**
**దానవత్వం చేతిలో కీలుబొమ్మలై**
**ఆత్మలు అమ్మడుపోతునప్పుడు**
**కన్నతల్లులే వృద్ధాశ్రమాల**
**వలసపక్షులౌతారు**
**ఆడపిల్లలే నిషిద్ధాక్షరాలౌతారు'**

తల్లిదండ్రులు తమకు ఆడపిల్ల వద్దని గర్భంలోనే చంపేస్తున్నారు. ఒక ఆడపిండం అలాంటి తల్లిదండ్రులను నిలదీస్తూ వారిని ఈ కవితలో ప్రశ్నిస్తోంది. సమాజంలోని తల్లిదండ్రులను మేలుకొలుపుతోంది. నేను మీ కడుపున పుట్టి మీరు బాధల్లో వుంటే మీ కన్నీళ్లుతుడుస్తాను. నన్ను కడుపులో చంపవద్దు. ఆడపిల్ల అయినా ఒకటే మగ పిల్లవాడు అయినా ఒక్కటే. నాకు వాడికి ఏమీ తేడా లేదు. ఇద్దరూ సమానమే నన్ను వివక్షతో చూడవద్దు. నన్ను భూమిమీదకు రానివ్వండి అని ఒక గర్భస్థ పిండం తన తల్లిదండ్రుల్ని వేడుకొంటుంది. ఈ అంశాన్ని 'యస్.అశోక్‌తేజ' 'నీకడుపులోని ఆడపిల్లనే' అనే కవితలో చక్కగా వర్ణించారు.

**'కడుపులోన ఉన్నది కొడుకు కాదనుకోకే**
**నీకడుపున పుట్టి నీ కన్నీళ్ళు తుడిచేస్తా**
**కడుపులో బిడ్డను చంపేగతి ఎందుకు పట్టిందో**
**విడమరిచే ఉద్యమ నెల బాలికనవుతానే**
**నాకూ మగబిడ్డకు తేడా ఎమున్నదే**
**వరకట్నం అడుక్కునే బిక్షగాణ్ణి పెళ్ళాడను'**

స్త్రీకి ఆడపిల్ల కావాలని ఆశున్నా ఆ విషయం బయటకు చెప్పలేని స్థితి. భర్తకుచెబితే చాచి చంపమీద కొడుతాడు. ఆడపిల్ల భూమి మీదకు రాకూడదు. పోనీ భూమి మీదకు వచ్చినా పెరిగి పెద్దైన తర్వాత నవ్వడం నిషేధం, ఆడపిల్లకు చదువు నిషేధం, చివరకు ఈ ప్రపంచంలో స్వేచ్ఛగా బతకడానికి కూడా అర్హత లేదు. దీనికి కారణం పితృస్వామ్య భావజాలం, ఆడపిల్లల పట్లఉన్న వివక్షత ఈ అంశాన్ని 'నిషిద్ధ స్వప్నం' కవితలో 'శ్రీమతి' వర్ణించారు.

**'నేనమ్మతో ఉన్నప్పుడు**
**నేనుకావాలని అమ్మ కోరుకుంటున్నట్టు**
**నాన్నకు తెలియగానే**
**ఈడ్చి చెంప మీద పగుల గొట్టిన నాన్నదెబ్బకి**
**నేనెవరో నాకు తెలిసింది**
**నేనొక స్త్రీని**
**నేనొక నిషిద్ధజీవిని**
**మొన్నటిదాకా నా నవ్వు నిషిద్ధం**
**నేడు నా బతుకు కూడా నిషిద్ధమే'**

ఇంట్లో తమకు కాపలాగా ఉండాలని కుక్కపిల్లల్ని పెంచుకుంటున్నారు. వాటికి ఎంతో డబ్బులు ఖర్చుచేసి వాటి బాగోగులు చూసుకుంటున్నారు. అదే తమకు ఆడపిల్ల పుడితే కుక్క కంటేహీనమని కడుపులోనే అంతం చేస్తున్నారు. తల్లిదండ్రులు కుక్కలకు ఇచ్చే విలువకూడా ఆడపిల్లలకు ఇవ్వడం లేదు. దాంతో ఒక ఆడపిండం తాను కుక్కజాతి కంటే హీనమా? అని తనలో తాను బాధపడుతూ తన బాధను ఈ కవితలో (ప్రశ్నిస్తున్నాం) వ్యక్తపరుస్తోంది.

**'కుక్కపిల్లల్ని, పందిపిల్లల్ని**
**సాకడానికి సిద్ధమవుతారు**
**ఆడపిల్లల్ని అంతకన్నా హీనమని**
**పిండాలుగానే చిదిమేస్తారు'**

## ముగింపు :

1. భ్రూణహత్యలను నివారించడానికి ప్రభత్వాలు అనేక చట్టాలు తీసుకురావాలి.
2. అల్ట్రాస్కానింగ్ పరీక్ష ద్వారా లింగ నిర్ధరణ పరీక్షలు చేసి పుట్టబోయేది ఆడబిడ్డా, మగబిడ్డా అని డాక్టర్లు చెప్పకూడదు.
3. పుట్టబోయేది ఆడబిడైనా, మగబిడైనా ఒక్కటే.
4. తల్లిదండ్రులు ఆడబిడ్డ, మగబిడ్డ అని వివక్ష లేకుండా ఇద్దరిని సమానంగా పెంచాలి.
5. రాబోయే తరాలకు అమ్మను అందివ్వాలి.

❀ ❀ ❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# తెలుగు కవితా విప్లవాల స్వరూపం - ఉత్తమ విమర్శన గ్రంథం

- పల్లె సైదులు, ఎం.ఎ., తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

ఆధునిక తెలుగు సాహిత్యం దశను, దిశను మార్చివేసిన సుప్రసిద్ధ సాహితీ విమర్శ గ్రంథం "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం". తెలుగులో కవితా విప్లవాల స్వరూపంపై వేల్చేరు నారాయణారావుగారు 1969-71 మధ్యకాలంలో ఆంధ్ర విశ్వ విద్యాలయంలో పిహెచ్.డి. చేశారు. ఈ పుస్తకంలోని ప్రధాన భాగం పరిశోధన కాలంలోనే రూపొందింది అని చెప్పవచ్చు. దరిమిలా 1974 లో ఆయన థీసిస్‌కు విశ్వ విద్యాలయం పిహెచ్.డి. ఇచ్చింది. ఆ థీసిస్‌ను మళ్ళీ కొన్ని కొత్త కొత్త భాగాలు చేర్చి, కొన్ని చోట్ల సవరించి, తయారు చేసిన పుస్తకమిది. ఉత్తమమైన థీసిస్‌గా నిర్ణయించి, వేల్చేరు నారాయణరావుకు రఘుపతి వేంకటరత్నం నాయుడు పేరిట బంగారు పథకాన్ని బహుకరించారు.

విప్లవాత్మక కవితల రూపం. విషయ, వ్యక్తీకరణ. ఈ పార్శ్వాలతో ఆ కవిత పుట్టిన సందర్భాన్ని ప్రతిబింబిస్తాయని ఈ సిద్ధాంతసారం. దీన్నుంచి కొన్ని విప్లవాత్మకమైన ఉప లక్ష్యాలు కూడా వస్తాయి. కవులు విప్లవాలను తీసుకురారు. తామున్న సమాజ సందర్భాన్ని అర్థం చేసుకున్న కవులు ఆ సందర్భాన్ని అర్థం చేసుకోలేనివారూ, లేదా ఆ సందర్భాన్ని తాము మార్చగలమనుకునేవారూ రాసే కవిత్వం నిలబడ డానికి, వారి సమర్థత పాలు గలమనుకునేవారూ రాసే కవిత్వం నిలబడడానికి, వారి సమర్థత పాలు సందర్భానికి అనుగుణంగా రాసే వారికన్నా ఉన్నతమైనదై వుండాలి అనేవి ఈ గ్రంథంలోని ప్రతిపాదనలకు స్థూలమైన సారాంశం.

కవితా విప్లవాల సరళిని విశ్లేషిస్తూ నారాయణరావు ఆశు కవిత్వ ధోరణుల కాలంలో తొలి కవితా విప్లవంగా వచ్చిన నన్నయ పురాణ విప్లవం గురించి మొదట వివరించారు. వాగ్రూపంలోనే సాగే జానపద సాహిత్యంగా పిలువబడే సాహిత్యాన్ని ఆయన ఆశుకవిత్వమనే పేరుతో వ్యవహరించారు. అటువంటి ఆశు కవిత్వానికి, పురాణ కవిత్వానికి ప్రక్రియ పరమైన మౌళిక భేదాలు వివరించి పురాణ రచన కవితా విప్లవమని తేల్చారు. కథ ప్రధానంగా ఉన్న పురాణ కవిత్వం నుంచి వర్ణన ప్రాధాన్యత సంతరించుకున్న ప్రబంధం ఏర్పడ డాన్ని తదుపరి విప్లవంగా పేర్కొన్నారు.ఆపై వర్ణనలవల్ల చిత్రబంధ కవిత్వాల వల్ల కథను ఆశ్రయించుకున్న కవిత్వ దృష్టి ఏ పద్యానికి ఆ పద్యంగా మారి పూర్తిగా బలహీనపడడాన్ని నిరూపించారు. ఒకవైపు ఈ ధోరణులు మరోవైపు ముద్రణా యంత్రాల్లో కవి, శ్రోతగా ఉన్న సంబంధం కవి పాఠకుడుగా మారి చక్షురక్షర సంయోగం వల్ల కలిగిన మార్పులను తెలిపారు. ఆశు సంప్రదాయాన్ని అనుసరించిన గురజాడ ఎంత గొప్ప కవి అయినా వాగ్రూపంలోంచి పూర్తిగా లిఖిత రూపానికి వచ్చిన కవిత్వం స్థితికి అనుగుణం కాకపోవడంతో ఆయనది సంపూర్ణమైన విప్లవమని ప్రతిపాదించారు. మరోవైపు సంప్ర దాయభావాలతోనే ఉండి ఆశు కవిత్వానికి తిప్పబోయిన తిరుపతి వేంకట కవులు విప్లవం ఎలా అసలు మొదలేకాక పోయిన వైనం సాధికారికంగా నిరూపించారు. ప్రక్రియ, వస్తువు కూడా కాలానుగుణం కాకపోవడంతో ఆపైన నారాయణరావు ఆధునిక కాలంలో తొలి పూర్తిస్థాయి విప్లవంగా గుర్తించిన భావ కవిత్వాన్ని గురించి శైలి, తాత్త్వికత వంటి అంశాల్లో పూర్తిస్థాయి మార్పులను ఎలా తీసుకువచ్చిందనే విషయాన్ని గురించి వివరించారు. సంప్రదాయ విమర్శ, అలంకారిక భావజాలంతో కొత్త కవిత్వాన్ని నిర్వచించలేరనీ, అయినా భావ కవిత్వానికి సంప్రదాయవాదుల ఆమోదం కోసం పూర్వ అలంకారిక శాస్త్ర పారిభాషిక పదాలకు వేరే అర్థాలు కల్పించి వాడిన విషయం పేర్కొన్నారు. 1930 ల్లో వచ్చిన ఆర్థిక మాంద్యంకారణంగా చదువుకున్న వారి జీవితాల్లో ఏర్పడిన కుదుపులవల్ల అభ్యు దయ కవిత్వ విప్లవం ప్రారంభమైన క్రమాన్ని అనంతర కాలంలో అభ్యుదయ కవిత్వం కూడా నీరసించిపోగా దానిపై నిరసనతో దిగంబర కవిత్వం ప్రారంభమైన విషయాన్ని సవిస్తరంగా పేర్కొన్నారు. వాక్సాహిత్యం/ఆశు కవిత్వం అనే ప్రజా కవిత ప్రక్రియ ఏయే సందర్భాల్లో మార్గ కవిత్వ ధోరణిని ప్రభావితం చేసిందో, ఎలా మిగిలిన కాలాల్లో పదాలుగా, కృతులుగా, శతకాలుగా మార్గ కవిత్వానికి అడ్డు లేకుండా ఉండిపోయిందో వివరించారు.

ఈ విమర్శ గ్రంథం చేసిన సిద్ధాంతాలు, ప్రతి పాదనలపై సాహిత్యంలో చర్చల జరిగాయి. ప్రధానంగా ఈ గ్రంథాన్ని గురించి జరిగిన విమర్శ రచనలు ఎన్నో ఉన్నాయని చెప్పవచ్చును. ఈ విమర్శ గ్రంథం చేసిన సిద్ధాంతాలు, ప్రతిపాదనలపై సాహిత్యంలో చర్చలు జరిగాయని, ప్రధానంగా ఈ గ్రంథాన్ని గురించి జరిగిన విమర్శ రచనలు అందరిణి అందుబాటులో ఉన్నాయనీ చాలా మంది పత్రికల ద్వారా, వ్యాసాలు ద్వారా అందించిన సమాచారం వల్ల తెలుస్తుంది. అరుణతార పత్రికలో త్రిపురనేని మధుసూదన రావువారి సమీక్ష మరియు ఆంధ్రజ్యోతి పత్రికలో పురాణం సుబ్రహ్మణ్య శర్మ ఆరు వారాల పాటు చేసిన సమీక్ష (ఏప్రిల్ 1979 సంపుటి 13, సంచిక, 7 నుంచి 13 వరకు) ఆంధ్రజ్యోతి దినపత్రికలో

కడియాల రామమోహనరావు రాసిన రెండు సుదీర్ఘ వ్యాసాలు (1979 ఏప్రిల్ 8, 15). త్రిపురనేని మధుసూదనరావు కవిసేనకి సమాధానంగా ప్రచురించిన కరపత్రం తెలుగులో కవితా విప్లవాల స్వరూపం క్రవిసేనకి జవాబు శీర్షికన రాశారు (హనుమకొండ సృజన, ప్రచురణ, 1980). బూదరాజు రాధాకృష్ణ ఈ పుస్తకంపై వచ్చిన సమీక్షలను దృష్టిలో పెట్టుకుని ఒక వ్యాసం రాశారు. (తెలుగు, జులై, సెప్టెంబరు 1980). ఎన్నో పరిశోధన వ్యాసాల్లో, గ్రంథాల్లో ఈ పుస్తకంలోని సిద్ధాంతాలను ఆధారంగా చేసుకున్నారు. ఈ విధంగా డా॥ వెల్చేరు నారాయణ రావు గారి "తెలుగులో కవితా విప్లవాల స్వరూపం" అనే పరి శోధన గ్రంథం సుప్రసిద్ధమై ప్రత్యేక తెలుగు సాహితీ విమర్శనా గ్రంథంగా విశేష ఖ్యాతిని గడించి, ఉత్తమ విమర్శనా గ్రంథంగా పేరెన్నికగన్నది.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# సలీం కథలు - మానవతా దృక్పథం

- డా॥ ఎం. నాగరాజు

విశ్వజనీనంగా వెలుగొందే మానవత్వం ప్రతి మానవునిలో సామాన్యంగా కన్పించే మహోన్నత్త్వం. ఏదో ఒక రూపంలో ప్రపంచాన్ని చాపచుట్టగా చుట్టి వీక్షిస్తుంది. ఈ తాత్పర్యానికి మానవుడే మకుటదారి. మానవుడే మాధవుడని మానవసేవే మాధవసేవని, మానవుడే అన్నింటికీ ప్రమాణం, కేంద్రమని ఉగ్గడిస్తుంది.

మానవుడు తన జాతివారితోను, సమస్త జీవరాశితోనూ ఉన్న సంబంధ బాంధవ్యాలకు ప్రాధాన్యమిస్తాడు. మానవునికి వివేచనతోపాటు నిస్వార్థ త్యాగం ఉండాలని, ఆత్మగౌరవం, ఆదర్శం, మానసిక ఏకాగ్రత, మానవ విలువలు పెంపొందించుకోవాలని తన కథల ద్వారా సలీం సమాజానికి నిర్దేశిస్తాడు.

మనిషిలో వ్యక్తిగతమైనటువంటి చైతన్యం, ఆత్మ పరిశీలన సామాజిక పునర్నిర్మాణం అనేవి ప్రముఖమైన భావాలు.

మానవుడు కేవలం తన జాతితోనే గాక విశ్వవ్యాప్తంగా ఉన్నటువంటి సమస్త జీవరాశుల పట్ల జాలి, కరుణ, దయ, ప్రేమ, సానుభూతి కలిగి ఉండాలని సూచిస్తుంది. దీన్నే జీవకారుణ్య వాదం అని పేర్కొనడం జరిగింది.

ప్రాచీన ప్రాకృత వ్యవస్థలో ఒక ఒడంబడిక ద్వారా అందరి హక్కులను పరిరక్షించుకొనేందుకు ఒక వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి రాజును ఏర్పాటు చేసి మిగిలిన వారి యొక్క యోగక్షేమములు కోసం హక్కులను ఆ వ్యవస్థకు అప్పజెప్పి ఒడంబడికను చేసారు. దీనినే 'సామాజిక ఒడంబడిక సిద్ధాంతం' అని హాబ్స్, లాక్స్ రూసోలు పేర్కొన్నారు.

సలీంగారు ప్రధానంగా మానవతావాద కవి. తను సమాజంలో మానవతవవాదానికే పెద్దపీట వేసి రచనలు చేయడం జరిగింది. తన కథల ద్వారా కూడా ఈ మానవతావాద దృక్పథాన్ని ఇంకా పటిష్టం చేసుకున్నాడు. అందుకు రాసినటువంటి కథలే సాక్షి.

"సలీం సాహిత్య స్వభావం మానవతావాదం, మానవ సంబంధాల్లోని మంచినీ, చెడునీ ఆయన కథలుగా మలుస్తారు. పతితులపట్ల, బాధా సర్ప దుష్టుల పట్ల ఆయనకు అంతులేని జాలి. ఆ జాలి, కరుణ ఆయన కథలన్నింటిలోనూ కన్పిస్తాయి. సలీం కథలు చదువుతుంటే మానవ స్వభావాలను ఎంత బాగా పట్టుకున్నారా అని ఆశ్చర్యం కలుగుతుంది. వాదాల జోలికిపోని రచయిత సలీం. మనిషే ఆయన వస్తువు. (ఆంధ్రజ్యోతి వార పత్రిక - రూపాయి చెట్టు కథల సంపుటి చివరి పేజి)".

సలీంగారు రచించిన రచనలన్నింటిలోనూ మానవతా వాద దృక్పథం స్పష్టంగా చెప్పడం జరిగింది. అది సమాజంలో మనుషుల మధ్య ఉన్నటువంటి మానవ సంబంధాలను బలిష్టంగా తయారుచేస్తుంది. ఒకవైపు మానవతావాద కథలు రాస్తూనే కొన్ని కథల్లో మనుషుల్లో మానవతావాదం ఏవిధంగా లేకుండా పోతుందో రచయిత చూపించడం జరిగింది. మానవ సంబంధాలన్నింటికీ మూలం మానవతావాదమే అని ఆయన నమ్మకం.

సమాజంలో మనుషులు వివిధ రకాల వృత్తులు చేసే టటువంటి వారుంటారు. అందులో కొన్ని ఉన్నతమైన వృత్తులుగా గుర్తించబడుతాయి. కొన్ని నీచమైన వృత్తులుగా గుర్తించబడుతాయి. తాను చేస్తున్నటువంటి వృత్తి ఏదైనా తనలో మానవతావాదం ఉందని నిరూపించే కథ 'అమ్మ'.

ఇప్పటివరకు సలీంగారు మానవత కథలను ఎక్కువగా రచించడం జరిగింది. తన కథలలో మానవతావాదంను ఏవిధంగా రచియిత ప్రతిఫలింపజేసాడో పరిశీలించడం జరిగింది.

ఈ కథలో కొండడు, సారాజ్జెం దంపతులు. కొండడు రిక్షా తొక్కి కుటుంబాన్ని పోషిస్తూంటాడు. ఒకరోజు కొండడికి జ్వరం వస్తుంది. మామూలు జ్వరమే కదా తగ్గిపోతుంది అనుకుంటుంది సారాజ్జెం. నాలుగు రోజులు అయినా జ్వరం తగ్గదు. కొండడు పనికి వెళ్తేనే కుటుంబం గడుస్తుంది. నాలుగు రోజులుగా కొండడు ఏమి తినకపోడం వలన సారాజ్జెం ఆ వీధిలోని అందరినీ సహాయం అడుగుతుంది. అయినా ఎవరూ వీరికి సహాయం చేయరు. చివరికి ఆ వీధిలో ఉండే వ్యభిచారి నాగమణి దగ్గరికి వెళ్తుంది సారాజ్జెం. ఆమె తన శరీరాన్ని కుష్టు రోగికి అర్పించి రెండు రూపాయలు తెచ్చి సారాజ్జెంకు ఇస్తుంది. ఇక్కడ ఇతరులలో లేని మానవత్వం నాగమణి పాత్రలో చూపారు రచయిత.

"కడుపుకింత కూడు పెట్టగలిగేదే తల్లి. తన కొండడి కోసం తను ఏమీ చేయలేకపోయింది. ఈ రోజు తన కొండడికి కూడు పెడ్తున్నది తను కాదు. నాగమణి. ఎవరినయితే తన కొండడు 'కొంపలార్పుద్ది' అని ఈసడించుకున్నాడో, ఎవరినయితే తనిన్నాళ్ళు వ్యభిచారి అని అసహ్యించుకుందో ఆమె ఈనాడు తల్లిలా - తను కరిగిపోయినా కూసింత వెలుగు నివ్వాలని తాపత్రయపడే కొవ్వొత్తిలా - పిల్లల ఆకలి తీర్చడం కోసం ఏమైనా చేయగల, దయగల అమ్మలా - రోదిస్తూ - ధారగా కన్నీరు కారుస్తూ -

అప్రయత్నంగా రెండు చేతులూ జోడించి నాగమణికి నమస్కరించింది. ఆకలి చల్లార్చే మహాఫల వృక్షంలా - దాహం తీర్చే అనంత జలాశయంలా - కమ్మని ప్రేమనందించే అమ్మలా - కోరిన కోర్కెలు తీర్చే గుడిలోని అమ్మోరిలా - నాగమణి.

ఆమె వ్యభిచారి అయితేనేం - మనసున్న మనిషి. మహోన్నత కడలి తరంగంలవ పొర్లుకొస్తున్న కన్నీళ్ళను, దారలుగా కురుస్తున్న వర్షాన్ని పట్టించుకోకుండా తన గుడిసె వైపుకు పరిగెత్తుతూ అనుకుంది సొరాజ్యెం - ఇంకా మానవత్వం మనుషుల్లో చావలేదు. - ఎక్కడో ఏ పతిత గుండెల్లోనో మలిన పడకుండా బ్రతికే ఉంది". (స్వాతి చినుకులు : 1996, పుట : 193, 194)

ఈ కథ ద్వారా రచయిత మానవత్వం అనేది వ్యక్తి చేస్తున్నటువంటి వృత్తికి సంబంధించినది కాదు. అది మనసుకు సంబంధించినదని వివరిస్తాడు.

ఒక వ్యక్తి ఈ సమాజంలో తనకు ఎవ్వరూ లేరంటూ, తను చివరకు చనిపోదాము అనుకున్న సమయంలో కూడా, ఈ మానవతావాద దృక్పథమే అతనికి మరలా కొత్త జీవితాన్ని స్తున్నది అని నిరూపించే కథ "చీకటి దీపం".

'చీకటిదీపం' కథలో ప్రధాన పాత్ర రామకృష్ణ పరమ హంస, ఇతను ఒక కంపెనీలో ఇంజనీరు. ఇతని భార్య తులసి. తులసి రామకృష్ణను అసహ్యించుకునేది. ఆమెది భర్త దగ్గరనే జీవితాంతం ఉండాలనే మనస్తత్వం కాదు. రోజుకొకరితో గడపా లనే ఉబలాటం, ఒకరోజు రామకృష్ణ డ్యూటీ అయిపోయిన తర్వవత ఇంటికి వస్తాడు. అప్పుడు అతడి బెడ్‌రూమ్‌లో వేరొక వ్యక్తితో ఇతని భార్య కలిసి ఉంటుంది. ఇది సహించుకోలేడు రామకృష్ణ. చివరికి అతని భార్య అతడిని వదిలేసి వెళ్ళి పోతుంది. ఇలాంటి పరిణామాలతో రామకృష్ణ చనిపోవాలి అని అనుకుంటాడు. అతనికి ఇప్పుడు 28 సంవత్సరాలు. తన పుట్టిన రోజునే చనిపోవాలని నిర్ణయం తీసుకుంటాడు. అయితే చనిపోయే ముందు తన మనస్తత్వం ఉన్న స్త్రీతో మాట్లాడి చనిపోదాం అనుకుంటాడు. ఫోన్ చేసి ఒక నెంబర్‌ని తడితే అక్కడ అందమైన స్త్రీ, గొంతు కలిసింది. ఆమె పేరు శ్యామల. ఆమె పుట్టిన తర్వాత పోలియోతో రెండు కాళ్ళు చచ్చుపడి ఉంటాయి. శ్యామల ఫోనులోనే రామకృష్ణలో మార్పును తీసుకువచ్చి అతడి ప్రయత్నాన్ని ఆపివేస్తుంది. రామకృష్ణ ఈమె మాటలను నమ్మి తనకో ఒక మంచి మనసున్న తోడు దొరి కింది, అనుకొని చావు ప్రయత్నాన్ని ఆపుకుంటాడు.

''అద్దంలో మరోసారి పరిశీలనగా చూసుకుంది శ్యామల. తనను వెక్కిరిస్తూ - దాటుకుంటూ వెళ్ళిపోయిన ముప్పయ్ అయిదు సంవత్సరాలు అతి క్రూరంగా తన మొఖం మీద వికృతమైన చాయల్ని వదిలి వెళ్ళాయి. జీవం కోల్పోయిన కళ్ళు మరో పదేళ్ళు వయస్సుని పెంచిన ముడతలు పడుతున్న చర్మం - బలహీనంగా, పూచిక పుల్లలా ఉన్న కాళ్ళు."

"ఎటొచ్చీ మిగిలిపోయిన కంఠంలోని మాధుర్యాఇ మాత్రమే. ఎడారిలాంటి తన జీవితంలో ఏనాడు వసంతం తొంగిచూడలేదు. ఏ మగవాడు తనతో ప్రేమగా మాట్లాడ లేదు. శ్యామల గుండెలో తడి!

క్షణమే ... అయితే మరుక్షణం జీవంలేని కళ్ళలో కొత్తగా మొగ్గ తొడిగిన - మెరుపు - అనంతమై .. వసంతమై ఎదురుగ్గా అద్దంలో పరావర్తనం చెంది ... ఆ గది నిండా వ్యాపించింది "

**(స్వాతి చినుకులు: 1996, పుట: 142)**

ఆ వెలుగు తనూ ఓ జీవితానికి ఆశాకిరణం కాగలిగా నన్న తృప్తిది. ఆ వెలుగు చీకటిని వెలిగించగలదన్న ధైర్యానిది. గర్వానిది.

ఈ కథ ద్వారా సలీంగారు మానవత్వం ఒక మనిషి జీవితం నిలబెట్టడమే కాదు, అది ఇంకో మనిషికి జీవితంపై విశ్వాసాన్ని నిలిపింది అని చెప్పడం జరిగింది.

రచయిత 'ఇరుకు' కథలో సమాజంలో మానవతా విలువలు, మానవత్వం ఎలా అడుగంటి పోతున్నాయో చెప్పడం జరిగింది. సమాజంలో నివశిస్తున్న మనుషుల యొక్క బుద్ధి, ప్రవర్తన, జాలి, దయలు నేడు ఒకరివి ఇంకొకరికి భిన్నంగా ఉంటున్నాయి. ఈ కథలో సమాజంలో మనుషుల యొక్క పగ, ద్వేషం మొదలైనటువంటి క్రియలను ఈ కథలో చూపించడం జరిగింది. వీటన్నింటికీ మూలం మనుషుల్లో హింసాత్మక ప్రవృత్తి చావకపోవడం, ఒకరి పట్ల ఇంకొకరికి మానవతా దృక్పథం లేకపోవడం కారణం అంటూ ఈ కథ ద్వారా సూచిస్తాడు రచయిత.

"నీవు అడిగావు చూడు, ఎందుకిలా చంపుకుంటారని .... నా ఉద్దేశంలో ఈ మతాలు, కులాలు లేకున్నా ఇలానే చంపుకుంటారనుకుంటా. ఇవన్నీ బాహ్యంగా కనిపించే అతి చిన్న కారణాలే.... అంతర్లీనంగా ఉన్న అసలైన కారణం. వీరి లోని రాక్షస ప్రవృత్తి చావకపోవటం .... జంతువులతో పాటు తిరుగాడుతూ, వాటితో పోరాడుతూ బతికిన మానవుడితో పోలిస్తే ఇప్పడి మనిషి పైకి సంస్కారవంతంగా సభ్యతా యుతంగా కనిపించినా, లోపలి పశు ప్రవృత్తి మాత్రం వదులు కోలే పోతున్నాడు. లిఫ్ట్‌లోని ఇరుకు కారణం అనుకుంటున్నావా గొడవకి ... కాదు. వీళ్ళవి ఇరుకు మనుసులు. హృదయ వైశాల్యాన్ని పెంచుకోలేని మనిషి మృగంలా ప్రవర్తిస్తూనే ఉంటాడు.. ఈ మారణహోమం ఇలా కొనసాగుతూనే ఉంటుంది."

**(నిశ్శబ్ద సంగీతం : చివరిపేజి)**

ఈ విధంగా మనిషి యొక్క ప్రవృత్తిని నిరసిస్తూ మనిషి కాదు మారాల్సింది, మనసు మారాలి. అని సమాజానికి చెబుతాడు. నేడు సమాజంలో చూస్తున్నటువంటి సాధారణ సంఘటనలనే కథలుగా అల్లిన రచయిత సలీంగారు, మానవతా వాదం గురించి ఇలా అద్భుతంగా చెప్పడం జరిగింది.

అదేవిధంగా నేడు పిల్లలకు తల్లిదండ్రిపై మానవత్వం, కరుణ, ప్రేమ, జాలి, దయ లేవు అని నిరూపించే కథానిక 'పండుటాకులు', ఈ కథలో ఇద్దరు మనుషులు తమ జీవితం మొత్తం శాయశక్తులా కష్టపడి వారియొక్క పిల్లలకు మంచి భవిష్యత్తుని అందిస్తారు. అయితే వీరి వృద్ధాప్యంలో వారి పిల్లల ఆదరణకు నోచుకోలేకపోతారు. వీరి పిల్లలు మంచి ఉద్యోగపరులు అయినప్పటికీ వీరికి కొంత ఆదరణను, ప్రేమను, జాలిని కూడా పంచలేనటువంటి నిర్వేదాన్ని ఈ కథలో చూపించాడు రచయిత, ఇద్దరు వృద్ధులు తమ మనసులోని భావాలను కటుంబంలోని పిల్లల నిరాదరణను ఒకరితో ఒకరు పంచుకుంటారు. నేటికాలం పిల్లలకు తల్లిదండ్రులే బరువై పోతున్నారని, వారిలో మానవత్వం మచ్చుకైనా లేదనేటువంటి సత్యాన్ని ఈ కథ ద్వారా రచయిత ఆవిష్కరించారు.

"అతను లేచి నిలబడ్డాడు" నా పిల్లకు నేను భారమై పోయాను. నన్నోపనికిరాని, విరిగిపోయిన వస్తువులా విసిరేశారు. అందుకే ఇలా ... అని ఆమె చూడకుండా కళ్ళు తుడుచుకున్నాడు. "నా కోడలి మాటలు విని నాకొడుకు నన్ను తరిమేశాడు" అందామె గాద్గదిక స్వరంతో. ఆమె మాటలు ఆమెకే విన్పించనంత మంద్రంగా ఉన్నాయి."

ఇద్దరూ మౌనంగా ఒకర్ని ఒకరు చూసుకున్నారు. కళ్ళలో సన్నటి నీటి పొర ...

"వాళ్ళు ఆశ్రమంవైపు మెల్లగా నడవటం ప్రారంభించారు. వాళ్ళ కాళ్ళ క్రిందపడి పండుటాకులు నలుగుతున్న శబ్దం - విషాద సంగీతంగా విన్పిస్తుంది."

**(నిశ్శబ్ద సంగీతం: 1999, పుట: 107)**

పై కథలో ఆశ్రమంలో ఉన్నటువంటి ఇద్దరు వృద్ధుల యొక్క మనోభావాలను, వారి పిల్లలకు మానవత్వం లేని దీన పరిస్థితిని రచయిత వివరించారు.

అదే విధంగా 'పేరు' కథలో ఉన్నత వర్గాల ఇళ్ళలో పనిచేస్తున్నటువంటి పనిమనుషుల మీద వారి యజమానులు అనుకరిస్తున్న వైఖరిని, మానవతా దృక్పథంతో చెప్పడం జరిగింది. ఉన్నతవర్గాల ఇళ్ళలో 'కుక్కుకు' ఇచ్చిన విలువ మనుషులకు ఇవ్వడం లేదనే విషయం ఈ కథ ద్వారా తెలుస్తుంది.

ఈ కథలో రూపిణి ఉన్నత వర్గానికి చెందిన స్త్రీ. ఆమె ఇంట్లో పనిచేసేటటువంటి స్త్రీ పేదమనిషి. రూపిణి పెళ్ళింట్లో ఒక పెంపుడు కుక్క ఉంటుంది. దానిపేరు రాజు, దీని ఆలనా పాలన అంతా వంటమనిషే చూసుకుంటుంది. పనిమనిషికి భర్త లేడు. అతను చనిపోయినప్పట్నుంచి ఆమె రూపిణి ఇంట్లో పని చేస్తూ జీవనం గడుపుతుంటుంది. ఆమెకు ఒక కొడుకు ఉన్నాడు. వీరి పేరు కృష్ణమూర్తి. ఒకరోజు వీడి పుట్టినరోజు సందర్భముగా రూపిణి ఆశీర్వాదం కోసం ఆ ఇంటికి తీసుకు వస్తుంది. అయితే అక్కడికి వచ్చిన కృష్ణమూర్తికి రూపిణి ఒడిలో కూర్చున్నటువంటి కుక్కను చూసి పరిగెత్తి దాని దగ్గరకు చేరుతాడు. అప్పుడు రూపిణి వాడివైపు చూసి మండిపడుతుంది. ఎవడ్రా మడ్డి వెధవ నువ్వు? అంటుంది. వాడు కృష్ణమూర్తి అని సమాధానమిస్తాడు. నీ ముఖానికి ఒక పేరు కూడానా? అలా రాజును ముట్టుకుంటే అనారోగ్యం చేయదట్రా? అని గర్జిస్తుంది. వాడు అక్కడే నిలబడి ఉండడం వలన రూపిణి వాడిని కసితీరేలా కొడుతుంది. తన కళ్ళ ఎదుటనే యజమానురాలు అలా తన కొడుకుని కొట్టడం వలన పనిమనిషికి కళ్ళ నిండా నీళ్ళు వచ్చాయి. అయితే ఆమెలోని పేదరికం వలన ఆమె ఏమీ అనలేకపోయింది.

ఇక్కడ కథలో ఉన్నతవర్గం వ్యక్తులు తమ ఇళ్ళలో పనిచేస్తున్నటువంటి వ్యక్తులపట్ల, మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నారని చెప్పడం జరిగింది. ఆ ఇంట్లో ఉన్న కుక్క పిల్లకు ఇచ్చినటువంటి విలువను సాటి మనిషికి ఇవ్వడం లేదనే విషయాన్ని ఈ కథ ద్వారా సలీంగారు చెప్పడం జరిగింది.

'విశ్వ రహస్యం' కథలో సలీంగారు మానవతా దృక్పథాన్ని చూపించారు. ఎంత ధనవంతులైనప్పటికీ, విలాసవంతమైనటువంటి జీవితాన్ని అనుభవిస్తున్నప్పటికీ పేదలకు సాయపడటంలోనే కనిపిస్తుంది నిజమైన సంతోషం అనే అభిప్రాయాన్ని రచయిత ఈ కథ ద్వారా తెలియజేస్తాడు.

ఈ కథలో సుభుష్ చంద్ర ఖగోళ శాస్త్రవేత్త. వీరిది బాగా డబ్బున్న కుటుంబం. వీరి పిల్లలు అమెరికాలో ఉద్యోగం చేస్తుంటారు. సుభాష్‌చంద్ర నిత్యం ఖగోళశాస్త్ర పరిశోధనల్లో నిమగ్నమై ఉంటాడు. రుక్మిణమ్మ మంచి మానవత్వం, ఇతరులకు చేయాలనేటువంటి గుణం కలిగిన వ్యక్తి. వీరి కుటుంబానికి మూడు కుటుంబాలు సేవలు చేస్తుంటాయి. వీరందరికీ ఆమె ప్రతి సంవత్సరం తమ ఇంటికి పిలిచి నూతన వస్త్రాలు, మంచి వంటలు పెట్టి వారిని సంతోషపరుస్తూంటుంది. రుక్మిణమ్మ చేస్తున్న ఈ పనుల వల్ల సుభాష్‌చంద్ర పెద్దగా ఆసక్తి కనబరచడు. తమకు సేవ చేస్తున్నటువంటి కుటుంబాలను ఆదుకోవలసినది మనమే అనుకుంటుంది రుక్మిణమ్మ.

"సూర్యుని చుట్టూ గ్రహాలు, గ్రహాలు చుట్టూ ఉపగ్రహాలు నిర్ణీత కక్ష్యలో తిరగడానికి కారణం గురుత్వాకర్షణ శక్తి"

సుభాష్‌చంద్ర చాలాసార్లు చెప్పిన విషయం గుర్తు కొచ్చిందామెకు. విశ్వంలోని అన్ని గ్రహాలు, నక్షత్ర సమూహాలు, పాలపుంతలు, నెబ్యులాలు .... అన్ని ఒకదానికొకటి అడ్డు రాకుండా ఓ నియమానికి, ఓ సూత్రానికి లోబడి సంచరిస్తు న్నాయి.

"గౌస్ కన్నీళ్ళకు కూడా ఓ సూత్రం ఉంది. మనిషిని మనిషితో కట్టిపడేస్తే అంతస్సూత్రం... ప్రేమ. గ్రహగతుల్ని గురుత్వాకర్షణ నియంత్రించినట్లే మానవ సంబంధాల్ని ప్రేమ బలంగా కట్టి ఉంచగల్గుతుంది. విశ్వమానవ ప్రేమ మాత్రమే అనంత మానవాళిని ఒక్కటిగా చేయగల్గుతుంది "

ఆమెకు అశాంతిగా అన్పించింది.

గౌస్ కూతురి నిఖా జరిగే వరకు ఆమె మనసు కుదుట పడేలా లేదు.

ఆమె కిందికి వెళ్ళడానికి లేచింది.

"నా సమయాన్ని వెచ్చించి నీకు విశ్వరహస్యాల్ని తెలియ జెప్పాలని ప్రయత్నిస్తుంటే అలా వెళ్ళిపోతావేం ... తెలుసు కోవాలని ఆసక్తిగా లేదా?" అన్నాడు సుభాష్‌చంద్ర.

ఆమెకు హాస్పటల్‌లోని పురిటిగదిలో పోచమ్మా, దాని కూతురి చూపుల్లోని వెన్నెల చల్లదనం, పిల్లలకు పుస్తకాలు పంచుతున్నప్పుడు నక్షత్రాల్లా మెరిసిన వాళ్ళ కళ్ళూ - సాయంత్రం కురిసిన వర్షపు చినుకుల్లా తన పాదాల్ని తడిపిన గౌస్ కన్నీళ్ళూ ... గుర్తొచ్చాయి. నాకు తెలుసు. మీకే తెలియదు. అంటూ ఆమె మెట్లు దిగి కిందకు వెళ్ళిపోయింది.

**(చదరపు ఏనుగు: 2006, పుట: 14)**

ఈ కథలో రచయిత విశ్వరహస్యం అంటే అది గ్రహా ల్లోనో, నక్షత్రాల్లోనో మరెక్కడా లేదు. అది మనస్సులోనే మనిషి మానవత్వంలోనే ఉంది అని రుక్మిణమ్మ పాత్ర ద్వారా తెలియజేస్తాడు.

సమాజంలో అన్నిరకాల వృత్తులు చేసేటటువంటి వారుంటారు. కొన్ని వృత్తులను గౌరవంగాను, మరికొన్నింటిని హీనమైనవిగా భావిస్తారు. ఎంత అసహ్యమైన పనిచేస్తున్నపటికీ వీళ్ళకు కూడా మానవత్వం ఉందనీ, వీరిపట్ల కూడా ప్రేమ, మానవత్వాన్ని ప్రదర్శించే వ్యక్తులు ఉంటారని తెలియ జేసేటటువంటి కథానిక 'కుక్కలు'. ఈ కథలో సంస్కార వంతంగా కన్పించే వ్యక్తులు అందరూ సంస్కారవంతులు కాదనీ, అసభ్యకరమైనటువంటి పనులు చేసేటటువంటి వారు నీచమైనటువంటివారు కాదని సమాజానికి తెలియజేస్తాడు రచయిత. ఈ కథ మానవతావాద దృక్పథంతో సాగింది. కథ ఆద్యంతమూ మానవతా దృక్పథాన్నే చూపారు రచయిత.

'కుక్కలు' కథ ప్రథమ కథనంలో చెప్పబడింది. ఈ కథలో పైకి సంస్కారవంతంగా కన్పించే అతని వదినే ఆమె భర్త క్యాంప్‌కి వెళ్ళగానే అతనితో అసహ్యంగా ప్రవర్తిస్తుంది. అమాయకురాలు, తెలిసో, తెలియకో ఆర్థిక పరిస్థితుల కార ణంగా వ్యభిచారం చేసేటటువంటి సీత ఇతని పట్ల నమ్మకం, ప్రేమ, నిజాయితీగా వ్యవహరిస్తుంది. ఈ కథలో రచయిత ఇలా చెబుతాడు.

"ఆ వీధి అంటేనే అసహ్యం వేస్తుంది. మొగుడు ఆఫీస్‌కి వెళ్ళిన వెంటనే పైట కావాలని జార్చి అర్థవంతంగా నవ్వే పక్కింటి మహాలక్ష్మి - పెళ్ళై ఆరునెలలైనా నిండని మేడపైనించి సైగలు చేసే ఎదురింటి సావిత్రి, భర్తను క్యాంప్‌కి పంపించి బరితెగించిన ఈవిడ ఛీ - వీళ్ళకన్న ఆ కుక్కలే నయం. అవి చేస్తున్నవి తప్పో ఒప్పో తెలియక లజ్జగా, సిగ్గుగా తల వంచుకునే వాటికీ - తప్పని తెలిసీ పవిత్రమైన వివాహ బంధా నికి మచ్చ అని తెలిసీ ఎవరూ చూడటం లేదన్న ధీమాతో అసహ్యమైన పాపపు పనులు చేసే వీళ్ళకూ ఎంత తేడా. వీళ్ళ కన్న వేశ్యలే నయం. నిజాయితీగా శరీరాన్ని అమ్ముకుని పొట్టపోసుకుంటారు **(స్వాతిచినుకులు: 1996, పుట: 47)".**

ఈ కథలో సలీంగారు పైకి సంస్కారవంతంగా కన్పించి లోపల అసభ్యకరమైన పనులు చేస్తే స్త్రీల కన్న నిజాయితీగా శరీరాన్ని అమ్ముకునే వేశ్యలే నయం అనే భావనను వెలి బుచ్చాడు. ఈ కథలో సమాజం మొత్తం అసహ్యించు కునేటటు వంటి వేశ్యల పట్ల మానవత్వం ప్రకటించాడు రచయిత.

సమాజంలో కేవలం మనుషులనే కాదు మనచుట్టూ ఉన్న జీవరాశుల్ని, పశుపక్ష్యాదులను కూడా ప్రేమించాలి. వాటి పట్ల మానవత్వం కలిగి ఉండాలని నిరూపించే కథ 'ద్వైతం' ఈ కథలో ఇంటి చుట్టూ ఉండేటటువంటి పావురాలు నిత్యం పనులు చేసుకుంటుంటాయి. ఇవి తమ కుటుంబంలో ఉన్నటువంటి ఆడపిల్లలపై ప్రభావం చూపుతున్నాయని, ఇల్లు మారిపోవాలి అంటుంది సుశీల. వాటికి నోరులేకపోవడం వలన ఆవిధంగా ఉంటాయని అంటాడు అతను. ఐతే ఎలాగైనా వాటిని తరిమేయాలని సుశీల బొమ్మ తుపాకీతో కాల్చి, వాటిని బెదిరించి పంపాలి అని అనుకుంటుంది. అయితే తుపాకి గుండు దెబ్బకు ఒక పావురం చనిపోతుంది. పావురాలు అన్నీ కలిసి చనిపోయిన పావురం దగ్గర చేరి బాధతో ఆ ఇంటిని వదిలి వెళ్ళిపోతాయి. పావురం చనిపోయినందుకు సుశీల చాలా బాధ పడుతుంది. మళ్ళీ పావురాలు ఉంటేనే బాగు టుంది అని మదన పడుతుంది.

"పాపం పిచ్చివండీ పావురాళ్ళు .... వాటికోసం ఎప్పుడూ ఓ గింజ విదల్చకున్నా మన ఇంటి చూరు పట్టుకుని వదిలేవి కావు. అదిలించిన బెదిరించిన అలగకుండా ఆశ్రయం కోరిన వాటిని అమానుషంగా తరిమేశానండీ" అంది.

**(చదరపు ఏనుగు: 2006, పుట:104)**

ఈ విధంగా కేవలం మనుషుల పట్లనే కాదు,

మనచుట్టూ ఉన్న పరిసరాల్ని, పక్షుల్ని ప్రేమించమని ఈ కథ ద్వారా తెలియజేస్తాడు రచయిత.

స్వాతిచినుకులు, నిశ్శబ్దసంగీతం, రూపాయి చెట్టు, నీటి పుట్ట వంటి సంపుటాల్లోని కథల్లో ఈ దృక్పథాన్ని రచయిన చూపించారు.

**ఆధార గ్రంథాలు :**

1. సలీం: చదరపు ఏనుగు (కథా సంపుటి) 2006, శ్రీ విజయలక్ష్మి పబ్లికేషన్స్, విజయవాడ
2. సలీం: నిశ్శబ్ద సంగీతం (కథా సంపుటి) 1999, కిన్నెర పబ్లికేషన్స్, హైదరాబాద్
3. సలీం: రూపాయిచెట్టు (కథా సంపుటి) 2004, విశాలాంధ్ర పబ్లికేషన్స్, హైదరాబాద్
4. సలీం: స్వాతిచినుకులు (కథా సంపుటి) 1996, శ్రీ విజయలక్ష్మీ పబ్లికేషన్స్, విజయవాడ
5. సలీం: నీటి పుట్ట (కథా సంపుటి) 2017, హైదరాబాద్

# తెలుగు నవల - సామాజిక దృక్పథం

- గాదె ఉమామహేశ్వరి, ఎం.ఎ., తెలుగు శాఖ, ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్.

సామాజిక దృక్పథం లేని రచనలు ఉత్తమ సాహిత్యం కిందికి రావు అని చాలా మంది పండితులు అనుకోవచ్చు. తాను జీవించిన కాలంలో తన చుట్టూ ఉన్న మానవ ప్రపంచాన్ని వదిలిపెట్టి, త్రైకాలికంగా నిలబడే రచన చేస్తానని కాని, చేశారని కాని ఏ రచయితైనా అంటే అది వెర్రితనం క్రింద లెక్కే. ఉత్తమ సాహిత్యంలో ఎప్పుడూ మనుషులూ, వాళ్ల సమస్యలూ, సంఘర్షణలూ కనబడాలి. అంతే కాని ఆకారణంగా ఉన్న సంఘటనలు, ఆత్మానందానుభూతులు ప్రధానం కాదు. ఆత్మానందాన్ని, ఆపరోక్షానుభూతినీ, సాహిత్యం ద్వారా దర్శించడం, అంటే సాహిత్య పరిధి కుచించుకునిపోయి వైయక్తికమైపోతుంది. ప్రధానంగా ఏ కళాస్వరూపమూ, ప్రయోజనమూ కూడా అది కాదు. సాహిత్య ప్రయోజనం అసలు కానేకాదు.

ఉత్తమ రచయిత ఎవరైనా, తన రచన ద్వారా, తాను కోరే సమాజ స్వరూపాస్థితులను తెలుసుకోకుండా ఏ ప్రయోజాన్ని ఉద్దేశించకుండా, కేవలం ఆత్మాశ్రయంగా "నవ్విపోదురుగాక నాకేటి సిగ్గు", "నా ఇచ్ఛయే గాక నాకేటి వెరపు" అనుకోవడం ఏ రచయిత విషయంలోనైనా, అందునా ముఖ్యంగా కవిత్వం వదిలేసినా, కాల్పనిక రచనా విషయకంగా, పొరపాటు అని చెప్పాలి. పూర్వాలంకారికులను దృష్టిలో పెట్టుకొన్నా కూడా యశస్సు, అర్థమూ, మనుషుల సుఖ దుఃఖాలను, అనుభూతులను ఆకళింపులను విడిచిపెట్టి, కవి సాధించగలగుతాడా? సాధించలేడు. కాబట్టి మానవుడు, మానవ జీవితము, ఉత్తమ సాహిత్యపు విలువలని చెప్పుకోవాలి. అయితే దేశకాల పరిస్థితులు, అన్ని రంగాలను ప్రభావితం చేసినట్లు సాహిత్యావగాహన విషయంలో కూడా ప్రభావాన్ని తప్పక చూపతాయి.

ప్రపంచ సాహిత్య చరిత్రలోనే కవిత్వ ప్రభావం క్రమేపీ పలచబడిపోతూ వచ్చిన తరవాతగాని వచనం విజృంభించలేదు. ధనస్వామ్యానికి స్వస్తి చెప్పి ప్రజాస్వామ్యం అనేక దేశాలలో ఆరాధ్యమవుతున్నట్లు పాతకాలపు కవిత్వ భూస్వామ్య వ్యవస్థ నశించి, వచనవికాసం ఈ శతాబ్ద సాహిత్య ప్రధానలక్షణమైంది.

తెలుగు నవల పుట్టి నూరేళ్ళు గడిచాయి. ఈ నూరేళ్లలో కొన్ని వేల నవలలు వెలువడి ఉండవచ్చు. అయితే సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రచయితలనూ, ముఖ్యంగా నవలా రచయితలను వేళ్లమీదనైనా ఎన్నాలంటే కష్టమే అవుతుంది. 100 మంది నవలలను ఎంచడమైనా కష్టమే అవుతుంది.

స్వాతంత్ర్యం రాకపూర్వపు సమస్యలు వేరు. అవగాహన వేరు. ఆదర్శాలు, అనుభవాలు, వేరుగా ఉండేవి. మేధావి వర్గంలో పారతంత్ర్యమే దేశంలోని అన్ని అనర్థాలకు మూల కారణమని అభిప్రాయం ఉండేది. స్వాతంత్ర్య కాంక్షను దేశీయులలో ప్రజ్వలింపజేయడమే రచయితల, కళాకారుల, మేధావి వర్గాల ప్రధానాశయంగా ఉండేది. దేశంలోని అంటరానితనం, అవిద్య, చేతివనులన్నీ క్షీణించి ఆర్థికంగా బలహీనపడడం సామాజిక దృక్పథం గల రచయితలను కలవరపెట్టాయి. స్వాతంత్ర్యం రావడానికి ముందు పాతిక సంవత్సరాల తెలుగు సాహిత్యాన్ని పరిశీలించి చూస్తే, చారిత్రక నవలలైనా సరే, ఆత్మాశ్రయ కవిత్వమైనాసరే, నాటకమైనా సరే, పారతంత్ర్యాన్ని నిరశించడమూ, స్వేచ్ఛను కీర్తించడమూ, మన సమాజంలో కనబడే లోపాలను సరిద్దుకోవాలన్న ప్రబోధం కనబడుతాయి. "మాలపల్లి" ఇందుకు చక్కని ఉదాహరణ. సామాజిక దృక్పథంతో వెలువడిన తెలుగు నవలల్లో ఉత్తమోత్తమ స్థానం మాలపల్లికే దక్కుతుంది.

స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పరిస్థితులన్నీ మారిపోయినాయి. ప్రజల దృక్పథం మారిపోయింది. అంతకు పూర్వంవలె కాకుండా సాంఘిక సమస్యలు కొత్తవి ఎదురైనాయి. స్వాతంత్ర్యం, సమభావం, స్నేహార్ద్రం, పునాదులై ఇళ్లులేచి, జనావళికి శుభంపూచి, శాంతి, శాంతి, శాంతి, శాంతి, కాంతి అన్న కవివాక్యం ఎగిసిపోయింది. పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదార్లు, బలం బాగా పుంజుకొన్నారు. బలహీనవర్గాలకు స్వాతంత్ర్యం, సమానత్వం లభించలేదు. మధ్యతరగతి ప్రజల్లో సంస్కారం పెరగలేదు. అల్పాదాయ వర్గాలవారిలో అసంతృప్తి పెరిగిపోయింది.

ఇటీవల రచయితకు సామాజిక దృక్పథం ఉండాలి, కమిట్‌మెంట్ ఉండాలి అన్న అభిప్రాయాలు, నినాద ప్రాయంగా వినబడుతున్నాయి. మళ్లీ ఈ సిద్ధాంతాలను ప్రతిపాదిస్తున్న నినాదాలను మార్మోగిస్తున్న మేధావి వర్గాలలోనే చిత్తశుద్ధి, అసలు సమస్యల అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. అంతో ఇంతో సాంఘిక ప్రయోజనాన్ని సాధించిన వీరేశలింగం పంతులు గారి రాజశేఖర చరిత్రం, సత్యవతీ చరిత్రం, ఇటీవలికాలంలో ఉన్నవ వారి మాలపల్లి వంటి నవలలు స్వాతంత్ర్యానంతరం వచ్చినవా? అంటే రాలేదనే చెప్పుకోవాలి నవలలు మాత్రం కుప్పతిపలగా వెలువడినమాట వాస్తవమే. అధిక సంఖ్యాకులు వినోదాన్ని కాలక్షేపాన్ని మాత్రమే అందించేవి. వర్తమాన సమాజంలోని సమస్యలేమిటి? ప్రపంచ

వ్యాప్తంగా ఆర్థిక, సాంఘిక, రాజకీయ పరిస్థితులు, ఉద్య మాలు, మన దేశాన్ని, సంఘాన్ని ఏవిధంగా ప్రభావితం చేస్తున్నాయి. అందువల్ల అక్కడి పరిణామాలేమిటి? అన్న విషయాలు రచయితలూ పాఠకులూ ఎవరూ పట్టించుకోవటం లేదు. 1950 సంవత్సరం తరువాత తెలుగు నవల త్వరిత గతిన వికాసంపొంది ప్రధాన స్థానాన్ని పొందుతూ వచ్చింది సాహిత్యంలో. బలివాడ కాంతారావుగారి "గోడమీది బొమ్మ", "దగాపడిన తమ్ముడు", ఇటీవల వచ్చి "పుణ్యభూమి" మంచి నవలలు. వీరి నవలల్లో పరిణతమైన దృక్పథం గోచరిస్తుంది. కొమ్మూరి వేణుగోపాలరావుగారు రచించిన "పెంకుటిల్లు" మధ్యతరగతి కుటుంబ జీవితాన్ని కనులకు కట్టినట్లుగా చూపగలిగింది. పురాణం సూర్యప్రకాశరావు గారి "జీవనగంగ", "మారే మనుషులు" సామాజి దృక్పథంగల రచనలే. పాఠకుల అభిరుచిని బట్టి రచనలని పత్రికలవాళ్లు, చెత్త రచనలను ప్రచురించడంలో సత్యంలేదని పురాణం సూర్య ప్రకాశరావు గారి "జీవన గంగ"కు వచ్చిన ఆదరణ నిరూపిస్తున్నది. రాజకీయాలలో ఏవిధమైన పరిగణలున్నాయో, పత్రికలవాళ్ల విజ్ఞతలో కూడా అటువంటి పరిగణలు చోటు చేసుకుంటాయేమోనన్న అనుమానానికి ఆస్కారం ఉంది. అందువల్లనే పాఠకుల అభిరుచినిబట్టే మా ప్రమాణాలు అనటంవాళ్లు.

ఏది ఏమైనా స్వాతంత్ర్యం వచ్చిన ఈ పాతిక సంవత్స రాలలో సమాజాన్ని అత్యంత ప్రభావితం చేసిన రచనలు రాకపోయినా సాహిత్యం, సామాజిక స్ప ృహకు వెలిగి ఉండరాదన్న సిద్ధాంతం మాత్రం బాగా బలం పుంజుకొన్నది. గోపీచంద్ రచించిన "పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా", "మెరుపులమరకలు", "చీకటి గదులు" ఆయన ఎరిగిన సమాజాన్ని ప్రతిపాదించినవే. ఈ విధంగా తెలుగు నవాలా సాహిత్యం విశేషమైన సామాజికత పొదుగుకున్నదని చెప్పవచ్చు.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# వ్యక్తి నామాలు : ఒక పరిశీలన

- డా. యర్రగంగు స్వరూపరాణి, అనంతపురం

భాషాశాస్త్ర పరిశోధనలో వ్యక్తి నామాలమీద చేసే పరిశోధనను "ఆంత్రోపానిమి" అని, స్థల/గ్రామ నామాలమీద చేసే పరిశోధనను "టోపానిమి" అంటారు. భూమిపై భగవంతునిచే సృష్టించబడిన ప్రతి వస్తువుకు పేరు వున్నట్లే ప్రతి వ్యక్తికి పేరు వుండటం సహజం. మానవుడు సంఘజీవి. వ్యక్తులమధ్య సంబంధాలు చాలా సంక్లిష్టంగా ఉంటాయి. వ్యక్తుల సంఖ్య పరిమితమైతే ఆ వ్యక్తులకు ప్రత్యేక గుర్తింపు అవసరంలేదు. కానీ మానవుల సంఖ్య అపరిమితం కాబట్టి వ్యక్తి గుర్తింపునకు పేరు చాలా అవసరం. అనాదిగా వస్తున్న జన్మ సంస్కారాలలో ఒకటిగా నామకరణ మహోత్సవం జరుపు తున్నారు. అందువల్ల బిడ్డ పుట్టినప్పుడు ఏదో ఒక పేరు పెట్ట కుండా ఆ వ్యక్తులు నివసించే ప్రదేశం, కులం, మతం, ఆచార వ్యవహారాలు, ఆత్మ్యాత్మికత, తిథి, వారం, జన్మనక్షత్రం, జన్మ రాశి, పూర్వవంశ చరిత్రల ఆధారంగా పేరు పెట్టుకోవడం జరుగుతుంది.

"పేరులో ఏమున్నది పెన్నిది" అని మనవారు పేరు కంటే గుణం మిన్న అని గుణానికి ప్రాధాన్యత ఇచ్చినప్పటికి వివాహాది శుభకార్యాలలో జాతకాలు, పేరుబలాలు కుదర నపుడు వధువు పేరు మార్చడం చూస్తూనే ఉన్నాం. ఏ మతంలోనైనా, కులంలోనైనా వధువు పేరు మార్చడమేగానీ వరుడు పేరు మార్చినట్లు మనకు ఎక్కడా దాఖలాలు కన బడవు, వినబడవు. సంప్రదాయాలలో పేరుకు అంత ప్రాము ఖ్యత ఇస్తున్నారు. మనుధర్మశాస్త్ర పేర్లను పెట్టడంలో కొన్ని నియమాలను సూచిస్తోంది. మగ బిడ్డకు 2,4,6,8 అక్షరాలున్న పేర్లుండాలనీ, ఆడపిల్లల పేర్లలో అక్షరాలు బేసిసంఖ్యలో సరళాక్షరాలుగా ఉండాలని చెబుతుంది. పేరు సరళంగా ఉంటే ఆమె జీవితంలో కష్టాలు ఉండవని పెద్దల నమ్మకం. భిన్న ప్రాంతాల్లో భిన్న నామకరణ సంప్రదాయాలున్నప్పటికీ ఆధునిక సమాజంలో బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య కులాలలో మాత్రం అనాదిగా వస్తున్న సంప్రదాయాలు ఇప్పటికీ పాటిస్తు న్నారని చెప్పవచ్చు.

నాగరికత, సంస్కృతి పెరిగేకొద్దీ మానవుల అభిరుచుల్లో ఎన్నో మార్పులు వచ్చినట్లే పేర్ల విషయంలోకూడా కాలాను గుణంగా మార్పులు సంభవిస్తున్నాయి. ఏదైనా ఒక ప్రాంతం లోని పేర్లను తీసుకుని అధ్యయనం చేసినట్లయితే ఆ ప్రాంత భౌగోళిక, సాంఘిక, ఆర్థిక, మత, కుల, చారిత్రక అంశాల్ని కొంత వరకు అవగాహన చేసుకోవచ్చు. అనంతపురం కథా సాహిత్యంలో లభ్యమైన పేర్లను ఆధారంగా చేసుకుని నామవిజ్ఞానాన్ని కింది విధంగా వర్గీకరించడం జరిగింది.

వెనకటి రోజుల్లో తెలుగువారి పేర్లు తమ చుట్టూ ఉన్న ప్రకృతిని, వాతావరణాన్ని అనుసరించి ఉండేవి.

**ఉదా॥** : కొండన్న, కోనమ్మ, యల్లమ్మ, తిప్పన్న, తిమ్మన్న మొదలగునవి.

ఈ పేర్లకు విశాలమైన అర్థం ఏదైనా వున్న అని పరికించినట్లయితే తమ చుట్టు ప్రక్కల ఉన్న కొండలు, కోనలు, వాగులు, వంకలు, నదులు, చెట్లు, పుట్టలు మొదలగు వాటిని అనుసరించి వుండేవి. తదనంతర కాలంలో సమాజంలోని పేర్లపై మత ప్రభావం కనిపిస్తుంది.

### 1) మత సూచకాలు :

సువిశాలమైన భారతదేశంలో భిన్నమతాలు, ఆచార వ్యవహారాలతో మానవులు జీవనాన్ని సాగిస్తున్నారు. వివిధ మతాలవారు తమ మత ప్రాధాన్యాన్ని, గొప్పతనాన్ని చూపెట్టు టకు పండుగలు, ఉత్సవాలు, ఊరేగింపులు జరుపుతారు. అన్ని మతాల సారాంశం ఒకటే అయినప్పటికి మానవుడు మతవ్యవస్థను అర్థం చేసుకునే తీరు భిన్నంగా ఉంది. అందుకు అనేక ఉద్యమాలు వెలుగులోకి వచ్చాయి. ఆ ఉద్యమాల ప్రభావం తమ వంశ, జాతి, సంతతి మీద కనబడు తుంది. భారతదేశంలో ఎక్కువ శాతం హిందువులు ఉ న్నప్పటికీ, వారిలో శైవ, వైష్ణవ భేదాలు కన్పిస్తాయి. ఆయా మత నియమానుసారంగా పేర్లను పెట్టుకోవడం సాంప్ర దాయంగా వస్తోంది

**వైష్ణవం** : వెంకటేశులు, నరసింహులు, శ్రీనివాసులు, గోవిందు, సత్యనారాయణ, నరసింహప్ప, లక్ష్మిదేవి. అనంతపురం ప్రాంతంలో నరసింహులు అనే పేరు విరివిగా వినబడు తుంది. అందుకు కారణం ఈ ప్రాంతంలో నరసింహస్వామి అనేక ప్రాంతాల్లో కొలువై ఇలవేల్పుగా వుండటం.

**శైవం** : రామలింగయ్య, శివయ్య, మణికంఠ, మునెయ్య, నాగరాజు, శివా, నీలకంఠ.

**క్రైస్తవం**: మేరీ, మరియమ్మ, ఏసురత్నం.

**ఇస్లాం** : వజీర్ భాషా, జాఫర్, సుల్తాన్, మస్తాన్, హుస్సేన్, జరీనా.

హిందువులు కూడా ముస్లిం పేర్లను పెట్టుకున్నట్లు తెలుస్తోంది. తల్లిదండ్రులు తమకు సంతానం కలగని పక్షంలో ఆయా దర్గాలను సందర్శించి ప్రార్థనలు చేయడం జరుగు తుంది. అనంతపురం జిల్లాలో 'గూగూడు కుళ్ళాయిస్వామి'

సుప్రసిద్ధం. ఇక్కడ అన్ని మతాల వారు కలిసి మొహర్రం పండుగను విశేషంగా నిర్వహిస్తారు. ఈ క్షేత్రం చుట్టుపక్కల గ్రామాలలో " కుళ్ళాయి " పేరు అన్ని మతాలలో విరివిగా వినబడుతోంది.

**ఉదా॥** కుళ్ళాయప్పా, పక్కీరప్పా, మస్తానయ్య.

వ్యక్తులపేర్లు మత సూచకంగానే కాక గ్రామదేవతల ఆధారంగా కూడా ఉన్నాయి. నాడు గ్రామం స్వయం పోషకం. గ్రామ ప్రజల కొరకు గ్రామంనందలి కొందరు వ్యవసాయం, మరికొందరు వాణిజ్యం, కులవృత్తులననుసరించి గ్రామాలను సస్యశ్యామలం చేసేవారు. ఆధునిక శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం ఎంత విస్తరించినప్పటికీ, ప్రజల నమ్మకాల్ని వారి ఆచార వ్యవహారాలద్వారా వ్యక్తం చేస్తున్నారు. అన్ని కులాలకు, వృత్తులకు సంబంధించిన ప్రజలు గ్రామంలో నివసిస్తూ గ్రామ సంక్షేమం కోసం గ్రామస్తులందరూ కలిసి ఉత్సవాలు నిర్వహించి గ్రామదేవతలను ఆరాధించడం జరుగుతుంది. గ్రామదేవతలు తమ బిడ్డలను రోగాల బారి నుండి, ఆపదలనుండి కాపాడుతారనే నమ్మకంతో గ్రామ దేవతల పేర్లను పిల్లలకు పెడతారు. అనంతపురం కథాసాహిత్యంలో **గ్రామ దేవతల ఆధారంగా** కనిపించే వ్యక్తుల పేర్లు.

**ఉదా:** ముత్యాలమ్మ, మారెమ్మ, గంగమ్మ, పోలేరమ్మ, కొల్లమ్మ, సుంకులమ్మ, పెద్దమ్మ, అక్కమ్మ, గౌరమ్మ, ఎల్లమ్మ, ఓసురమ్మ.

## క్షేత్రదర్శన సూచకాలు :

గ్రామ దేవతలతోపాటు క్షేత్రాల్ని నెలకొల్పి ఆ దేవతలల్ని ఆరాధించడం మనకు ఆనాదిగా వస్తోంది. ఉత్సవాలు నిర్వహించి భక్తితో తమ కోర్కెలు తీర్చమని ఆయా దేవతలను వేడుకుంటారు. అందుకు ప్రతిఫలంగా ఆయా దేవతల పేర్లను బిడ్డలకు పెట్టుకోవడం పరిపాటి.

**ఉదా:** తిరుపతయ్య, మల్లిఖార్జున, తిమ్మప్ప, లక్ష్మీనరసింహ, సింహాచలం.

**నక్షత్ర సూచకాలు :** జాతక చక్రంలోని నక్షత్రాలకు వున్న పేర్లనే బిడ్డకు పెట్టుకోవడం జరుగుతుంది.

**ఉదా :** అశ్విని, స్వాతి, రోహిణి.

**చారిత్రక సూచకాలు :** దేశ ఔన్నత్యంకోసం పాటుబడిన వారిని ఆదర్శంగా తీసుకుని ఆ మహానుభావుల వ్యక్తిత్వాలు తమ బిడ్డలకు సంక్రమించాలని ఆశిస్తూ నామకరణం చేస్తారు.

**ఉదా :** అశోక, వివేకానంద, నందకుమార్, దేవి, ఇందిరా, రామచంద్ర.

**కుల సూచకాలు:** వేదకాలంనుంచి కులవ్యవస్థ ఉన్నట్లు ఆధారాలున్నాయి. యుద్ధానికి క్షత్రియులు, వర్తకానికి వైశ్యులు, శ్రోత్రియానికి ద్విజులు, పరిచర్యలకు శూద్రులున్నట్లుగా తెలుస్తోంది. కులసూచక నామాన్ని పేరుకు అనుబంధంగా జతచేసి పెట్టుకోవడం పరిపాటి. వారిపేర్లు వినగానే కులం స్ఫురిస్తుంది.

**శెట్టి :** శెట్టి అనగానే మనకు స్ఫురణకు వచ్చేది వ్యాపారం నిర్వహించేవారు. ఒక్కప్పుడు వైశ్యకులానికి చెందిన వారు మాత్రమే వ్యాపారం చేసేవారు. కానీ నేడు అన్ని వృత్తులు, కులాల వారు ఏదో ఒక వ్యాపారం చేస్తున్నారు.

**ఉదా :** రంగనాయకులు శెట్టి, రంగప్ప శెట్టి, ఎంగటేశులు శెట్టి.

**నాయుడు/ చౌదరి :** నాయుడు నాయక శబ్దభవం. ఇది మొదట గౌరవ సూచకం. తదనంతరం కులసూచకంగా స్థిరపడింది. ఇటీవల కాలంలో సంబోధనవాచకంగా ఉపయోగిస్తున్నారు. గుంటూరు ప్రాంతంలో కాపుల్ని కూడా నాయుళ్ళుగా వ్యవహరిస్తారు. రాయలసీమ ప్రాంతంలో నాయుడు శబ్దం కమ్మ కులసూచకంగా స్థిరపడింది.

**ఉదా :** వెంకటనాయుడు, కేశవనాయుడు, రామప్ప నాయుడు, రామానాయుడు.

శివాజీ కాలంలో రాజ్య ఆర్థికవ్యవస్థను మెరుగు పరచడానికై " చౌత్ సర్దేష్ ముఖ్ " అనే పన్నును వసూలు చేయడానికై చౌత్ దారు అనే అధికారుల్ని నియమించారు. అలాగే కాకతీయుల కాలంలో పన్నులు వసూలు చేసే అధికారిని చౌదర్ అనేవారు. వీరే తదనంతర కాలంలో చౌదరీగా వ్యవహరింపబడినారు. అనంతపురం ప్రాంతంలో కమ్మ కులానికి చెందిన వారిని 'చౌదరి' గా పిలుస్తున్నారు.

**ఉదా :** నారాయణ చౌదరి, రామప్ప చౌదరి, హరినాథ్ చౌదరి, రాజేష్ చౌదరి, జగదీష్ చౌదరి.

**రెడ్డి/కాపు :** రెడ్డిపదం రట్టడి - రడ్డె - రెడి - రెడ్డిగా పరిణామం చెందిందని భాషా శాస్త్ర పరిశోధకులు తెలియజేశారు. మొదట వీరు గ్రామ నాయకులుగా ఉండి వ్యవసాయం చేస్తూ కొంత గ్రామ అవసరాలను తీరుస్తూ ఉండేవారు. తదనంతరం వారి వంశీయుల్ని రెడ్డి పేరుతో పిలుస్తున్నారు.

ఇతర కులస్థుల్లో ఎవరైనా ఊరి పెద్దరికం చేస్తే ఆ కుటుంబాన్ని రెడ్డి కుటుంబంగా పరిగణిస్తారు. ఊరి పెద్దను రెడ్డి అంటారు. ఈ నేపథ్యంలో అనంతపురంలో రెడ్డి కేవలం కులసూచకంగానే కాక హోదాలో ఊరిపెద్ద అనడానికి రెడ్డి అనే మాట ఉపయోగిస్తారు. తరతరాలకీ ఆ కుటుంబాన్ని రెడ్డి కుటుంబంగా గౌరవిస్తారు. ఈ ప్రాంతంలో రెడ్డి పేరును కులసూచకంగాను, ఊరిపెద్ద అనే గౌరవ సూచకంగానూ వినియోగిస్తున్నారు.

**ఉదా** : రామిరెడ్డి, ఓబిరెడ్డి, విశ్వనాథరెడ్డి, పెద్దారెడ్డి, వెంకటరెడ్డి, ఆదినారాయణరెడ్డి, వీరారెడ్డి, తిప్పారెడ్డి, వెంకటరెడ్డి, రాజారెడ్డి.

అనంతపురం కథా సాహిత్యంలో పురుషుల పేర్లకు - అప్ప, - అయ్య, - అన్న అని గౌరవార్థంలో పేరు చివరి జోడించి సంబోధించడం అలవాటు. ఇవి మూడు కూడా ద్రావిడ మూలాల నుండి వెలువడినవి.

**- అప్ప** : అప్ప అనేది కన్నడ భాషా ప్రభావంతో చేరిన గౌరవ చూచకం. రాయలసీమ ప్రాంతంలో ప్రత్యేకంగా కనిపిస్తుంది.

**ఉదా** : నారాయణప్ప, శాంతప్ప, నరసప్ప, నారప్ప, మల్లప్ప, సిద్దప్ప, కిష్టప్ప.

**- అయ్య** : సుధాకరయ్య, కురుణయ్య, వెంకట రామయ్య, వెంకయ్య, రామయ్య, మల్లయ్య.

**- అన్న** : **ఉదా** : వెంకటన్న, నాగన్న, తిమ్మన్న, రామన్న, మల్లన్న.

స్త్రీల పేర్లపై - అక్క, - అమ్మ అనే అనుబంధ రూపాలు గౌరవ సూచకంగా, సంబోధన వాచకాలుగా వినియోగిస్తు న్నారు.

**- అక్క** : **ఉదా** : మల్లక్క, రాములక్క, నరసక్క, మల్లెక్క.

**- అమ్మ** : ఆదెమ్మ, మారెమ్మ, సులోచనమ్మ, నరసమ్మ, పాపమ్మ, గంగమ్మ, రాములమ్మ, ఈశ్వరమ్మ, శాంతమ్మ.

కొన్ని సందర్భాల్లో కులం పేరును, వృత్తి బోధకాలను అనుబంధంగా చేర్చి సంబోధించడం జరుగుతుంది.

**ఉదా** : నారాయణ చౌదరి, కురవ మల్లప్ప, కమ్మ నరసింహులు, బోయ చెన్నమ్మ, పూసల ముత్యాలమ్మ, బట్టల మల్లమ్మ, ఎరికల నరసప్ప.

ఇటువంటి సందర్భాలు మనకు పల్లెల్లో తరచుగా వినబడతాయి. కారణం ఒకే పేరు కలిగిన వారు ఇద్దరు/ ముగ్గురు ఉన్నప్పుడు వారి కుల/వృత్తి సూచకాల్ని చేర్చి సంబోధించడం పరిపాటి.

## నివసిస్తున్న ప్రదేశం :

బ్రతుకుదెరువు కోసం ఒక ప్రాంతంనుండి మరో ప్రాంతానికి వలస వెళ్ళినప్పుడు ఏ ప్రాంతంనుండి వచ్చింటారో ఆ ఊరిపేరే ఇంటిపేరు అవుతుంది.

**ఉదా:** పూలకుంట ఓబిరెడ్డి, కక్కలపల్లి కిష్టయ్య, తోటకాడ నారాయణప్ప, బద్వేల్ రమేష్.

**సంక్షిప్త నామాలు** : పెట్టిన పేరు చాలా పొడువుగా ఉన్నప్పుడు పిలవడానికి సులువుగా ఉండటంకోసం పెట్టిన పేరులో వెనుక భాగాన్నో, ముందు భాగాన్నో, మధ్యలోని భాగాన్నో తీసుకుని పిలుస్తుంటారు.

వెంకటస్వామి - వెంకట్, రాధాకృష్ణ - రాధా, శ్యామల - శ్యామ్ ఇక్కడ రాధాకృష్ణ అబ్బాయి పేరు, శ్యామల అమ్మాయి పేరు. రాధా, శ్యామ్ అని పిలిచినపుడు కొత్తవారికి తికమక పెట్టిస్తాయి. సౌలభ్యం కోసం చిన్న పేర్లతో పిలుచుకున్నప్పటికీ కొన్ని ప్రమాదాలు లేకపోలేదు.

**వయో సూచకాలు** : జన్మ క్రమాన్ని అనుసరించి పిలుచుకునే పేర్లు. చిన్నోడు, పెద్దోడు, నడిపోడు, పెద్దక్క, చిన్నక్క, చిన్నమ్మి, పెద్దమ్మి, అమ్మి మొదలగునవి.

తల్లిదండ్రులు పెట్టినవి ' పుట్టు పేరు ' ' ముద్దపేర్లు' కాకుండా ఏర్పడేవి అడ్డపేర్లు. వీటినే వెక్కిరింతల పేర్లు అంటారు. పుట్టు పేరు ఒకటే ఉన్నప్పటికీ మారుపేర్లు అనేకం ఉండవచ్చు. అతని స్వభావం, ఆకారం, గుణం, రంగు, రూపు, పరిమాణం, లోటుపాట్లు, తెలివితేటలు మొదలగు వాటి ఆధారంగా అడ్డపేర్లు ఏర్పడతాయి. పల్లెల్లో ఎక్కువగా మారు పేర్లతోనే చలామణి అవుతుంటారు.

## పరిమాణాన్ని, ఆకార వికారాలను సూచించేవి :

గున్నా, చిట్టి, పొట్టి, కుట్టి.

పొడవు ఆధారంగా - జంపాయప్ప, రంగు ఆధారంగా ఎరుపు, తెలుపు - ఎర్రోడు, బ్రిటీషోడు. అధికంగా కోతలు కోసేవారిని - కోతలరాయుడు, అధికంగా మాట్లాడేవారిని - వాగుడుకాయ, నిరంతరం తిరిగేవారిని - గాలిగాడు, గాలోడు, ఎప్పుడూ తినేవారిని - బకాసురుడు, తిండిపోతు, లావుగా ఉంటే - దుబ్బి, సన్నగా ఉంటే - బక్కోడు, రొక్కోడు, శరీరా వయవాల లోపాలు ఉంటే - కుంటోడు, గుడ్డోడు, నడ్డోడు మొదలగునవి.

**తాత ముత్తాతల పేర్లు** : తల్లిదండ్రుల మీద, పూర్వీకుల మీద గౌరవంతో తమ బిడ్డలకు వారి పేర్లు పెట్టుకునే ఆనవాయితీ చాలా సమాజాల్లో ఉంది. ఇంకా పేర్లలో అనేక రకాలున్నాయి. ముద్దపేర్లు, గుప్తనామాలు, కలం పేర్లు, బిరుదు నామాలు, ప్రకృతికి సంబంధించినవి, జంతువుల పేర్లు మొదలగునవి.

కొందరు పెట్టుకున్న పేరుకు వారి లక్షణాలకు సంబంధం ఉంటుంది. లక్షణాల్ని బట్టి పేరు వినగానే మీ పేరును సార్థకం చేసుకున్నారని అలవోకగా అనేస్తాం. మరి కొందరు వారు పెట్టుకున్న పేరు వారి స్వభావానికి భిన్నంగా ఉంటుంది. ప్రశాంతి - అశాంతిగానూ, సుందరి - అంద హీనంగానూ, ఆనంద్ - విషాదంగానూ కన్పిస్తారు. దీన్నిబట్టి

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253

పేరుకు గుణానికి, ఆకారానికి, అందానికి, స్వభావానికి సంబందం ఉండదని చెప్పవచ్చు. ఆధునిక కాలంలో వ్యక్తుల పేర్లపై సినిమాల ప్రభావం కన్పిస్తోంది. సినీ హీరోలు, హీరోయిన్లపై ఉన్న అభిమానంతో వారి పేర్లను పెట్టుకోవడం జరుగుతోంది.

**ఉదా :** సుజాత, శారద, సుశీల, చిరంజీవి, నరేష్, సురేష్ మొదలగునవి. మనపెద్దవాళ్లను ఈ పేరు ఎందుకు పెట్టారని అడిగితే తడుముకోకుండా ఆ పేరు పెట్టడానికి గల కారణాలను వివరించి పూసగుచ్చినట్లు చెప్తారు. ఫలాన దేవుని/ దేవత మొక్కుబడిఅనో, ఆ వారంలో పుట్టడం వల్ల ఆ వారంలో పూజించే దేవుళ్ళపేర్లు పెట్టామని, కరువు సంభవించిందని, పంటలు బాగా పండినాయని, ఫలన కార్తిలో, మాసంలో, సంవ త్సరంలో పుట్టారని, పెద్దవారు చనిపోయారని అలా తడుము కోకుండా పేర్లను పెట్టడానికి గల కారణాలను చెప్తారు. పేర్లను అధ్యయనం చేయడంద్వారా ప్రతి పేరు వెనక దాగి వున్న సంక్షిప్త చరిత్రను తెలుసుకోవచ్చు.

## ఆధార గ్రంథాలు :

1. విశ్వనాథ రెడ్డి కేతు - కడప ఊర్లపేర్లు, తిరుపతి, 1976
2. సుబ్బరామిరెడ్డి ఎ - కడప ఊర్లపేర్లు, నవ్య పరిశోధక ప్రచురణలు, భవాని నగర్, తిరుపతి ,1976.

**వ్యాసాలు :**

1. విజయలక్ష్మీ మూలె : తెలుగువారి ముద్దుపేర్లు ,తెలుగు సాహిత్య మాస పత్రిక, జూలై 1995.
2. సూర్యనారాయణమూర్తి కోటి : వ్యక్తి వాచకాలు, స్రవంతి సాహిత్య మాసపత్రిక, మే 1985.
3. సోమసుందరం నాయుడు వై : భారతంలోని వ్యక్తినామాలు - కొన్ని విశేషాలు, స్రవంతి సాహిత్య మాస పత్రిక, అక్టోబర్, నవంబర్, డిసెంబర్ 1981.
4. శారద కె :మనుషుల పేర్లు - కొన్ని విశేషాలు, స్రవంతి సాహిత్య మాస పత్రిక, జూలై 1981.

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# "అనామిక డైరీ" నవల - సజీవ మనస్తత్వ చిత్రణ

- **డి. ధాత్రికుమారి,** తెలుగు అధ్యాపకులు, వై.ఏ. ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, చీరాల.

ప్రఖ్యాత కవి, కథా రచయిత, నవలా రచయిత, కేంద్ర సాహిత్య అకాడమి అవార్డు గ్రహీత మనందరికీ సుపరిచితులు సలీంగారు. వీరు తన రచనలనన్నింటినీ సమాజానికి దర్పణంగా రచించారు. రచనలు ఇంగ్లీషు, హిందీ, మరాఠి, మలయాళం, కన్నడ భాషలలోనికి అనువదింపబడ్డాయి. వీరు వందకు పైగా కథలు రాశారు. రెండు కవితా సంపుటాలను కూడా వెలువరించారు. వీరి 'వెండి మేఘం' నవల ముస్లింల అనేకానేక జీవన పార్శ్వాలను మొట్టమొదటిసారిగా ఆవిష్కరించింది. 'కాంచన మృగం' అనే మరోనవల 'ఆటా' వారి నవలల పోటీలో ఎంపికైంది. హెచ్ఐవి పాజిటివ్ వారి గురించి రచించిన 'కాలుతున్న పూలతోట' నవల 2010వ సంవత్సరంలో కేంద్ర సాహిత్య అవార్డును పొందింది. సామాజిక సమస్యలను ఇతివృత్తంగా స్వీకరించి రచించిన తన రచనల ద్వారా సామాజిక బాధ్యతను మనకందరికీ గుర్తుచేశారు సలీంగారు.

"కుల, మత, ప్రాంతీయ విభేదాలకు, వివాదాలకు అతీతమైన ఉన్నతమైన వ్యక్తిత్వం రచయితల స్వంతమైనపుడు మరింత గొప్ప సాహితీ సృజన జరుగుతుందని గాఢంగా విశ్వసించేవారు" సలీంగారు. వీరి కలం నుండి జాలువారిన సామాజిక స్పృహ కల్గిన రచనలలో మరో కలికితురాయి 'అనామిక డైరీ'. ఈ నవల ఆటా, నవ్య వీక్లీ సంయుక్త నిర్వహణలో జరిగిన పోటీలో ప్రథమ బహుమతిని సాధించింది.

"సామాజిక ప్రయోజనాత్మకమయిన నవల సమాజ ప్రగతికి దోహదం చేసే మంచి సాధనం. ఎన్నో గంభీర విషయాల్ని నవలలో వర్ణించడానికి వీలుంది. నవల చరిత్రకు ప్రత్యామ్నాయం" అని H.G.వేల్స్ నవలకిచ్చిన నిర్వచనం సలీంగారి నవల 'అనామిక డైరీ' కి పూర్తిగా సరిపోతుంది.

జైలులో ఉన్న స్వప్న అనే (నవలా నాయిక) అనామకురాలు తన జీవితాన్ని డైరీలో రాసుకుని విడుదలై వెళ్ళిపోగా ఆ పుస్తకాలను జైలర్ యామిని చదవడం ద్వారా మనకు కథ తెలుస్తుంది. వాస్తవ సమాజాన్ని, సమకాలీన సమాజాన్ని ముందుంచ గలిగినదీ నవల. మానవోద్రేకాలు ప్రధానంగా ఆర్థిక శక్తులకు లోబడి ఉంటాయని ఈ నవల ద్వారా తెలియజేశారు సలీంగారు. 'అనామిక డైరీ' నవలలో పాత్రల మనస్తత్వాలను సలీంగారు సజీవంగా మలచిన తీరును విశ్లేషించుటే ప్రస్తుత వ్యాస ప్రధానోద్దేశ్యం.

కథ విషయానికొస్తే స్వప్న నాన్న వేరే పెళ్ళిచేసుకుని వెళ్ళిపోవడంతో కుటుంబం కష్టాలపాలౌతుంది. స్వప్న అమ్మ తన కుటుంబ అవసరాల కోసం వేశ్యా వృత్తిలోకి కూరుకుపోతుంది. అయిన అప్పు తీర్చడం కోసం కుమార్తెని శివరావు అనే వ్యక్తి దగ్గర తార్చుతుంది. ఒకరోజు ఎవరితోనో బయటికి వెళ్ళిన స్వప్న తల్లిని ఎవరో అత్యంత అమానుషంగా హత్య చేస్తారు. దీంతో స్వప్న ఒంటరిదైపోయి శివరావు సహకారంతో "ప్రభుత్వ సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం"లో పదవ తరగతిలో చేరుతుంది. అక్కడ సారిక అనే అమ్మాయి స్వప్నకి మంచి స్నేహితురాలవుతుంది. వార్డెన్ యొక్క అంతులేని అరాచక ప్రవర్తనకి సారిక, స్వప్నలు బలైపోయి, పెద్దమనుషులుగా చెలామణి అవుతున్న ఆఫీసర్లు, పోలీసులు, రాజకీయ నాయకులకు తార్చబడతారు. ఈ పనుల కారణంగా సారిక మరణించడంతో స్వప్న మరోసారి ఒంటరిదౌతుంది. దొంగతనం నేరంపై జైలుకెళ్ళి విడుదలై వచ్చిన తన చిన్ననాటి ప్రక్కింటి అబ్బాయి రాము స్వప్నకి పెద్దదిక్కుగా నిలుస్తాడు. సందీప్ అనే మిత్రుని సహాయంతో నెల్లూరుకు తీసుకుని వెళ్ళి స్వప్నని పెండ్లి చేసుకుంటాడు. తన పట్ల ఆ సందీప్ చెడు ప్రవర్తనకు భయపడిన స్వప్న ఆ విషయాన్ని తన భర్తకు తెలియకుండా దాచిపెట్టి, భర్తని పీడించి సందీప్‌కు దూరంగా ఉండేందుకై కాపురాన్ని తెనాలికి మార్చుతుంది. తన పాప పద్మకు మూడేళ్ల వయస్సులో భర్త రాము సందీప్‌తో కలసి తాగటానికని నెల్లూరు వెళ్లి తిరిగి వస్తూ తాగిన మత్తులో రైలు క్రింద పడి మరణించడంతో మరలా దిక్కులేనిదైపోతుంది. దిక్కుతోచని పరిస్థితుల్లో సందీప్‌కు భయపడి తన కుమార్తెను రక్షించుకోవడం కోసం సినిమాల్లో చేరడానికి హైదరాబాదు వెళ్తుంది. ఆర్థిక సమస్యల ఊబిలో మరింతగా కూరుకొనిపోయి వేశ్యా వృత్తిలోనికి దిగుతుంది. తన కుమార్తె పద్మని మద్రాసులోని ఎన్జివో సంస్థలో చేర్పించి తన జీవితానికి దూరంగా సురక్షితంగా ఉంచి చదివిస్తుంది. శేషు అనే వ్యక్తి స్వప్నకి రైల్వేలో స్వీపర్ ఉద్యోగం ఇప్పించి, అతని ఇంటి ఆవరణలో గల సర్వెంట్ క్వార్టర్‌ని స్వప్నకి నివసించేందుకు ఇస్తాడు. ఆ ఇంటికి వచ్చిన పద్మని శేషు బలాత్కారం చేయబోగా ఆమె అతనిని హత్య చేస్తుంది. శేషు హత్యా నేరం స్వప్న తనపై వేసుకుని జైలుకెళ్లి పది సంవత్సరాలు శిక్ష అనుభవిస్తుంది. ఆ సమయంలోనే పద్మ ఉద్యోగం చేసే సాఫ్ట్‌వేర్ కంపెనీలోనే పని చేస్తున్న అబ్బాయితో పద్మకి పెండ్లి కుదురుతుంది. వాళ్ళిద్దరూ తనకోసం వస్తారని ఎదురుచూస్తూ విడుదలకు ముందురోజు వరకు డైరీలో కథను రాస్తుంది స్వప్న. ఇదీ స్థూలంగా ఈ నవలలోని కథ. దీనిలోని మరొక చిన్నకథైన వాసంతి కథ మనల్ని కంటతడి పెట్టిస్తుంది.

నవలలోని ప్రధాన పాత్రలు స్వప్న తల్లిదండ్రులు, రాము, శివరావు, సారిక, సందీప్, సుబ్బులుపిన్ని, శ్రీజ అక్క, మాధవి, వాసంతి,శేషు, పద్మ.

రచయిత కొన్ని సామాజిక సమస్యలను కథాంశంగా తీసుకుని కథావస్తువుకు తగిన కథన పద్ధతితో రెండింటి మధ్య సమతౌల్యాన్ని సాధించారు. కథావస్తువు, శిల్పం (రూపం) రెండూ పడుగు పేకల్లా కలసిపోయాయి. సమాజంలో జరుగుతున్న అకృత్యాలను, 'ప్రభుత్వ సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహం'లో అమాయక విద్యార్థినులపై జరిగే అత్యాచారాలను, సినిమా పరిశ్రమలో చాలామంది జూనియర్ ఆర్టిస్టుల దుర్భరమైన జీవితాలను ఇందులో ప్రధానంగా కథావస్తువుగా స్వీకరించుట జరిగింది. వ్యథార్త జీవిత దృశ్యాలకి సజీవ ప్రతిబింబంగా సలీంగారు కథని మలచారు. ఒకవైపు ఆర్థిక సమస్యల వలయంలో చిక్కి జీవనం సాగిస్తున్న వ్యక్తి జీవితం - మరోవైపు పాత్రల అంతస్సంఘర్షణ ప్రధాన లక్ష్యాలుగా ఈ నవల సాగుతుంది.

ఉత్తమ పురుష కథనంలో నవలని మనముందుకు తెచ్చారు సలీం. ఉత్తమ పురుష కథనం, దినచర్యా పద్ధతి రెండూ కలిసిన కథన ప్రయోగం ఎంతో క్లిష్టమైనది. ఈ రెండింటినీ కలిపిన కథనంలో, పరోక్ష పద్ధతిన, వ్యక్తి నిష్ఠా పద్ధతి (౹బఎయవషఱఖవ)లో కథని చెప్పి, ఏమాత్రం గజిబిజి లేక ఎంతో నేర్పుతో కథైక్యాన్ని సాధించారు సలీంగారు. తీవ్రమైన భావోద్వేగాలను వ్యక్తం చేయటానికి చలంగారు కూడా ఈ ఉత్తమ పురుష కథన దృష్టి కోణాన్నే ఉపయోగించారు.

జీవిత వాస్తవికతలో భాష కూడా భాగం కనుక భాష యొక్క నడత సామాన్య పాఠకుడికి అత్యంత చేరువగా, అతి సహజంగా ఉండేలా ఉపయోగించారు. అసాధారణ భావావేశం గల సహజత్వం సలీంగారి శైలిలో తొణికిసలాడుతుంది. ప్రయోగశీల దృక్పథంతో శిల్పాన్ని మలచి మరొక గొప్ప నవలను మనకందించారు సయ్యద్ సలీంగారు.

నవలలోని కథారంగం ప్రధానంగా నేటి ఆంధ్రప్రదేశ్ లోని విజయవాడ, నెల్లూరు, తెనాలిలోనూ, తెలంగాణాలోని హైదరాబాద్ (నాటి సమైక్యాంధ్రప్రదేశ్)లోనూ జరిగింది. కథానాయిక స్వప్న ఐదవ సంవత్సరం మొదలుకొని జైలు నుండి విడుదలయ్యే ముందురోజు వరకు దాదాపు నలభై సంవత్సరాల నిడివిగల కథాకాలాన్ని రచయిత ఎంచుకున్నారు.

ఈ కథంతా నాటి ఆంధ్రా ప్రాంతంలో సాగినప్పటికీ ఇందులో సామాజికాంశం మాత్రం విశ్వజనీనాంశం. సమాజంలో నాటినుండి నేటివరకు జరుగుతున్న ఘోరాలకు సజీవ రూపాన్నిచ్చిందీ నవల. సంఘంలో జరుగుతున్న చెడును, కుళ్లును కొన్ని అంశాల ద్వారా స్వప్న జీవితం నేపథ్యంలో మనముందు నిలిపారు.

మనిషి ఏం చేసినా అతని సమస్యలలో భాగంగానే చేస్తాడనే తత్త్వం ఈ నవలలో కన్పిస్తుంది. ఈ నవల ప్రధానోద్దేశ్యం సమాజంలో ఇన్ని రకాలుగా అక్రమాలు, అఘాయిత్యాలు జరుగుతున్నాయి జాగ్రత్త అని సమాజానికి తెలియజేయడంగా భావించవచ్చు. అంటే దీనర్థం సమాజంలో అన్ని చోట్లా ప్రతినిత్యం, ప్రతి సందర్భంలోనూ ఇలాంటివే అందరికీ ఎదురౌతాయని కాదు, ఇలాగ కూడా సమాజంలో మరో కోణం ఉందని, పైకి కన్పించే మంచి సమాజం మాత్రమే కాకుండా, ఇటువంటి విషపు కోరల సమాజం కూడా మన చుట్టూనే ఉందనే విషయాన్ని చెప్పి ఎంతో సామాజిక స్ఫురణతో సమాజాన్ని వెన్నుతట్టి లేపారు.

స్వప్న జీవితంలోని మలుపులు చూస్తే స్త్రీ ఒంటరిదైతే ఆమెని ఎందరు, ఎన్ని విధాలుగా వేధించుకు తింటారనే విషయం ఈ నవల ద్వారా మనకు తెలుస్తుంది. నవలలో అడుగడుగునా స్వప్న 'అనామిక' అయిపోవడానికి ఎదురైన నిస్సహాయ పరిస్థితులు మన మనోఫలకం మీద సాక్షాత్కరిస్తాయి. ఇటువంటి సమస్యలతో నవలలు రావడం క్రొత్త కాకపోయినా కథనం ఆద్యంతం ఎంతో ఆసక్తికరంగా పఠితల్ని కట్టిపడేసి చదివింపజేస్తుంది. పరిస్థితులను ఎదిరించి పోరాడలేక జీవితంతో రాజీపడిన మనస్తత్వం కల్గిన స్త్రీగా మనం స్వప్న జీవితాన్ని చూడవచ్చు. ఇక్కడ స్వప్న విధి వంచితురాలు, సమాజ వంచితురాలు.

ఒక దశలో స్వప్న జీవితంలో కష్టాల్ని రచయిత మరింతగా పెంచుతూ పోయారేమో అన్పిస్తుంది. చదివేకొద్దీ హృదయం పిండేసినట్లవుతుంది. స్వప్న కష్టాల్ని ఇంకొంచెం తగ్గించి ఉంటే బాగుండేదేమో అనే జాలి కల్గుతుంది పాఠకులకి. ఒక వ్యక్తి జీవితంలో ఇన్ని రకాల ప్రతికూల పరిస్థితులు, ఇన్ని దుర్భర, దారిద్ర్య సంఘటనలా? అని మనసు కలచివేస్తుంది. బాల్యంలో, కౌమారంలో, యవ్వనంలో ఆ తరువాతి దశలో కూడా పరిస్థితులు ఎప్పుడూ స్వప్నకి అనుకూలించలేదు.

తన ఐదవ పుట్టినరోజుని స్వప్న నాన్న తనకు నచ్చిన విధంగా చేయడం, రాము స్వప్నని పెండ్లి చేసుకోవడం, పద్మ పుట్టడం, పద్మని తనకు దూరంగా మంచి ఎన్జీవో సంస్థలో హాస్టల్లో చేర్పించి చదివించటం మాత్రమే ఆమె జీవితం మొత్తంలో సంతోష సమయాలు.

స్వప్న జీవితం చుట్టూ తిరిగే ఈ నవలలో ఐదు,ఆరు ప్రధాన సంఘటనలు, వాటి పర్యవసానాల ఆధారంగా రచయిత కథనాన్ని చెప్పిన తీరు అద్భుతం. అత్యంత సహజంగా, సున్నితమైన అంశాల ఆధారంగా కథలో ఎంతో క్లిష్టత ఉన్నా కథనంలో పట్టు సడలకుండా ఆద్యంతం ఎంతో జాగరూకత వహించారు సలీంగారు. ఈ సంఘటనలు ఏకసూత్రతతో నవలను నడిపించుటకు ఆధారభూతమైనవి.

స్వప్నకి ఏడేళ్ల వయస్సులో స్వప్న వాళ్ల అమ్మా, నాన్నలు వేరే యువతి విషయంలో గొడవ పడతారు (స్వప్న వాళ్ల నాన్న వాళ్లమ్మతో సహజీవనం చేస్తూనే, మరో యువతిని పెండ్లి చేసుకుంటాడు). అప్పుడు స్వప్న నాన్న వాళ్ల అమ్మతో ఆ యువతి గురించి 'అది నా భార్య. దాన్నేమైనా అంటే నాలిక చీరేస్తాను. అది నేను తాళి కట్టిన భార్య' అని తిడతాడు. ఇంకా నీకు తాళి కట్టానా? తలంబ్రాలు పోశానా? అని అంటాడు. దీనిని బట్టి సమాజంలో తాళికున్న గుర్తింపు అర్థ మౌతుంది. ఈ సన్నివేశం ద్వారా సమాజం కోసం ఒకరికి తాళికట్టి చాటు మాటుగా ఎంతోమంది అక్రమ సంబంధాలను కొనసాగిస్తూ సమాజాన్ని మలినం చేస్తున్న వైనం మన కనుల ముందు కదలాడేలా చేశారు రచయిత.

రిక్షా నడిపే స్వప్న నాన్న క్రమ క్రమంగా వీళ్లకు దూరమై, వీళ్ళను వదలి వెళ్ళిపోతాడు. దీనితో కుటుంబ అవసరాలకై అయిన ఇరవై ఐదువేల రూపాయల అప్పును తీర్చడం కోసం, అప్పుల పేరుతో స్వప్న తల్లి స్వప్నని తార్చడంతో స్వప్న జీవితంలో నిశ్శబ్ద హింస మొదలైంది. సమాజంలో పెద్ద మనుషులుగా చెలామణి అయ్యే కొంతమంది రహస్యంగా గెస్ట్ హౌస్‌లో నిస్సిగ్గుగా చేసే నీచ కార్యకలపాలను లోకానికి వెల్లడిచేశారు సలీంగారు.

స్వప్న పనులపై అనుమానం వచ్చినా ఆమెని ఏమి అనకుండా "నువ్వంటే పిచ్చి ఇష్టం కదా. నువ్వేం చేసినా కోపం రాదు బాధేస్తుంది." అన్న రాములు మాటల్లో స్వప్న పట్ల గల ఆరాధనా భావం, స్వచ్ఛమైన ప్రేమ కనిపిస్తాయి. స్వప్న జీవితంలో రాము ఒక ఊరట.

రెండవ సంఘటన స్వప్న తల్లి హత్య గావించబడటం. దీంతో స్వప్న ఏకాకైపోతుంది. తల్లి దారుణ హత్యతో ఒంటరిదైపోయిన స్వప్న ప్రభుత్వ సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో చేరుతుంది.

వసతి గృహంలో చేరిన తర్వాత ఇక జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదని, బాగా చదువుకోవాలని భావించింది. ఇక్కడే స్వప్నకి మూడవ సంఘటన అనుభవంలోకి వస్తుంది. వార్డెన్ పాశవిక ప్రవర్తన మూలాన సారిక గర్భవతియై చివరికి ప్రాణాలను సైతం కోల్పోవడం వంటి సంఘటనలు ఎలాంటి వారినైనా చలింపజేస్తాయి. ఈ సంఘటనల ద్వారా సలీంగారు ప్రభుత్వ సంక్షేమ గురుకుల బాలికల వసతి గృహంలో విద్యార్థినులు ఎదుర్కొనే ఇబ్బందులను, సమస్యలను నిర్భీతితో సమాజం దృష్టికి తెచ్చారు. తమపై జరుగుతున్న అఘాయిత్యాలను చెప్పుకోలేక జీవచ్ఛవాలుగా బతుకుతున్న ఎంతోమంది విద్యార్థినులను గురించి మనం నిత్యం టి.వీ.ల్లో, వార్తాపత్రికల్లో చూస్తూనే ఉన్నాం కదా!

ఇక నాల్గవ అంశం స్వప్న భర్త 'రాము' మరణం. దీనితో స్వప్న జీవితం అథ:పాతాళానికి తొక్కివేయబడుతుంది. తెనాలిలో ప్రక్కింటి సుబ్బమ్మపిన్ని మాటలు విని అక్కడే స్కూలు టీచర్‌గా చేరాలనుకుంటుంది. కానీ సందీప్ తన కుమార్తెని కబళిస్తాడని భయపడిపోయి అక్కడ నుండి హైదరాబాదుకు వెళ్లిపోవాలనుకుంటుంది.

ఐదవ అంశం స్వప్న తన ఇంటి ఓనర్ భానుమతికి అక్కయైన శ్రీజ దగ్గరికి సినిమాలలో అవకాశాల కోసం హైదరాబాదుకి వెళ్ళటం. శ్రీజ బిగించిన ఉచ్చులో తెలియ కుండానే పడిపోతుంది స్వప్న. తనకంటే ముందు తనలాగే హైదరాబాదుకు వచ్చిన మాధవి, స్వప్నని చూసి 'నువ్వు ఇక్కడికి రాకుండా ఉండాల్సింది' అని అంటుంది తన బాధలు స్వప్నన్నా అనుభవించకూడదనే జాలితో.

పై ప్రధాన సంఘటనలతో పాటుగా ఈ నవలలో మాధవి, సినిమా అడ్డా దగ్గర స్వప్నకు పరిచయమైన (నలభై ఏళ్లు దాటిన) వాసంతిల జీవితాలు కూడా సమాజంలో ప్రతి ఒక్కరికీ కనువిప్పు కల్గించేలా చిత్రించబడ్డాయి. ఎన్ని కష్టాలు వచ్చినా స్వప్న తల్లిగా తన బాధ్యతను మాత్రం విస్మరించలేదు. కానీ అడుగడుగునా జీవితమంతా ఆమె ఏవైతే చేయకూడదనుకుందో, ఎలాగైతే బ్రతకకూడదనుకుందో చివరికి అలానే బ్రతకాల్సి వచ్చింది. బ్రతుకుదెరువుకై వెళ్ళి అవకాశాలు రాక తల్లడిల్లిపోయి ఒక పూట తిండికి కూడా జరగక నైతికంగా దిగజారిపోయి మాధవితో కలసి, స్వప్నకూడా పూర్తిస్థాయిలో వేశ్యా వృత్తిలోకి దిగిపోవడం స్వప్న కష్టాలకు పరాకాష్టగా చెప్పవచ్చు.

సినిమా పరిశ్రమలో జూనియర్ ఆర్టిస్టులు పడే అగ చాట్లను కన్నులకు కట్టినట్లు తెలియ చేశారు. సామాన్య కళాకారునిలో ఉండే ప్రతిభను కొండంతలుగా చేసి అమాయ కులకు అవకాశాలను ఎరగా చూపి వారు కన్న కలల్ని కల్లలుగా చేస్తే ఆ కళాకారులు పడే వేదన వర్ణనాతీతం. ఎంతోమంది సినిమా పరిశ్రమ వైపు ఆకర్షితులై భ్రమలలో బ్రతుకుతూ వారి జీవితాలను వ్యర్థం చేసుకుంటున్నారు. అక్కడికి వెళ్ళాక సరియైన గమ్యం లేకుండా పోయి చివరికి వాస్తవానికి వచ్చేటప్పటికి అంతా శూన్యం. స్వప్న జీవితంలో కూడా అడుగడుగునా ఇలాంటి కష్టాలే మనకి కనిపిస్తాయి.

ఒకసారి స్వప్న తన దగ్గరకి యూనివర్సిటీ నుండి వచ్చిన రీసెర్చి స్కాలర్ ద్వారా మద్రాసులో చాలా నిబద్ధతతో పనిచేసే డేవిడ్ అనేవ్యక్తి స్థాపించిన 'కురింజి మలర్ కుడిల్ (అందమైన పూవు కుటీరం) అనే ఎన్జివో సంస్థలో తన కుమార్తె పద్మని చదువుకునేందుకు చేర్పిస్తుంది. తర్వాత పద్నాలుగో యేట పద్మని ఇంటికి పిలుచుకొని వస్తుంది స్వప్న.

ఇక్కడే కథలోని కీలక సంఘటన స్వప్న జీవితానికి సంబంధించి జరుగుతుంది. ఇదే చివరి అంశం. శేషు అనే రైల్వే కాంట్రాక్టరుకి ఇంటిపనులు చేస్తూ, అతను కోరినపుడు అతని అవసరాలను కూడా తీర్చేలా అతని ఇంట్లో పనికి కుదురుతుంది స్వప్న. శేషుని పద్మ హత్యచేయగా, ఆ హత్యని స్వప్న తనపై వేసుకుని జైలుకి వెళ్ళకపోతే అసలు ఈ డైరీనే మనముందుకు వచ్చేదికాదేమో.

జైలర్ యామిని స్వప్న డైరీ చదివి అందులో పద్మని ఇంటికి పిల్చుకొచ్చినట్లు రాసిన పేజీ నుండి చివరి అక్షరం వరకు చింపి తన ప్యాంటు జేబులో పెట్టుకొని, ఆ నోటు పుస్తకాలు రెండూ పనికిరావు "ఇందులో మనకు పనికొచ్చే సమాచారమేమీ లేదు", "చించేసెయ్" అని చెప్తుంది. వాస్తవానికి జైలర్ ఈ డైరీని చదివిన తర్వాత చట్టరీత్యా పద్మకి జైలు శిక్ష పడేలా చేయాలి. కానీ చట్టానికి అతీతంగా మానవత్వం వైపుకు మొగ్గి పద్మకి జైలు శిక్ష పడే అవకాశమున్న పేజీలను ఎవరికీ తెలియనీయకుండా చింపివేసింది. సలీం గారు జైలర్‌తో ఇలా చేయించి సమాజంలో మానవత్వం ఇంకా పూర్తిగా కనుమరుగై పోలేదని పాఠకుల్ని సాంత్వన పరచినట్లైంది.

రెక్కాడితే కానీ డొక్కాడని కటిక పేదరికంలో జీవితాలను వెళ్ళదీసే వాళ్ళు కొంతమంది ఎంచుకునే దారుల వల్ల తప్పు దారిలో పయనించి వారి జీవితాలను వారి చేతుల్లో లేకుండా చేసుకుంటే జీవితం ఎలా దుర్భరమౌతుందో అనామిక డైరి తెలియజేస్తుంది. 'అనామిక డైరీ' అనే పేరు విషయానికొస్తే నవల పేరును బట్టి కథాంశాన్ని మనం కొంత వరకు ఊహించవచ్చు. స్వప్న జీవితం మొత్తాన్ని పరిశీలిస్తే కొన్నిసార్లు అనాథగా, మరి కొన్నిసార్లు అనామకురాలిగా మనకు స్పష్టంగా తోస్తుంది. అందుకే అడుగడుగునా నవల పేరుకు సార్థకత చేకూరింది. 'ఎంతటి పరిశీలనా శక్తి కలవారైనా ఒక స్థిరమైన ప్రాపంచిక దృక్పథంలేని వారెవ్వరూ గొప్ప రచనలు చేయలేరని' కా.రా (కాళీపట్నం రామారావు) గారు చెప్పినట్లు, సలీంగారు కూడా ఇటువంటి ప్రాపంచిక దృక్పథం కలిగిన గొప్ప నవలా రచయిత కనుకే సజీవ మనస్తత్వ చిత్రణతో ఇంతమంచి నవలను మనముందుకు తీసుకురాగలిగారని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చు.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# దాట్ల దేవదానం రాజు వచన కవిత్వంలో - అభ్యుదయ తత్వం

- పి.వి.వి. గంగాధరం, పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, గుంటూరు.

దాట్ల దేవదానం రాజు గారు నిత్య జాగరకుడుగా నిరంతరం సమాజానికి అభ్యుదయ కవితా పాఠాలు బోధించే కవిగా సృజనశీలిగా చరిత్రలో నిలిచిపోయారు. వస్తువు, అభివ్యక్తి, శిల్పంలో దాట్ల వారిది ప్రత్యేక శైలి. దాట్ల దేవదానం రాజు గారు వచన కవితా సరళిలో సారళ్యం, సూటిగా హృదయానికి తాకే విధంగా శబ్దాల కూర్పు తెలుగు నుడికారపు సొంపులు, రసపోషణలను తగినంతగా వినియోగించుకోవటం అన్నింటిలోనూ కవితా సామాన్య సంభాషణ స్థాయికి దగ్గరగా ఉండటం ఈయన ప్రత్యేకత.సమాజంలోని అసమానతలను స్నేహపు విలువలను ఉపయుక్తమైన జీవన విధానాన్ని, సహృదయతను మొత్తంగా అభ్యుదయ తత్వాన్ని అక్షర రూపంలో అందించిన సాహితీశీలురు.

దాట్ల దేవదానం రాజుగారు తూర్పుగోదావరి జిల్లా కోలంక గ్రామంలో 1954 మార్చి 20న శ్రీమతి దాట్ల సూర్యనారాయణమ్మ, వెంకటపతి రాజులకు జన్మించారు. ప్రాథమిక, ఉన్నత విద్యను స్వగ్రామంలో పూర్తిచేసి ఉన్నత చదువులు చదివి ఉపాధ్యాయ వృత్తి చేపట్టి ఆ వృత్తికే వన్నెతెచ్చారు. విశ్రాంత ఉపాధ్యాయునిగా సామాజిక నిబద్ధతతో తనను తాను అక్షర రూపంలో ఆవిష్కరించుకుంటున్న కవి. కథకుడు దాట్ల దేవదానం రాజు ఇప్పటి వరకూ 9 కవితా సంపుటికలు 3 కథా సంపుటికలు ప్రచురించారు.

భావ కవిత్వానికి తిరుగుబాటుగా వచ్చిందే అభ్యుదయ కవిత్వం. సామాజిక చైతన్యం, ప్రగతిశీల మానవతావాదం, మార్పు ప్రధానాంశాలుగా ఈ కవితా ఉద్యమం కొనసాగింది. అభ్యుదయ కవిత్వంపై మార్క్సిస్ట్ సిద్ధాంతాల ప్రభావం బలమైన ముద్ర వేసిన సమయంలోనే జాతీయోద్యమంతో ఉత్తేజితమైన కవులు అభ్యుదయ కవితలు రచించారు. 1935లో ఏర్పడిన భారత అభ్యుదయ రచయితల సంఘం, 1943 లో ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం, సామాన్య మానవ ప్రాధాన్యం,వర్గ సంఘర్షణ, విప్లవ ప్రభోదం, సమసమాజ నిర్మాణం వంటి అభ్యుదయ కవితా అక్షణాలుగా విశ్వ శ్రేయస్సును అభ్యుదయ కవిత్వం ద్వారా కాంక్షించారు.శ్రీశ్రీ శిష్టా ఉమామహేశ్వరరావు, శ్రీరంగం నారాయణ పతాభి, ముద్దు కృష్ణ, పురిపండి మొదలగు వారు భావకవిత్వంపై తిరుగుబాటు చేసిన తొలితరపు అభ్యుదయ కవులు.

ఈ అభ్యుదయ కవితా ప్రస్థానంలో శ్రీశ్రీ రచించిన మంగప్రస్థానం అభ్యుదయ కవితా ఉద్యమానికి ఊపిరి లూదారు, తరువాత కాలంలో రెంటాల గోపాల కృష్ణ, గంగినేని వెంకటేశ్వరరావు, బెల్లంకొండ రామదాసు, అజంత, బైరాగి, బోయి భీమన్న మొదలగు వారు అభ్యుదయ కవితా మార్గానికి పరిపుష్ఠిని కలిగించి మరింత తేజోవంతం చేశారు. ఈనాడు కవిత్వం అంటే వచన కవిత్వంగా స్థిరపడిపోయే స్థాయికి వచన కవిత్వాన్ని అభ్యుదయవాదులు తీసుకువచ్చారు.

మానవ సమాజం నిత్యనూతనమైనది. మార్పు అంతర్లీనంగా జరిగే పక్రియ. కొన్ని కోట్ల సంవత్సరాలనుండి పురోగామి పరివర్తన అన్ని అంశాలలోను సమాజంతో పాటు పెనవేసుకొని జీవన విధానాలను సంస్కృతిని, సాంప్రదాయాలకు అనుగుణంగా మార్పులకు లోనవుతున్నాయి. ఈ క్రమంలో సమాజంలో మానవుడు సాంఘికంగా, ఆర్థికంగా, వృత్తి పరంగా, వ్యవస్థ పరంగా, ధనాత్మకంగా పురోగమిస్తూ అత్యున్నత శిఖరాలను అధిరోహించాడనుటలో సందేహంలేదు.

ఇతర సమాజంలో సాహిత్యపు చైతన్యం మన కవిత్వం లోనికి ప్రవేశించనట్లే వచన కవిత కూడా తెలుగు సాహిత్యం లోనికి ప్రవేశించి 19, 20 శతాబ్ధాల కాలాన్ని గొప్పగా ప్రభావితం చేయగలిగింది. సామాజిక చైతన్యంతో పాటు, సామాన్యుని జీవితాలకు విలువలను పెంచింది. సమాజంలో బ్రతికే ప్రతి ఒక్కరికి ప్రశ్నించే హక్కును అందించింది.

జీవన గమనంలో మానవత్వానికి , మానవీయ విలువలకు కూడా అక్షర రూపం అందించి, సమాజాన్ని మానవీయ విలువలతో నింపడానికి, తనవంతు ప్రయత్నాన్ని చేసారు కవి దాట్ల దేవదానం రాజు గారు సమాజానికి, వ్యక్తులకు, మానవత్వం యొక్క ఆవశ్యకతను తెలియజేసే ప్రయత్నం చేసారు."అంతిమ పరిమళం", "సహృదయం", "మాటల దానం" కవితలు ద్వారా...

**తరగని భూగర్భ జల ఊటలా**
**నీ చూపులు నీ శ్వాసలు నీ అంగాల కదలికలన్నీ**
**నీలో ఎగిరిపోకుండా ఇక్కడే సంచరించనీయ్**

అంటూ చనిపోయి కూడా శాశ్వతంగా బ్రతికే అవకాశం. అవయవదానం ద్వారా సాధ్యమని మనం చిరంజీలుగా నిలిచే అవకాశం మన చేతిలోనే ఉంటూ విషయాన్ని గుర్తు చేస్తూ దానికి కావలసింది కాసింత సాయం చేయాలనే మానవత్వం "సహృదయం" అనే కవితలో...

**వాడేదో**
**కొన్ని మెలుకువల్ని పోగేసుకుని**

**నిమ్మళంగా వెలుగులు పూయించుకుంటున్నాడు**
**కొన్ని సామర్ధ్యాల్ని వెలికితీసి**
**బహు జాగ్రత్తగా అందలమెక్కుతున్నాడు**
**తెల్ల తెల్లని చూపులతో**
**వాడి ఉన్నతిని కాంక్షిద్దాం**

అంటూ ఎదుటివాడి ఎదుగుదలను, ఉన్నతిని, అభ్యున్నతిని, సహృదయంతో, సోదరభావంతో కాంక్షించాలని విశాల హృదయులమై సర్వమానవ సౌభ్రాతృత్వాన్ని కోరు కోవాలని తన కవిత ద్వారా తెలియజేసారు.

మానవ జీవితంలో అంగవైకల్యం వల్ల కలిగే ఇబ్బందు లను వర్ణిస్తూ అదే సమయంలో అంగవైకల్యరులలో వున్న ఆత్వవిశ్వాసం,పట్టుదలను, తపనను ఆవిష్కరించారు కవి దాట్ల దేవదానం రాజు గారు ఈ క్రింది కవితలో

**వాడి కళ్ళల్లో**
**తల్లి గర్భంలోనే**
**జిల్లేడు పాలు పోసి**
**ఇన్నాళ్ళూ నను తప్పించుకు తిరిగిన దేవుడు**
**తల వంచుకొని నాముందు నిలబడ్డాడు**
**అంతే**

సమాజంలోని అసమానతలను, అన్యాయాలను భక్తి మునుగులోని మూఢాచారాలను, మతోన్మాధుల దురా గతాలను ''కొత్త పుట్టుక'' అనే కవిత ద్వారా ప్రశ్నించిన తీరు దాట్ల దేవదానం రాజు గారి సామాజిక స్పృహకు నిదర్శనంగా చెప్పవచ్చు.

లోపలి దీపం అనే కవితతో కవి పాఠకుల్ని సమాజం వైపు మళ్ళించారు.

**"రాటుదేరిన కొరడా దెబ్బలు**
**భుజం నలిగిన బతుకులు**
**తల మీది దు:ఖ భారాలు**
**అనంతానంతమైన అనుభవాలు**
**మందులు మాకులు వద్దు**
**రోజూ వచ్చి కాసేపు మాట్లాడరా, అబ్బాయ్"**

ప్రపంచీకరణ, ఉదారవాదం, వర్గ వైరుధ్యం, వర్ణ వైషమ్యం, లుప్తమవుతున్న మానవీయ సంబంధాలు, ఆత్మీయ అనుభూతి, స్పందనలు కవితలుగా రూపు దాల్చి కవిగారి లోపల దీపాన్ని వెలుగులోనికి తెచ్చాయి.

పాఠం పూర్తయ్యాకా అనే కవితా సంపుటిలో

**"తరగతి గది ఒక మ్యూజియం**
**పురాతన రాతి విగ్రహాల్లా**
**విరిగిన అంగాలతో**
**తోలు కప్పిన చిన్న దేహాల విద్యార్థులు**
**కొన్ని కంఠశోషలు కొన్ని బాధ్యతల మధ్య**
**పాఠం పూర్తవుతుంది"**

ఇందులో సర్కారు బడుల దీనావస్థ గురించి విద్య పేరుతో జరుగుతున్న వంచన గురించి, ఉపాధ్యాయుడిగా రాజుగారు అనుభవించిన నిస్సహాయత గురించి అతి సరళంగా గాఢంగా వివరించారు.

జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడిగా మన్ననలు పొందిన రాజుగారు సంధించిన ఈ కవిత ప్రతి తల్లి,తండ్రి సమాజం ఆలోచించాల్సిన ఆవశ్యకతను తెలియచేస్తుంది.

**ఆధార గ్రంథాలు :**

1. దేవదానం రాజు, దాట్ల ., దోసిలిలో నది (కవితా సంపుటి), శిరిష ప్రచురణల,యానాం 2016.
2. దేవదానం రాజు, దాట్ల ., లోపలి దీపం (కవితా సంపుటి), శిరిష ప్రచురణల,యానాం 2005.

❀❀❀

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253



# అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ స్వభావ వర్ణన

- డా॥ జి. ఉషారాణి, రీడర్ ఇన్ తెలుగు, శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పుంగనూరు, చిత్తూరు జిల్లా.

**ఉపోద్ఘాతం :**

సామాజిక జీవితాన్ని గురించి సృజనాత్మకంగా ఆవిష్కరించేది సాహిత్యం. తెలుగునాట మధ్యయుగాలనాటి స్త్రీ జీవితచరిత్ర పునర్నిర్మాణానికి అన్నమయ్య సంకీర్తనలు కూడా ఒక ప్రధానమైన చారిత్రక ఉపపత్తిగా నిలుస్తున్నాయి. అన్నమయ్య రచనల్లోని అంశాలమీద ఎన్నో పరిశోధనలు జరిగినప్పటికీ అతడి సంకీర్తనల్లోని స్త్రీని గురించి సమగ్రమైన, ప్రామాణికమైన పరిశోధన ఇంకా జరగవలసివుంది.

సంకీర్తనాచార్యుడు, ద్రవిడాగమసార్వభౌముడు, పదకవితాపితామహుడుగా ప్రసిద్ధిచెందిన తాళ్ళపాక అన్నమాచార్యుల సంగీత, సాహిత్య సరససమ్మేళనమైన శృంగార, ఆధ్యాత్మిక సంకీర్తనలను వినేటప్పుడు అలౌకిక దివ్యానుభూతి కలగడం సహజమే. అయితే ఆ సంకీర్తనలను సునిశితంగా పరిశీలించినప్పుడే అన్నమయ్య కాలంనాటి స్త్రీలు మన ఎదుట ప్రత్యక్షమౌతారు. వారి స్వరూపం, వారి స్వభావం ఈ కీర్తనలో అన్నమయ్య మనకళ్ళకు కట్టినట్లు వర్ణించాడు. అన్నమయ్య సంకీర్తనలో వర్ణింపబడిన స్త్రీల స్వభావాన్ని పరిశీలించడానికి సాగిన ప్రయత్నమే ఈ పరిశోధనావ్యాస ఉద్దేశ్యం.

**స్త్రీ స్వభావ చిత్రణ :**

అన్నమయ్య సంకీర్తనల్లో ప్రధానంగా కనిపించేవి స్త్రీ పాత్రలే. స్త్రీ అంటే నాయికే. ఇందులో వృద్ధులు కాని, పసిపిల్లలు అరుదుగా కనిపిస్తారు. నాయికలంతా పడుచువారే. వారిలో కొందరు వివాహితలు, మరికొందరు కన్యలు. ఆ రోజుల్లో బహుభర్తృత్వం నిషిద్ధం కానీ బహుపత్నిత్వం దక్షిణ నాయకత్వంగా చెలామణి అయ్యేది. ఈ బహుపత్నిత్వం వల్ల సపత్నులు ఏర్పడ్డారు. సపత్నులమధ్య పోటీ ఏర్పడింది.

సవతులమధ్య పోటీ వల్ల మాత్సర్యం కలిగింది. ఈ పోటీలో కొందరు గెలిచారు. సంతోషించారు. కొందరు ఓడిపోయి బాధపడ్డారు. మరికొందరు రాజీపడ్డారు. ఉన్నదాంతో తృప్తిపడ్డారు. కొందరు గొణిగారు. కొందరు చెప్పుడు మాటలు విని కలతచెందారు. కొందరు భర్తల్ని సాధించారు. ఇంకొందరు దెప్పిపొడిచారు. కొందరు అనుమానంతో కుందారు. కొందరు క్రోధం వెళ్ళగక్కారు. ఆ తర్వాత పశ్చాత్తాపపడ్డారు. కొందరేమో సందేహపడ్డారు. ఇంకొందరు సాకులు చెప్పారు, ఒట్లు వేశారు. కన్నీరు కార్చారు. కొందరు భయపడ్డారు. కొందరు విరహాన్ని తట్టుకోలేకపోయారు. భర్తను వశీకరణ చేసుకోవడానికి ఎన్నో పాట్లు పడ్డారు.

అన్నమయ్య సంకీర్తనల ఆధారంగా స్త్రీల స్వభావాల్లోని ఈ వైవిధ్య, వైరుధ్యాలను ఇరువది (20) అంశాలుగా వర్గీకరించి క్రమంగా అనుశీలించడం జరిగింది.

**1)ఈర్ష్య :** మనం పొందలేనిది ఇతరులు పొందినప్పుడు, మనదనుకున్నదానిని ఇతరులు తమ సొంతం చేసుకున్నప్పుడు మనసులో పుట్టే భావనే ఈర్ష్య. సపత్నుల మధ్య యీ ఈర్ష్య చాలా అధికంగా ఉంటుంది. తన భర్త అభిమానాన్ని సవతి చూరగొంటే ఈమె ఈర్ష్య హద్దులు దాటుతుంది. ఆమె ఎంతటి తెగింపుకైనా సిద్ధపడుతుంది.

**పొత్తుల మగఁడవు పొరుగున సుండఁగ**
**తత్తర మింతేసి తమకేలయ్యా** ॥ పల్లవి ॥

**యేపున నీ మోము యిటునే ఁజూచిన**
**చూపులాపెమై చురుకనెను**
**ఆపొద్దు నీతో నాడిన మాఁటలు**
**తీపులు తనకటు తినఁ జేదాయ** ॥ పొత్తుల ॥

**నడుమ నే నీతో నవ్విన వెన్నెల**
**కడ నాపెకుఁ జీఁకటులాయ**
**చిడిముడి నే నినుఁ జెనకిన సరసము**
**వెడవెడఁ దన కవి విరసములాయ** ॥ పొత్తుల ॥

**వెస నా మోవులవిందు నీకిడిన**
**పసిగొని నాపెకుఁ బగలాయ**
**యెసఁగిన శ్రీవేంకటేశ మమ్మిద్దరిఁ**
**గొసరి కూడితివి గురి దనకాయ** ॥ పొత్తుల ॥
**(16-391)**

నాయిక తన పతినే చూస్తోంది. ఆ చూపులు ఆమె సవతికి చురుక్కున తాకాయి. ఈమె తన భర్తతో తీయగా మాట్లాడుతూ వుంటే, ఆ మాటలు సవతికి చేదుగా వున్నాయి. నాయిక నవ్వులవెన్నెలలు ఆమె సవతికి చీకట్లుగా మారాయి. తన పతితో నాయిక సరసాలాడుతోంటే ఆమె సవతికి అవి విరసంగా అనిపిస్తున్నాయి. ఈ విధంగా సపత్నీమాత్సర్యంవల్ల సవతులు చేసే ప్రతిపనీ వారికి ఎలా కంటగింపవుతుందో ఈ కీర్తనలో చూడవచ్చు.

క్రింది సంకీర్తలోని నాయిక కాస్త కోపగత్తె. తన సవతుల్ని చూసి ఈర్ష్యతో తాను వాళ్ళలా ప్రవర్తించనని చెబుతోంది.

**ఇంచుకంత పనికైన నిల్లుచొరనీక నిన్ను**
**లంచములడుగ నే లకిమమ్మనా**

BHAVAVEENA
Vol. 14, Issue. 12(2), December - 2017.
ISSN No. : 2456-4702 - RNI No. APTEL/2003/12253


**వంచనల నీకు నిట్టె వలలఁ జిక్కితిఁ గాక**
**కంచుఁ బదనునకంత కంటెఁబో నేను ॥ అప్పుడే ॥**

**సొలపు మాటల నిట్టె చూపులనె జంకించి**
**చలము సాదించ నీ సత్యభామనా**
**వలచి నేనిదె నీకు వసమై చిక్కితి ఁగాక**
**కలికి చేఁతల నింత కంటెఁబో నేను ॥ అప్పుడే ॥**

**రేపు మాపు గోరఁదమ్మి రేకులనె లేఖవ్రాసి**
**రూపు నీకుఁ జెప్పిపంప రుకిమిణినా .............. ॥ అప్పుడే ॥**
**(5-43)**

"నిన్నుకోరి నీకు వశమైపోయాను. కాని నీ భార్యలలో యెవరి కంటె తీసిపోను. చిన్న పని కూడ చేయడానికి లంచ మడగటానికి నేనేమైనా లక్ష్మినా? కంటితో బెదిరించి, మాటలతో సాధించటానికి నేనేమైనా సత్యభామనా? ప్రేమలేఖలు తామ రాకుమీద రాసి పంపటానికి నేనేమైనా రుక్మిణినా?" అంటు యీ నాయిక తన భర్తను నిలదీస్తోంది.

పై సంకీర్తనలో లంచమిస్తేగాని ఏ పని చేయని లక్ష్మి నైజాన్ని, తన సాధింపుతో అను నిత్యం బాధించే సత్యస్వాతి శయాన్ని, తన కుటుంబసభ్యులకు తెలియకుండా లేఖ పంపిన రుక్మిణి తెగింపును యీ నాయిక అదేపనిగా భర్తకు దోషాలుగా యేకరువు పెడుతోంది. సపత్నుల మీద భర్తకు ద్వేషం కలి గించి, వశీకరించుకోవాలనే మాత్సర్యభావన ఆమెలో వున్నట్టుంది.

పత్నికి తన పతియే సర్వస్వం. తనకు సంబంధించిన ఏ వస్తువునైనా యితరులతో పంచుకోవటానికి ఒప్పుకుం టుందేమోగాని స్త్రీ తన భర్తను పంచుకోవటానికి మాత్రం ససేమిరా అంగీకరించదు.

**ఇరవై మన్నించవయ్యా ఇంతి గుణ మిదివో**
**తరుణివారము గాన తగులఁ జెప్పితిమి ॥ పల్లవి ॥**

**కొమ్మనీతో పొందుచేసి కొరిపిన్ననాఁ డాడే**
**బొమ్మలఁ దేనియ్యదు నీ పొందు దగిలీనంటా**
**ఇమ్ముల సవతిపోరు కిసుమంత కోప దీకె**
**యమ్మె కెవ్వతెఁ దెచ్చినా నెట్టవునో పనులు ॥ ఇర ॥**

**నీవూఁ దానుఁ గూచుండఁగా నిలువుటద్దములోన**
**సోవగాఁ బతిరూపులు చూడ నోపరు**
**తావులఁ దననీడకు తా నలిగీని చెలి**
**ఆవలి ఇంతిఁ దెచ్చితే నప్పు డేమేమౌనో ॥ ఇర ॥**

**తన రూపు వ్రాసి వేరే తరుణి యయ్యీనంటా**
**యెనలేని తన సంది నిడుకొనెను**
**ఘనుఁడు శ్రీవేంకటేశ కైకొంటివి ఇంతిని**
**ననుపు చెలుల పొందు నవ్వుఁబాటు సుమ్మీ ॥ ఇర ॥**
**(19-483)**

ఈ సంకీర్తనలో అన్నమయ్య ఒక నాయిక తన చిన్న నాటి బొమ్మలకు భర్త స్పర్శ తగలరాదనటం, అద్దంలో భర్త పక్కన తన రూపమే చూసి తట్టుకోలేకపోవటం, తాను గీసిన తన రూపునే వేరే స్త్రీగా భ్రమించటంలాంటి చేష్టలతో ఆమె కుండే సపత్నీమాత్సర్యాన్ని సున్నితంగా వివరించాడు. ఇదే భావాన్ని నందితిమ్మన -

**ధనమిచ్చి పుచ్చుకొన్నను**
**మనమున నోర్వంగవచ్చు, మగఁడింతులకున్**
**జనవిచ్చి పుచ్చుకొన్నను**
**మనవచ్చునె? యింక నేటిమాటలు చెలియా!**

(పారిజాతాపహరణం - పద్యం 97) అని సత్యభామ ముఖతః చెప్పాడు.

**2) చెప్పుడుమాటలు వినటం :** సాధారణంగా కుటుంబ సభ్యులమీద అందరికీ విశ్వాసం వుంటుంది. వారినిగూర్చి ఎవరైనా చెడుగా చెబితే వాళ్ళమీద నమ్మకంతో చెప్పిన వాళ్ళనే తిట్టిపోస్తారు. అయితే కొందరు మాత్రం చెప్పుడు మాటలకు చెవి వొగ్గుతారు.

అన్నమయ్య సంకీర్తనల్లోని యీ నాయికకు ఆమె పతిని గూర్చి యెవరో చాడీలు చెప్పారు. ఆ మాటల ప్రభావం మనసు మీద పడింది.

**తప్పక తాఁ జూచినాను తలవంచి చూడనైతి**
**అప్పుడే రాఁడాయనని ఆ కోపాన**
**చిప్పిలఁ దా నవ్వినాను సెలవిని నవ్వనైతి**
**చెప్పుడు మాటలు విన్న చిత్తపుఁ గోపానను**
**(26-82)**

చెప్పుడు మాటలు విన్న నాయిక కోపంతో నాయకుడు తన్ను చూచినా, తలవంచైనా చూడలేదు. అతడు ఆదరంగా నవ్వితే ఈమె కనీసం చిరునవ్వైనా నవ్వలేదు. నాయకుని మీద అపనమ్మకం ఏర్పడ్డ నాయిక చెప్పుడుమాటలు విని అతణ్ణి ఉపేక్షిస్తోంది.

**3) అనుమానించటం :** "అనుమానం పెనుభూతం" అని సామెత. పొరపాటున ఎవరిమీదన్నా అనుమానం కలిగితే అది ఓ పట్టాన వదలదు. ఇంతింతై పటుడింతై... అన్నట్టు క్షణక్షణానికి పెరిగిపోతుంది. అన్నమయ్య సంకీర్తనలో నాయకుడు చెప్పే మాటలు విని నాయిక నమ్మలేకపోతోంది.

**చుట్టరికము సేసుక సుద్దులెల్లఁ జెప్పేవు**
**నెట్టన నీ రచనలు నిజమా యిది**
**చెట్టాపట్టాలు వట్టుక సిగ్గులు విడిపించేవు**
**నట్టనడుమ నివెల్లా నమ్మవచ్చునా! ॥ ఆఱడి ॥**
**(21-175)**

నాయకుడు బంధుత్వాలు కలుపుకొని యేవేవో మాటలు చెబుతున్నాడు. ఆ మాటలన్నీ కథలేమో అని ఈమె అనుమానం. అందుకే "నీ రచనలు యివి నిజమేనా?" అని నిలదోస్తోంది. అతడు నాయిక చేతులు పట్టుకొని సిగ్గును విడిపిస్తున్నాడు. "వీటన్నిటినీ నమ్మవచ్చా?" అని ఆమె ప్రశ్నిస్తోంది. అనుమానపడే నాయికకు నాయకుడు ప్రేమతో చేసే చేతలు సైతం అనుమానాస్పదంగా తోచినట్టు అన్నమయ్య సహజంగా వర్ణించాడు.

**4) గొణగటం :** తమకు ఇష్టంలేని పనులు ఎవరైనా చేస్తే, ఆ విషయాన్ని గట్టిగా బయటకు చెప్పుకోలేని పరిస్థితి వస్తే బాధితులు గొణుక్కోవటం సహజమే. సవతుల విషయాల్లో ఈ గొణగటం అనేది ప్రబలంగానే వుంటుంది.

**సరసముతో నాసరులు దిద్దఁగా**
**కెరలుచునటు గొణఁగీ నొకతె**
**ధరనీ సేఁతలు తానే మెఱఁగునొ**
**గరిమ లన్నియునుఁ గనవలె నిఁకను (19 - 57)**

నాయకుడు ఒక ఇంతి ఎదురుగా ఆమె సవతి మెళ్ళోని హారాల్ని సరసంగా సరిదిద్దాడు. అది చూసిన ఆ యింతి అసహాయురాలై గొణుక్కుంది.

**5) సాధించటం :** తమ స్వంతం అనుకున్నవారు తమను కాదని, తమకు నచ్చనిపనిని చేసినప్పుడు ఆ వ్యక్తిని సాధించటం నిస్సహాయస్త్రీల సహజలక్షణం. అన్నమయ్య చిత్రించిన ఈ నాయిక తన ప్రియుడు చేసిన తప్పుల్ని సహించలేకపోయింది. ఆ తప్పులన్ని ఎంచుతూ అతన్ని మౌనంతో సాధిస్తోంది.

**రమణుఁడు నీవద్ద నూరక పవ్వళిం చుండఁగా**
**తమకించి మాటలాడఁ దగవౌనటే**
**చెమటలు గారఁగాను చేతఁ దుడుచుకొనీని**
**సముకమున నీ వింత సాదింతు రటవే ॥ ఇంటికి॥ (16-31)**

నాయకుడు యింటికి వచ్చి ఆమె దగ్గర ఊరకే పడుకొని వున్నాడు. అయినా నాయిక అతనితో ఒక్కమాట కూడా మాట్లాడలేదు. అతనికి చెమటలు కారిపోతున్నా, అతడు చేత్తో తుడుచుకొంటున్నా ఆమె మాత్రం యేమీ పలకటంలేదు. మునుపు అతడు చేసిన శుశ్రూషలు తలచుకొంటూ వుందేమో తన మౌనంతోనే నాయకుణ్ని సాధిస్తోంది.

**6) దెప్పిపొడవటం :** ఎవరైనా, ఏదైనా తప్పుచేస్తే ఆ తప్పును క్షమించగలగటం కొందరికే సాధ్యం. క్షమించలేని వారైతే వారితో మాట్లాడటమైనా మానేస్తారు. కొందరు మాత్రం వాళ్ళుచేసిన తప్పును అనుక్షణం గుర్తుచేస్తూ, దెప్పిపొడుస్తూ వుంటారు.

ఈ నాయిక కూడా మూడోకోవకు చెందిందే. తన భర్త పూర్వం చేసిన తప్పుడు పనుల్ని ఎత్తిచూపిస్తూ, అతన్ని దెప్పిపొడుస్తోంది.

**అవునయ్యా నీ సుద్దులటువంటివి**
**జవళితో నంటిన బచ్చలి వంటివా ఁడవు ॥ పల్లవి ॥**

**చెలరేఁగి యెడలేని చేఁతలెల్లాఁ జేసివచ్చి**
**వెలయనిప్పుడు నన్ను వేఁడుకొనేవు**
**పలుమారు నీచేత బాసలుగొన వెరతు**
**కలువకంటులయెడ కాతరీఁడ పనుచు ॥ అవు ॥**

**వాడవారిపైనెల్లా వలపులు చల్లి వచ్చి**
**యీడ నాతో నేడలేని యిచ్చలాడేవు**
**కోడెకాఁడ నీవోజ కొనియాడ సిబ్బితయ్యీ**
**జాడతో నింతులయెడ చంచలుఁడ వనుచు ॥ అవు ॥**

**పెక్కు గోపికలనెల్లాఁ బెండ్లాడి యిటవచ్చి**
**గక్కన నా కౌఁగిటఁ గలసితివి**
**నిక్కి శ్రీవేంకటేశుఁడ నే నలమేల్మంగను**
**కక్కసించ నోప నీవు గబ్బివాఁడ వనుచు ॥ అవు ॥**
**(19-20)**

నాయకుని గుణాలన్నీ నాయికకు తెలుసు. అతడికి "చనువిస్తే అంటు బచ్చలిలా" అంటుకుంటాడు. వీధిలో చేయకూడని చేష్టలన్నీ చేసి యింటికి వచ్చి ఆమెను వేడుకొంటాడు. అందుకే పదే పదే అతనితో ఒట్టు వేయించుకోవాలంటే ఆమె భయపడుతోంది. స్త్రీ విషయంలో అతడు చంచలుడని తనకు తెలుసంటూ నాయిక దెప్పిపొడుస్తోంది. చెప్పేదొకటి, చేసేదొకటి అయిన నాయకులకు యీ దెప్పిపొడుపులు తప్పవుమరి.

**7) సాకుచెప్పడం :** సహజంగా ఒక పనిమీద యిష్టం లేనపుడు సూటిగా చెప్పకుండా కుంటిసాకు చెప్పి తప్పించుకోవడం మానవ సహజం.

**యేమి సేయఁబోయి నీవు యేమి నేసినాఁడవు**
**సాముకు విచ్చేయదు జవరాలు నేఁడు**
**దోమతెర మంచముపై తురుము వీడఁగను**
**తామసించి లేవదిదె తలనొచ్చీననుచు**

నాయకుని చేతలతో నాయిక అలిగింది. జవరాలిని చెలికత్తెలు సాముకు పిలిచారు. అయితే ఆమె కోపంతో వుంది కాబట్టి దోమతెర వేసి మంచంమీద కొప్పు ఊడిపోగా పడుకొనివుంది. చెలులు పిలిస్తే 'తనకు తలనొప్పిగా ఉంద'ని సాకు చెప్పేసింది.

ఇక్కడ నాయిక అలుకకు కారణం నాయకుడే. అయితే చెలికత్తెలకు తన అలుక విషయం చెప్పకుండా తలనొప్పి అనే సాకును చెప్తోంది.

**8) ఒట్టు పెట్టుకోవటం :** ఏదో ఒక విషయంలో ఎవరి మీదైనా కోపం వచ్చినప్పుడు ఆ వ్యక్తితో మాట్లాడననో, ఆ పని చేయననో, ఆ వ్యక్తి మొహం ఇక జీవితంలో చూడననో ఒట్టు పెట్టుకొంటారు. ఒట్టు వేసుకోవడం ఎంత తేలికో, దాన్ని నిలబెట్టుకోవడం అంత కష్టం.

**చెలులఁ దానంపినాఁడు చెంతనే రాకుండఁగాను**
**అలిగి వుందానఁ దొల్లె అందు కేఁటిదే**
**కలఁగి ముంగోపమున కానివొట్టు వెట్టుకొంటి**
**పిలిపించ రాదు నాకు పిన్నదాన నేను ॥ అన్నిటా ॥**
**(11-232)**

ఈ నాయిక తన ప్రియుని మీద అలిగింది. నాయకుని దగ్గరికి పోరాదని ఒట్టు పెట్టేసుకుంది. నాయకుడేమో చెలికత్తెల్ని పంపాడు. అతడే రావచ్చుకదా అని నాయిక అనుకుంటోంది.

ఇక్కడ నాయిక పెట్టుకోరాని ఒట్టేదో పెట్టుకుంది. అలా గని నాయకుడ్ని చూడకుండా ఉండలేకపోతోంది. పోనీ తానే వెళ్తే ఒట్టు మీరినట్టు అవుతుంది. స్త్రీల మనస్తత్వం బాగా తెలిసిన అన్నమయ్య ఆమె మనసులోని భావచాంచల్యాన్ని చక్కగా వర్ణించాడు.

**9) కోపగించుకోవడం :** సత్త్వరజస్తమోగుణాల్లో కోపం తమో గుణానికి చెందింది. కోపంతో వున్నప్పుడు వివేచనము కోల్పోతాం.

**ఇంతలోఁ గోపము గద్దా ఇయ్యకొని వుండవద్దా**
**వింతగాదు నీకు నాకు వెరగైతి నింతే ॥పల్లవి॥**

**సతియేలే గొణఁగూ చల్లకువే సణఁగూ....**
**కతగాఁ దిట్టకువే కానినింద గట్టకువే.... ॥ ఇంత ॥**

**వద్దువద్దే కసరూ వంచకువే వుసురూ....**
**గద్దించి చూడకువే కల్లలింతాడకువే... ॥ ఇంత ॥**
**(20-55)**

నాయిక చాలా కోపంతో ఉంది. అందుకే గొణుగు తుంది. సణుగుతోంది. ఒకటే తిడుతోంది. అవసరమైన నిందలు మోపుతోంది. ఒకటే కసురుతోంది. నిట్టూర్పులు విసురుతోంది. గద్దించి చూస్తోంది. ఈ సమయంలో చెలికత్తె మాటలు విని ఇంతెత్తున లేచిన తిమ్మనగారి సత్యభామ గుర్తురాకమానదు.

**చేసిన వారి చేఁతలు చేతనఁ బెట్టుగావా**
**యీసున నన్నుఁ జూడఁగ నెఱ్ఱనాయ కన్నులు ॥ పల్లవి ॥**

**కోపించి వాదుకు రాఁగాఁ గొప్పు కడువెడజారె**
**యేపున నాతో జగడ మిదివొమ్మదె.... ॥ చేసిన ॥**

**బీరాన నన్నుఁ దిట్టఁగాఁ బెదవి కెంపులు రేఁగె**
**దూరి పెద్దల నాడేది తోడ దోసమే ...... ॥ చేసిన ॥**

**వోపనంటాఁ బెనఁగఁగ వో పోఁకముడి వీడె**
**దాఁపురాలు బయలాయఁ దగదే యిఁక .... ॥ చేసిన ॥**
**(20-11)**

నాయిక కోపంతో నాయకుడ్ని చూడగానే ఆమె కళ్ళు ఎర్రబడిపోయినాయి. నాయకుడితో వాదులాడడానికి రాగానే ఆమె కొప్పు జారిపోతుంది. అతడ్ని తిట్టగానే ఆమె పెదవులు అరుణిమలయ్యాయి. తాను ఓపలేనని ఆమె పెనగుతూవుంటే జడముడి వీగిపోయింది.

పై కీర్తనలో అన్నమయ్య కోపంగా వున్న నాయిక హావభావాలను అతిసహజంగా కళ్ళకు కట్టినట్లు వర్ణించాడు.

**10) పశ్చాత్తాపం :** తెలిసి కొందరు, తెలియక కొందరు ఏవో తప్పులు చేస్తుంటారు. తప్పు చేయడం మానవ సహజం. చేసిన తప్పును సరిదిద్దుకోలేకపోయినా... పశ్చాత్తాపపడడం కనీస మానవధర్మం.

**ఏమి సేయవచ్చు నిఁక నివెల్లానాసేరములె**
**దీమసాన లోలోనే తెలుసుకోనైతి ॥ పల్లవి ॥**

**చెప్పెఁగా నీ గుణాలెల్ల చెలియ నాతో నాఁడె**
**నెప్పున నీ సేవ సేయ నేరనైతి**
**వొప్పగించెఁగా నీ వుంగరము నా చేతికి**
**చొప్పులవి సాధించి చూడనైతి ॥ ఏమి ॥**

**నవ్వెఁగా వూడిగమాపె నను నిన్నూ నిట్టె చూసి**
**జవ్వనమదమున విచారించనైతి**
**పువ్వులను వేసెఁగా పొంచి యాకె వుండుమని**
**యెవ్వతో నీవద్ద నుంట యెరఁగనైతి ॥ ఏమి ॥**

**సన్న సేసెఁగా నాకు సరుస నా చెల్లెలు**
**అన్నిటా నిన్ను మాట పట్టడుగనైతి**
**యిన్నిటా శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నేఁడు**
**యెన్నుకొని నీ రతులు యిటు వొగడనైతి ॥ ఏమి ॥**
**(16-5)**

చెలికత్తె నాయికతో నాయకుని గుణాలన్నీ ఏకరువు పెట్టింది. నాయకుడిచ్చిన ఉంగరాన్ని కానుకగా ఇచ్చింది. కాని యవ్వనమదంతో నాయిక ఆ మాటల్ని పట్టించుకోలేదు. కానుకను తృణీకరించి సాధించింది. అతనికి సేవ చేయలేదు. అతడు దూరమయ్యాడు. ఆమెకు స్వామి విలువ తెలియ వచ్చింది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లు చేయరాని పనులన్నీ చేశాక ఇలా చేశామే అని నాయిక పశ్చాత్తాప పడుతోంది.

**11) సందేహం :** ఏదన్నా పనిచేయాలంటే ముందు

అది జరుగుతుందో లేదో అని సందేహం. అటుతర్వాత యెవరైనా ఏమైనా అనుకుంటారేమో అని సందేహం పట్టిపీడిస్తుంది. అన్నమయ్య సంకీర్తనలోని ఈ నాయికకు కూడా అదే పరిస్థితి ఎదురైంది.

**దేవర గుణములు దెలియవు**
**నీవే మాకును నేరుపవయ్యా! ॥ పల్లవి ॥**

**వదలక నీతో వాసికిఁ బెనగిన**
**యెదుటనె నీమనసెట్టుండునో**
**కదిసి నీ రతికిఁగడు దమకించిన**
**యిది వేసాలని యెంతవో నీవు ॥ దేవర ॥**

**చెనకఁగ నీయెడ సిగ్గులు నెరపిన**
**పనులవి యేమని భావింతువో**
**ననచి నీయెదుట నవ్వులు నవ్విన**
**తనివి లేనిదని తగనాడుదువో ॥ దేవర ॥**

**కూడుచు నిన్నిటు గుబ్బలనొత్తిన**
**వోడదనుచు గోరూఁదుదువో**
**యీడనె శ్రీ వేంకటేశ యేలితివి**
**వీడె మిచ్చితే వెరగందుదువో ॥ దేవర ॥**
**(19-4)**

ఇక్కడ నాయికకు అన్నీ సందేహాలే. వంతుకోసం పోట్లాడితే యేమనుకుంటాడో? రతికి తమకిస్తే వేషాలను కొంటాడో యేమో! సిగ్గుపడితే ఇదేమి పని అనుకుంటాడో! ఎదురుగా నిలబడి నవ్వితే తనివి తీరలేదంటాడేమో! అతన్ని కలిస్తే వీడలేదని గోరుతో వత్తుతాడేమో! తనను ఏలాడుకదాని తాంబూలమిస్తే భయపడతాడేమో!

ఇక్కడ నాయిక తానేమి పనిచేసినా నాయకుడు దాన్ని ఇష్టపడతాడో, లేదో అని సందేహాలడోలికలో ఊగిపోతోంది. ప్రియుని గుణం ఎప్పుడెలా వుంటుందో తెలియని ప్రియురాలి చిత్తాన్ని ఈ కీర్తనలో అన్నమయ్య చక్కగా వ్యక్తపరిచాడు.

**12) ఆత్మన్యూనతాభావం :** కొందరు తమలో ఎలాంటి లోపం లేకున్నా తాము ఎదుటి వారికి సాటికామని, వారితో పోటీపడలేమని ఆత్మన్యూనతాభావంతో బాధపడుతూ వుంటారు.

నాయకుడు ఈ నాయికను చేపట్టాడు. "నాలో ఏమి మంచి లక్షణాలున్నాయి? నేనేమి నీ దేవేరులకంటే గొప్పదాన్నా?" అంటూ తన్ను తాను కించపరచుకుంటోంది.

**పరగ నేఁ జేసినట్టి భాగ్యము గాక**
**సరస నీ దేవుళ్లలో చక్కని దానినా ॥ పల్లవి ॥**

**మన్నించి నీవు నను మాఁటలాడించేవు గాక**
**యెన్నిక నీసతులలో నేమిబాఁతి**
**అన్నిటా నేరుపరివై యాదరించేవుగాక**
**కన్నెలు పదారువేలకంటె దొడ్డదాననా ॥ పరగ ॥**

**యెల్లగా నాచే విడె మిప్పించుకొనేవుగాక**
**తొల్లిటి కాంతలకంటె దొరనా నేను**
**మెల్లనె నా చన్నుల మీఁదఁజేయి వేసేవుగాక**
**గొల్లెతలకంటె నే నెక్కుడు దాననా ॥ పరగ ॥**

**ననుపునఁ గూడి నన్ను నవ్వు నవ్వించేవు గాక**
**చనవరి కాంతల సరివత్తునా**
**యెనసితివి శ్రీవేంకటేశ నిన్ను నింతలోనె**
**మనెడివారి కంటె మలసేటి దాననా ॥ పరగ ॥**
**(19-60)**

నాయకుడు నాయికను గౌరవించి ఆమెతో మాట్లాడు తున్నాడు."నీ సతులైన నా సవతులలోకెల్లా నేనేమన్నా గౌరవించదగ్గదాననా?" అని అడుగుతోంది. "అన్ని విషయాల్లో నన్ను ఆదరిస్తావు. పదహారువేల కాంతల్లోకి నేనేమన్నా పెద్ద దాన్నా?" అని ప్రశ్నిస్తోంది. కోరి ఆమెతో తాంబూలం ఇప్పించు కొంటున్నా నాయకుడు. "ముందుండే భార్యలకన్నా నేనేమన్నా అధికురాలినా?" అని సందేహిస్తోంది. మెల్లగా ఆమె మీద చెయ్యి వేశాడు. "గొల్లెతలకన్నా నేనేమన్నా ఎక్కువా?" అని అడుగుతోంది. ఆమెతోకూడి అతడు ఆమెను నవ్విస్తున్నాడు. "నీతో చనువుగా వుండే స్త్రీలకు నేనేమైనా సమానమౌతానా? అంటోంది ఈమె. వేంకటేశుడు ఆమెను కూడాడు. "నీవు మన్నించే వారందరిలోకి నేను గౌరవించదగ్గదాననా?" అని అడుగుతోంది.

ఈ నాయికలోని ఆత్మన్యూనతాభావం ఆమె తన్ను తాను సవతులతో పోల్చుకొని నేను వారికి సరివస్తానా? అని అనుకోవటంలోనే ప్రస్ఫుటంగా కనిపిస్తోంది.

**13) కన్నీరు :** మనసుకు ఆనంద, విషాదాలు కలిగి నప్పుడు కన్నీరు స్రవిస్తుంది. పురుషులు తమకు ఎంత కష్టం కలిగినా ఆ బాధను బయటపడనియ్యరు. స్త్రీలు సున్నిత మనస్కులవటం వల్లనేమో మనసుకు కాస్త బాధ కలిగితే వెంటనే కన్నీటిరూపంలో తమ బాధను వ్యక్తం చేస్తారు.

ఎంతో ఆత్మాభిమానమున్న సత్యభామే తన భర్త మీద అలిగి, తన కాళ్ళకు మ్రొక్కిన కృష్ణుని శిరస్సును ఆమె వామపాదంతో త్రోసి అటు తర్వాత ఆ బాధను భరించలేక "బాలపల్లవ గ్రాస కషాయకంఠ కలకంఠ వధూ కలకాకలీధ్వని" (పారిజాతాపహరణం - 1వ ఆశ్వాసం, 133వ పద్యం)తో గాసిలి ఏడ్చింది.

అన్నమయ్య చిత్రించిన ఈ నాయిక మాత్రం సత్య భామలా ఈర్ష్యతో కలిగిన బాధవల్ల ఏడవలేదు. తనపతి చేష్టలను, అతడి రూపాన్నీ తలచుకుంటూ అతడు రాలేదన్న బాధతో ఏడ్చింది.

**అంతలోనే నిన్నుఁజూచి అంగన కన్నీరు నించి**
**పంతపుఁ గూరిమితో నీపైనొరగెను**
**ఇంతసేసి కూడితివి ఇప్పుడే శ్రీవేంకటేశ**
**వింతగాఁ గళలఁ జొక్కి వేడుక నలసెను (26-103)**

పతిని గూర్చే ఆలోచిస్తూ, అతడి ముచ్చట్లు చెలితో చెబుతూ, అతడి గూర్చే బాధపడుతూవుంది నాయిక. అంతలోనే ఆమె పతి వచ్చేశాడు. అంతే! అతడిని చూస్తూనే ఆమె కన్నీరుకార్చి ప్రేమతో అతడి మీదికి ఒరిగిపోయింది. మరి ఈ కన్నీరు అంతవరకూ తానుపడ్డ బాధనుంచి వచ్చిన దుఃఖాశ్రువులా? లేక పతిని చూసిన ఆనందంతో వచ్చిన ఆనందాశ్రువులా?

**14) పడరానిపాట్లు** : బహుభార్యత్వం వున్నచోట సవతుల్లో పోటీ వుండటం సహజమే. కానీ ఆ పోటీయే వెర్రితలలు వేస్తే వాళ్ళు చేసే పనులు, వారుపడే పాట్లు ఆ దేవునికే ఎరుక. పతిని తమ సొంతం చేసుకోవాలనే ఉద్దేశ్యంతో ముందు తాము సమ్మోహనంగా అలంకరించుకొంటారు. ఇక్కడ నాయిక కూడా అదే ఆలోచనలో వుంది. అందుకే తన్నుతాను అలంకరించుకొంది.

**వూరివారి సొమ్ములెల్ల నొగిఁ బెట్టుక రాఁగాను..... (14-9)**

అయితే ఆమె తన సొమ్ములే కాకుండా ఇతరుల సొమ్ము కూడా ఒంటినిండా ధరించి వచ్చింది. తాను నాయ కుణ్ణి వశం చేసుకోవటానికి పాపం ఈ నాయికకు అరువు సొమ్ము బరువు చేటయినా ధరించక తప్పలేదు.

**15) నమ్మకం** : స్త్రీకి స్వభావసిద్ధంగా వుండే లక్షణం నమ్మకం. తన వారని భావించిన వారిని స్త్రీ పూర్తిగా నమ్ము తుంది. ఎవరైనా వారిని గూర్చి చెడుగా చెప్పినా ఆమె సహించదు. నమ్మిన వాడేమిచేసినా ఆనందంగా భరిస్తుంది.

**యీడకుఁ బిలుపించెను యేమి సేయుమనీనే**
**వోడక తనయెదుట నున్న దానను**
**పాడితో నీట ముంచనీ పాలముంచనీ తాను**
**వాడుఁ దన వలపులవలకు లోనైతిని ॥ సారె ॥**

**మాఁట నన్ను నాడించెను మనసెట్టు దెలిసీనే**
**యేఁటికైనా నియ్యకొంటి నిదివో నేను**
**నాఁటిమాఁట చెల్లించీనా నగనీ తెగడనీ**
**మేఁటిపాయము తనకే మీఁదుగా నెత్తితిని ॥ సారె ॥**

**కౌఁగిట నన్ను నించెను కళదాఁకె నిఁకనేలే**
**దాఁగక తనకు నిట్టె దక్కితి నేను**
**వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడు దా నన్నుఁ గూడె**
**యేఁగించనీ రేఁగించనీ యిరవైతి నేను ॥ సారె ॥**
**(20-149)**

నాయకుడు నాయికను పిలిపించాడు. ఆమె అతడి ఎదురుగా వుంది. ఏమి చేసినా అతడిష్టమేనంటోంది. నీట ముంచినా, పాలముంచినా అతడిదే భారమట. అతడి మనసేంటో తెలీదు. దేనికైనా సరే సిద్ధంగా వుంది. అతడు నవ్వినా, తిట్టినా తన మనస్సును, వయసును అతడికే అర్పిస్తానంటోంది. తనను ఏగించినా, రేగించినా భరిస్తుందట.

చాలామంది భార్యలు భర్తను పూర్తిగా నమ్ముతారు. అతడి మాటను జవదాటరు. తమ భారమంతా అతడిదేనని భావిస్తారు. ఏమైనా సరే భర్త ఆనందంగా వుండాలి అను కుంటారు. భర్తపట్ల అచంచల విశ్వాసం వుండే భార్య స్వభావాన్ని ఈ కీర్తనలో అన్నమయ్య హృద్యంగా వర్ణించాడు.

**16) స్వాతిశయం** : ఇతరులకులేని విశిష్ట గుణమేదైనా తమలో వున్నప్పుడు కొందరు అహంభావానికి లోనవుతారు.

**తనివి దీరక నన్ను తమకమున నెంతేని**
**చెనకేవు వద్దు నీ చిత్తమిఁక నోరి! ॥ పల్లవి ॥**

**దంటవై నాచేతఁ దలఁపించు కొనఁగ దొర**
**కొంటి వింక నిది నీకు కొలఁదిఁ బడునా**
**నంటున నా ప్రియము నాఁటిలను నిన్నునా**
**వెంట ద్రిప్పక నిన్ను విడుతునా వోరి! ॥ తనివి ॥**

**గబ్బివై నావాలుఁ గనుఁగొనల నవ్వులకు**
**నుబ్బేవు నీవు నీ వొడఁబడికల**
**నిబ్బరపు నావలపు నెలకొన్న యపుడేని**
**అబ్బురంబగు గర్వమణఁచనా వోరి! ॥ తనివి ॥**

**మెట్టుకొని నీవు నా మెఱుఁగుఁ బయ్యద చెఱఁగు**
**పట్టేవు నీకు నీపరిణామమూ....... ॥ తనివి ॥**
**(6-38)**

నాయకుడు ఆమె ప్రేమకోసం పరితపిస్తున్నాడు. ఆమె కనుకొనల చిరునవ్వు విసరితే ఆనందంతో ఉబ్బిపోతున్నాడు. అటువంటివాడు ఆమె కొంగుపట్టాడు. ఆమె అతన్ని కూడింది. ఇక్కడ నాయిక రూపగర్విత. నాయకుని తన స్వాధీనం చేసుకోగలనన్న స్వాతిశయం ఆమె మాటల్లో తొణికిసలాడు తోంది. అందుకే తన వెంట విడువక తిప్పుకుంటానని, అతని గర్వాన్ని అణచితీరతానని, అటూ ఇటూ కదలనివ్వక తన కొంగుకు కట్టేసుకుంటానని శపథం చేసింది.

ప్రేమ ఎక్కువైనచోట అధికారాన్ని చలాయించటం సహజం. ఆ ప్రేమను తన సొంతం చేసుకుంటానని నాయిక స్వాతిశయంగా పలకడం ఆమెకు అతనిపై వుండే ప్రగాఢమైన ప్రేమకు తార్కాణం.

**17) ఆత్మాభిమానం** : కొందరు స్త్రీలు తమ ఆత్మాభి మానం దెబ్బతింటే తట్టుకోలేరు. నాయకుడు ఈ నాయిక

దగ్గరికి రాలేదు. తనకు తానుగా నాయకుడి దగ్గరకు వెళ్ళడం తన ఆత్మాభిమానానికి దెబ్బగా ఈమె భావిస్తోంది.

మనసుకు మనసే మర్మము గాక
వినికివలెఁ దనకు విన్నవించఁ గలనా ॥ పల్లవి ॥

తలుపులో తమకము తానె యెరఁగఁ డట
యెలమిఁ దన్నుఁ గొసరనేలె నాకూ
కలిమిఁ జంద్రురాక కలువపువ్వులకును
తెలిపిరా యెవ్వరైన దినదినమునకు ॥ మనసు ॥

తప్పక వరుసెరిఁగి తానె విచ్చేయఁ డట
యిప్పుడు విలువ నంపనేలె నాకూ
వుప్పతిల్లుఁ గోవిలకు నొగి వసంతకాలము
చెప్పుదురా యెవ్వరైనఁ జెలగి యేటేటను ॥ మనసు॥
(9-27)

కలువకు చంద్రుడిరాక తెలియజేయాలా? కోయిలకు వసంతంరాక ఎవరైనా చెబుతారా? అలాగే ప్రియుడైనవాడు ప్రేయసి మనసు గ్రహించి, పిలువకనే రావాలి. రాని భర్తకోసం అందుకే నాయిక పరితపిస్తోంది. తనకు తానుగా వెళ్ళటానికి ఆత్మాభిమానం అడ్డువస్తోంది.

ప్రేమ అనేది మనసులో వుంటే ఎదుటివారి మనసులోని రహస్యాల్ని సులభంగా తెలుసుకోగలరు. ఆ విషయాన్ని వాళ్ళే వచ్చి వాచ్యంగా సిగ్గువిడిచి విన్నవించవలసిన పనిలేదని అన్నమయ్య ఈ సంకీర్తన ద్వారా సందేశమిస్తున్నాడు.

**18) అభ్యర్థన :** నాయకుడు ఎందుకో అలిగాడు. అతని అలుక తీర్చటానికి నాయిక అతన్ని పలురకాలుగా వేడుకుంటోంది.

ఎందాఁకా నీచలమేమి గట్టుకొంటివి
యిందువంకనే దొంవిన్నిటా నీవైతివి ॥ పల్లవి ॥

పలుకరాదా కొంత పరాకు మానరాదా
పిలిచి పిలిచి పెదవులెల్లా బెండుపడెను
సెలవుల నవ్వరాదా చేతల దగ్గరరాదా
నిలువ నివ్వెరగాయ నీకుఁగానే ప్రేమను ॥ ఎందాకా॥

చక్కఁగాఁ జూడఁగరాదా చలము మానఁగరాదా
మొక్కి మొక్కి చేతులెల్లా మొనలాయను
మక్కువతో వినరాదా మన్నన లియ్యఁగరాదా
యిక్కువలు విన్నవించి యెలుఁగెల్లా రాసెను ॥ ఎందాకా॥

యింటి కిట్టె రారాదా యెటు నన్నుఁ గూడరాదా
వెంట వెంటఁ దిరిగాడి వేసటాయను...... ॥ ఎందాకా ॥
(20-119)

స్వామిని పిలిచి పిలిచి ఆమె పెదవులు బెండుపడ్డాయి. అందుకే పరాకుమాని పిలుపు వినమని అభ్యర్థిస్తోంది. కోపంవదిలి తనకేసి ఒక్కసారి చూసి చిరునవ్వు చిందించమంటోంది.

ఆయనకు మొక్కిమొక్కి ఆమె చేతులు మొనలు దేరాయి. అందుకే ప్రేమతో ఆమె మాటల్ని మన్నించమంటోంది. అతనికోసం తిరిగితిరిగి ఆమె అలసిపోయింది. అందుకే అలకమాని ఇంటికి వచ్చి, తనను కూడమని విన్నవించుకుంటోంది.

పట్టుదల వుండే భర్తల్ని పొందటానికి భార్యలకు అభ్యర్థనకు మించిన మార్గమేముంది?

**19) సహనము :** ఇక్కడ నాయికకు ఉండాల్సిన దానికంటే ఎక్కువ ఓర్పే వుంది. ఆమెకుండే ఓర్పును చెలికత్తె ఇలా వర్ణిస్తోంది.

ఎంత వోర్పు గలదానవేమే నీవు
కాంతలెల్లా నీ సుద్దులు కతలుగాఁ జెప్పేరే ॥ పల్లవి ॥

ఘనమైన విరహాగ్నిఁ గాఁగియు నప్పఁటి బతి
మనసు నొవ్వకుండానే మాటలాడేవే
యెనయక మరుచేతి నేటువడి యింకా నా
తనితోనే పొందు సేయఁ దమకించేవు ॥ ఎంత ॥

వొల్లనే యాసతివద్ద నుండఁగా విభునిఁ జూచి
వొళ్ళు దాఁకకుండాఁ బువ్వుల వేసేవే
పల్లదపుజవ్వనము పంచపాలై మరి
నుల్లసాన నవ్వుతాను ఊడిగాలు సేసేవే ॥ ఎంత ॥

గక్కన శ్రీవేంకటేశు కౌఁగిటఁ జిక్కి యప్పటి
కక్కసించకేల మొగము చూచేవే
చక్కఁగా రతి పరవశమున నన్నీ మరచి
చొక్కుచు నాతనిచే మెచ్చులు మెచ్చేవే ॥ ఎంత ॥
(16-53)

తాను విరహంతో వేగిపోతూవున్నా తన పతి మనస్సుకు బాధ కలగకుండా మాట్లాడుతోంది. మరునిచే దెబ్బతిని కూడ అతనితోనే స్నేహం చేస్తోంది. తన భర్త దగ్గర కూర్చున్నా శరీరానికి తగలనట్లు పువ్వులు విసిరివేస్తోంది. తన పరువమంతా పంచపాలైనా కూడ నవ్వుతూనే భర్తకు సేవలు చేసోతంది. ఆ వేంకటేశ్వరుని కౌగిలిలో చేరి కోపగించుకోకుండా మోము చూస్తోంది. రతిపరవశంలో అన్నీ మరచి తన ప్రియున్నే మెచ్చుకుంటోంది. "సహనానికి మారుపేరు స్త్రీ" అనే సూక్తిని ఈ సంకీర్తనలో అన్నమయ్య సాహితీకరించాడు.

**20) తృప్తి :** మనకు లభించినదానితో, అందుబాటులో వున్నదానితో సర్దుకుపోవటమే తృప్తి. కొందరు ఉన్నదానికంటే ఎక్కువ కావాలని ఆశపడి కోరి దుఃఖాన్ని తెచ్చుకొంటె, ఇంకొందరు వున్నదాంట్లోనే తృప్తిగా అనుభవించి, ఆనందంగా వుంటారు.

వంచుక అనుభవించు పడఁతుల మిందరము
ముంచి నీ మన్నన నాపై మోహము గలంతే ॥ పల్లవి ॥

మనసిచ్చి నాతోను మాటాడుటే పదివేలు
యెనయు మనుచు దూరనెంతదానను
చనవు నీదొకటే సతులు పదారువేలు
పెనఁగితే నెంతవచ్చు బెరసి నావంతు ॥ వంచు ॥

యిచ్చగించి నా యెదుట నిరవవుటే పదివేలు
యెచ్చరించి కొసర నేనెంతదానను
అచ్చపు నీ కాఁగిలిడే అతివలు శానశాన
ఇచ్చితివి నావంతు యెంత వచ్చునందును ॥ వంచు ॥

కందువ నీ రతి నన్నుఁ గలయుటే పదివేలు
యిందరిలోఁ జెప్పేనంటే యెంతదానను.... ॥ వంచు ॥
(7-517)

ఈ నాయిక ఆ కోవకు చెందిందే. ఉండే నాయకుడేమో ఒక్కడు. అతడికా పదహారువేలమంది భార్యలు. ఎనుమండు గురు పట్టపురాణులు. అందుకే ఆమె నీవు చూపించే ప్రేమ చాలంటూ తృప్తి పడుతోంది. ఈ విధంగా అన్నమయ్య తన సంకీర్తనల్లో స్త్రీల స్వభావాన్ని అత్యంత సహజంగా వర్ణించాడు.

**ఆధార గ్రంథాలు:**

1. అన్నమయ్య సంకీర్తనల్లో స్త్రీ - డాక్టర్ గుమ్మనూరు ఉషారాణి.
2. అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు : సంపుటాలు 5, 6, 7, 9, 11, 16, 19, 20, 21, 26. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రచురణలు 1998.
3. పారిజాతాపహరణము : ముక్కుతిమ్మనార్యుడు, శ్రీ వరక్రిష్ణ ప్రింటర్స్, విజయవాడ - 2.
4. పదకవితావైజయంతి : డా॥ పొన్నా లీలావతమ్మ, పొన్నా పబ్లికేషన్స్, పాలకొల్లు.
5. పారిజాతాపహరణము - నంది తిమ్మనాచార్య ప్రణీతము, సంపాదకుడు : తాపీధర్మారావు, ఆం.ప్ర. సాహిత్యఅకాడమీ, హైదరాబాద్.

# బాలసాహిత్యం - బాలలకు వికాసం

- యం. నాగమణి

తెలుగులో బాలసాహిత్యాన్ని మొదటగా ప్రచురించింది “జనవినోదిని' పత్రిక తరువాతికాలంలో వివేకవతి మాసపత్రిక, ఆంధ్రపత్రిక, బాలభారతి, గృహలక్ష్మి తదితర పత్రికలు బాల సాహిత్య రచనలను ప్రచురించాయి. బాల సాహిత్యం మధుర మైన తేనెలా తియ్యగా ఉంటుంది. చెప్పవలసిన విషయం నూటిగా ఒలచిన పండులా ఉంటుంది. భాష సరళంగా, లలితంగా ఉంటుంది. శిశువుల మనస్సు రంజకంగా ఉంచేది బాలసాహిత్యం ప్రాచీన బాలసాహిత్యంలో పాటలు, చిట్టి పొట్టి కథలు ఎక్కువ. పాల్కురికి సోమనాథుడు, తెనాలి రామ కృష్ణుడు, సూరన, ధూర్జటి సందర్భాను సారంగా తమ రచనల్లో పిల్లల, ఆటపాటలను పేర్కొన్నారు ఎక్కడైతే వికాసానికి ప్రాధా న్యత లభిస్తుందో అక్కడ అభివృద్ధికి తొవుంటుంది, బాల సాహిత్యం పిల్లలు సర్వతోముఖంగా ఎదగడానికి ఉపకరి స్తుంది, అద్భుత కథలంటే పిల్లలు ఎంతో ఆసక్తి చూపుతారు. ఈ కథల్లో వాస్తవికత కంటే ఊహ ప్రముఖ పాత్ర పోషిస్తుంది. ఈ కథలు పిల్లల్లో సృజనాత్మకతను, వారు ఎదగడానికి దోహదపడతాయని మనోవైజ్ఞానికుల అభిప్రాయం పేదరాసి పెద్దమ్మ కథలు, ఇంద్రజాల కథలు, అల్లాఉద్దీన్ అద్భుత దీపం, మాయాగంట, ఉడతమ్మ ఉపదేశం లాంటి కథలు, అలీబాబా నలభై దొంగలు, కాశీమజిలికథలు ముఖ్యమైనవి.

బాలసాహిత్య, వికాసానికి, ప్రచారానికి సాధనాలైన వాటిలో ప్రథమస్థానం పత్రికలదే. బాలల పఠనానురక్తికి, భాషాభివృద్ధికి పత్రికలు ఎంతో దోహదం చేస్తాయి.

బాలసాహిత్య, రంగంలో ఓ కొత్తశకానికి నలభయ్యో దశకం నాంది పలికింది. “బాలకేసరి” పత్రిక 1940లో ప్రారంభ మయింది. “రేడియో అన్నయ్య” న్యాయపతి రాఘవరావు 1945లో “బాల సచిత్ర మాసపత్రికను ప్రారంభించారు. 1946లో నాగిరెడ్డి చక్రపాణి ప్రారంభించిన “చందమామ” బాగా జనాదరణ పొందింది. గేయ, పద్య, గద్య రూపాలలో బాలసాహిత్యం కన్పిస్తున్నది. మాట, ఆట, పాట, కథ పిల్లలకు ప్రీతికరమైనవి. ఈ నాలుగింటి కలబోత బాలసాహిత్యం, చదివినా, విన్నా, చెప్పినా మనసులు, వికసించి విజ్ఞానపథంలో ఆనంద పుష్పాలు వెదజల్లుతున్నాయి సాహిత్యమే మనిషిని మనీషిగా చేస్తుంది.

ఎక్కడైతే బాలలకు స్వేచ్ఛ ఉంటుందో అక్కడ బాగా నేర్చుకుంటారు, ఆనందంగా గడుపుతారు. “నేటిబాలలే రేపటి పౌరులు” అన్న నానుడి బాలల ప్రాధాన్యతను తెలియ జేస్తుంది. ఎక్కడైతే బాలల వికాసానికి ప్రాధాన్యత లభిస్తుందో అక్కడ అభివృద్ధికి తావుంటుంది.

తెలుగు సాహిత్యంలో “బాలసాహిత్యం” ప్రముఖంగా పేర్కొనదగింది. ఈ రంగంలో ఎంతోమంది సాహితీ వేత్తలు కృషి సలిపారు. మనోవికాసానికి మాతృభాష పెట్టని కోట పిల్లల మేధను వికసింపజేసే గేయాలెన్నో ఉపయుక్తంగా ఉన్నాయి.

బాలగేయాలు బోలెడంత విజ్ఞానాన్ని అందిస్తాయి. ఇవి విలువల పాఠాలు బోధిస్తాయి.

**కానివారితోను కావించు చెలిమి**
**కట్టెవిరిచి పొయిని పెట్టినట్లుండు**
**అయినవారితోను కావించు చెలిమి**
**ఆకు మడిచి, మడత పెట్టినట్లుండు**
**కానివారి మాట కంట్లోది నలుసు**
**ప్రాణం పోయిందాక పక్కలో పోటు**
**అయినవారి మాట అమృతంపు తేట**
**బతికి ఉన్నందాక భాగ్యంబుమూట**

స్నేహనికి సంబంధించి పిల్లలకు మంచి బాటను చూపించే గేయమిది. ప్రస్తుత తరుణంలో వీటిని ఎక్కువగా పిల్లలకు నేర్పించి, వాటి అర్థాలు, విడమర్చి చెప్పితే వారి భావి జీవితం సుఖమయమవుతుంది. వారి వ్యక్తిత్వ వికసింప బడుతుంది.

బాలల గేయాలైన అరటికాయ బజ్జి మినప్ప సొజ్జి, కలిసి మెలిసి తిందాం - కథలు వెతలువిదాం అంటూ చిన్నారి బాలల్ని దృష్టి యందుంచుకొని గురజాడ అప్పారావు కమ్మని శైలిలో గేయాలు రచించారు.

బాలసాహితీ ప్రపంచంలో ఎన్నో పుస్తకాలున్నా వాటిలో గేయాలది ఉన్నతస్థానం. వీటిలో ముళ్ళపూడి వెంకటరమణ రాసిన “బాలశతకం”, కరుణశ్రీ 'తెలుగుబాల' నార్ల చిరంజీవి “వెలుగుపూట” ముదిగొండ జ్వాలాపతి లింగశాస్త్రి “తెలుగు బిడ్డ” బృందావనం రంగాచార్య తెలుగుబోధ శతకాలు బాలసాహిత్యానికి వన్నెతెచ్చాయి.

కవిరావు ముద్దుపాప శతకంలోని

**“బడికి వేళకేగి పాఠాలు వల్లించి**
**క్రొత్తవాని నేర్చు కొనగ వలయు**
**క్రమము తప్పకుండ శ్రమ జేసి లేనియు**
**వృద్ధి చెందగలవు ముద్దుపాప”**

ఇలాంటి పద్యాలు పిల్లల్ని ఆలోచింపజేస్తాయి.

రెడ్డి రాఘవయ్య "బాలనీతిమాట" (అంతర్జాతీయ బాలల సంవత్సరం) ఉత్తమ రచనగా పేరొందింది.

**తెలుగు వాడవు నీవు తెలుగు దేశమునీది**
**తేనెలొలుకు తెలుగు పలుకు నీది**
**తెలిసి మెలగవలయు తెలుగుజాతి చరిత**
**తెలిసికొనుము నీవు తెలుగు బాల !**

బాలాంత్రపు రజనీకాంతరావు రాసిన వానపాట

ఇప్పటికే వినిపిస్తున్న బాలల్లో ప్రేరణ కలిగిస్తున్నది

**"వానా వానా వల్లప్పా**
**వాకిలి తిరిగే చల్లప్పా**
**ఎండా వేసిన వస్తువులన్నీ**
**ఇంట్లో పెట్టు చెల్లప్పా"**

వాన వచ్చినప్పుడు పిల్లలు చేతులు పట్టుకుని తిరుగుతూ ఇలా పాడుకుంటూ ఆడుకోవడం ఓ మధుర దృశ్యం.

అద్భుతకథలంటే పిల్లలకు మక్కువ వీటిలోని ఊహలు పిల్లలను ఆకర్షిస్తాయి. సాహసకథలు పిల్లలు ఆలోచనలను ఇనుమడింపజేస్తాయి.

బాలసాహిత్యంలో తొలి నాటక జనమంచి రామకృష్ణ రాసిన "యమునాతీరం" ఇదో కృష్ణకథ "బాల" పత్రిక పెట్టిన తరువాత ప్రచురితమైంది గురజాడ రాసిన పుత్తడి బొమ్మ పూర్ణమ్మ" బాలల గేయనాటికగా పేరొందింది.

నేటితరంలో చిన్నారుల్లో నైతిక విలువలు, సృజ నాత్మకతను పెంపొందదదించడానికి తల్లిదండ్రులు, ఉపా ధ్యాయులు చొరవ తీసుకుని పిల్లలో పఠనం మీద ఆసక్తి కల్గించేలా చేయాలి. నేటి తరం పిల్లలకు గేయవిజ్ఞానం అందడం లేదు. ఈ గేయాలు పిల్లలకు జీవితపాఠాలను బోధిస్తాయి. మనోల్లాసాన్ని కలిగిస్తూనే వాళ్ళను మంచి పౌరులుగా తీర్చిదిద్దుతాయి.

# జాషువా సాహిత్య ప్రయాణం

- డా. ఛుట్టి యాదేశ్

ఒక కవి రచనలను కాలక్రమానుసారంగా చదవడం వల్ల ఆ కవిని సంపూర్ణంగా అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. జాషువాను అర్థం చేసుకోవడంలో ఈవిధానం ఉపయోగపడుతుంది. అనుకరణ, అనుసరణ దశల నుండి దళిత ద అష్టిగలవాడిగా, అక్కడి నుండి విశ్వనరుడిగా ఎదిగిన క్రమం అతని రచనలను ఈ క్రోనలాజికల్ ఆర్డర్ లో చదవడం వల్ల తెలుస్తుంది.

జాషువా అనుకరణ/అనుసరణ దశను చెప్పడానికి ఆయన రాసిన మూడు రచనలను ఉదహరించవచ్చు. అవి:

1. హిమదామర్కధర పరిణయం (పద్యకావ్యం) (1917) ( జాషువా వయసు 22 ఏళ్ళు)
2. చిదానంద ప్రభాతం (పద్యనాటకం) (1921) ( జాషువా వయసు 26 ఏళ్ళు)
3. కుశలవోపాఖ్యానం (వచనం) (1922) ( జాషువా వయసు 27 ఏళ్ళు)

జాషువా, పై మూడు రచనలు మూడు ప్రక్రియల్లో రాశాడు. ఈ మూడు రచనల్లో జాషువా ప్రతిభ అనుకరణ, అనుసరణలకే పరిమితమైంది. 'హిమదామర్కధర పరిణయం'లోని కథ అతుకులబంత! కథకు తలాతోకా ఉండదు. పాత్ర చిత్రణ కూడా అధ్వాన్నంగా ఉంటుంది. 'చిదానంద ప్రభాతం' పద్యనాటకం బైబిల్ ను అనుసరించి రాయబడింది. ఇందులో, కవి ''క్రైస్తవ కవుల ఎడల క్రైస్తవ సోదరులకు అభిమానం ఉండాలి''అంటాడు . ఈ భావన 26 ఏళ్ళ జాషువా పాక్షికద అష్టినీ, అపరిపక్వ మనస్తత్వాన్ని తెలియజేస్తుంది. 'కుశలవోపాఖ్యానం'లో, సందర్భశుద్ధి లేకుండా డాంబికం ప్రదర్శించాలనే కుతూహలం కనబడుతుంది. 'రుక్మిణీ కల్యాణం', 'ధ్రువవిజయం'లలో కూడా పాండిత్య ప్రదర్శనే మెండుగా ఉంది.

'శ్రీ కన్యకాపరమేశ్వరీ' (40 పద్యాలు), 'శారదా స్మ అతి' (30 పద్యాలు) ప్రైవేట్ సర్కులేషన్ కోసం, కేవలం డబ్బును ఆశించి, జీవన భ అతికోసం రాసినవి.

''ఇక పెద్ద కావ్యాల జోలికి వెళ్ళను'' అనేటట్లు జాషువాను ఇబ్బందులకు గురిచేసిన కావ్యం 'శివాజి'. ఇది అసంపూర్ణంగా మిగిలిపోయిన ఒక ప్రబంధం! ఈ అసంపూర్ణతకు ఒక బలమైన కారణం ఉంది. దీని గురించి 'నా కథ - 2'లో కొంత తానే చెప్పుకున్నాడు. జాషువా ఒకసారి రైలులో వెళ్తూవుంటే, ఆయనను ఎరిగిన ఒకాయన అతని పక్కనే కూర్చున్న శ్రీశైలపతి అనే ఒక శ్రీమంతునికి పరిచయం చేశాడు. శ్రీశైలపతి ''కలవాడు'' మాత్రమే కాకుండా ''త్యాగి'', ''కవీశుల ప్రేమించువాడు'', ''కవనమంటే చెవికోసుకుంటాడు''. జాషువా పరిచయం కాగానే, శ్రీశైలపతి ''ఆశువుగా, నీ కవితా ప్రాశస్త్యము దెలియ పలుకు పద్యము'' అని కోరాడు. వెంటనే జాషువా 'భారత వీరుడు' అనే తన పాత పద్యాన్ని గంభీర గళస్వనముతో వినిపించాడు. అది విన్న శ్రీశైలపతి, ఆనందబాష్పబిందువుల రాల్చి ''భళీ! ఆనాటి కర్ణశరములుగానీ యివి పద్దియములు గావు కవీంద్రా! కరుణా వీర రసాలు నీ కలమునం గంగా ప్రవాహంబులై పరువుల్ వారు, 'శివాజి కావ్యము' రచింపన్ గోరెదన్'' అని, ''దానికిన్ వరుడన్నేన''ని ''రెండు పచ్చనోట్లు'' (రెండు 100 నోట్లు!) చేతిలో పెట్టిండంట! జాషువా, మొదట ఆశ్చర్యపోయినా, ''క అప నన్ను నేల శ్రీశైలపతి రూపంలో వచ్చింద''ని సంతసించి, 'శివాజీ కావ్యం' రాయడం ప్రారంభించాడు (1926). కొంత రాసిన తర్వాత శ్రీశైలపతికీ, అతని భార్యకు కూడా వినిపించాడు. మిగిలినది రాస్తూవున్నాడు.

అంతలో జాషువాకు సోదరుడి వివాహం చేయవలసి వచ్చింది. చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. వెంటనే నాలుగువేలు కావాలని శ్రీశైలపతిని అడిగాడు. అతడు మారుమాట్లాడకుండా అడిగినంత ఇచ్చాడు. జాషువా ఆ డబ్బుతో సోదరుడి పెళ్లిని ఘనంగా జరిపించాడు.

జాషువా కావ్యం రాస్తూనే ఉన్నాడు. మధ్య మధ్యలో ఫిరదౌసి, స్వప్నకథ, అనాథ కావ్యాలు రాశాడు. ఇతర దాతల సహాయంతో ముద్రించాడు. అయినా 'శివాజి' పూర్తికాలేదు. దాదాపు పది పన్నెండేండ్లు (1926 నుండి 1937 వరకు) కాలం గడిచినా కావ్యం పూర్తికాలేదు. ఇంతలో కాబోయే క అతిపతి అయిన శ్రీశైలపతి ఆర్థిక పరిస్థితి పూర్తిగా దెబ్బతిన్నది. అంకితంగొన్న కావ్యాన్ని కూడా ముద్రించే స్థితిలో లేడు. జాషువా 'శివాజి' కావ్యాన్ని పూర్తిచేసి వేరే వ్యక్తికి అంకితం ఇస్తే అతడు ముద్రించగలడు. కాని శ్రీశైలపతి దగ్గర, సోదరుడి పెండ్లికని తీసుకున్న నాలుగువేలు తిరిగి ఇవ్వలేదు. అతనూ అడగలేదు, ఓ కావ్యానికి భర్తనవుతున్నానన్న నమ్మకంతో! తీరా, 'శివాజి' కావ్యం ముగింపు దశకు వచ్చేసరికి క అతిభర్త శ్రీశైలపతి దివాలా తీశాడు. అయినా, జాషువాను తన డబ్బు తనకు తిరిగి ఇమ్మని అడిగినట్లు లేదు!

ఒక కావ్యాన్ని అంకితం పొందడం కోసం ఇంత పెద్ద మొత్తంలో (ఇప్పుడు దాదాపు నాలుగు కోట్ల పైమాటే!)

ధనసహాయం చేశాడంటే శ్రీశైలపతి దాత అత్వం ఎంత గొప్పదో అర్థమవుతుంది. అంతటి గొప్పవ్యక్తికి అంకితంగా రాయబడిన కావ్యాన్ని వేరే వ్యక్తికి అంకితం ఇవ్వలేక, దాన్ని అసంపూర్తిగానే వదిలివేశాడు. ఆ రోజుల్లో కావ్యాన్ని కన్యగానే భావించేవాళ్ళు. ఒకరికిచ్చి పెళ్ళి చేయవలసిన కన్యను మరొకరికిచ్చి పెళ్ళి చేయడం బాగుండదని అనిపించిందేమో కవికి! దాంతో ఆ కావ్యం సంపూర్ణరూపం సంతరించకుండానే ఆగిపోయింది. ఒక కావ్య భ్రూణహత్య జరిగింది! కవిగా, కావ్యంపై ప్రేమతో నన్నా పూర్తి చేద్దామన్నా, తన కావ్యాలను సొంతంగా అచ్చు వేయించునే ఆర్థిక స్థోమత జాషువుకు లేదు.(జాషువా కావ్యాలన్నీ దాతల సహాయంతోనే ముద్రణ పొందడం గమనించవచ్చు). ఈ కారణాల చేతనే 'శివాజీ' ప్రబంధం అసంపూర్ణంగా వదిలివేయబడింది. కేవలం అంకిత సమస్య కారణంగా, కావాలని అసంపూర్ణంగా వదిలివేయబడిన కావ్యం బహుశా తెలుగు సాహిత్య చరిత్రలో ఇదొక్కటే కావచ్చు!

'శివాజీ ప్రబంధం' నిజంగా 'ప్రబంధమే'. "నలుగెలంకుల నెలరాతి సోపానంబులు దాపిన బద్ధన బావులయందు కాలముల బుప్పించు కలువ పూవులంగని మొగంబులు వంచి తేనె కన్నీట దలపోయు తమ్ములం గరుణింపక ముక్కులం బడిచివైని ముక్కలు సేసి తూండ్లం గబళించుచుం..." లాంటి వర్ణనలు చదువుతుంటే శ్రీక అష్ణదేవరాయల కాలానికి వెళ్ళిపోతాం. ఈ ప్రబంధాన్ని ప్రబంధయుగంలో పీఠంవేసి కూర్చోబెట్టవచ్చు!

దాదాపు పదిపన్నెండేండ్ల సుదీరకాలం గడిచినా ఈ రచన పూర్తి కాకపోవడం, అసంపూర్ణంగా వదిలివేయవలసి రావడం అనే రెండు కారణాల వల్ల, జాషువా ఇక పెద్ద కావ్యాల జోలికి వెళ్ళలేదు. బహుశా, ఈ సంఘటనే జాషువాను చిన్న కావ్య ప్రక్రియ అయిన 'ఖండకావ్యా'న్ని చేపట్టేటట్లు చేసింది! ఓ కావ్యం కనుమరుగు కావడం ఒక ప్రక్రియ వెలుగొందడానికి కారణమై మంచే జరిగింది.

గుర్రం జాషువా 'జాషువా కవి'గా ఒక స్పష్టతను సంతరించుకుంటున్న శుభపరిణామం 'ఫిరదౌసి' కావ్యంలో కనిపిస్తుంది. ఈ కవి ద అక్పథంలో ఒక 'స్పష్టత' వస్తున్న విషయాన్ని ఈ కావ్యంలో గమనించవచ్చు. 'ఫిరదౌసి' రచనతోనే జాషువాకు గుర్తింపు వచ్చింది. ఈ కావ్యాన్ని చదివిన అబ్బూరి వరద "ఈ గాథాపద్యం లాంటివి ఆరోజుల్లో అరుదు" అన్నాడు (కవన కుతూహలం %% పు.83). దీని తర్వాత రాసిన 'స్వప్నకథ', 'అనాథ' రెండు కావ్యాలు ఫర్వాలేదనిపిస్తాయి.

1937లో ఖండకావ్య ప్రక్రియకు శ్రీకారం చుట్టి 1966 వరకు ఎనిమిది భాగాలలో (ఏడు ఖండకావ్యాలు ం ఇతర ఖండికలు) మొత్తం 240 ఖండికలు రాసి ఆ ప్రక్రియకు పర్యాయపదం అయ్యాడు జాషువా.

సినిమా రచనలో కూడా జాషువాకు ప్రవేశం ఉంది. రాధాక అష్ణ (1939)లో పాటలు, పద్యాలుబీ నచ్చిన కోడలు వచ్చింది(1951)లో పాటలు, మహారథి కర్ణ(1960), పల్నాటి యుద్ధం (1966)లలో పద్యాలు రాశాడు.

గబ్బిలం - 1, 2 భాగాలలో జాషువా అస్ప అశ్యతా ద అష్టి, దళితవాద ద కృథం స్పష్టంగా కనిపిస్తుంది. తెరచాటు, నేతాజి, బాపూజీ, వీరాబాయి కావ్యాలు అంత గొప్పగా అనిపించవు. ఉదా : 'వీరాబాయి'లో ఒక పాత్ర "ఏ సావ్ కార్! సారా బాటిల్ రెండు ఇచ్చిపో" అంటుంది. అక్బర్ కాలం క్రీ.శ.1550వ దశకం. ఆ కాలంలో సీసాకు 'బాటిల్(%Battle%)' అనే ఆంగ్ల పదం ప్రయోగించడం అనాలోచితం. 'చిన్నా నాయకుడు' వచనంలో ఉన్న ద అశ్యకావ్యం. నవలిక వంటిది. ఈ కావ్యంలోని కథనం, ద అశ్యకథనానికి దగ్గరగా ఉండి, ప్రతీ సన్నివేశం పాఠకుడిలో ముద్రపడి నిలిచిపోతుంది. ఈ కావ్యం ద అశ్య చిత్రీకరణకు మంచి ఉదాహరణగా నిలుస్తుంది. వేంకట సుబ్బమ్మగారి స్మ అతికి శ్రద్ధాంజలిగా రాసిన కావ్యం 'అశ్రుమంజరి'. స్వాతంత్ర్యోద్యమాన్ని కథావస్తువుగా గ్రహించిన కావ్యం 'స్వయంవరం'. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రాన్ని కీర్తిస్తూ రాసిన కావ్యం 'రాష్ట్రపూజ'. ఇవి మామూలు రచనలే.

## జాషువా విజన్

కాందిశీకుడు, కొత్తలోకం, ముసాఫరులు కావ్యాలలో జాషువా విజన్ స్పష్టంగా కనిపిస్తుంది. సమాజం పట్ల ఈ కవిలో వచ్చిన స్పష్టత, విశ్వనరుడిగా ఈ కవి ఆలోచనా విధానం ఈ మూడు కావ్యాలలో కనిపిస్తుంది. సమాజంలో ఉన్న కుళ్ళును తొలగించడం ఎట్లా? కులం, మతం అనేవి ఉంటే అవి ఎట్లా ఉండాలి? అనే ప్రశ్నలకు తన అభిప్రాయాలను వివిధ సందరాలేలో ఆయాపాత్రల చేత జాగ్రత్తగా చెప్పించాడు.

'కాందిశీకుడు'లోని కథ కల్పితం. "నిరపరాధులగు మానవులను నిష్కారణంగా ఆహుతి కొనుచున్న నేటి ప్రపంచ యుద్ధభాషణ కాలమున శాంత్యహింసల ఉత్క అష్టములను స్థిరీకరించుటయే నా ఆశయము" అని తన విశ్వమానవ సహ అదయతను చాటుకున్నాడు.

'కొత్తలోకం'లో, ఇతివ అత్తం 'భూగోళంపై జగన్నాటకం'. ఈ నాటకంలో నటన యుగయుగాలుగా సాగుతూనే ఉంది. నాటకంలో అన్ని హ అదయ ద్రావకాలైన ద అశ్యాలే. కాని, కవి హ అదయాన్ని గమనించని కకు పాత్రధారులు వందలు వేలు. సత్యం, ధర్మం దెబ్బతిని నాటకం రసాభాస అయ్యింది. మహానాటక కర్త నిందాబద్ధుడైనాడు. ఇందుకు గల కారణాలను, కొన్ని సవరణలను ఆ స అష్టికర్తకు మనవి చేయదలిచాడు. కాని గుండె నిబ్బరం లేకపోయింది. చివరికి,

**"స అష్టికర్తవు నీవు నీ స అష్టిలోని
మానవుడ నేను ఇద్దరి మధ్య మనకు
ముసుగులో గ్రుద్దులాటలు పొసగవింక
హక్కు గలదయ్య ప్రశ్న వేయంగ నిన్ను "**

అని ధైర్యం తెచ్చుకొని జగన్నాటక కర్తను ఆర్థించిన వాంచితాలే ఈ 'కొత్తలోకం'.

'ముసాఫరులు'లో ఇతివ అత్తం - ఇహానికీ పరానికీ ప్రయాణిస్తున్న రెండు ఆత్మల సమావేశం. ప్రపంచ వ్యవస్థ నంతా ద్మ్రితంగా ఇందులో వర్ణించాడు. ప్రపంచాన్ని దర్శిం చడం తన సాహసంగా పేర్కొన్నాడు. "మానవులందరికీ ఈ భూమి కొంతకాలం ముసాఫరుల భవనం" అనడంలో ఆధ్యా త్మికంగా జాషువా అత్యున్నత స్థాయికి చేరుకున్నట్లు అర్థమవు తుంది.

జాషువాకవికి 'క్రీస్తు చరిత్ర'నే చివరి కావ్యం! దాని తర్వాత 'ముసాఫరులు', 'నాగార్జున సాగర్'లు వచ్చినా సఅజనాత్మకంగా లేవు. 'ముసాఫరులు'తో జాషువా ఆధ్యాత్మికతలోకి వెళ్ళిపోయాడు. 'నాగార్జున సాగర్' ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కోసం, ఆనకట్ట ప్రచారం కోసం రాసింది. ఖండకావ్యాలలో అంతకు ముందే రాసిన పద్యాలు కొన్ని, అక్కడక్కడ రాసుకున్న పద్యాలు కొన్ని ఇందులో సందరానేు గుణంగా పొందుపరచబడ్డాయి. ఈ రెండింటిలో, కవి కావ్యవస్తువు కోసం వెతుక్కోవడం కనిపిస్తుంది. అంటే, కవిగా దాదాపుగా ఆగిపోయినట్లే లెక్క! జాషువా రచనలను పరిశీలించడం ద్వారా, ఒక కవి ప్రారంభ దినాలలో కవిత్వం కోసం అవస్థలు పడడం, ఆ అవస్థల నుండి తేరుకొని తన శక్తినంతా గుమ్మరించి అత్యు న్నత శిఖరానికి చేరుకోవడం, ఆ తర్వాత క్రమంగా కవిత్వం నుండి వైదొలగడం జరుగుతుందన్న తాత్త్విక సత్యం బోధపడుతుంది.

**ఆధార గ్రంథాలు :**

1. జాషువా సర్వ లభ్య రచనలు - మనసు ఫౌండేషన్ ముద్రణ